ఈ వజ్రోత్సవ జ్ఞాపకార్థముగా మన ప్రతిశ్వాసను ఒక 'సోహం' శ్వాసగా ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసలను శాంతి మయముగా ఒనొర్తుము గాక! మనము సోహం నుండియే వచ్చితిమి అందే ఉంటిమి. మన మందుననే కదలుచు, మెదలుచు సమస్తమును చేయుచుంటిమి, నమ్మినను నమ్మకున్నను మనము కడకు అందులోననే కలసి లీనమై పోదుము. అమూల్యమగు మానవ జన్మకు సోహం భావనయే గమ్యము, ధ్యేయము, సర్వమునని ఎరుంగవలెను. అదియే సర్వసృష్టికిని ఆద్యంతములు.

ప్రాక్పశ్చిమమున గల సత్యాన్వేషకు లందరకు ఈ సోహం సందేశమే ప్రేమ, పవిత్రత, ప్రకాశము నందించు సందేశము. ఈ వజ్రోత్సవ స్మృతి చిహ్నముగా సోహం భావనను తైలధార వలె అవిరళముగ కలిగియుందుము గాక!

**శ్లో॥ దేహో దేవాలయ ప్రోక్తో**
**జీవోదేవ స్సనాతనః**
**త్యజే దజ్ఞాన నిర్మాల్యం**
**సోహం భావేన పూజయేత్.**

సర్వకాల సర్వావస్థల యందును సోహం ఒక్కటియే సర్వవ్యాపకమై సర్వజ్ఞమై సర్వశక్తియుతమై వెలుంగునది. ఈ పరిమితమైన దానిని ఆ అపరిమితము నిత్యసత్యమైన దానిలో లయింతముగాక!

హరిః ఓం తత్సత్ ఓం.

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

ప్రాక్పశ్చిమమున గల సోహం భక్తులందరకు విశ్వమానవాళి కంతకు ప్రేమపూర్వక అర్పణ.

**శాంతి! శాంతి కావలసిన యెడల అది ఎచ్చటనో లేదు. అది మనలోనే యున్నది.**
**మనలోని శాంతిని అనుభవించినపుడే, ఇతరులకు శాంతి ప్రదానము చేయగలము.**

# చిరస్మరణీయమైన నా చిన్న అనుభవము

**(శరీరమును విడిచి చనుట - 1974 మే 24వ తేదీ రాత్రి 8 గం॥ జరిగిన విచిత్రానుభూతి)**

**- పరమపూజ్య శ్రీ స్వామి ఓంకార్**

నా ఎనుబదియవ సంవత్సరమున పొందిన, చిరస్మరణీయమగు యీ విచిత్రానుభూతి ప్రాక్పశ్చిమమున గల ప్రేమాస్పదు లందరితోడను పంచుకొనుటకు నా హృదయము కోరుచున్నది. నన్ను ప్రేమించుచు, నా క్షేమమును కోరుచున్న వారందరితోడను నా అనుభవము పంచుకొన దలచుచుంటిని.

ముఖ్యముగా పూజ్యశ్రీ స్వామి చిదానందజీ, మాతా కృష్ణాబాయి, శ్రీ స్వామి సచ్చిదానందజీ, పూజ్యశ్రీ స్వామి కృష్ణానందజీ, స్వామి బ్రహ్మానందజీ, మాతా సరస్వతీ దేవి, (అమెరికా) డా॥ పిచ్చెయ్యగారు, డా॥ ఎమ్.ఎస్. రావు గారు, శ్రీ భాష్యం అప్పలాచార్యులు గారు, శ్రీ తారకం గారు మొదలగు ప్రేమాస్పదులతో నా అనుభవమును పంచుకొని వారి అభిప్రాయములు తెలుసుకొనవలెనని యున్నది.

ప్రాపంచిక మానవులకు యీ సంఘటన సామాన్యముగ తోచినను, యీ చిన్న అనుభవము నుండి ఎన్నియో సంగతులు నేర్చుకొనుటకు నా హృదయము కోరుచున్నది.

కోటగిరిలోని లక్ష్మీ విహార్ యందు సాధు మార్కండేయ యాజమాన్యములో సంధ్యా సమయమున ప్రతిదినము గావింపబడు ప్రార్థన, భజన కార్యక్రమములు జరుపబడుచుండెను. అందరూ ఆ ప్రార్థనలో నిమగ్నులై యుండిరి. నేను సుఖముగనే యుంటిని. కొలదిగా అలసట తోచుట చేతను, దైవముతో ఏకాంతముగ గడప హృది కోరుట చేతను, నేనా ప్రార్థన యందు పాల్గొనక, నా పడక గదియందుడిపోతిని. కంటికి రెప్పవలె కాపాడు జ్ఞానేశ్వరి మాత్రము నాతోనే యుండెను. శారీరకముగ, మానసికముగ కూడ నేను సంపూర్ణ ఆరోగ్యముగనే యుంటిని. ఎట్టి తేడాయును శరీరమునలేదు. కొలది ద్రాక్షపండ్లను చేతి నిడుకొని నా మంచమునకు ఒక గజము దూరమును గల బల్లపై కూర్చొని యుంటిని.

నా పడక పైకి మారవలయునని సంకల్పము నాకు కలిగెను. ఇంతలో నాతల ప్రక్కకు ఒరిగిపోయెను. దానిని నిల్పుటకు గాని, కదుపుటకు గాని, చూచుటకు గాని, శక్తి లేకపోయినది. చైతన్య హీనుడనైతిని. జ్ఞానేశ్వరి ఆందోళన చెంది ప్రక్క గదిలో నుండిన రాజుగారిని పిలిచెను. వారు పరుగున వచ్చి నన్ను పడక పైకి చేర్చుటకు ప్రయత్నించిరి. శరీరము నిర్జీవమై యుండుటచే వారు కదపలేకపోయిరి. అచ్చట జడ శరీరము మాత్రమే మిగిలియుండెను. మరి ఇద్దరు భక్తుల సహాయముతో, అతి విచారముతోడను, దుఃఖముతోడను ఆ శరీరమును ప్రక్క పైకి జేర్చిరి. "స్వామీజీ, స్వామీజీ"యన వారు నన్ను పిలుచుచుండిరి. కాని అందుజీవము లేదు. చూపు శూన్యముగా యుండెను. శ్వాస నిలచిపోయెను. జీవ మెచ్చటికో కొనిపోబడెను. నిర్జీవమగు శరీర మేమిపల్కును? అది యీ జీవితాంతముగా భావించి, చి॥ శాంతి, పిల్లలు మొదలగువారందరు మంచము చుట్టును జేరి విలపించుచు, "శ్రీరామ జైరామ జైజై రామ ఓం" అని స్మరింప మొదలిడిరి.

కొద్ది క్షణముల పాటు “లక్ష్మీ విహార్” దుఃఖాంధకారమున మునిగిపోయెను. ఇంతలో కుమారి జ్ఞానేశ్వరి ఇట్లనెను. **“స్వామీజీ చూచుచుండిరి. జీవము తిరిగి వచ్చినది.”**

చిరునగవుతో నేనిట్లడిగితిని **“నే నెచ్చటయుంటిని?”** బాహ్యస్మృతేమియు నాకు లేకుండెను. నేను లక్ష్మీ విహార్ యందు భక్తులు, సందర్శకుల మధ్య యుంటినని వారు చెప్పిరి. నేనిట్లంటిని. **“నేను ఆ దివ్యానుభూతిలో సుఖముగా నుంటిని.”**

సంగతి యేమియో తెలిసికొనుటకు, ఈ మరణ చిహ్నముల సంగతి తెలుసుకొనుటకు డాక్టర్ కోసమై వెళ్ళిన సాధు మార్కండేయ, డాక్టరుగారితో తిరిగి వచ్చెను. వారు తిరిగి వచ్చు సరికి నేను చైతన్యముతో మాటలాడుచుంటిని. దైవము యొక్క మహిమను ఎవరు వర్ణింపగలరు? ఇది డాక్టర్సు సాధించవలసిన సమస్య కాదు, మాంత్రికులు నిర్ణయించగల వలసినదీ కాదు.

ఆ విధముగా 24వ తేదీ శుక్రవారం రాత్రి జరిగిన విచిత్ర సంఘటన ముగిసినది. అప్పటి నుండియు ఒక విధమగు అంతర్విమర్శ నాలో జరుగుచుండెను. ఈ విధమగు ప్రశ్నలు నాలో కలుగుచుండెను. **“ఈ శరీరమును మృతప్రాయమొనర్చి, చైతన్య రహితము చేసి 15 నిమిషముల పాటు నేనెక్కడకు కొంపోబడితిని? ఎవరైనను నన్ను తీసుకువెళ్ళిరా? నేనొక్కడనే వెళ్లితినా! అందరి ఆనందము కొరకు యీ నిర్జీవమగు శరీరమున తిరిగినేనెట్లు ప్రవేశించితిని?”**

ఈ పరిమిత మేధస్సునకు అందనిదై, చిత్రమైనదగు యీ అనుభవము నా కెన్నియో విధముల తోడ్పడి, పురోగమన సోపానమైనది. నాకును నన్ను ప్రేమించు వారికి కూడ ఇది చక్కగ ఉపయోగించగలదు.

ఓం తత్సత్ ఓం.

ప్రాక్పశ్చిమమున గల ప్రేమాస్పదులగు వారందరికి నా వినమ్రపూర్వకమైన అర్పణ, వారికి శాంతి జ్ఞానము కలుగు గాక!

లోకా స్సమస్తా స్సుఖినోభవంతు

ఓం ! ఓం ! ఓం !

**సముద్ర గర్భమున ఎంత లోతుకుపోయిన అంత ఎక్కువ శ్రేష్ఠమైన ముత్యములు లభించునట్లు, సాధకుడు ప్రవృత్తిని విడిచిన నివృత్తి పరుడైన కొలదియు ఎన్నియో అమూల్యమైన శాంతి ముత్యములను జ్ఞాన రత్నములను తన హృదయంలోనే గాంచగలడు.**

# పూజ్యశ్రీ మలయాళ స్వామీజీ పిలుపు

**- పరమపూజ్య శ్రీ స్వామి ఓంకార్**

**శ్రీ మళయాళ స్వాములవారి చిత్తరువు యొకటి నా బల్లమీద గలదు. దానిని జూచినప్పుడెల్లను శ్రీ స్వామీజీ నన్ను పిలుచుచున్నట్లే యుండును. శ్రీ స్వామీజీ నా హృదయమునకు చాలా సన్నిహితులు. వారి హృదయమునకు నేను గూడ సన్నిహితుడనే.** నా దగ్గర నుండి వారి వద్దకు యెన్ని గజముల దూరమున్న వారి దగ్గర నుండి నాకును, అన్ని గజముల దూరమే యుండును గదా! మా యిద్దరి మధ్యను యెంత మాత్రము దూరమే లేకుండెడిది. శ్రీ మలయాళ స్వామీజీ, శ్రీ ఓంకార స్వామీజీ రెండుగాదు, ఒక్కటే అని చాలామంది భక్తులనుకొనుచుండెడివారు.

శ్రీ స్వామీజీ భౌతిక దేహమును చాలించితిరన్న విషాదవార్త మొన్నను కాకినాడ నుండి భక్తులు రాగా వారి నుండి ఆశ్రమవాసులు విని చాలా విచారించిరి. మరునాడు ది. 12-7-62 తేదీ గురువారము శయనైకాదశి మహా పుణ్యదినమున రాత్రి 12 గం॥లకు శ్రీ వ్యాసాశ్రమములో మహా సమాధినొందిరన్న విచారకరమైన ఉత్తరముగూడ శ్రీ వ్యాసాశ్రమము నుండి వచ్చెను.

శ్రీ స్వామీజీ, నేను రెండుగాదు గావున, వారున్న చోటనే నేను గూడ యుండుటకు కోరుట సహజమే! వారు వెళ్ళిన తావునకు నన్ను గూడ రమ్మనమని నాకు స్వాగతము పంపుచున్నట్లు తోచుచున్నది. శ్రీ స్వామీజీ ముక్తజీవులు, జీవన్ముక్తులు. వారి భౌతిక దేహమును వదలినను నిత్యముక్తులుగా, సిద్ధ పురుషులుగా జీవించియే యున్నారు.

శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీరమణ మహర్షి మొదలైన సిద్ధపురుషుల వలె శ్రీ మలయాళ స్వాములవారు గూడ స్థూలరీతిగ శరీరము వదిలే ముందు చాలా బాధలు పడియుండిరి. మేము నీలగిరి శాంతి కేంద్రమునకు వెళ్ళునప్పుడు, వచ్చునప్పుడు తరచు శ్రీ స్వామీజీ దర్శనార్థము శ్రీ వ్యాసాశ్రమమునకు వెళ్ళుచున్నను, మా దురదృష్టముచే శ్రీ స్వామీజీ యెప్పుడును వెల్లూరు ఆస్పత్రిలోనే చికిత్సను బడయుచుండెడివారు. అందుచేతను యీ మధ్యను, వారి దర్శనమే లభించకపోవుట విచారకరము. అయినప్పటికి శ్రీ స్వామీజీ శిష్యులు, శ్రీ పరమేశ్వరానంద స్వాములవారు, శ్రీ గోవింద స్వాములవారు, వ్యాసాశ్రమ వాసులందరూ, గురుకుల బాలబాలికలతో సహా, మమ్ము యెన్నో రీతులుగా గౌరవించుచూ, ప్రేమించుచూ, శ్రీ స్వామీజీ ఆశ్రమంలో లేని కొరతను లేకుండ జేయుచుండెడివారు.

ఇప్పుడు శ్రీ స్వామీజీ ఎక్కడకు వెళ్ళిరి? ఎక్కడకు వెళ్ళగలరు? ముక్త పురుషులైనవారు సర్వత్రా నిండియుండిరి. వారి ఆత్మ వారిని ప్రేమించెడి వారిలోనే, లీనమై యున్నది. ఈ లోకములో రెండు తరగతుల మానవులు గలరని మహనీయులు జెప్పుచుందురు.

1. బ్రతికియుండియు, చనిపోయినవారు, ఎంత ధనవంతులైనను, బలవంతులు, మేధావంతులైనను అట్టివారు దైవమును మరచిన ప్రేమశూన్యలై యున్నను, బ్రతికియున్నను చనిపోయినవారితోనే సమానము. అట్టివారి జీవితములు భూమికి భారమే. విశ్వప్రేమ లేని హృదయము శ్మశానమువంటిది.
2. ఒక పూజ్యశ్రీ స్వామీజీవంటివారు, దేహముతో యున్నను దేహము విడిచినను, వారు నిత్యజీవులే! నిరంతరము ఇప్పుడే గాక యెప్పటికిని, శాశ్వతముగా లోక కల్యాణమునకు తోడ్పడుచు, జీవించుచునే యుండిరి.

దైవమును మరచినవారు, సాధువులైనను, గృహస్థులైనను మృతజీవులే! బ్రతికియున్నను చనిపోయినవారితోనే సమము. ఇక దైవమును మరువనివారు యెవ్వరైనను, వారు ఏ ఆశ్రమంలో బ్రహ్మచారి గృహస్థ, వానప్రస్థ, సన్యాశ్రమంలో యున్నను. జీవన్ముక్తులుగా భక్త కోటికి లోకమంతకూ

ఆదర్శనీయమైన మహనీయులుగా జీవించుచుండిరి. శ్రీమలయాళ స్వాములువారు పూర్వముకంటె ఇప్పుడే హెచ్చుప్రభతో, శక్తితో, తేజస్సుతో, ప్రేమతో నిండి భక్తుల హృదయములలో ప్రకాశించుచున్నారు. కండ్లున్నవారు శ్రీవారిని నిరంతరము దర్శించవచ్చును. చెవులున్నవారు శ్రీవారి వాక్కునే అన్ని వాక్కులలో వినవచ్చును. శ్రీస్వామీజీ పుష్పములలో వికసించుచున్నారు. పక్షులలో పాడుచున్నారు. బాల బాలికలలో నవ్వుచు ఆడుకొనుచున్నారు. నదులలో ప్రవహించుచున్నారు. పర్వతములలో స్థిరమైయున్నారు. గాంచుడు! మీ శిరస్సులను పైకెత్తి రాత్రులయందు ఆకాశమువైపు జూచిన ప్రతీ నక్షత్రములోను శ్రీ స్వామీజీయే గానవచ్చెదరు. నక్షత్రములలో, సూర్యచంద్రాదులలో శ్రీస్వామీజీ తేజస్సే నిండియున్నది.

అంతా రామమయం. ఈ జగమంతా రామమయం. రాముడు, శ్రీ స్వామీజీ రెండు గాదు ఒక్కటే! వారి **"యదార్థభారతి" కర్మ, భక్తి, యోగ, జ్ఞానములను దెలిపెడి ఆధ్యాత్మిక విషయిక మాసపత్రిక.**

**"ఓ మిత్యే కాక్షరం బ్రహ్మధ్యేయం సర్వ ముముక్షుభిః"** అని

సర్వమత వేదాంతసారమును 36 సంవత్సరముల నుండి ఏకగ్రీవముగా చాటుచు ఆంధ్రదేశములో అనుభవనీయమైన సేవను చేయుచున్నది. అదిగో! నేనిప్పుడీ వ్యాసమును శ్రీస్వామీజీ సన్నిధిని అనుభవించుచూ వ్రాయుచుండ, పిప్పిహ, అనెడి చిన్నపక్షి దూరము నుండి ప్యూకహా! ప్రభువెక్కడ, శ్రీస్వామి – యెక్కడ? అని వెదకుచు ఆర్తనాదము జేయుచున్నది.

శ్రీ స్వామీజీ హృదయములకు, హృదయముగా పవిత్రమైన మన ఆంతర్య హృదయముననే జ్యోతి స్వరూపముగా వెలుగుచుండిరని సమాధానము వచ్చుచున్నది. శ్రీ స్వామీజీకి ఇప్పుడు ఈ లోకములో వేరే శరీరము లేదు. వారి ప్రియమైన స్వార్థరహితులైన శిష్యులు, భక్తుల హృదయములలో ప్రవేశించిరి. మన శరీరములే శ్రీ స్వామీజీ శరీరములు. వినుడు! మరల పిప్పిహ పక్షి, స్వామీజీ, ఇచ్చటనే యున్నారు. ఇదివరకు కంటే ఇప్పుడే హెచ్చుగా మనందరిలో జీవించుచున్నారని గానము జేయుచున్నది. శ్రీ స్వామీజీ స్వార్థరహితమైన సేవాపరులు. వారు అనుభవించటకు పిలచుచున్నారు. శ్రీవారి పిలుపు మీకు వినబడుట లేదా? ఒక్కతరి నిశ్శబ్దముగా నుండుడు. శబ్దములో గూడ వారే!

పరమపావనమైన వారి జీవితమంతయు దేశాభ్యుదయమునకు, లోకశాంతికే ప్రతీక్షణమును ధారపోసియుండిరి. ఒక్కమారు వారు స్థాపించిన వ్యాసాశ్రమమును దర్శించినను, వారు రచించిన ఏ వేదాంత గ్రంథమును చదివినను, శ్రీ స్వామీజీ మహత్తరమైన జీవితము ఇదివరకు, ఇప్పుడే గాక, ఎప్పటికిని మానవకోటికి ఆదర్శనీయముగా నిరంతరము తోడ్పడుచుండునని మనమందరమును గ్రహింపగలము. ఇక వెయ్యిమాటలు, హెచ్చు వ్రాతలేల?

శ్రీ స్వామీజీ మనలను పిలచుచున్నారు. అశరీరిగా వారిప్పుడనుభవించుచున్న ఆత్మానుభవమును మన అందరిలో పంచుకొనుటకు మనలను ఆహ్వానించుచున్నారు. ఇదియే మంచి తరుణము. తరించుటకిదియే గొప్ప సావకాశము. ఇంకను యీ అస్థిపంజరములను, అనిత్యమైన యీ భౌతిక శరీరములను అంటిపెట్టుకొని, ఎంతకాలము, యీపృధ్వితో బంధింపబడి ఖండమైన జీవితములను, అల్పమైన భావనలతో జీవించుము? **"పరోపకారార్థం మిదం శరీరం"** యీ దుర్లభమైన మానవజన్మలు, ఇతరుల సేవకొరకే ఇవ్వబడెను. గాన మనము గూడ శ్రీ స్వామీజీవలె ప్రతీక్షణము ఆత్మసోదరీ, సోదర స్వరూపముల సేవలో గడుపుచు మనము తరించి మనతోడివారి తరింపునకు తోడ్పడెదముగాక! అఖండ కోటి సచ్చిదానంద స్వరూపముగా వెలుంగుచున్న శ్రీ మలయాళ స్వాములు వారి పరిశుద్ధాత్మకు నా జోహార్లు!

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు,
ఓం శాంతిః శాంతిః శాంతిః
హరిః ఓమ్ తత్ సత్.

# పూజ్యశ్రీ ఓంకారస్వాముల వారి 65వ జన్మదినోత్సవ శుభాకాంక్షలు

**- పరమపూజ్య శ్రీ స్వామి శివానంద,** ఋషీకేశము

ఆత్మానుభూతి నొంది, అద్వైతామృతమును గ్రోలిన వారికీ దృశ్య ప్రపంచములో నామరూపములు మిధ్య, ఉన్నది, ఉండినది, ఉండబోవునది కేవల యొకేయొక పరబ్రహ్మము, భగవానుడు మాత్రమే. తత్త్వ రీత్యా వాస్తవికముగ నామ, రూపములు భగవానునకు లేవు. భగవానుడు లేక పరబ్రహ్మము భక్తుల ఉపాసనార్థము సగుణము. సాకారము వహించును, సాకార సాక్షాత్కారమన జీవిత లక్ష్యమబ్బినటుల గాదు. దాని వెంబడి ననుసరించి యుండు నిర్గుణతత్త్వమును క్రియారూపమున గ్రహింపగలిగినప్పుడే మీరు జీవిత లక్ష్యము బడసినట్లు అగును.

84 లక్షల చేతనాచేతన నామరూప జగత్తును (నిరతము సర్వమును భగవానునిలోను, భగవానుని 84 లక్షల చేతనా చేతన నామరూప జగత్తు (నితరముల సర్వము)లోను తానే ఆ భగవానునిగాను, ... క్రియారూపమున గాంచుటయే నిర్గుణ సాక్షాత్కారము. అదియే గీతలో అ. శ్లో 29, 30 (సర్వభూతస్థ.., యోమాం పశ్యతి)లలో నిరత్రము సృష్టీకరింపబడినది. అదియే మీరనుదినము, ననుక్షణము పఠించుచు ననుభవ మొందయత్నించు శాంతి ప్రార్థన.

ఈ పరమ పవిత్రమగు, దివ్యమగు సారమగు శాంతిప్రార్థన "కేనోపనిషత్తు" "ముండకోపనిషత్తు" మున్నగువాటిలో కాననగును. ఈ **"శాంతి ప్రార్థన"** నాంతర్య మనోభావముల భక్తి శ్రద్ధలతో పఠించుటయన "భగవన్మంత్రజపము" నొనర్చినటులే, శాంతి ప్రార్థన మంత్రతుల్యమే కాదు మంత్రమే, భగవానునికి వలయునది భాష కాదు, భావము, హృదయాగాథోద్భూతమైన "పరమ పవిత్రభావము" మాత్రమే ప్రపంచములోని నేభాషలోనైనను నుచ్చరింపబడవచ్చును, నేజాతివారైనను దేశ, కాల, లింగ, వయోవివక్షత లేక జపించవచ్చును.

శృతి వాక్యములగు **"దేహోనాహం, జీవోనాహం, ప్రత్యగభిన్న బ్రహ్మనాహమ్"** (నేను జడమగు దేహమును కాదు, జీవుడను కాదు. వేరుకానట్టి పరమాత్ముడనే, పరబ్రహ్మమునే) **"సర్వం ఖల్విదంబ్రహ్మ, నేహనానాస్తి కించన"** (ఈ సమస్తము నేకైక పరబ్రహ్మమే, యిటనొకింతయు బహుత్వము వేరొండులేదు) మున్నగువాటి యొక్క సారమే మీరు "శాంతి ప్రార్థన" ద్వారా గ్రహించగలరు. ఇదియే వేరొక రూపముననిట **"శివోహం, శివోహం, శివోహం, సోహం సత్, చిత్, ఆనంద స్వరూపోహమ్"** నేనే శివుడను, నేనే శివుడను, నేను శివుడను, నేను పరమాత్మను, నేను సచ్చిదానంద స్వరూపమను (పరమాత్మను) అని ప్రతినిత్యము సత్సంగ సమయములలో సంకీర్తింపబడును.

మీరు ద్వైతులుకండు, విశిష్టాద్వైతులుకండు లేక వేరితర సాంప్రదాయకులుకండు నీ మహోన్నత, అద్వైత స్థితికి మిమ్ముల నీడ్చితీరును. అప్పుడే మీరు నుడువరాని శాంతి, తెలుపరాని యానందము, చెప్పరాని నాత్మైక్యత సహజావస్థలో నుందురు.

కాన ఓనాప్రియ ఆత్మీయులారా! నా హృదయైక బాంధవులారా! నాప్రేమైక ఆత్మీయులారా! లెండు, ఈ క్షణమే లెండు. భువిపైనిక మిగిలియున్న దినములైనను నీయుత్తరక్షణము నుండి, క్షణక్షణము సద్వినియోగపరుపుడు. మిమ్ముల మీరెన్నడును స్వల్పబుద్ధితో రావు, రాజు, రెడ్డి, గుప్త, మూర్తి, శర్మ, వర్మ, శాస్త్రి, కమల, విమల, లలిత, రాధ, మంజుల సవితగ దేహ భావనతో తలపోయకుడు. మీరు సదా, సర్వదా, నిత్యనిరంతరము త్రికాలముల, త్రివ్యవస్థల నా పరబ్రహ్మము మాత్రమే. బాహ్యావేషములకు నాడంబరములకు ప్రాధాన్యత నిడకుడు. ఆంతర్య హృదయమును మాత్రమే లెక్కగొనుడు, "ధర్మము" ననుసరింపుడు. సద్గురు సంశ్రయ మొందుడు. వాని బోధలనాచరింపుడు. కాయిక, వాచిక, మానసిక, పరిశుద్ధిని పవిత్రతను నూటికి నూరుపాళ్ళుగ గొనుడు. దేహేంద్రియ మనోబుద్ధ్యాదుల కతీతులుకండు. రాగద్వేషముల విడనాడుడు. మీకు మీరీక్షణముననే "పరమ సత్యమును" గ్రహించి దివ్యులుగా భాసిల్లగలరు. గత ముప్పది సంవత్సరములకు పైగ నాంధ్రమున, నితరత్ర, దేశ, విదేశముల నాధ్యాత్మి సేవ నొనర్చుచున్న పరమ ప్రీయాత్మీయులగు మీకు మాశుభాభివందనలొనర్చుచు నిట ప్రత్యేక ప్రార్థనల సల్పితిమి! అఖిల ప్రజాసేవకై నాయురారోగ్యముల తోడ వర్ధిల్లుదురు గాక!

* స్వార్థ చింతనయే బంధన, దుఃఖ హేతువు, ఇతరులకై జీవించుచు, ఇతరులకై యోచించుటయే స్వేచ్ఛ.
* ఆత్మ పరిశోధన చాలా ముఖ్యము. మాయ చేత ఇతరులను పరిశోధించునే గాని, తనను తాను పరిశీలించుకొనడు. ఆత్మ పరిశోధన తోడనే ఆధ్యాత్మికత ప్రారంభమగును.
* అసూయ - అసూయ యను నదొక మానసిక కుష్ఠరోగము - కుష్ఠు రోగము శరీరమును పాడు చేయును. అసూయ మనస్సునే నశింపచేయును.

# విశ్వప్రేమ చిహ్నము శ్రీస్వామి ఓంకార్‌జీ

- పరమపూజ్య శ్రీ స్వామి చిదానంద
ఋషీకేశం

ఓం శాంతి!

పూజనీయులు, ప్రేమాస్పదులు అగు శ్రీ ఓంకార్‌జీ మహారాజ్ వారికి హృత్పూర్వక ప్రణామములు. శాంత్యాశ్రమ మునివర్యులు విశ్వశాంతి దూత. శాంతియే చైతన్యముగా గలవారు, ప్రేమయే రూపుదాల్చినట్లుందురు. ఆ దివ్య పురుషుని యందు కానవచ్చు ప్రేమ సామాన్య భౌతిక ప్రేమ కాదు, దివ్య ప్రేమ. వారి నుండి ప్రసరితమగు ప్రేమ యీ విశ్వమంతయు వ్యాపించుటయే గాక, చేతనా చేతనములైన సకల సృష్టిని తనలో ఇముడ్చుకొనగలిగినది. వారి పరిధిలోనికి వచ్చిన ప్రత్యణువు ఆధ్యాత్మిక ప్రేమ స్రవంతితో నిండిపోవును. దైవ ప్రసాదితులగు యీ తోటపల్లి మునివర్యులు మానవాళికొక అమూల్య సంపద, ఆశాజ్యోతి. మహోత్కృష్టమగు వారి జీవితాశయము మానవాళికి శాంతి నొనగూర్చు చున్నది. మానవసేవ చేయవలయుననెడి వారిలో కలిగిన ప్రగాఢవాంఛ, అనంతప్రేమ, ఈ శాంతి సంస్థను నెలకొల్పజేసి, అర్ధ శతాబ్దికి పైగా చక్కగ నడపబడుచున్నది. శాంతి కేంద్రము లన్నింటికి మూలస్థానమైన యీ శాంత్యాశ్రమున శ్రీ స్వామీజీ యుండుటచే వారి ప్రేమ, శాంతి ఆశ్రమమంతయు పరివ్యాప్తి చెందియుండును. ఆ ఆశ్రమమందలి తరు వృక్షలతా గుల్మములు, పుష్ప పత్రములు సర్వము ఆ శాంతి ప్రేమలచే నిండి, వారు ప్రసరితమొనరించు వాటిని తాము కూడ సజీవములై చాటుచున్నట్లుండును.

శ్రీ స్వామీజీ ఆధ్యాత్మిక సంస్థ విశ్వమానవ ఏకత్వమును చాటును. వారి శాంతి ప్రేమ సందేశములు జగద్విఖ్యాతమైనవి. వారు రచించిన పుస్తకములు, వారు ప్రతినెల ప్రచురించు "శాంతి" "పీస్" మాస పత్రికలు సమస్త మానవులకు పూరట కలిగించి, వారి ఆత్మోన్నతికి తోడ్పడును. వారి పవిత్రనామము వివిధ దేశములలోని ప్రజల నాల్కలపై సతతము నిల్చియుండును. వారి ప్రేమ, శాంతి క్రీస్తు ప్రభువుని తలపింపజేయుచుండెను. ఈ రచయితకు స్వామి ఓంకార్‌జీ వారి పరిచయము మొదట స్వామి శివానంద సేవలో, వారి శిష్యత్వములో యుండగా జరిగెను. శ్రీ గురుదేవులు శివానందజీ, ఓంకార స్వామీజీల ఆధ్యాత్మికానుబంధము ప్రేమ, పరస్పరానురాగ గౌరవములు అప్పుడే తెలుసుకొనుటకు అవకాశము చిక్కెను. ఆ విధముగా యీ సేవకునకు స్వామి ఓంకార్‌జీపై అధిక గౌరవము కలిగెను. ఇది 1945 సం॥ నాటి సంగతి అప్పటినుండియు వారిని దర్శింపవలయుననియు వారి పవిత్రాశీర్వాదము గైకొనవలయుననియు, తీవ్ర వాంఛ కలదు. ఎంతో కాలమైనను ఆ వాంఛ అట్లే యున్నది. కొలది సంవత్సరముల క్రిందటనే ఆ కోర్కె నెరవేరెను. సద్గురు శివానంద వారి ద్వారా స్వామీజీ, శాంత్యాశ్రమము చాలా కాలముగా తెలిసినను ఇరువది సంవత్సరముల తర్వాత స్వామీజీని వారి ఆశ్రమములో దర్శించి ఎనలేని ఆనందమును పొందియుంటిని. పూజ్య స్వామీజీ మమ్ముల నందరను అధిక ప్రేమతో, వాత్సల్యముతో ఆహ్వానించిరి. ఆ రాత్రి స్వామీజీ శ్రీ శివానందజీ ముప్పది సంవత్సరముల క్రిందట ఆశ్రమమునకు వచ్చినప్పటి సంగతులు అధిక ప్రేమతో చెప్పియుండిరి. ఆశ్రమమునకు వెళ్ళుట వారిని దర్శించుట నాకు చాల ఆనందమును కల్గించుటచే, నేను అదృష్టవంతుడనని భావించితిని.

ఆ తరువాత నేను వారిని దర్శించుసరికి వారొక పెద్ద ఆపరేషన్‌కు గురియై డాక్టర్లుచే ఏ

మాత్రపు అలసట కూడవలదని నిషేధింపబడి యుంటిరి. వారికి పూర్తి విశ్రాంతియే గాక మాట్లాడుట కూడ వలదని నిషేధించి యుండిరి. కనుక వారు సాధ్యమైనంత నిశ్శబ్దములో గడుపుచుండిరి. అట్లున్నను అధిక ప్రేమ వాత్సల్యములతో నా యోగ క్షేమముల నరసి, నాతో ప్రేమపూరిత ప్రసంగము నొనర్చిరి. నా గురుదేవులగు, శ్రీ శివానందజీ సమతుల్యులగువారు, చిన్నవాడను, సాధనా దశయందున్న వాడను అగు నాపై చూపిన ఆదరణ నన్నాశ్చర్యపరచెను. ఆధ్యాత్మిక దృష్ట్యా సేవకుడను, భక్తుడను అగు నాపై వారట్టి ఆదరణ చూపుటే వారి ఘనత. డాక్టర్లు యొక్క సలహాపై శ్రీ స్వామీజీ మౌనము పాటించినను, వారి దర్శనము గావించుకొని, వారి దివ్య సాన్నిధ్యములో కొంచెము సేపు గడుపుటయే చాలును. వారి తీవ్ర అనారోగ్య స్థితి, ఆసుపత్రిలో జేరుట, శస్త్ర చికిత్స మొదలగునవి నాకు తెలిసి వారి ఆరోగ్య విషయము తెలుసుకొనుటకై వారిని దర్శించితిని. సేవకుడను, వారి కంటే చిన్నవాడను అగు నన్ను వారితో సమముగా భావించి ఏకత్వమును చూపిరి. అది నాలో గాఢముగా నాటుకొనెను. వారి ఆత్మభావన, మా గురుదేవులు, నాకు కూడ సజీవమూర్తిత్వమున భాసించువారి ఆత్మభావనను స్ఫురణకు దెచ్చెను. నిరాడంబరమైన ప్రకృతిని, వినమ్రతని ప్రేమించు మా గురుదేవులు స్వామీజీని అంత అత్యధికముగా ఎందుకు ప్రేమించెడివారో నాకిప్పుడు అవగతమైనది. అనంతమైన ప్రకృతిలో పసిబాలురవలె జీవించుటయే వారిరువురును అంత సన్నిహితత్త్వమునకు దెచ్చెను. స్వామి ఓంకార్‌జీ పసిబాలుని వలె 'అహం' 'నేను' భావమును వారిలో తుడిచివేయుటచే దైవము వారిలో దివ్యత్వమును నింపెను. ఇప్పుడు, ఇచ్చటనే దైవ సాక్షాత్కారము అను దానిని సార్థక మొనర్చుచు, వారు ఆ దివ్యత్వమునే జగతిని ప్రసరిత మొనర్చుచుండిరి.

అంతయేగాక వారి ఆత్మనే అన్నింటి యందును, ప్రతి తావునందును, వారు దర్శింతురు. తరువృక్ష లతాగుల్మము లన్నింటితో వారు మాట్లాడుచు, ఎండగా యున్న సమయమున వాటికి నీరుపోయుట మరచిన, వాటిని క్షమార్పణ వేడుచు వాటిని ప్రేమించుచుందురు. వాటికి నష్ట పరిహారము చెల్లించుటకై మరింత ప్రేమించుచు వాటికి అధికమగు నీరు పోయించుచుందురు. అట్లు శ్రీ స్వామీజీదృష్టి ఎక్కడ ప్రసరించిన, అచ్చట దివ్యత్వము ప్రస్ఫుటమగును. వారి పంచేంద్రియములు ఏమి గ్రహించినా, ఏమి చేసిన అందు వారు దైవభావమునే గ్రహింతురు. ఆ విధముగా వారు దైవములోనే జీవించుచు, చలించుచు, దైవములోనే అహర్నిశము తాదాత్మ్యము చెందెదరు. అందుచేతనే వారి సన్నిధికి వెళ్ళి వారి ప్రక్కన కూర్చుండిన ప్రతివారు ఆ దైవానుభూతిని పొందుచు, ప్రతిక్షణమున, ప్రతి శ్వాసయందు వారు పొందు దివ్యానుభూతిని పంచుకొందురు. కావున వారు దైవస్వరూపులేయని చెప్పుట అతిశయోక్తి కానేరదు. వారి సన్నిధియన దైవసన్నిధియే, వారి సన్నిధిలో యేకత్వము తప్ప అన్యము కానరాదు. ఆత్మభావమున అందరు ఒక్కటియే. దైవానుగ్రహముచే ప్రేమ, శాంతి, ఏకత్వము స్వామి ఓంకార్‌జీ మహారాజ్ ద్వారా మానవాళిపై ప్రసరిత మగుచుండెను. వారి ప్రేమపూరిత సేవ, శాంతి జీవనము మానవాళికి మార్గదర్శకములు.

పవిత్రము, ఆనంద ప్రదము అగువారికి 80వ జన్మదిన శుభ సమయమున, నేను నా హృదయపూర్వక కృతజ్ఞత నర్పించుచు, ఈ వ్యాసము వారి చరణముల కర్పించుచుంటిని. శాంతిని, ప్రేమను ప్రసరించు వారు చిరకాలము మనెదరు గాక! ప్రేమ సేవారూపముననే ప్రసరిత మగుననియు, ఏకత్వమునకు అదియే మార్గమనియు చూపుదురు. వారి నుండి ప్రసరితమగు తేజఃకిరణములవి. ప్రేమ, శాంతి, సేవ, ఏకత్వము వీటి ప్రతిరూపలగు వారికి నా శ్రద్ధాంజలి. ప్రియతములగువారికి ప్రణామములు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

# శాంతి దూత - శ్రీ స్వామి ఓంకార్ జీ

**- పరమపూజ్య శ్రీ స్వామి దేవానంద**

పరమ పవిత్రమైన మన భారత ఖండములో, సమయా సమయందనేక అవతారములు, మహాపురుషులు, లోకోపకార పరాయణులు ఉద్భవించిరి. కొన్ని యవతారములు అధర్మ నాశనము మరియు ధర్మ రక్షణము కొఱకు, కొన్ని యవతారములు, ప్రేమ, వాత్సల్యములు ప్రేరేపించే నిమిత్తము, కొన్ని యవతారములు, దయాహింసలు బోధించుటకుగాను, కొందరు మహాపురుషులు, త్యాగమును నిరూపించుటకుగాను, కొందరు సత్పురుషులు వర్ణాశ్రమ ధర్మములను ఆదర్శముగా నడపి చూపించుటకు గాను, కొందరు సత్యమును ప్రతిష్ఠించుటకుగాను, కొందరు మహనీయులు విశ్వశాంతిని ప్రబోధించుటకు గాను, మరికొందరు మహాపురుషులు నిష్కామ సేవ ద్వారా లోక కల్యాణము చేయుటకుగా నుద్భవించి, ప్రపంచమందు పైతెలిపిన, లోక కల్యాణప్రదమైన ధర్మాది కార్య క్రమములను ప్రతిష్ఠించి, ప్రబోధించి, ఆదరించి ఆదర్శవంతులై, వారి వారి అవతారములను ముగించిరి. ముగించుచున్నారు. ముగింప బోవనున్నారు.

అట్టి మహాపురుషులలో, లోక కల్యాణము జేయు వారిలో, శాంతి దూతలలో నొకరు. పూజ్యశ్రీ స్వామి ఓంకార్‌జీ మహరాజ్. వీరు కనీసము ఏబది (50) సంవత్సరముల నుండి, విశ్వశాంతికై, లోకశాంతికై మానవ శాంతికై, అనేక విధములుగా కృషి సలుపుతూ శాంతిదూతవలె, రాత్రింబగళ్లు, వీరి అమూల్యమైన జీవితము నంతటి నర్పించిరి. పూజ్యశ్రీ స్వాములవారు. రెండు, మూడు, పర్యాయములు, పాశ్చాత్యదేశ పర్యటనము చేసి, భారతదేశ మంతటా అనేకసార్లు పర్యటన మొనర్చి "శాంతియే మీ జన్మహక్కు. మీరు వాస్తవముగా శాంత స్వరూపులే, శాంతము లేనిచో సౌఖ్యము లేదు. కాబట్టి మీరందరు అట్టి ఉత్కృష్టమైన పరమశాంతిని ఇపుడే ఇచ్చటనే పొందండి. ఈ పరమోత్కృష్టమైన సదవకాశమును జారవిడువకండి. మీలో నున్న ఆ పరమశాంతిని మీరందరూ అనుభవించి, నిత్యానందమును, బ్రహ్మానందమును పొందండి" అని ఈ దివ్య సందేశమును రెండు మాస పత్రికలు ద్వారా (1) Peace, (2) శాంతి, చిన్న చిన్న కరపత్రముల ద్వారా, లేఖలు ద్వారా, ప్రత్యక్ష దర్శనము ద్వారా, వారి పవిత్ర సంకల్పము ద్వారా, వారి ప్రతిశ్వాస నిశ్వాసలు ద్వారా పదేపదే ప్రభోదించుచున్నారు. ప్రస్తుతము మన మందరము, శాంతి లేదు, శాంతి లేదు, అని అల్లాడుచూ ఎచ్చట చూచినను అశాంతియే అని మొఱపెడుతున్నాము. కాని శాంతిని పొందుటకు తగిన ప్రయత్నము మాత్రము చేయలేదు. కాబట్టి ఇప్పుడయినా, పూజ్యశ్రీ స్వాములు వారి 76వ పరమ పవిత్రమైన జన్మదినోత్సవ సమయములో మనమందరము వారి ప్రబోధములను శ్రవణము చేసి, మననము చేసి, అపరమోత్కృష్టమైన శాంతి ననుభవించెదము గాక.

పూజ్యశ్రీ ఓంకార స్వాములువారు, మనకందరికీ ఆ పరమ శాంతిని పొందుటకు చేయు ప్రయత్నమందు శక్తి, సామర్థ్యములనొసంగెదరు గాక. సర్వశక్తి స్వరూపుడయిన పరమేశ్వరుడు, ప్రపంచమందు శాంతిని వెదజల్లుటకు గాను పూజ్యశ్రీ స్వాములువారి కనేక దీర్ఘ సంవత్సరములు, సంపూర్ణారోగ్య మొసంగి రక్షించుగాక యని పదేపదే ప్రార్థించుచున్నాను.

ఓం శాంతి ః ఓం శాంతి ః ఓం శాంతి ః

# ఓంకారస్వామి జన్మదినము

– పరమపూజ్య శ్రీ స్వామి రామానందతీర్థ

ఎవరిని గురించి వారికి ఇతరుల కంటె, పూర్ణముగాను, బాగుగాను తెలియును. అందుచే అన్యులపై పరిపూర్ణమైన అభిప్రాయము వెలిబుచ్చుట చాలా కష్టతరము. ప్రప్రథమమును వారి రూపమునందలి కొంతభాగమును మాత్రమే మనము చూడగలము. అంతేగాక మనకు గ్రాహ్యముగాని సంగతులెన్నో యుండును. ఇతరులను అర్థము చేసుకొనగల్గెడి మన శక్తికి మితమైన పరిధియు గలదు. అందుచేత ఒక ఉన్నతము, ఘనతరము అయిన వ్యక్తిని గూర్చి మనము వర్ణింపబోగా మన ఆత్రములో పరిపూర్ణ రూపకల్పన చేయజాలము. ఒక్కొక్క పరి మన ఆలోచనా ఛాయలు, మనము వివరింపబోయెడి దానికేమియు సంబంధము లేకుండగ, ఆ రూప చిత్రణమును కళంక పరుపవచ్చు గూడ. అయినను మరి మార్గాంతరము లేదు.

స్వామి ఓంకార్‌జీని గూర్చి చెప్పబోవుట చాలా సాహసకార్యము. నేను వ్రాయుటకు నా కలము గైకొనినపుడు నా హృదిలో యీ ఆలోచనలు కల్గెను. "నీవు స్వామీజీని సరిగా అర్థము చేసుకొంటివా? వారిని పరిపూర్ణముగా తిలకించితివా? వారిని పూర్ణముగా అవగాహన చేసుకొంటివా? లేక నీ వ్యక్తిగత అభిప్రాయపు ఛాయలా?" వీనికి తృప్తికరములైన జవాబు లేమియు రాలేదు. మానవుడు తీసుకొను జాగ్రత్తలన్నియు తీసుకొనుచు, పరిమితమైన హద్దులలో, వాస్తవములకు దూరము కాకుండగ, స్వామీజీ యొక్క ఈ రూపచిత్రణ గావించితిని.

స్వామీజీ వికసించిన నిష్కపట మనస్కులు. వారు సతతము చల్లని వీక్షణములను ప్రసరింపజేయుటగాక, నూత్న విషయములను వినుటకు, నేర్చుకొనుటకు కూడ సంసిద్ధులై యుందురు. వారు పరిపూర్ణులై యుండియు, క్రొత్త భావములను తెలుసుకొనుటకు ఆత్రముగా నుండుట నేను గమనించితిని. పురోభివృద్ధికి, ఔన్నత్యమునకు అంతము లేదన్న విషయము వారికి తెలుసు. వారిలోని ఈ ప్రత్యేక లక్షణము నాకు సదా ఆనందము కల్గించుచుండెను. మా ఇరువురి మధ్యను స్వేచ్ఛా సంభాషణ జరుగుచుండును. వివిధ రకములైన ఆశ్రమ కార్యకలాపములను గూర్చి వారితో చెప్పుటకు నేనెప్పుడును సందేహించలేదు.

భౌతిక దృష్ట్యా వానికి అర్థము కన్పించకున్నను, పరంపరాగతియైన కొన్ని ఆధ్యాత్మిక సాంప్రదాయములను స్వామీజీ అంగీకరించుచుందురు. వానిని అర్థము చేసుకొనుటకు నేనెంతయూ ప్రయత్నించితిని. కాని ఇంతవరకు కృతకృత్యుడను కాలేదు.

వారిలోని మరి ఒక ప్రత్యేక లక్షణమేమన, వారు నిత్యమును గుర్తించిన సంగతి ప్రదర్శింపరు. వారు దైవమును దర్శించి, సదా ఆయనలోనే వసించుచుందురు. వారి బాహ్య ఆచరణ లేమైనను, ఆ అనంతములో వారు సదా సర్వైక్యము చెందియుందురు. అందుచేతనే వారి నుండి సుమనోహర మధుర పరిమళము, తేజస్సు వ్యాపించుచుండును.

నిస్వార్థముగా వివిధ రకములైన ఆశ్రమ కార్యకలాపములందు మునిగియున్నను, వారు ఎన్నియో కష్ట నిష్టురములను ఎదుర్కొనవలసి వచ్చుచుండును. సర్వ సామాన్యునిపై వలె విధి వారిపై ఇన్ని రకములైన కష్టముల నేల కల్గించెనని, నేను ఒక్కొక్క పర్యాయము ఆశ్చర్యపోవు చుందును. స్వతసిద్ధముగా వారు

బహు సున్నిత హృదయులు. మేము తరుచు వారి అనారోగ్యమును గూర్చి విచారించుచుందుము. కాని వారు చురుకుగా కదులుచు తమ పనిని ఉజ్వలమూర్తి (Colossus) వలె చేయుచునే యుందురు. ఇవన్నియు చాలా చిన్న విషయముల క్రింద చూపట్టినను చాలా విశిష్ట విషయములు.

పసిబిడ్డల లాలిత్యము స్వామీజీయందు చూపట్టును. వారు చిన్న విషయములను ఆనందింతురు, విచారింతురు, కాని వారి అంతరం దివ్యత్వముపై ఇవి ఎట్టి ముద్రయు కల్పించవు. ఆ దివ్య అంతర్వాణి సతతము ప్రవహించుచునే యుండును.

కొన్ని సమయములందు కొందరు భక్తుల వలె నటించుచు, వారి స్వకార్యములకై స్వామీజీ మంచితనమును దుర్వినియోగము చేయుచుండుట గాంచిన నాకు చాలా విచారము కల్గుచుండును.

ఓంకార్ స్వామీజీది చిత్రమైన వ్యక్తిత్వము. అందముగా నిర్మింపబడిన వానిని వారెంతయో ప్రేమించుటయేగాక, వాటిని యదా స్థానములో భద్రపరుచుచుందురు. తోటపల్లిలోని శాంతి ఆశ్రమము వారి భావముల యొక్క రూపచిత్రణ. ఈ భూమి యందు వృద్ధి పొందిన ప్రతి వృక్షము నందును, ఇచ్చట రూపుదాల్చిన ప్రత్యాకృతియందును వారి రసజ్ఞాన సంబంధమైన ప్రతిభ బహిర్గత మగుచుండును. అతి స్వల్పాంశములను గ్రహించువరకు ప్రతి పనియందును వారు కృషి సల్పుదురు.

**"దైవములో నివసింపుము, ఇతరుల నాయనలో నివసించుటకు తోడ్పడుము"** ఈ మాటలయందే వారి పూర్తి జీవితము నిబిడీకృతమై యున్నది.

ఓం తత్ సత్ః

* **మీరు ఏ దైవము కొరకు చర్చిలలోను, మసీదులలోను, దేవాలయమందును వెదుకుచుండిరో, ఆ దైవము పవిత్రమగు మీ హృదయముల యందే గలడు.**
* **మనము సుఖ సంతోషములు పొందవలెనన్న ఇతరుల సుఖ సంతోషములకు తోడ్పడవలెను. ఇతరుల నానందింపచేయుట యందే మన ఆనందము ఇమిడి యున్నది.**
* **నీవు ఏది సత్యమని నమ్ముదువో దానిని గట్టిగా పట్టుకొనవలెను. ఎన్నడును విడువవలదు. సత్యమనగా ఎన్నడును మార్పునొందని జ్యోతియే.**

# ఓంకార హృదయము

– పరమపూజ్య శ్రీ స్వామి నిత్యానందగిరి
కైలాస ఆశ్రమం

ఆధ్యాత్మ విజ్ఞాన సురభిళామోదితులగు "శాంతిపాఠక" మహాశయులారా!
ఓం తత్సత్ ఓం నమస్తే.

శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులగు శ్రీమదోంకార స్వామి మహాశయలకు 1968 జనవరి 21 తేదీకి 74వ జన్మదినము రానున్నది. మహనీయుల జన్మదినము – దేశీయులకు పుణ్యతీర్థావగాహన సదృశము కదా! స్థిత ప్రజ్ఞావతంసులు శ్రీమదోంకార స్వాములవారి జన్మావతరణ సందర్భమున వెలువడు "శాంతి" జన్మదిన సంచిక విశేషములతో వెలువడునని పాఠక మహాశయు లెఱింగిన విషయమే కదా!

ఓం సత్యం శివం సుందరమ్ అని శ్రుతి మాతృ ప్రవచనము. అనగా మనము చిన్మయ స్వయంజ్యోతి స్వరూపులము. మంగళప్రదమై, నిత్యమై, సత్యమై, సుందరమై ప్రతిమానవ హృదయములో ప్రణవజ్యోతి వెలుగొందుచున్నది. అట్టి ప్రణవజ్యోతిని తనయందును సమస్త భూతములయందును వెలిగించి, వెలిగింపజేసి, వెలుగుజూచువాడు శ్రీరామతీర్థ మహాశయుడు. ఆ దివ్యాశయుడు నిజముగా ప్రథితాద్వైతమును నఖిల దేశముల అవిరళ ప్రచారము చేసి ఢంకా బజాయించి నిరాఘాటధాటీ పాటవముతో జాటి చెప్పినాడనుటలో అతిశయము లేదు. ఆశ్చర్యమును కాదు. కావుననే ఆ మేధోపాధోనిధిని విద్వల్లోకము ఒక్కుమ్మడిగా "అపరశంకరు" డని వేనోళ్ళ జాటినది. అతడొక ఆధ్యాత్మిక దివ్యజ్యోతి. తన్మూలమున పెక్కు జ్యోతులు నలువంకల వెలిగింపబడి అజ్ఞానాంధ తమః పరంపరలను విచ్ఛిన్న మొనర్పబడి దివ్య తేజో విరాజితముగా జేయబడినది.

రామతీర్థుడొక ప్రసిద్ధి పురుషోత్తముడు, విజ్ఞాన సాగరము తదంతస్తేజము – శిష్యాగ్రేసరుడగు శ్రీమాన్ నారాయణ స్వామిగారు సుమారు 40 ఏండ్లకు బూర్వమే ఆంధ్ర దేశమున శ్రీరామతీర్థ శంఖారావము వినకపూర్వమే – శ్రీ తోటపల్లి కొండలలోని శ్రీ "శాంత్యాశ్రమము" ఆవాసముగా నేర్పఱచి శ్రీవారి సహకార సానుభూతి విభూతిలో బాలుపంచుకొని నిరంతర సంక్షుభిత జీవిత సంగ్రామములో శ్రీరామతీర్థ దివ్యోపదేశామృతము నాస్వాదించి గఙ్ఞున త్రేన్చి అనుభవమునకు దెచ్చుకొని తదారాధనము తదనుకరణు, తదేకనిష్ఠ, తదేక జీవిత విధానము గల ప్రకృత వక్తవ్య మహద్వ్యక్తి, పవిత్ర హృదయుడు శ్రీమదోంకారస్వామి గారు, వీరు ప్రాక్పశ్చిమ దేశములకు భారతీయ సంస్కృతిని, క్రైస్తవ ప్రేమాదర్శ జీవన కార్యాచరణమును మేళవించి సమదర్శియై పరమ కరుణారస పరిప్లావిత హృదయులునై "అపర దధీచి" యై నింపెసలారి విరాజిల్లుచున్నారు. ఎంతయు ధన్యజీవనులు. వారి దృష్టియే ఓంకారము. పావన జీవనమే ఓంకారము. వినుట, కనుట, పొందుట, అంతయు నోంకారము. ఇంతయేల వీరసలే ఓంకారము అగుటచే వీరికిని ఓంకారమునకు అభిన్న నదృశము గదా! ఇట్టి త్యాగధనులు తమ జీవిత సర్వస్వమును జగత్కల్యాణమునకై వెచ్చించుటలో వింత లేదు. విశేషము కాదు. మఱియు లోక కళ్యాణార్థము ఆర్ష సంస్కృతిని పూర్వము అమెరికా, చికాగో నగరమునందు వివేక సూర్యుడగు "వివేకానందుడు"

"భగవాన్ రామతీర్థులు" తమ దివ్య వాగమృత ప్రవాహముచే పునీతము దొసగినట్లుగా శ్రీ శాంతి సంస్థాన స్థాపితులగు శ్రీ స్వామివారును అభినవ రామతీర్థ స్వరూప స్వభావములచే పరస్పర విభిన్న మంత కాలుష్యపూరిత మానుష్యమును పరమ ప్రశాంత వాతావరణము సేకూర్చి పవిత్ర భావ ప్రభావాహకముగా దయారుచేసి లోకసంగ్రహ మొనర్చు చున్నారనటుట నుచితము.

**"ఓమితి యిదమ్ సర్వమ్"** అను సూత్రమును హోత్వం తరమగు వీరి దృష్టియే – మానవసేవ మాధవ సేవ నరసేవయే నారాయణ సేవ. ప్రజాసేవయే పశుపతి సేవయనెడి లక్ష్యసాధనకై జీవించుట వలన ''సర్వేజనా స్సుఖినోభవంతు'' అనెడి మంగళాచరణ సూక్తియే వీరి ధ్యేయస్ఫూర్తి. మూర్తిమంతమగుటచే నీలోకోద్ధారకునికి శతాయు స్సంపత్సమృద్ధియేగాక, ఆత్మోన్నతికిని జగదాత్మ విద్యానవద్యతకును – పది కాలాల పాటు దివ్యాయుర్విభూతితో విరాజిల్లుగాకయని యాశించుచు శ్రీశాంతికామునకు శాంతి కామనుడనై లేఖినికి విశ్రాంతి నెలకొల్పుచున్నాడను.

ఓం తత్సత్ ఓం నమస్తే ఓం! ఓం!! ఓం!!! ఓమితియిదం సర్వమ్.

* నేను ముఖ్యముగ కోరునది ప్రతిక్షణము ధ్యానములోను, లేక స్వార్థరహిత సేవలో గడుపగలగాలి. ప్రతిక్షణము అమూల్యము. అట్టి అమూల్య కాలమును తెలిసి గాని, తెలియక గాని వృథా చేయరాదు. అనవసర ప్రసంగముల వలన, ఆధ్యాత్మిక జీవితమునకు అవరోధము తెచ్చుకొందురు.
* ఏ పని లేని సోమరుల మెదడులో దయ్యములు నాట్యము చేయునన్న వాక్యము ఎంతో సత్యము. పనియే ఆరాధన గాన, మనము సదా ఏదో మంచిపనిని ఆదరించుచు కాలము సదా సద్వినియోగము చేయవలసి యున్నది. అప్పుడు సోమరితనమునకు తావుండదు.

# అపర దధీచి

**- పరమపూజ్య శ్రీ స్వామి విద్యానంద**, వ్యాసాశ్రమము

శ్లో॥ **శ్రీమానోంకారస్వామ్యస్థి ప్రదాతా పరదధీచిః**
**దధీచిరి సర్వత్రహ్యుదారో యం విరాజతామ్॥**

పరిపూర్ణ పరబ్రహ్మ స్వరూపులగు ప్రియాత్మ బంధువులారా! లోకములో దాతలు పలురకములుగా నుందురు. ఇందులో కొందరు అన్నదాతలు, మరికొందరు భూమిదాతలు మరియును కొందరు హిరణ్యదాతలు, ఇంకా కొందరు వస్త్రదాతలు, ఇంకను కొందరు విద్యాదాతలును విరాజిల్లుచున్నారు. కాని దధీచివలె అస్థి ప్రదాన మొనర్చిన పరమోదారులేరి? శిబిచక్రవర్తియును మాంసమును గోసియిచ్చెనే గాని యెముకను గాదుగదా! పసిబిడ్డకు అమోఘమగు అస్థి ప్రదానమొనర్చిన మహోదారులు. మహనీయ గుణగరిష్ఠులు అని స్వీయ యశశ్చంద్రికల నలుదిక్కుల నలరింపజేసిన మహాపుణ్యమూర్తి శ్రీఓంకారస్వామి దివ్యమూర్తి.

మరియు పూజ్యపాదులు శ్రీశ్రీశ్రీ ఓంకార స్వాములవారు ప్రాక్పశ్చిమ దేశముల వేదాంతభేరిని మ్రోగించిన మహోత్తమ వక్తలు, మహాత్ములు. పాత్రస్స్మరణీయులగు పూజ్యపాద మహర్షి శ్రీశ్రీశ్రీ మలయాళ స్వాములవారు తిరుమల గోగర్భమున తీవ్రతపం బొనర్చు కాలమున ఈ మహనీయులిరువురకు మిక్కిలి పరిచయము కలిగి యుండెనని శ్రీ వ్యాసాశ్రమమునకు ఈ స్వాములవారరుదెంచి యుంటిరని జనశ్రుతి. తాపసోత్తములగు శ్రీఓంకార స్వాములవారికి 21, జనవరి 1974 వ తేదీన 80 ఎనుబదియవ జన్మ దినోత్సవము జరుగుచున్నది. ఈ మహోదారుడు చిరకాలము వర్థిల్లుచు భక్తజనులకు ముముక్షువులకు స్వీయమగు సహజోదార స్వభావమును, మరియు బహుకాలము తపంబొనరించి సంపాదించిన బ్రహ్మాత్మైక్య విజ్ఞానామృతమును స్వసద్బోధల చేత బంచివెట్టుచు పునీత మొనర్చుచుండ వలయునని సర్వలోక శరణ్యుడగు పరమేశ్వరుని ప్రార్థించుచున్నవాడను. శ్రీశ్రీశ్రీ స్వాములవారి జన్మదినోత్సవమును గురించి తెలియజేసిన విజ్ఞానవతియగు శ్రీ జ్ఞానేశ్వరిగారు, పరమ భాగవతులగు ఆశ్రమ భక్తులు ప్రశంసనీయులు.

ఓమ్

ఓం లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శ్శాంతి శ్శాంతి శ్శాంతిః

# ప్రణవ స్వరూపులు శ్రీమదోంకార స్వాములవారు

**– పరమపూజ్య శ్రీ స్వామి సర్వేశ్వరానంద**

అఖండమై ఆద్యమై అవ్యయమైనట్టి సద్వస్తువు కలదో అది తానైన్నానను నిశ్చయ బుద్ధినంది ఆబాల్యమాది వ్రతశీలురై ఆపదమున త్రిష్టనంది శాంతుడై వీతరాశుడై మునియై కరుణాళువై జ్ఞానియై లోక కళ్యాణ కారుకుడై కారణజన్ముడై తన ఉనికిచే సర్వప్రాణి జాతమునకు సుఖశాంతులు ప్రసాదించువాడై ఏ మహనీయుడు ఆంధ్రావని తపః ఫలముగా అవతరించి తాను తరించి లోకమునకు తాననుభవించిన పరమశాంతిని లోకశాంతి ప్రార్థనల ద్వారా అందజేసిన వారలై ముక్తస్థితిన అవ్యక్తానుభవమున అఖండ తేజోవిభవమునందిన శ్రీమదోంకారస్వాములు సాక్షాత్ ప్రణవస్వరూప పరబ్రహ్మమే. గురుస్సాక్షాత్ పరబ్రహ్మ. అన్న సూక్తి అక్షర సత్యము గావించిన మహాపురుషులు.

**"ఆత్మ క్రీడ ఆత్మరతిక్రియావానేష బ్రహ్మవిదాం వరిష్ఠః"**

అన్న ముండక శ్రుతి ప్రమాణానుసారము జీవితము గడిపిన సంయమశీలురు.

క్రియావంతుడై ఆశ్రమ స్థాపనలు గావించి దేశవిదేశ పర్యటనలు చేస్తూ సద్బోధలను శాంతి ప్రార్థనలను గావించుతూ ఏయే క్రియలు చేయుచున్నప్పటికి చిత్తమును బ్రహ్మమునందు లయము గావించుకొని చరించిన జీవన్ముక్తులు స్వాములవారు. బ్రహ్మ మొదలు లోకాధిపతులందర యందు తృణము మొదలు మేరు పర్యంతము చరాచర ప్రకృతిని సొంతము తన స్వరూపమునందే సాక్షాత్కారమందిన మహనీయుడు **"చిన్మయం వ్యాపితం సర్వం యత్కించిత్ సచరాచరం, అసిత్వం దర్శిత యేన తస్మై శ్రీగురవేనమః"** సర్వనామా రూపములందంతట ఏకాకారంగా వెలుగునందిన ప్రజ్ఞానఘనైక ప్రణవ స్వరూపులు క్షణకాలమైనను బ్రహ్మభావనను వీడని బ్రహ్మవిదులు, బ్రహ్మిష్టులు అగాధమునందు జ్యోతి స్వరూపులై ప్రకాశించు తేజోమూర్తులు ఎన్నెన్ని విపత్కర పరిస్థితులు వ్యావహారిక రంగమున తటస్థించినను అన్నిటియందు సమస్థితిని కోలుపోవని ధృఢవ్రతులు శ్రీస్వాములవారు.

**శ్లో॥ "అతేపకోహమజర్వో విరాగశ్శాంతవాసనః"**

**అన్నపూర్ణో పనిషత్తు నందలి విషయానుభవత నందిన అంతరారాములు.**

ఈ వ్యవహార కలాపములను అంటి చరించు ఇంద్రియప్రాణ మనస్సుల ద్వారా గల్గు సుఖదుఃఖాది పాప పున్యజాతము నా కంట నేరదు నేను కేవల చిన్మాత్ర స్వరూపుడను ఇదం వృత్తియందు తోచు సర్వము మిధ్యా మాత్రమేనన్న స్థితప్రజ్ఞ ఆ జీవితాంతము అర క్షణమైన వీడక చరించిన పూతాత్ములు నేను నిరంజనుడను. జరామరణాది అవస్థలకు ఆకారమైన ఈ తనువు నేను కాదని తను మన ధర్మాలకు సాక్షియై నిలచిన సోహంభావుడు బ్రాహ్మణ్యుడు – శ్రీ స్వాములవారి దివ్యబోధల యందు సదా సర్వాత్మభావన నిండి ఉండెదిది. పరిపూర్ణ పరమాత్మకంటే అన్యము లేదు. గావున మాయా జగజ్జీవేశ్వరులు వానికి నేను విలక్షణమైన పరమాత్మను. జగజ్జీవేశ్వరులు ప్రతీతి మాత్రమే గాని వాస్తవము గానేరదని యెరిగిన శ్రీరామ తీర్థులు రాచబాటలో పయనించిన మహానుభావుడు శ్రీగురుదేవులు.

**కేవలాఖండబోధోహం స్వానం దోహం నిరంతరః**
**సత్యంజ్ఞానమనంతం యత్పర బ్రహ్మేహ మేవతత్**

అఖండజ్ఞాన స్వరూపమును అనంతమును నిరంతరమును ఏ పరమాత్మగలడో ఆ పరమాత్మనేనే అద్వితీయమైన సత్యజ్ఞానానంద బ్రహ్మ స్వరూపము నేనేనన్న బ్రహ్మణ్యుడు అశుభములు లేనివాడను అశుచి అనిత్యము అగు దేహాదులు నామరూపములు మృణామాత్రమే నేను శుభ స్వరూపుడ శాంతుడ, కేవలుడ ప్రణవ స్వరూపుడవని శ్వాసో శ్వాసల యందు అనవరతము స్వరూపాను సంధానతత్పరుడై పరిపూర్ణ పరబ్రహ్మతత్వమున ప్రతిష్టనందిన శ్రీ గురుదేవుల శతజయంతి ఉత్సవములు పరిపూర్ణత నందు శుభసమయంలో ఆ మహాత్ముని అడుగుజాడల పయనించు మముక్షువులెల్లరు సాక్షాత్ సగుణసాకారప్రణవ స్వరూప “పరబ్రహ్మమే” మన శ్రీ ఓంకార గురుదేవులని గుర్తించి వారి అనుభూతులను అనుష్టాన నియమములను దైవగుణ సంపదను ఆర్జించి వారివలె మనము అమరులమయ్యెదము గాక! ఈ కార్యక్రమములు విజయవంతముగా గల్గునట్లు గురుదేవులు అనుగ్రహింతురుగాక!

* అనుభవములో పెట్టజాలని శాస్త్రములన్నియు, దినచర్యలో ఉపయోగింపజాలని బోధలన్నియు మెదడుకు బరువే గాని, శాంతిని, ఆనందమును ఈయజాలవు.
* మనోవాక్కాయ కర్మలచే ఒకే విధముగా జీవించు వారిని, ఏదియు శాంతిమయ జీవితము నుండి దూరము చేయజాలదు.
* ప్రతి కార్యమును దైవార్పణగా చేయుట అభ్యసించిన, ఏ పనియు దైవమునకు మనకు మధ్య అడ్డుగా నుండదు. అన్నియూ దైవారాధనగా పరిఢవిల్లును.

# నిరంజన ప్రణవ స్వరూపులు

**– పరమపూజ్య శ్రీ స్వామి రామకృష్ణానంద,** గండిక్షేత్రం

శ్రీవారి జన్మదిన వజ్రోత్సవ జయంతులు మరెన్ని జరుగగల్గినా మనబోటి వార్లకు మహద్భాగ్యం. మనం ఆత్మ సౌభాగ్యంగా ఆనందిస్తాం. మహా నదులవలె మహీ ధారలవలె మార్తాండుని వలె మందమారుతము వలె మహనీయుల దిశ్శృత ధీర్ఘ జీవితాలు మానవ సమాజానికి మంగళదాయకాలు. ఆ శ్రేణికి చెందిన శ్రీవారి దివ్యాశీస్సులను సదా అపేక్షిస్తాను.

శివశరణ సంప్రదాయంలో జగద్గురువులను పీఠాధిపతులను "నిరంజన ప్రణవస్వరూపు"లని సంబోధించటం కద్దు. మన స్వాములవారు మరొక్కరి సంభోదన పనిలేకనే "నిరంజన ప్రణవ స్వరూపు"లై వున్నారు. "ఓం మంగళం – ఓంకార మంగళం" అని కర్ణాటక ప్రాంతంలో విరివిగా భక్తులు మంగళహారతి పాడ్తుంటారు. ఆంధ్రరాష్ట్రంతో యించుమించు సమానంగా కొన్నేండ్ల నుండి నాకు కన్నడ రాష్ట్రంలో విస్తారమైన పరిచయం ఏర్పడింది. కాబట్టి ఆ పాటను వినడం తటస్థించింది.

భావం పీఠంపై శ్రీ స్వాముల వారిని అధిష్ఠింపజేసి **"ఓం మంగళం – ఓంకార మంగళం"** అని భక్తిమయంగా పాడుకుంటాను. అదే నేను వారికి చేసే వజ్రోత్సవ జయంతికి సంబంధించిన అల్పసేవ.

"శాంతి"కి సందేశం కావాలన్నావు అరే! ఇది మహా విచిత్రం, అందరికి కావలసినది శాంతి సందేశమైతే, శాంతికి సందేశమా! నిజమే, మనమందరం శాంతి స్వరూపమే అయినా, మన స్వరూపాన్ని మనం మరచి శాంతికి దూరం అయినాము. మనకు మనం చెప్పుకొనే సందేశమే శాంతికి సందేశం. అశోక వృక్షం క్రింద వుండి "సీత" శోకిస్తుంది. తాను వుండేది అశోక వృక్షం క్రింద తాను చేసే పని శోకం. ఇది విచిత్రంగా వుందే అని తమ ప్రవచనాలలో శ్రీ వినోభాభావే అంటారు. అప్పటి కథ ఎందుకు? మన సంగతి మాత్రం విపరీతంగా లేదా? అశోక చక్రం క్రింద వున్నాం. శోకిస్తూ వున్నాం. విపరీతం ఇది! కాదా అని. తెలుపు సబ్బు నుండి రాదు. గుడ్డ నుండి రావాలి. శాంతి భోగంతో రాదు. శాంతి త్యాగంతోనే రావాలి". **"త్యాగచ్ఛాంతి"** అని గీతావాక్యం. ప్రభుత్వం అన్నం ఇవ్వచ్చు, గుడ్డ ఇవ్వచ్చు. శాంత మాత్రం త్యాగధనులైన మహర్షులు నుండే రావాలి.

మహారాజైన పరీక్షితుడు కాస్త దప్పికతో అశాంతికి పాలై అనర్ధాన్ని తెచ్చుకున్నాడు. అతడే శుకమహర్షి బోధ వింటూ, ఆకలి దప్పులను మరచి ఆత్మశాంతి బొందినానని చెప్తూతున్నాడు. గ్రోమోర్–గ్రోమీర్ ఈనాటి యుగపురుషుని సందేశం నేటి భౌతిక విజ్ఞానశాస్త్రం మానవునికి గతి పెంచినది. ఈ యుగమే గతియుగం, 'గతిని' నియామకంలో పెట్టలేక 'మతి' లేకపోతే ఆ గతి వికాసాన్ని కాకుండా వినాశానికి దారితీస్తుంది. మానవ సమాజంలో భద్రతను గాక భయాన్ని కల్గిస్తుంది. ఎవడు బైటనెరిగి లోపల ఎరగడో వాడే రాక్షసుడు.

ప్రహ్లాదుడు రాక్షసుడై పుట్టినా రాక్షసుడై బ్రతకలేదు. దేవతై బ్రతికినాడు. దేవతలకు దేవతై బ్రతికాడు. దేవదేవుని అంక పీఠమలంకరించి అగ్రజుడైనాడు. అదంతా నారద మహర్షి కరుణ, భక్త బాలకుని స్పర్శ ఉగ్ర నరసింహుని అశాంతిని దూరం చేసింది. శాంతిని ప్రసాదించింది. ఇదంతా సాధుసత్తముల మహిమ.

**"తరతిశోక మాత్మమిత్"** ఆత్మవేత్తల కరుణే నిజమైన అశోక చక్రం దాని ఆశ్రయంలోనే మనం శాంతిని పొందాలి.

శాంతిదాత, శాంతిదూత, శాంతిప్రవక్త, శాంతిస్వరూపి శ్రీశ్రీశ్రీ ఓంకార స్వాముల వారికి మా గీతాచార్య జగద్గురు శ్రీకృష్ణ పరమాత్మ మరీ మరీ దీర్ఘాయు ప్రధాతయైన లోకకల్యాణ సంధాత అగుగాక! యని పునఃపునః నా అంతరంగిక హార్ధిక శుభాకాంక్షలు. తథాస్తు.

ఓం శివం ! హరి ఓం ! తత్సత్ ఓం

(పూజ్యశ్రీ ఓంకారుల వజ్రోత్సవ సంచిక నుండి)

## శాంతి సౌరభ్యం

**– పూజ్యశ్రీ స్వామిని శారదా ప్రియానంద**

అందరికీ కావలసింది శాంతియే. అందరూ ఆరాటపడుతూ వెదుక్కొనేది కూడా శాంతియే. అర్థం కాని ఆందోళనతో అంతులేని అన్వేషణని సాగిస్తూ ఆవేదనల పాలై ఆక్రోశించుతుంటారు అజ్ఞానులు, అమాయికులు అయిన ప్రజలు.

తాము వెతుక్కునే పెన్నిధి తమలోనే ఉన్నదని తెలుసుకొనిన నాడు ఆరాటమూ, అన్వేషణ రెండూ ఆగిపోతాయి. ఆనందము, శాంతి అంతరాంతరాలలో నుండి బయటపడుతాయి.

ఈ ఆనందం అందరికీ అందుబాటులోనిదే అయినా అందుకునే అదృష్టము ఏ కొద్దిమందికో. మహాత్ములు అపురూపంగా ఉంటారు. అట్టివారి దర్శనం, స్పర్శనం, సంభాషణం లభించడం కూడా పూర్వజన్మ సుకృతం ఉంటేనే సాధ్యం.

వికసించిన పుష్పం తనవద్ద అందమూ, పరిమళమూ ఉన్నాయని చాటనక్కరలేదు. ఆ పుష్ప సౌరభ్యమే నలుదిక్కులకూ ప్రాకి పుష్పము కల తావును తెలుపుతుంది. ఇట్టిదే పూజ్యశ్రీ ఓంకార స్వామి వారి నిండుతనం. వారి నుండి స్రవంతిగా ప్రవహించే శాంతి సందేశం భక్తుల హృదయములను స్పృశించి పావనం చేస్తూ ఉంటుంది. వారి ప్రతి పలుకూ, చూపు, భావము, శాంతిని వర్షించుతుంటాయి.

పూజ్య స్వామీజీ వారి 87వ జన్మదిన సందర్భంలో నా హృదయ కుసుమాన్ని అంజలిగా సమర్పించడం నా సౌభాగ్యం. వారికి నా ప్రణామ సహస్రాలు.

## మంగళాశాసనము

**– శ్రీమాన్ అప్పలాచార్యులు**

పూజ్యశ్రీ స్వామీజీ జన్మదినోత్సవము జరుపుకొనుచున్నను మనము ఈనాడు శ్రీవారికేమి సమర్పించగలము? శ్రీవారికేదిప్రియమో దానిని సమర్పింపవలెను. అన్నిటిని పరిత్యజించినవారికేది ప్రియమో మనకేది హితమో అది వారికి ప్రియము. వారు మనకై మనలో మననుదరి జేర్పనున్నారు. కాని వారికి వేరే ఉనికి లేదు. కావున అందరి హితమే శ్రీవారికి ప్రియము. దేహాత్మాభిమానులకు తమదేహమెంత ప్రీతిదాయకమో విశ్వాత్మాభిమానులకు విశ్వశ్రేయమే ప్రీతిదాయకము. వారికీ విశ్వమున అంతరములు లేవు. తారతమ్య భావనలు లేవు. అంతా వారి శరీరమేయయినపుడు అందు తారతమ్యమేమి అందుచే శ్రీవారి జన్మదినమున మనము సమర్పింపవలసిన కానుకను జన్మ రహస్యము నెరింగి దానికనుగుణముగ ప్రవర్తించుటయే. దానికి మనము చేయవలసినది త్యాగము. త్యాగము ద్రవ్యత్యాగము – భావత్యాగము అని రెండు విధములు. ద్రవ్యత్యాగము అనగా తమకున్న శారీరక, మానసిక, ఆర్థికవాచిక సంపదను ఇతరులకొసగుట. ఇది చేసినపుడు ఖ్యాతికై పూజకై లాభమునకై చేయక వారిదే వారి కర్పించుచున్నా మనేబుద్ధితో అహంమమతా త్యాగముతో అనిపంచుట భావ త్యాగము. శ్రీవారి జన్మదినమున వారి సన్నిధిని అందరును ఈరెండు విధములగు త్యాగములను చేసి **"త్యాగాచ్ఛాన్తి రనన్తరం"** అయినట్లు శాంతి నార్జించుకొనుటయే శ్రీవారికి ప్రియమైన విషయము. కావున భక్తులెల్లరు వారికా కానుకనర్పించి తరింతురుగాక. విశ్వహితముకై శ్రీ స్వామీజీ చిరంజీవులై యుండునట్లు శ్రీమన్నారాయణుడు అనుగ్రహించుగాక అని సర్వేశ్వరుని సన్నిధిని మంగళాశాసనము చేయుచున్నాను.

# శ్రీ శాంతి ఆశ్రమం - తపోభూమి

- శ్రీ సద్గురు శివానందమూర్తి, భీమిలి.

## సనాతన ధర్మము - శాంతి సాధన

మనకు రెండు రకాల ఆశ్రమాలున్నాయి. ఒకటి నైమిశారణ్యములు, ఇవి సాధకుల తపోభూములై మానవ జీవితానికి కావలసిన సందేశాన్ని అందిస్తాయి. రెండవది పుణ్యభూములు పాప ప్రక్షాళనం చేసి జీవులను తరింపజేస్తాయి. అందులో శ్రీ శాంతి ఆశ్రమాన్ని తపోభూమిగా పేర్కొనవచ్చు.

ఇక్కడ నాదాన్ని, ప్రణవనాదాన్ని ఉపాసన చెయ్యాలి. నాదమంటే కేవలము శబ్దము కాదు. యోగసాధనలో వినిపించే ప్రణవనాదమే నాదము. సంగీత సాధకులు చేసే నాదోపాసన వేరైనది. కావున సాధకులు ఈ తపోభూమిలో యోగసాధనతో కూడిన ప్రణవనాదముతో ముక్తిని పొంది తరించెదరు గాక.

## <u>ధర్మాచరణము</u>

**(21-01-2004 తేదీన శ్రీ ఓంకారస్వామివారి జన్మదిన మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీ సద్గురు శివానందమూర్తి గారు అందించిన సందేశ సారాంశమిది.)**

మానవుడు చరితార్థుడు కావడానికి చతుర్విధ పురుషార్థములు ముఖ్యమైనవి. వానిలో రెండు, మూడు పురుషార్థాలైన అర్థ, కామములను మొదటి పురుషార్థమైన ధర్మముతో జోడించి ఆచరిస్తే మోక్షానికి దారి తీస్తుంది. ఇట్టి ప్రవర్తనయే మన సనాతన ధర్మము యొక్క ముఖ్య లక్షణము.

భారతీయ సంస్కృతిలో క్షమ అనేది ఒక విశిష్టమైన గుణము. దాని ప్రాధాన్యాన్ని వివరిస్తూ ఒక ఉదాహరణను ఇచ్చారు.

బ్రాహ్మణులు, ఋషులు అందరును నివసిస్తున్న ప్రదేశములో క్షామము ఏర్పడి ఆకలి బాధతో అలమటిస్తున్నారు. ఆ సమయములో గౌతముడు అనే ఋషి తన యోగశక్తిచే సృష్టింపబడిన విత్తనములు జల్లి కొన్ని గంటలలో పంటలు పండించెను. అందరును క్షుద్బాధను తీర్చుకొని సంతుష్టులైరి. గౌతమ ముని యొక్క పేరు ప్రఖ్యాతులు నలుదిశలా వ్యాపించెను. కొంతమంది బ్రాహ్మణులకు అసూయ ఏర్పడి ఒక మాయగోవును పొలము మీదకు పంపిరి. ఆ మాయా గోవు మేయుచుండగా గౌతముడు ఒక చిన్న దర్భను విసిరెను. మాయాగోవు కనుక చనిపోయెను. బ్రాహ్మణులందరు గౌతముడు గోహత్య చేసినాడని ఆయన దగ్గర ఆహారము తీసుకొనుట ఉచితము కాదని పండిన పంటలను నిరాకరించిరి. ఈ బ్రాహ్మణులందరూ మళ్ళీ ఆకలి బాధతో బాధ పడుచుండిరి. ఈ విషయాన్ని గ్రహించి గౌతముడు తన తపశ్శక్తి ద్వారా గంగను తెప్పించి, వారి బాధను తొలగించెను. ఆ గంగయే నేటి గోదావరి. మహాత్ములు ఇతరులు తమకు కీడు తలపెట్టినప్పటికి వారికి అన్నివిధముల శ్రేయస్సు కోరెదరు. ఇది మహాత్ముల లక్షణము.

శ్రీశాంతి ఆశ్రమంలో శ్రీ ఓంకారస్వామివారు చేసిన తపస్సే శాంతి రూపాన్ని ధరించి, అందరికి శాంతి సందేశాన్ని అందజేస్తుంది అని అన్నారు. ఇలాంటి ఆశ్రమంలో స్వామివారి నూటపదవ జన్మదినోత్సవములో పాల్గొను భాగ్యము లభించినందులకు ఆనందించాను.

ఓం! ఓం! ఓం!

# "మూర్తిదాల్చిన శాంతిజ్యోతి" ఓంకార స్వామీజీ

**- పూజ్యశ్రీ స్వామిరామతీర్థ ,** యాజ్ఞవల్క్యాశ్రమము

సనాతన ధర్మజ్ఞానఖని యగు, ఋషినిలయ మగు. భారతావనియందు శాంత్యానంద మకరందమును, త్యాగతపః సౌశీల్యవరిష్ఠంపదను. అంతఃతేజోవిజ్ఞాన మయూఖములను, అఖండ బల వీర్యక్త్యుత్సాహములను, జాతీయ దివ్యజీవన మాధుర్యమును, ప్రాక్పశ్చిమండములం దంతట, ప్రసన్న శరశ్చంద్రికవలె, అవ్యాజకరుణాపూరిత శాంతిని ప్రసరింపజేయు ఈశ్వర ప్రియతమ పుత్రరత్నము మతిలోక వరశిఖామణియు నగు స్వయంజ్యోతి, మూర్తి దాల్చిన జ్ఞానమయ, తేజోరాశి. శ్రీ పూజ్యపాద, శ్రీ ఓంకార స్వామి మహారాజ్ గారు.

మహనీయ మానవాకృతి ధరించిన శాంతిజ్యోతి, శ్రీ ఓంకారజీ యుగ శాంతికేంద్ర మన దగు శాంత్యాశ్రమ ద్వారా, శ్రీస్వామివా రొనర్చిన, సేవాదౌరంధర్యము, అసమానము. ప్రాచీన కణ్వ యాజ్ఞవల్క్య ఋషిపుంగవుల ఆశ్రమములువలె, శ్రీశాంత్యాశ్రమము, తదుపశాఖలు శ్రీరామతీర్థ పరమహంస భగవత్పాదుల. వేదాంత కళాశాలయు శాంతిపధికులకు, సమస్త జిజ్ఞాసులోకమునకు అను వగు ఎన్నో కుటీరములు, ధ్యాన మందిరములు నిర్మించి, విశ్వము నంతటిని శాంతిమయ స్వయంప్రకాశ సుందరమందిరమును కాహ్వానించు, ఆనంద ఘనజ్యోతి శ్రీఓంకార స్వామీ పరమహంసజీ!

అహంకార విజేతలగు మహర్షివరేణ్యులే, జాతీయ జీవన విజయ పతాకమును, ప్రతిష్ఠించిన సత్యద్రష్టలు, అన్తఃసౌందర్యమును, సహస్రాన్ముఖముల ప్రసరింపజేయు, మానవరూప స్వయం ప్రభాభాస్వజ్జ్యోతులు, సంయమీంద్రులే, దేశచరిత్రకు, వన్నె ఘటించువారు యతివరేణ్యులే, జాతి గౌరవమును, ఆత్మోన్నత్య త్యాగమయ సువర్ణ సేతువును నిర్మించినవారు, లోకమాన్యులగు ఋషివరేణ్యులే, జాతీయ మృత్యుంతజయత్వమును, అభయ సామ్రాజ్య గరిమను, సాధించిన ధర్మవీరులు, తపోధనులు, జననీ జన్మభూముల అజేయ గౌరవశ్రీని, ప్రాణముతో సమానముగ రక్షించినవారు యోగి చక్రవర్తులే, యనుట నిరంకుశనత్యము, శాంతిజ్యోతులే యనుట పరమసత్యము.

నైతిక, ధార్మిక, సాంఘిక, వైజ్ఞానిక రాజకీయాది కళాసౌందర్యములన్నియు, ఆధ్యాత్మిక, భవ్యసౌరభమునకు వెలియైనచో నద్యః పతనమునందుట గాని, జాతీయ జీవనఘోర సంగ్రామమునకు, గురియగుట గాని సంభవించుననుట తధ్యము. మానవాళి నాగరికతయన భౌతికౌన్నత్య మనియు, ఇంద్రియ భోగ సంచయమనియు, తుళ్ళిపడు ప్రబుద్ధులు, జాతి, దివ్య జీవనమునకు, విఘ్న దేవతలుగ పరిగణింపబడుదురు. శాంతి, శాంతియని, గద్దియలపైని గొంతెత్తి కేకలు వేయుట వలన శాంతి సిద్ధించదు. స్వార్థపూరితులై తుచ్ఛపదవీ వ్యామోహమునకు బానిసలై, ఆత్మనిగ్రహశూన్యులై, రాజ్యాంగ పదవీ పిపాసాయత్తులకు శాంతి ఆలభ్యమేయగును. సూర్యచంద్ర భూగోళములకు నెగబ్రాకినను, శాంతి హుళక్కి,

క్షణకాలంబున జగమంతటిని, భస్మీ పటలము జేయు మారణాయుధ కేంద్రములను నిర్మించుట చేత, శాంతి బూటకమే యగును. నేటి నానాజాతి ప్రజానాయకులు అభిలషించు శాంతి, ఘోరీలలో, సమాధులలో నుండు పురుగుల శాంతియే, సత్యధర్మ బలపౌరుష. పురుషోత్తమ శక్తి పరాఙ్ముఖమై పరుగులు సాగించు రాజకీయ భద్రతలన్నియు. శ్మశాన శాంతికై పయనించు నను టెంతయు అభేద్య సత్యము.

నిజమైన దేశ భద్రతను, సరియైన జీవిత సంజీవనీ స్రవంతిని, అద్భుత మానవాభ్యుదయ అభయ నిక్షేపమును సంపాదించిన ధన్యత ఋషి ప్రవరులదే. ఋషియన అలేంద్రియ జ్ఞాన సముద్రుడు, సకల మానవ ఆత్మమోక్ష విశ్వకల్యాణమునకై జీవిత కైంకర్య మొనర్చువాడే, ఋషినత్తముడు. జ్ఞానజ్యోతియు పూర్ణకాముడు నగు, ఆకృతినొందిన శ్రీఓంకార పరంజ్యోతి, జగత్తును సముజ్వలముగ వెలిగించుగాక.

నవభారత శాంతి సామ్రాజ్య నిర్మాత ప్రపంచశాంతికై జీవన జగన్నాథ రథమును నడిపించిన, జగద్బాంధవ శాంతిజ్యోతి శ్రీఓంకార స్వామీజీ జన్మోత్సవ బ్రహ్మయజ్ఞ జయశంఖారవము ప్రసుప్త జీవమానవాళికి ప్రబుద్ధ జ్ఞాన సూర్యోదయమగుగాక.

**"భద్రమితిశా న్తిరక్షాయాత్"**

* నావద్ద నున్న పిల్లలను, పెద్దలను, నేను సదా కోరునది. 'విశ్వప్రేమ' విశ్వమానవ సౌభ్రాతృత్వము, నిష్కామసేవ, ప్రతిఫలము కోరని ప్రేమ.
* నేను స్వార్థరహితులను రక్త బంధువులుగా భావింతును. స్వార్థులను, రక్తము పీల్చి జోరీగలుగా భావింతును. ప్రపంచములో పేరు ప్రతిష్టలకు లొంగనివారిని, ఆశించనివారిని, నిందాస్తుతులను సమంగా చూచుటకు యత్నించువారిని, ఆత్మబంధువులుగ ఎంచెదను' అట్టివారికి నా జోహారులు!
* ద్వేషించువారిని, దూషించువారిని కూడ దైవసమానులుగ జూచి ప్రేమించుటకు ప్రయత్నము చేయువారుండాలి.

# ఆనంద సందేశము

**– భగవాన్ శ్రీ సత్యానంద మహర్షి,** విశాఖపట్నం.

భౌతిక సంపద యెంతగ నున్నను శాంతిధనము లేనిది యెంతమాత్రమును రాణింపదనుట పరమ సత్యము. భౌతిక ధనము దొర చేత, దొంగల చేతను, అపహరింపబడును కాని, శాంతి ధన మెవ్వర చేతను అపహరింపబడక శాశ్వతముగనుండును. శాంతి మానవులందరి జన్మహక్కై యున్నది. శాంతియను మహా సంపద అంతరంగికమైనది. కాని బహిరంగమైన దెన్నటికిని కానేరదు. బాహ్యమున కర్మకలాపముల మధ్యనున్నను, అంతరమున, అలల లేని సముద్రము వలె, శాంతముగ నుండుట సర్వోత్తమము. ఈ విషయముననే శ్రీ వశిష్ఠ మహర్షి శ్రీరామచంద్రునకును, శ్రీకృష్ణ పరమాత్మ అర్జుననకు బోధించియున్నారు. శాంతియుతమైన ఆదర్శ జీవితమును గడుపువాడు పూర్ణాయురారోగ్యము గలవాడై, తనకును, ఇతరులకును, భౌతికాధ్యాత్మికముల, ఉపకరించును. వ్యష్టిగ తనకును సమిష్టిగ లోకమునకును, శాంతి అత్యవసరము, ప్రస్తుత కాలమును శాంతి లేకపోవుట వలననే, అవినీతియు, కలహములును ఇవియననేల – సర్వానర్థములు, సర్వదుఃఖములు వాటిల్లుచున్నవి. కోపతాపము లెరుగని, సర్వదా మందహాస వదనారవిందుడైన పరశాంతుని దర్శింపవలయుననియు, వానితో మాటలాడవలయుననియు వాని సన్నిధిలో కొంతకాలము గడుపవలయుననియు ప్రజలు గాఢముగ వాంఛించుచుందురు. అట్టి మహాపురుషుని పవిత్ర సన్నిధానములో కొలది నిముషములు గడుపువాడు, తమ సాంసారిక దుఃఖమును, ఆందోళనను విస్మరించి, శాంతిని అనుభవించును.

ఇట్టి అమూల్య శాంతి, సందేశమును మన పుణ్య భారతదేశమందే గాక, విదేశములయందును, వ్యాపింపజేయుటకై శ్రీశ్రీశ్రీ ఓంకార స్వాములవారు అఖండ కృషి సల్పుచుండుట జగద్విదితము. ఇంకను, దేవదేవుడగు భగవంతుడు. శ్రీవారికి ఆయురారోగ్యముల నొసగి శాంతి దివ్యసందేశమును ప్రపంచమంతా ప్రసరింపజేయుగాక యని ఆ పురుషోత్తముని వేడుచున్నాము.

* **మానవుని ఉన్నతి, పతనము, అతని చేతిలోనే యున్నది. నిస్వార్థపరులై ఇతరులకై జీవించిన ఉన్నతి పొందును. స్వార్థపరుడై తన కొఱకు జీవించిన పతనము నొందును.**
* **మనము చేయు పనులు నూటికి నూరుపాళ్ళు శ్రద్ధతో చేసిన తిరిగి ఎన్నడును దానిని చేయవలసినది యుండదు.**

# శ్రీరామ తీర్థ జీవితం

**మూలం : శ్రీ పూర్ణసింహ**

**అనువాదం : పూజ్యశ్రీ స్వామి కేశవ తీర్థ**

ఒకప్పుడు విశ్వ కళ్యాణానికి, సుస్థిర శాంతికి, భారతీయులు పవిత్ర హృదయాలు విప్పి ప్రార్థనలు చేశారు. అమృత గీతాలు ఆలపించారు. యుద్ధాలతో జయాపజయాలతో యోధులు స్వగృహాలకు తిరిగి వచ్చినప్పుడు తమ ఆత్మనూ సర్వశక్తులనూ బలి పెట్టింది. బుద్బుద ప్రాయమైన ఐహిక సుఖము కన్న విషయం అవగతమైంది. తాము జయించిన ప్రతి యుద్ధం తమ "ఓటమికే" చిహ్నప్రాయంగా ఉందన్న అంతర్గర్భిత సత్యాన్ని ఆర్యహృదయాలు గుర్తించినవి. అఖండమైన పరిత్యాగదీప్తి, వారిలోని బాహ్యావిజయతృష్ణను అదృశ్యం చేసింది. శాంతి ప్రేమలు దశదిశాక్రాంతములై, దేశవిదేశాలకు పుణ్యక్షేత్రమైంది. భారత వర్షం. ఆనాటి నుంచి త్యాగమయం గాని, ఘట్టాలకు హిందూ దేశ చరిత్రలో స్థానం లేకుండా పోయింది. భారతదేశంలో ఒకని ఆదర్శోన్నతి వాని భౌతిక సామ్రాజ్య విజయాలు చూచిగాని, పాండిత్య ప్రకర్షలు చూచిగాని, కులాధిక్యతా విశేషాలు చూచిగాని పరగణించరు. అతని బ్రహ్మజ్ఞాన ప్రతిభను చూచి, బ్రహ్మవిద్యను చూచి మాత్రమే పరిగణిస్తారు. మానవుడిలో మనం చూడవలసింది అతని బాహ్య పరిస్థితులు గాదు – అంతరానుభూతులను చూడవలసి వుంది. ఆ అంతర్మానవునే మనం అర్చించవలసి వుంది. మౌన గంభీరమైన మహర్షుల అంతర్జీవనం బాహ్యానికి దురవగాహనమైంది. కానీ ఆ మహాత్ముల మందహాసరోచిస్సులలో నుంచి, దయార్ద్ర వీక్షణాలలోంచి, ఉదార హృదయంలో నుంచి, ప్రసన్నములోనుంచి వారి బ్రహ్మమయ జీవితాలను అర్థం చేసుకోవాలి. అలాంటి జీవితాలను అర్థం చేసుకోవాలంటే వారి వాక్యాలు, సందేశాలు, ఆ ప్రసన్న వదన సౌందర్యాన్ని అన్వేషించాలి. శ్రీ రామతీర్థ స్వామి జీవితం ఆయన అంతః సౌందర్యాన్ని, అభ్యున్నతినీ చిత్రిస్తున్నది. ఆ మహర్షి జీవితం స్థూల జగత్తు నతిక్రమించి ప్రశాంత బ్రహ్మజ్ఞానపదము బట్టి ఆత్మ సామ్రాజ్యానికి అనుగమించిన ఒక మౌన మనోపరిణామమే.

రామతీర్థస్వామి జీవితం అరణ్య కేదారాల్లో శృతిగల్పి విశ్వశాంతి ప్రేమల వర్షిస్తూ సాగిన ఒక జానపద గీతం. ఒకప్పుడు దివ్యోపనిషన్ముఖము నుండి ఉద్గతమైన గానమే యిది. ఇది క్రొత్తది గాదు, సనాతనమైందే. కానీ రామతీర్థ పరమహంస తిరిగి ఒకసారి తన హృదయ మూలంలో నుంచి వెలికిదీసి ఆ గానమధువును వర్షించాడు. ఆ బ్రహ్మర్షి శ్రేష్ఠుని గాంధర్వగానం వైవిధ్యంలో నుంచి ఏకత్వానికి, విభిన్నతలో నుంచి ఏకశృతికి, ఆత్మలో నుంచి పరమాత్మకు మానవలోకాన్ని తీసుకుపోతున్నది. అసూయలో నుంచి ప్రేమ పథానికి యుద్ధము నుంచి శాంతికి రమ్మని మానవులను ఆహ్వానిస్తున్నది. ఆ దివ్యనిలో నుంచి పరమ ప్రేమశాంతి పరవశత్వాలు వాహినులై ప్రవహిస్తున్నవి. ఆ మహర్షికి మానవులందరూ పవిత్రులే. సర్వసృష్టి పవిత్రమైందే. ఆయన అంతర్ముఖుడైన మహాకవి. **"తత్వమసి" "ఏకమేవా ద్వితీయం బ్రహ్మ"** – అనే ఈ రెండు మంత్రాలనే బంగారు రెక్కలతో,ఈ పరమహంస ఎగిరి ఎగిరి నిత్య నీలాకాశంలో కలిసిపోయింది.

పంజాబుదేశంలో గుజర్వాలా జిల్లాలోని మురలీవాలా గ్రామములో 1873లో ఒక నిరుపేద బ్రాహ్మణ కుటుంబంలో శ్రీరామతీర్థ స్వామివారు జన్మించారు. **ప్రసిద్ధమైన రామాయణ కావ్యాన్ని హిందీలో రచించిన గోస్వామి తులసీదాసు వీరివంశ వృద్ధుడే.** వీరి తండ్రి గోస్వామి హీరానందుడు. సరిహద్దు రాష్ట్రంలో

పెషావర్, స్వాట్ మొదలైన ప్రదేశాలకు యాత్రార్థం వెళ్ళి శిష్యులను చూచి వస్తూండేవాడు. శిష్యులిచ్చే తృణమో ఫణమో ఆయన సంపాదన. రాముడు జన్మించిన కొద్దిరోజులకే తల్లి పరమపదించింది. ఆవు పాలతో బాలరాముని పెంచారు. రాముడెప్పుడూ పాలు అన్నం తీసుకొనేవాడు. పాలంటే ఆయనకు పరమ ప్రేమ. ఒక్కొక్కసారి అయిదు సేర్ల పాలు త్రాగేవారు.

అయిదోయేట విద్యాభ్యాసం. ఆయన బాల్యమంతా నిరంతర విద్యాకృషిలో గడచిపోయింది. పెద్ద పెద్ద తరగతులు చదవవచ్చేసేకల్ల, తగినంత డబ్బులేక తండ్రి సహాయం చేయలేకపోయినాడు. అందుచేత రాముని విద్యార్థి జీవితం కటికి దారిద్ర్యంతో గడిచింది. ఒక చొక్కా, రెండు లాగులూ, ఒక చిన్న తలపాగా ఇవి ఆయన దుస్తులు. అన్నీ కలిపినా మూడు రూపాయలు కావు. కళాశాలలో చదువుకొనే రోజులలో, లాంతరునూనెకని ఒక్కొక్కసారి అన్నం మానేవారు. ఎన్నో వారాలకు వారాలే పస్తులుండవలసివచ్చేది. ఆయన ఎంత పస్తులుంటున్నప్పటికీ, ఆయన ముఖంలో బాధావిచారాలు లేశమాత్రం కూడా కనిపించేవి కావని తోటి విద్యార్థులు చెప్పేవారు. అంతక్లిష్టపరిస్థితులలో కూడా ప్రశాంతతో, ఓర్పుతో, గంటగంటలు చదువుతో కళాశాలలో కాలము గడిపేవారు.

తేజోవంతమైన ఆర్య సౌందర్యముతో ఉద్దీపిస్తున్న ప్రసన్నవదనుడు రామతీర్థుడు. నల్లగా విల్లువలె వంపులు తిరిగిన ఆయన కనుబొమ్మలు, మిలమిల మెరిసే ఆయన తేజోనేత్రాలు, ఆయన గాఢ హృదయను, అపారమైన ఆయన ప్రేమను స్ఫురింపజేస్తుంటవి. ఆ విశాల ఫాలభాగం. గణనీయమైన ఆయన ధీశక్తికి చిహ్నంగా ఉండేది. ఆయన ఆధరాలు నవకోమల కన్యాధరాలవలె ఉండేవి. తీవ్రంగా ఉన్నప్పుడు బిగించినట్లున్న ఆ పెదవులు, ఆయన అప్రతిహత మనోబలమును జ్ఞాపకానికి తెస్తుండేవి. కళాశాల దినములలో ఆయన ఇంతటి మహాత్ముడని స్ఫురింపకపోయినా, ఆయన నెఱిగినవారు ఆయన నిరాడంబర పవిత్ర శీలాన్ని గుర్తించినవాండ్లు ఇలాంటి వ్యక్తి మరొకడు లేడని యెంతో ఆశ్చర్యపడేవారు. అమాయక కన్య మాదిరి గుప్తంగా ఉండేవాడు. ప్రేమ దీప్తులలో నిరంతరం జీవిస్తున్న ఆ మహనీయుడు, సన్నగా అంత పొట్టిగాకుండా, పొడగిరి కాకుండా, తేజో దేహంతో సౌందర్యమును విరజిమ్ముతుండేవాడు. అజ్ఞాత జీవితం గడుపుతున్న బాలరామునిలో, ఉన్నతాశయాలతో మహత్తర లక్ష్యంతో నిరంతర కృషి చేస్తున్న ఇంకొక రాముడున్నాడు. ఆ బ్రాహ్మణబాలుడు తన అంతఃపవిత్రాశయాలను ఎప్పుడూ వ్యక్తీకరించేవాడు కాదు. కండ్లల్లో తొణికిసలాడే ఆనంద బాష్పాలతో, భక్తునిలో ప్రదీపించే వినమ్రతతో, కన్యకుండే ముగ్ధత్వంతో, వీరునకుండే విజయ సంకల్పముతో ఈ దివ్య విద్యార్థి అహోరాత్రాలు విద్యాలయంలో కృషి చేస్తున్నాడు. తోటి విద్యార్థులందరిలో ఈయనే అగ్రగామి. ఈయన విద్యాకృషి అనంతమైంది. రామతీర్థులకున్న వివిధ విషయ సర్వజ్ఞత్వం సాహిత్య తార్కిక వైదాంతిక విషయ పాండిత్యం అనన్యసామాన్యమైంది. భావప్రపంచ మంతటికి ఈయనదే నేతృత్వం.

ఇరవయ్యో యేడు వచ్చేసరికి గణిత శాస్త్రంలో యం.ఏ. పట్టం పొందాడు. తరువాత కళాశాలలో నాలుగు సంవత్సరాల్లో అధ్యాపకుడుగా, గణిత శాస్త్ర ప్రధానాధ్యాపకుడుగా పనిచేశాడు. 1899 సంవత్సరాంతంలో, లాహోరు విడిచిపెట్టి వెళ్ళిన ఒక సంవత్సరానికి, అరణ్య వాసం చేస్తూ రామతీర్థులవారు సన్యసించారు.

ఇరువై ఆరు సంవత్సరాల స్వల్పకాలంలో మహత్తర విజ్ఞాన సముద్రాన్ని రాముడు ఆపోశించాడు. ప్రతి నిముషమూ రామునకు ఏదో ఒక కానుక చెల్లింపవలసిందే.

విశ్వవిద్యాలయంలో ఉన్నత పరీక్షలో ఉత్తీర్ణుడు కావడమే కాకుండా, హఫీజు మైలానా, రుమీమహర్బీ, ఉమర్ ఖయ్యాం మొదలైన ప్రసిద్ధ పారశీక తాత్త్విక కవుల రచనలన్నీ ఆయన

జీర్ణించుకున్నాడు. ప్రాచ్య, పాశ్చాత్య వైదాంతిక సాహిత్యమంతా ఆయన ఉత్తరించాడు. హిందీ, ఉరుదు, పంజాబీ కావ్యాలలోని సౌందర్యాన్ని సంపూర్ణంగా దర్శించాడు.

తీవ్ర పరిస్థితుల వల్ల, నిరంతర శ్రమవల్ల తీర్థరాముని ఆరోగ్యం చెడిపోయింది. ఆయన యం.ఏ. ప్యాసై వచ్చే సరికల్లా ఎముకలు ప్రోగైన ఆయన్ని చూచి ప్రజలు ఈ అస్థిపంజరంలో ప్రాణం ఎలా కొట్టుకలాడుతున్నదా అని ఆశ్చర్యపోయేవారు. ఎముకల మీద కాస్త కండైనా లేదు. మెడ కొంగ మెడలా సాగింది. కంఠం రుద్దమైంది. సుఖంగా మాట్లాడలేకపోయేవాడు. అంత బలహీనుడైపోయినాడు. అయితే ఆయన దృఢంగా ఉండాలని, ఆరోగ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. నిత్యం సక్రమ వ్యాయామంతో, క్రమాహారంతో ఆరోగ్యం పొందాడు. నూతన వ్యాయామరీతులను కూడా కనిపెట్టగలిగాడు. నాటినుంచి ఎన్నడూ వ్యాయామం మానలేదు. ఇంకొక నిముషానికి శరీర పరిత్యాగం చేస్తాడనగా వ్యాయామం చేశాడు కూడా. ఆ బక్క పలచని మనిషే ఇంతటి మహత్కార్యాలు, నిరంతర కృషి చేయగలిగాడు. ఆయన అతి తొందరగా నడిచేవారు. హిమవత్పర్వతాల మీద సన్యాసిగా నున్నప్పుడు రోజుకు నలభై మైళ్ళకు పైగా నడిచేవాడు. ఒకసారి అమెరికాలో వినోదార్థం నలభై మైళ్ళ పందెములో పరుగెత్తి పోటీచేసిన సైనికుల కంటె రెండు గంటల ముందే గమ్యస్థానం చేరి గెలిచాడు. **ఒకసారి స్వామి శాన్‌ఫ్రాన్సిస్‌కో వీధిలో చరచర నడిచిపోతున్నప్పుడు ఒక అమెరికన్ "ఈ భూమి తనదే అన్నట్లు నడిచిపోతున్నాడే" అని అన్నాడు.** "అవును" అని రామతీర్థులవారు నవ్వుతూ నడచి వెళ్ళారు. కౌపీనమాత్ర పరిధానుడయి. ఒక గొంగడి మాత్రం కప్పుకొని స్వామి "గంగోత్రి, యమునోత్రి, బదరీనాథ" శిఖరాల నధిరోహించారు. యమునోత్రినుంచి గంగోత్రికి హిమవాహినులలో నడచిపోయినాడు. వ్రేళ్లు కొంకర్లపోయే మంచుగడ్డల్లో నివసించాడు. చీకటి కొండగుహల్లో నిద్రించాడు. అరణ్య గర్భాల్లో నివసించాడు. ఈ రచయిత ఒకసారి పర్వత వాసులను కలుసుకున్నప్పుడు వారిలా అన్నారు! "రామతీర్థులవారు నిజముగా దేవుడే. కాకపోతే వర్షాకాలములో తీవ్ర వేగముతో సుళ్లు తిరుగుతూ ప్రవహించే నదిలో నుంచి మా గొఱ్ఱెలను ఎలా దాటించుకొని వచ్చేవారో!"

**అర్ధరాత్రులందు స్వామి ఆసనము మీద నుంచి లేచి కాటుకలాంటి చీకటిలో, చొరరాని కీకారణ్యాలలో నిర్భయముగా మృత్యువుతో పోరాడడానికా అన్నట్లు నిర్గమించేవారు.**

చదువుకొనే దినాలలో ఉపవాసాల వల్ల కృశించి పాలిపోయిన ఆయన యౌవన వదనములో, భయంకర దుర్గమారణ్యాలను సైతము అతిక్రమించగలిగిన శౌర్య, ధైర్య సాహసాలను లాహోరు ప్రజలు గుర్తించలేకపోయినారు. ఎంతో మేరుధీరుడు స్వామి. ఇప్పటి అయన వదనము ఎంతో వికసించింది. సుందరమైంది – దివ్య పారవశ్య మధువుల నాస్వాదించిన ఆ మహర్షి నేత్రాలిప్పుడు అర్ధనిమీలితాలు. ఈ ధైర్యము, ఈ బాహ్యాంతర మహోత్తర శక్తితో స్వామి తన జీవితోద్గ్రంథాన్ని అంటే తన వ్యక్తిత్వాన్ని లోకానికి ప్రసాదించాడు.

రాముని వ్యక్తిత్వము ఒక ప్రచండమయిన అగ్నిపర్వతము లాంటిది. కొన్ని నెలల పర్యంతము ఇంకేమీ చెప్పటానికి లేనట్లు మహామౌనములో మునిగి వుండేవాడు. నిరంతర బ్రహ్మానంద మగ్నుడయి వుండేవాడు. హఠాత్తుగా ఒక్కసారి పర్వతం బ్రద్దలయినట్లు, తన దివ్య భావాలు మహాపారవశ్యముతో వ్యక్తము చేసేవాడు. స్వామియేది వ్రాసినా, ఏది మాట్లాడినా అది నిత్య నూతనముగా వుంటుంది. ఒక్కొక్క పలుకు అనాఘ్రాత పుష్పములాంటిది.

ఆయన నిరంతర యేకాంతాభిలాషి. బహిర్జన సంకులత నుంచి విడివడడానికి కాబోలు స్వామి, పర్వతాగ్ర విజనభూములకు గమించేవాడు. జలజలమని నృత్యం చేసే ఆ కొండ వాగులనూ అనంత నీలాకాశమునూ చూస్తూ కొండరాళ్ళ మీద సంధ్యారాగములో పండుకొని నిమీలిత నేత్రుడయి శాంతి మగ్నుడయి ఉంచేవాడు.

ఆ మహా వ్యక్తిలోని ఒక విశిష్టత, అర్ణవమై పొంగే పారవశ్యము, గాఢమైన అప్రమత్తత ఆయన నేత్ర పద్మాలలో నుంచి అపారముగా వర్షించేది. స్వామివారి మాధుర్యము అనివార్యమైంది. హిందువులు, మహమ్మదీయులా మహనీయుని సమానంగా ప్రేమించారు. ఏ మతస్థులైనా ఏ కులస్థులయినా, ఏ జాతి వారైనా రామతీర్థ మహర్షిని ఆత్మ బాంధవునిగా చూచుకొనేవారు. అమెరికా వాండ్లాయనను అమెరికా దేశీయుడన్నారు. జపానువారు జపానీయుడన్నారు. పారశీకులు మావాడే నన్నారు.

రాముని దర్శించడమంటే నూత్నా దర్శాలతో, నూత్నదర్శనాలతో నూత్న శక్తులతో నవనవోద్వేగాలలో చెలరేగిన పరవశానందానుభూతి పొందడమే.

ఆయన మనోజ్ఞ సందర్శనములో ఉన్న ఇంకొక గొప్ప విషయము గంభీరమైన భావనా స్వాతంత్ర్యము. ఆయన మహోన్నతమైన ధీశక్తి. స్వామి ఏది చెప్పినా ఊహించి చెప్పడు. ప్రతివాక్యము ఆయన జీవితానుభవములో నుంచి వస్తుంది. అనుష్టాన మతాన్ని తాను విశ్వసించానని ఆయన తరచుగా ప్రవచించాడు. స్వామి దృక్పథములో, జీవనకళ ఉజ్వల విశ్వాసానికి ఉన్నది. బాహ్య మతానికి అప్రమత్తుడయిన మానవుని అంతరంగిక మతానికి సంబంధము లేదు. నీవు సజీవమానవుడవైతే నీ జీవితాన్ని సత్యానికి అంకితము చేసి పరిశోధించు. ప్రతివ్యక్తి తన జయాపజయాల ద్వారా తన జీవితానుభూతుల ద్వారా మాత్రమే దైవసాన్నిధ్యమును పొందవలసి ఉన్నది. జీవితమే సర్వోత్కృష్టమైన నిరూపణము.

రెండు సంవత్సరాలు హిమవత్పర్వతాల్లో గడిపి, స్వామి తనలో తాను కనుగొన్న బ్రహ్మానందాన్ని ప్రపంచానికి పంచిపెట్టాలనే దివ్యాశయముతో ప్రజ్వల ఆచార్య సామర్థ్యముతో ప్రజల మధ్యకు వచ్చారు. 1903లో కలకత్తా నుంచి జపానుకు ఓడలో ప్రయాణము చేసాడు. అక్కడ స్వామి ఒక పక్షం మాత్రము ఉన్నాడు. రెండుసార్లు అక్కడ ఉపన్యాసము యిమ్మని ప్రార్థించారు. టోకియోలోని ఒక క్రైస్తవ పత్రిక రామతీర్థ స్వామివారిని ప్రశంసిస్తూ, **"పరవశ వేదాంత ప్రవక్త"** అని పేర్కొన్నది. ఈ రచయితను, జపాను విశ్వవిద్యాలయములోని ప్రాచ్య వేదాంత సంస్కృతాధ్యాపకుడైన **"తాకకుత్స"** మహాశయుడు కలుసుకున్నాడు. ఆయన తాను అనేక భారతీయ సాధుపుంగవులను, పండితులను ఇంగ్లండులో మాక్సుముల్లర్ వద్ద – జర్మనీలో చూచినప్పటికీ, రామతీర్థస్వామి వంటి మరొక వ్యక్తిని చూడలేదన్నాడు. ఆయన మూర్తీభవించిన వేదాంతమే. టోకియోలో ఆచార్యుడు, భౌద్ధవాఙ్మయ నిష్ణాత **"కంజిహిరే"** ఒకసారి ఇలా చెప్పాడు.

**"భారతదేశ చరిత్రలో బౌద్ధవాఙ్మయాన్ని గురించి, సింహళ జపాను గ్రంథాలలో నేను చదివిన వర్ణనలన్నీ శ్రీరామతీర్థులను సందర్శించినప్పుడు కండ్లకు కట్టినట్లున్నవి."**

రామతీర్థులవారు జపాను విడిచి, అమెరికా వెళ్ళినప్పటికి ఆనందపరవశోద్విగ్నమైన రామతీర్థ స్వరూపం హిరే మహాశయుని దృష్టిలోనుంచి పోలేదు. 1963 నవంబరులో రామతీర్థులు జపాను విడిచి శాన్‌ఫ్రాన్సిస్‌కోకు వెళ్ళారు. అమెరికాలో రెండు సంవత్సరాలున్నారు. ఆ రెండు సంవత్సరాల్లోనూ, చాలాకాలము ఏకాంతములో ఉన్నారు. ఎంతో నిరాడంబరముగా జీవించేవారు. అమెరికాలో అడవి నుంచి స్వయముగా కట్టెలు కొట్టుకొని నెత్తిన బెట్టుకొని తెచ్చుకునేవారు. అక్కడ అమెరికను పత్రికలలో స్వామి దివ్యోపన్యాసాలను అభినందిస్తూ వ్రాసిన రచనలను చూచి, వాటిని నిర్లక్షించేవారు. ఒకసారి ఆ అభినందన పత్రికలన్నీ కట్టగట్టి శెక్రమెంటో నదిలో విసరి పారవేశాడు స్వామి. ఈ మహాత్ముని అమెరికా జనులు ఏనాటికీ మరిచిపోలేరు. స్థలాభావము వల్ల శ్రీస్వామివారి అమెరికా జీవితాన్ని పూర్ణముగా వర్ణించడము లేదు.

**భారతదేశానికి తిరిగివస్తూ ఈజిప్టులో ఒక పెద్ద మసీదు వద్ద పర్షియనుభాషలో మహమ్మదీయులకు ప్రత్యేకముగా ఉపన్యసించారు.**

మాతృదేశానికి తిరిగి రాగానే 1905లో ఆ మహర్షి రెండు లక్ష్యాలు పెట్టుకొని వచ్చాడు. ఒకటి జీవితవిధానాలన్నిటిలో నిర్మాణాత్మకముగా కృషి చేయడము, రెండు ఐక్యకార్యాచరణ, వారి సంయుక్త రాష్ట్ర ఉపన్యాసాలన్నిటిలో ఈ ఆదర్శాన్నే ఉద్ఘాటించేరు.

1906 అక్టోబరు దీపావళి పుణ్యదినంనాడు స్నానము చేస్తూ, పొంగులు పారుతూ వున్న గంగానదిలో మునిగిపోయినారు. వారు వ్రాసిన చరమగీతము ఉరుదుభాషలో ఉంది. అది ఇలా ఉంది.

**"ఓమృత్యు దేవతా! కావలెనేని, తీసుకపొమ్ము యీ దేహంబు నీవు"**
**ఎన్నియో దేహముల్ కలవు నే దాల్ప, చంద్రుడు నేసిన వెన్నెలవలువ**
**లానందముగ దాల్చి విహరింతు నేను, సూర్యుడొసంగు కాషాయవస్త్రముల**
**కట్టి మహాహ్లాద మయతతోనుందు, జలజల బారెడి సెలయేటి రొదల**
**నేగాన మొనరింతు గళముపైకెత్తి, వీచికాహస్తముల్ పైకెత్తి ఆడు**
**వనధిలో నేనహా తాండవించెదను, స్వేచ్ఛగా మారుతంబుల విహరింతు**
**ఇవియెల్ల నేను ధరించు రూపములె, ఉన్నత శిఖరాగ్రభాగాల నుంచి**
**క్రిందికి ప్రేమతో దిగివచ్చినాడ, మీ కవాటద్వారముల దట్టినాడ**
**గాఢ సుషుప్తిలోనుంచి మిమ్ములను మేలుకొల్పితి నిద్ర కంపించపోవ,**
**ఒకరి నోదార్చితి, ఒకరి కన్నీళ్లు, చల్లని చేతులతో నొత్తినాడ**
**చలిలోన గడగడలాడు వారలకు, హాయిగా ధరియింప వస్త్రమ్ములిత్తు**
**కొందరి ముసుగుల తీసివేసెదను, సర్వంబు ధరియింతు భరియింతు నేను**
**సెలవిదే! సెలవిదే! నాకేమి వలదు, నేనేది దాచుకో నిసుమంతయైన**
**నె నెవ్వరికి గోచరింప, నన్నెవరు తెలుసుకోలేరిదే సెలవింక సెలవు!"**

స్వామి తన నిర్గమనాన్ని ఈ విధముగా ముందుగానే ఊహించారు. ముప్పై మూడేండ్లయినా నిండని ఈ మహాప్రభావసంపన్నుని గంగానది తన గర్భములో దాచుకున్నది. శ్రీవారు రచింపదలచుకున్న **"వేదసారస్వత సౌందర్యం" "మనోగతులు"** అనే ఉద్గ్రంథాలు రెండూ వారి హృదయ పేటికలో గుప్తపడిన రత్నాలు.

**ఈ ప్రపంచమునకు మనము వట్టి చేతులతోనే వచ్చితిమి, తిరిగి వట్టి చేతులతోనే విడువవలసి యుండునన్న సత్యమును ఎన్నడు మరువనివారు, ఎప్పుడో ఒకప్పుడు యీ ప్రపంచమును అందరం విడువలసిన వారమేనను సత్యమును మరువనివారు, ప్రపంచ వ్యామోహం విడిచి ధర్మ వ్యామోహంతో జీవించగలవారు ధన్యులు.**

# శ్రీ శాంతి ఆశ్రమము

**– పూజ్యశ్రీ స్వామి నిర్విషయానంద బ్రహ్మచారి**

శ్రీ నిర్విషయానంద బ్రహ్మచారిగారు చిన్నతనము నుండి 'శాంతి' పత్రికలో శ్రీ ఓంకారస్వామీజీ వారి వ్రాతలను చదివేవారట. అవి వారి సాధనకు శ్రీ స్వామిజీ వారి భావములు వారికెంతో సహాయపడేవని వారు తెలియజేశారు. పిమ్మట, పది సంవత్సరముల తర్వాత ఓంకార స్వామీజీ వారిని దర్శించినపుడు వారి దివ్యప్రేమకు పాత్రులై ఏడెనిమిది మాసముల తర్వాత ఆ ప్రేమపాశము వారిని శాంతి ఆశ్రమమునకు తీసుకువచ్చినదట. దాదాపు వారం రోజులు స్వామీజీ వారి సన్నిధిలో గడిపే భాగ్యము లభించినది. వారు శాంతి ఆశ్రమమున ఉండమని కోరినా, దేహ ఆరోగ్య పరిస్థితి బాగోనందున ఉండలేకపోయారట. శాంతి పత్రికకు శ్రీ నిర్విషయానంద బ్రహ్మచారి గారు వ్రాసిన అమూల్యమైన వ్యాసములలో 1) సేవాభావము, 2) బ్రహ్మవిద్యచే శాంతిని బడయగలము, 3) అంతరాత్మ ప్రేరణ, 4) మనో నిగ్రహోపాయము, 5) ఉపాసనా రహస్యముల సారాంశ సంగ్రహము స్వరూపమిది.

సేవాభావమును విశ్లేషించినపుడు నిజమైన సేవాభావ సంపన్నుని లక్షణములు వ్యక్తమగును. కృత్రిమ సేవకులను చూసి జనులు మోసపోకుండుటకును, నిజమైన సేవనొనర్చదలచిన వారి లక్షణములు అలవరచుకొనుటకు వీలగును. ఈ శతాబ్దమున సేవాభావ లక్షణముల తానాచరించి లోకమునకు వ్యక్త మొనర్చిన వారిలో గాంధీజీ మొదటివారు. ఆయన సేవ అన్నిరంగములకు చెందినది. నిజమైన సేవాభావము వారి యందుండుట చేతనే విశ్వమానవుల హృదయముల చూఱగొనగలిగినారు. విశ్వశ్రేయము నభిలషించిన వారికి సంతృప్తిగా శరీర సౌఖ్యములననుభవించుటకు చోటు లేదు. సుభాసు చంద్రబోసును ఎవరో మీరెప్పుడు కళ్యాణము చేసుకొనెదరని యడిగినారట. వెంటనే "విశ్వమానవులకు కళ్యాణమొనగూడిన పిమ్మట" అన్నారట.

అట్టి విశ్వ ప్రేమైక్య హృదయుడే నిజమైన ప్రజా సేవకుడు. శ్రీ వివేకానంద స్వాములవారు అమెరికా కరుగుటకు ముందు మనదేశమందు సంచార మొనర్చుచు కన్యాకుమారి కరిగి అచ్చట పర్వతముపై యాసీనుడై హిందూ దేశమందలి బీదల యిక్కట్టులను హృదయమున వీక్షించి పరితపించెను. పిమ్మట వారి కష్టముల తీర్చుటకై అమెరికా కరిగి కొంత సంపద నార్జించుకొని వచ్చి మనదేశమందలి పేదలకు సహాయమొనర్చి సుఖ జీవనుల చేయవలయునను తలంపుగలిగెను. నానా బాధలు అనుభవించి, కడకు ఆ దేశీయులచే పూజింపబడి, హంసతూలికా తల్పములపై శయనించినపుడు కూడా "హా తల్లీ! నా దేశీయులు కుడువ కూడు, కట్టబట్ట, వసింప వసతి లేక తపించుచుండ నాకిట్టి సౌఖ్యములా యనుచు విలపించెను". అట్టిప్రేమ స్వభావుడు భోగ్యపదార్థములు తన్ను వరించినను వాని వంక చూడరు. ఇట్టి మహనీయులు ఇప్పుడును కలరు.

శ్రీ శాంత్యాశ్రమ స్థాపకులు పూజ్యశ్రీ ఓంకారస్వాములవారి జీవితాశయము ఇట్టిదే. అయిదేళ్ల పసిబిడ్డ కేదో కారణముచే కాలి ఎముక విరిగిపోయెను. దానికి సజీవులగు వారి ఎముకను తీసి అతికించిన బాగుపడునని డాక్టర్లు చెప్పగా, ఆ బిడ్డ తల్లిదండ్రులందుకై కృషి సలిపిరి. కాని సమ్మతించిన వారు

లేరు. ఒక సమయమున ఆ బిడ్డ తల్లిదండ్రులు శ్రీ స్వాములవారిని దర్శించుటకు వచ్చిరి. ఆ బిడ్డ వృత్తాంతము విని, తక్షణమే నేనిచ్చెదనని, ఎవరెన్ని చెప్పినా లక్ష్యపెట్టక, ఎముకను సమర్పించినారు. ఈ విషయమును వినినప్పుడు పురాణములో పేర్కొనిన ధధీచి, శిబి, రంతిదేవాదులు స్మృతి పథమునకు వచ్చెదరు. వీరి జీవితములో నిట్టిత్యాగ లక్షణము లెన్నో గలవు. మహనీయుల త్యాగపూరితమైన సద్భావముల నలవఱచుకొని శక్తి వంచనలేక "పరోపకార్థమిదం శరీరమ్" అన్న సూత్రము ననుసరించి లోకసేవ నొనర్పవలెను.

భౌతిక వస్తువులపై గల వ్యామోహము తొలగినప్పుడే మానవులకు శాంతి లభించును. తద్వారా సత్యసాక్షాత్కారము పొందగలరు. మానవుడు తన ప్రయత్నము ద్వారా సృష్టి యందలి రహస్య శక్తులను తెలిసికొని యుపయోగించుకొనుచున్నాడు. ఈ శక్తులనెన్నిటిని కనిపెట్టినను సృష్టికంతకు మూలమగు సత్యమును గాంచకపోవుటచే అశాంతికి గురి యగుచున్నాడు. సత్య సాక్షాత్కారము కొఱకు యత్నించుటయే వివేకవంతుని లక్షణము. ఈ వివేకము లభించవలెనన్న చిన్నతనమందే బ్రహ్మవిద్య నభ్యసించవలెను. ఇప్పుడు చిన్న చిన్న గ్రామములలో కూడా పాఠశాలలున్నవి. ఈ పాఠశాలలో నేర్పెడి విద్య లౌకిక విద్య. ఈ విద్య వలన శరీర పోషణకు దగిన భౌతిక సంపద సమకూర్చుకొనుచున్నారు. కాని ఆత్మపోషణ కనువగు విశ్వవ్యాప్తమగు దివ్యశక్తి సంపాదించుకొనలేకున్నారు. అందుచే చదువుకొనినవారును శాంతి సౌఖ్యములను బొందుటలేదు.

గాంధీజీ బోధించిన నిరాడంబర, నిరభిమాన, నిష్కామ, నిష్కాపట్య జీవిత విధానమును మన నాయకులు, మనము మఱచిపోయినాము. అందువలన అన్నిచోట్ల అనైక్యత, అశాంతి ఏర్పడినది. బ్రహ్మజ్ఞానికి యుండెడి సహజ లక్షణములను శ్రీ భగవద్గీత యందు శ్రీకృష్ణ పరమాత్మ చెప్పుచూ మొదట శమము గూర్చి చెప్పినారు. శమమనగా అంతరేంద్రియ నిగ్రహము. అంతరేంద్రియమనగా మనస్సని అర్థము. మనస్సును స్వాధీనములో నుంచుకొనుటకు ఒక్క బ్రహ్మజ్ఞానికే సాధ్యమగును.

'అంతరాత్మ ప్రేరణ' అనే అంశము గురించి వివరిస్తూ శ్రీ నిర్విషయానంద బ్రహ్మచారి గారు "ప్రతి మానవునికి అంతరాత్మ గలదు." అందుచే నీతి విరుద్ధమైనవియు, హింసాయుతములైనవియునగు పనులు నొనర్చుచు నేనంతరాత్మ ప్రేరితుడనయి చేయుచున్నానని చెప్పవచ్చును. అట్లు చెప్పెడి వారును గలరు. అంతరాత్మ ప్రేరిత విషయమును గ్రహించుట సామాన్యము కాదు. దేహమే నేనను భావము వీడి శరీరేంద్రియముల కతీతముగా సర్వవ్యాపకమై వెలుగొందు బ్రహ్మమే నేనను నిశ్చయ స్థితిలో దోచు గంభీర భావము నంతరాత్మ ప్రేరణగా భావింపవచ్చును. సంకల్పము కలిగిన తోడనే అంతరాత్మ నామరూప రహిత మగు జగద్రూపము ధరించినది. బ్రహ్మకార స్థితి సంకల్ప వికల్ప రహితమైనది. అక్కడ నుండి సంకల్పములు జనించుట కారంభించుచున్నవనినచో దేహభావ మున్నదని యర్థము. అట్టి యెడనిది యంతరాత్మ ప్రేరితమగు భావమని నిర్ణయించటెట్లు? ఈ ప్రశ్నకు సమాధానము చెప్పుట కష్టము. కొన్ని ప్రత్యక్ష దృష్టాంతముల వలన నిది యంతరాత్మ ప్రేరిత కార్యమనియు ఇది జీవప్రేరిత కార్యమనియు నిర్ణయించుకొనవచ్చును.

"సమిష్టి సుఖము నభిలషించి చేయు కార్యములు అంతరాత్మ ప్రేరితములు. వ్యష్టి సుఖమును

కోరి చేయు పనులు జీవ ప్రేరితములు. ఎందుచేతనంటే అంతరాత్మ సర్వవ్యాపకమైనది. అచ్చటి నుండి బయలుదేరిన భావము విశ్వసౌఖ్యము నభిలషించునదిగా యుండును. విశ్వసౌఖ్యము నభిలషించి పని చేయునప్పుడు వాని ప్రేమ సర్వత్రా వ్యాపించి యుండును. వర్ణనాతీతమగు ప్రేమ సముద్రుడై యుండును. ఇట్టి మహనీయుడే యంతరాత్మ ప్రేరితుడై కార్య మొనర్చువాడు. గాంధీజీ ఇట్టి వ్యాపక ప్రేమ గలిగిన మహనీయుడు. నేనంతరాత్మ ప్రేరితుడనై ఈ పని చేయుచున్నానని చెప్పుటకు ఆయనకు చెల్లును. రాజకీయ కార్యములలో నిమగ్నుడై యుండియు శాంతియుతముగ వారుండుట కిదియే హేతువు. అట్టి మహనీయులెందరో గలరు."

"మనో నిగ్రహోపాయము" గురించి వివరిస్తూ శ్రీ నిర్విషయానంద బ్రహ్మచారిగారిట్లు చెప్పారు. అనేకులు ధ్యాన సమయమున మా మనస్సనేక వికారములకు గురి యగుచున్నది. దానినణుచు మార్గమేమియు గోచరించుట లేదని చెప్పుచుందురు. ఇది వాస్తవ విషయమే. అన్నిటికంటే ఘనకార్యము మనో నిగ్రహమే కదా! మనస్సును కట్టివేయవలె ననుకొనుట పొరపాటు. అసలు మనస్సను నది ఒక వస్తువు కాదు. ఒక వస్తువైనచో దానినొకచోట నిలుపవచ్చును. అట్లు మనస్సును నిలుపుటకు వీలు లేదు. కనుక దానిని కట్టివేసెడి. ప్రయత్నమును వదలి దాని యందుండెడి వికారములుపశమించు మార్గము వెదుకవలయును. నిజముగా నాలోచించిన మనస్సనునదొకటి లేదు. ఒకటే పరమాత్మ కలదు. ఆ పరమాత్మ యందు ఈ మనస్సు కల్పితము. కల్పితమనగా లేదని యర్థము. కనుక మనస్సనునది లేదు. ఒకే పరమాత్మ కలదు. అని నిరంతరము తీవ్రముగా భావించుచుండిన, మనస్సున కావలి స్థితికి పోగలము. అప్పుడు మనస్సనునదొకటి గోచరింపదు. ఒకే పరమాత్మ సర్వదా పొడకట్టును. ఇది మనోరహిత స్థితిని పొందుట కొక నుపాయము.

ఒకడు నిర్వికల్పస్థితిని పొందినాడనుకొందము. కొన్ని గంటల్లో, కొన్ని రోజుల్లో యున్నాడనుకొనుడు. పిమ్మటనైనను వ్యవహార స్థితికి వచ్చి దృశ్య ప్రపంచమును చూడవలయును గదా! అప్పుడు వాని కది బంధమై అశాంతి కలిగించవలయును. అట్లు కలిగించుట లేదు. కొంత తడవు సమాధి స్థితి యందు నామరూప రహితమైన యే పరమాత్మను దర్శించియున్నారో, ఆ పరమాత్మ స్వరూపముగా ఈ వ్యవహార ప్రపంచమును దర్శించుదురు. అందుచే వారెట్టి వికారమునకు గురి కాక వ్యవహారములను ప్రశాంతముగా నడుపుచుందురు. మనస్సునందలి వికారములే అశాంతికిని, దుఃఖములకు, బంధములకు కారణము.

ఇక ధ్యాన సమయాన కనులు మూసికొని యున్నప్పుడు మనస్సు పొందెడి వికారములు జయించు మార్గమేదనిన వ్యవహార దశయందు ప్రపంచమునెట్లు పరమాత్మ స్వరూపముగా భావించుచున్నామో అట్లే ధ్యాన సమయమున గోచరించు మనోకల్పిత దృశ్యములను గూడ పరమాత్మ స్వరూపముగా భావించుచుండవలయును. అట్లైన ధ్యాన సమయమున కాన్పించు దృశ్యముల వలన కలుగు వికారములు డిగిపోవును. ఈ దృశ్య జగత్తుకు కారణమైన పరమాత్మయే సర్వదా పొడకట్టును. అప్పుడు నేను మనస్సును జయింపలేనను సందేహము ఉడిగిపోవును.

'ఉపాసనా రహస్యము'లో శ్రీ నిర్విషయానంద బ్రహ్మచారిగారు హిందువులు ఉపాసించే హరిహరమూర్తుల అసామాన్య ఆకారములలో గల రహస్యాన్ని విశిదపరిచారు. ఈశ్వర రూపములో,

శిరస్సుపై గంగాదేవి, సగ శరీరము పార్వతీ దేవి, సర్పములు ఆభరణములు. వస్త్రము గజచర్మము. భిక్షపాత్ర మనుష్యకపాలము. ఆయన వాహనము ఎద్దు. పార్వతీదేవి వాహనము సింహము. కుమారుడగు విఘ్నేశ్వరుని వాహనము ఎలుక, మరో కుమారుడు కుమారస్వామి వాహనము నెమలి. సింహమునకు వృషభమాహారము. పాములను నెమలి చంపును. పాములు ఎలుకలను మ్రింగివేయును. పరస్పర వైర భావ కుటుంబములో ఆయన నివసించుచున్నారు. నిర్వికల్ప సమాధియందు నిమగ్నుడై యున్నాడు. ఇందు మనము గ్రహించవలసిన విషయమొకటి గలదు. మానవులకు ఒక్కొక్క సమయమున లెక్కకు మించిన కష్టములు సంభవించును. ఇంటిలోని వారెల్లరూ పరస్పర కలహములతో విసుగుజనింపచేతురు. అప్పుడు సామాన్య మానవుడు కష్టములను భరింపజాలక ఆత్మహత్య నొనర్చుకొనుటో, దుఃఖ క్రాంతుడగుటో, కోపతాపములకు గురి యగుటో సంభవించును. అట్టి సమయమున గ్రహించవలసిన రహస్యమొకటి ఈశ్వరోపాసనలో కలదు.

పరస్పర వైరభావ కుటుంబములో ఆయన చలింపకుండునట్లు మనమును చలింపక నిర్వికల్ప సమాధిలో నిమగ్నులమై యుండవలెనని గ్రహింపవలయును. అట్లుండిన ఆయన కుటుంబము వలె మన కుటుంబములు వైర భావమును వీడగలవు. ధర్మయుక్త భిక్షావృత్తి నవలంభించి ఇది నీచమను తలంపుతో సిగ్గునొందక మందహాస వదనార విందముతో నొప్పుచున్నాడు. అట్లే మనమును దరిద్రస్థితి సంభవించినప్పుడు భిక్షావృత్తి నైన నవలంబించవచ్చు గాని, నీతి విరుద్ధ కార్యములలో ప్రవేశింపదగదు. నిమ్నములని శరీర పరిశ్రమకు సంబంధించిన కార్యములు చేయుటలో సిగ్గునొందక పూజ్య భావముతో తత్కార్యములు చేయవలెను. ఇదియే ఈశ్వరోపాసనచే నేర్చుకోదగిన విషయము. గాంధీజీ జీవితమందు ఇట్టి సందర్భములు అనేకము చూడవచ్చును. ఆయనను అనేక సందర్భములలో లాఠీ దెబ్బలు కొట్టారు. ఆయన చలించలేదు. ప్రతీకారం చేయలేదు. పాకీపని, చెప్పులు కుట్టుట మొదలగు తక్కువ పనులను పరమానందభరితుడై చేసారు.

నారాయణుడు లక్ష్మీ నిలయుడు. రత్నాభరణాలు, పట్టు పీతాంబరాలు మొదలగు అలంకారములతో మహదైశ్వర్యములతో నిండియుండి, లక్ష్మీదేవి నిరంతరమాయన పాదములొత్తుచున్నా, ఈ భోగముల వైపు కన్నెత్తి చూడక. ఆదిశేషునిపై యోగనిద్ర పోవుచున్నాడు. భోగములగాంచి వ్యామోహము చెందరాదని నిశ్చల హృదయులై ఉండవలెనని నారాయణోపాసన వలన మనము గ్రహించవలెను.

శ్రీ ఓంకార స్వామీజీ జన్మదినోత్సవమునకు భక్తజనులెల్ల రొకచోట గూడియుందురు. ఈ జన్మదినోత్సవమును జరుపుట వలన శ్రీ స్వామీజీ నూతనానంద మనుభవించున దేమియూ లేదు. అయితే ఈ ఉత్సవ సమయమున శ్రీవారి పవిత్రత, శాంతి, ప్రేమ, నిగ్రహము మొదలగు సల్లక్షణములు మనమెల్లరము హృదయాలలో నిలుపుకొని, సత్ప్రవర్తనతో నూతన వికాసమును జీవితములందు పొందవలెను.

(ఈ వ్యాసము శాంతి పత్రికలోని స్వామి వారి పలు వ్యాసముల నుండి సంగ్రహించి వ్రాయబడినది)

# శ్రీ శాంత్యాశ్రమము

- పరమపూజ్య శ్రీ స్వామి విద్యాప్రకాశనందగిరి
శ్రీ శుకబ్రహ్మాశ్రమము - శ్రీకాళహస్తి

శ్రీ ఓంకార స్వాములవారి 75వ జన్మదినోత్సవము జరుగనున్నదని తెలిసికొని చాలా ఆనందమైనది. శాంతి సంస్థాపనమునకై శ్రీ స్వామిజీ కావించిన కృషి అమోఘమైనది. అశాంతిలో తల్లడిల్లి పోవుచున్న జనసముదాయమునకు శాంతి మార్గమును ప్రసాదించి, **"శేషాం శాన్తి శ్శాశ్వతీ నేతరేషామ్"** అను ఉపనిష ద్వాక్యాను ఆత్మానుభూతి యందే మహోన్నత శాంతి నెలకొనియున్న దను పరమ సత్యమును లోకమునకు ఉద్ఘాటించి శ్రీ స్వామిజీ జనులకు మహోపకార మొనర్చిరి. కరుణామూర్తియగు సర్వేశ్వరుని కృపచే శ్రీ స్వామీజీ యొక్క సేవాభాగ్యము ఇతోధికముగ జనులకు లభించగలదని ఆశించుచున్నాము.

శాంతి పత్రికకు మాత్రము అరువది సంవత్సరములు పూర్తి అగుటచే షష్ట్యబ్ధి మహోత్సవము జరుగుచున్నది. పత్రిక యొక్క ఈ షష్టిపూర్తి ఒక గొప్ప శుభ విశేషము. ఏ పత్రిక ద్వారా త్యాగశీలురును, అపరశిబి చక్రవర్తియునగు శ్రీ ఓంకారస్వాములవారు తమ శాంతి సందేశములను నలుదిశల వ్యాపింపజేసెనో, ఎయ్యది సమస్త మానవాళికిని శాంతిని బడయు మార్గములను, పద్ధతులను లెస్సగసూచించి మహోపకార మొనర్చెనో, అట్టి దివ్యమగు మాసపత్రిక తన అరువది సంవత్సరములను పూర్తి చేసికొని అరువది యొకటవ జన్మదినోత్సవము జరుపుకొనుచుండుట చాలా ఆనందకరమైన విషయము.

**'అశాంతస్య కుతఃసుఖమ్'** అని గీతాచార్యులు పేర్కొనినట్లు శాంతి లేనివానికి సుఖమే లేదు. కాబట్టి సుఖమును కోరు ప్రతివారును ముందు తమకు శాంతి లభించినదాయని పరీక్షించుకొనవలసి యుండును. తమ చిత్తము నిర్మలముగా, ప్రశాంతముగా నున్నదాయని చూచుకొనుచుండవలెను. ప్రతిప్రాణియు సుఖము నెట్లు కోరుచున్నాడో అట్లే తత్సుఖకారణమగు శాంతిని కూడ బడయుటకై బాగుగా అభ్యసించవలెను.

జనులు అట్టి శాంతిని పొందుటకు 'శాంతి' పత్రిక బహువిధముల తోడ్పడుచున్నది. శాంతి ప్రబోధకమైన ఆ పత్రికను జనులింకను ఇతోధికముగ ప్రోత్సహించి లోకములో శాంతి ప్రచారమునకు దోహదమును కలుగజేయుదురు గాక!

* **మనము చేయు పనులు నూటికి నూరుపాళ్ళు శ్రద్ధతో చేసిన తిరిగి ఎన్నడును దానిని చేయువలసినది యుండదు.**
* **దైవము అమూల్యమగు మానవ జన్మను మీకు ప్రసాదించినందుకైనను దైవనామ సంకీర్తనలో పాల్గొని తరించుడు.**

# విశ్వశాంతి శంఖారావం స్వామి ఓంకార్

**– పూజ్య శ్రీ స్వామి మేధానందపురి**
కైలాస ఆశ్రమము, ఋషీకేశం

ప్రణవము అన్ని వేదముల సారము. నిరాకార నిర్గుణ నిర్విశేష పరబ్రహ్మము యొక్క వేదిష్ట (అతి దగ్గర) నామము. ఈ ఓంకారము. దీని ద్వారా పరాపరబ్రహ్మల ప్రాప్తి అని ఉపనిషత్ ఘోష. బ్రహ్మగారు అన్ని లోకముల సారము తెలుసుకొను తపస్సు ఆచరించగా మూడు లోకముల సారము (భూర్భువస్సువః) అని తెలుసుకొనెను. వాని సారము మూడు వేదములు. భూర్భువస్సువః అను మూడు వ్యాహృతులు వేదముల సారము. వ్యాహృతుల సారము అకార, ఉకార, మకారములు. వానిని జేర్చిన 'ఓం' శబ్దమేర్పడును. పుత్రేషణ, లోకేషణ, విత్తేషణ త్యజించి సన్యసించిన వారికి ఈ 'ఓం' కార మంత్రమునే ఉపదేశించెదరు. అందుకే ఓంకార స్వామీజీ సర్వసంగ పరిత్యాగియై ఆ ఓంకారమునే ధ్యానించి తాను బంధ విముక్తులై ఇతరుల ముక్తి మార్గమునకు తోడ్పడెను.

అతి చిన్న వయసులో ఋషీకేష స్వర్గాశ్రమునకు పోయి అచటి వ్యవస్థాపకుని తపస్సు చేసుకొనుటకు కుటీరమిమ్మనిన, ఆ వ్యవస్థాపకుడు వీరిని ఎగాదిగా జూచి ఇంత చిన్నవయస్సులో ఉన్నవారు ఏమి తపస్సు ఆచరించగలరని మనుష్య సంచారము లేని, విషజంతువులైన పాములు, తేళ్ళు, జెఱ్ఱులు గల ఒక కుటీర మిచ్చెను. దానిలో ఉండి నిరంతరము ఓంకారమును జపించుట వల్ల వీరికి స్వామి ఓంకార్ అని పేరు కలిగెను. వీరి తపస్సుకు ఆశ్చర్యచకితుడై వ్యవస్థాపకుడు కుటీరములోనున్న విష జంతువులు బారి నుండి తప్పించుటకు లాంతరు ఇచ్చెదననిన స్వామివారు తనలోనున్న దివ్యజ్యోతిని దర్శించెదను. బయట ఉన్న ప్రకాశము ఆవశ్యకము లేదనిరి. దీని ద్వారా స్వామి వారి జ్ఞాన ప్రాప్తికి కావలసిన వ్యాకులత, నిర్భీకత, తత్పరత తెలియుచున్నవి. మంత్ర శాస్త్రములో గాని స్తోత్రములలో గాని ఓంకారమును చేర్చనిదే ఫలము దక్కదు. ఆ ఓంకార ఫలితమును అనుభవించినవారు మన ఓంకారస్వామి. ఈ ఓంకారము సర్వ వ్యాపకమైన పరబ్రహ్మ ప్రతీకము గనుక స్వామివారు అందరిలో ఆత్మను దర్శించుచు రాగద్వేషములకు అతీతులై అందరిని సమానముగా ఆదరించెడివారు. వ్యాపక ఆత్మ అందరిలో ఒక్కటే గనుక అన్ని మతముల సామరస్యమును తెలుపుచు విశ్వశాంతికి తోడ్పడిరి.

ఈ సందేశమును భారతములోనే గాక అనేక ఇతర దేశములలో ప్రచారము చేసి వారికి గురువై వారిని సక్రమమైన ముక్తి మార్గములో పయనించుటకు తోడ్పడిరి. **"యద్భావం తద్భవతి"** అనునట్లు చిన్నతనము నుండి వీరికి విదేశీ పర్యటన చేయవలయునని తీవ్ర కోరిక యుండుటచే కష్టములను అవలీలగా దాటి లక్ష్యమును సాధించి అనేకసార్లు విదేశీ పర్యటన గావించిరి. అచ్చటి వారిని ఎంతోమందిని శిష్యులుగా తీసుకొనగలిగిరి.

1952లో కారు ప్రమాదములో కాలు విరిగిన ఒక చిన్న అమ్మాయికి చికిత్స కొఱకు సజీవమైన వ్యక్తి ఎముక కావలసి వచ్చెను. ఈ కరుణామూర్తి మత్తుమందులు లేని ఆ కాలములో తన ఎడమకాలి ఎముక ముక్కను కోయించి 'దాన' మిచ్చిన మహాయోగి పుంగవులు. ఆధ్యాత్మిక ఉపదేశములతో పాటు శారీరక బాధలను తొలగించుటకు తోటపల్లి కొండలలో అనేక రకముల (ఆస్పత్రులు) వైద్య కేంద్రములు స్థాపించిన కరుణామూర్తి.

**మననాత్ మునిః** ఆత్మ పరమాత్మల ఏకత్వమును విచారించు ఉత్తమ సాధకులైన మౌనులనే

మునులందురు. అటువంటివారే ఈ ఓంకారస్వామి. జీవునిలో గల అనేక సంస్కారాలను తొలగించి మనస్సును అమనీభావమున తీసుకుపోయిననే గాని మౌనము ఆచరించలేరు. అట్టి మనోనాశమును పొందిన మౌనభావము స్వామివారికి సహజసిద్ధము. అందులకే విశాఖపట్టణములో గల కైలాసగిరిపై నిర్వాణ ఆశ్రమములో ఎడతెరిపి లేకుండా ఆరు సంవత్సరముల పాటు మౌనదీక్షలో ఉండగలిగిరి. ఆ సమయములో **'మౌనపు ఘడియలు'** అని రచించిన ఉత్తమ గ్రంథము అతి ప్రఖ్యాతము. మౌనమనగా వాణింద్రియమును నియమించుట కాదు, కాని మనస్సును ఖాళీ చేసుకుని పరమాత్మ భావములో ఉండుట అని తమ జీవితము ద్వారా లోకానికి చాటి చూపిరి. అందుకనే నిశ్శబ్ధమే బ్రహ్మమనుచుండెడివారు. ఆ పరబ్రహ్మను అందరిలో చూచుచు అందరికి పరమాత్మ భావముతో సేవ చేయవలయునని ఉపదేశము గావించిరి. సర్వవ్యాపకమైన పరమాత్మను పువ్వులు, కాయలు, పండ్లు ఇచ్చి తనను తాను మోసపుచ్చుకోవద్దని చెప్పుతూ నిర్మలము, నిష్కాపట్యము, ఋజుత్వము గల మనస్సుతో పరమాత్మకై వ్యాకులత ఉండుట వలననే పరమాత్మను పొందగలమని చెప్పిరి. వారి ఆత్మానుభవము ధృడమైనందు వలన కేవలము జీవులను ప్రేమించవద్దు కాని మూర్తీభవించిన ప్రేమమూర్తివై పరమాత్మ ప్రేమను చవిచూడమనిరి. అస్పృశ్యతను తొలగించుటకై అన్ని జాతుల వారికి ఉచిత విద్యాశాలలు ఏర్పాటుచేసిన మహా తత్వదర్శి. ఆ కాలములో మూర్తీభవించిన ధర్మమూర్తి రామచంద్రులవారు శబరి ఎంగిలిపండ్లు తిని ఆమెకు మోక్షమిచ్చినట్లు మన ఓంకార స్వామివారు అన్నిజాతులవారిని చేరదీసి అందరికి సహాయపడిన విశ్వశాంతిమూర్తి.

శాస్త్రములలో దానము యొక్క మహిమను చాలా పొగిడిరి. దానము వలన మనలో నున్న చెడు సంస్కారములు త్వరగా నశించును. అందుకే కృష్ణపరమాత్మ **'యజ్ఞదాన తపఃకర్మ'** సత్యజ్యమనిరి. అదే విధముగా స్వామివారు జపయజ్ఞము మౌన యజ్ఞమును ఉపదేశించిరి. మౌనమునే తపస్సనిరి. స్వామివారి భాషలో మౌనమనిన ఆత్మభావములు స్థిరముగా యుండుట. ఇంతేగాక జలపాతముల వలె ఎల్లప్పుడు దానము చేయుచుండడని ఉద్ఘోషించిరి. దానము చేయకుండ మనతో ఉంచుకొను వస్తువులు ధనము మట్టితో సమానమై మట్టిగా మారుచుండుననెడివారు. అంతేగాక ఇచ్చిన దానమును మరచిపోవలయును. దానిని ప్రచారము చేయకూడదనెడివారు. చేసిన పాపము చాటిచెప్పిన దాని ఫలము నశించును. అట్లే చేసిన పుణ్యము ప్రకటించిన దాని ఫలము నశించును.

వ్రతముల ప్రాముఖ్యమును గురించి చెప్పుచూ మనలోనున్న చెడు అలవాట్లను, చెడు కర్మలను, చెడు సంస్కారములను తొలగించుకొని ఆత్మానందములో మునుగుటయే వీరిభాషలో ముఖ్యవ్రతము. కాని ఓంకార జపము చేయుచు ఆత్మను పరమాత్మలో తాదాత్మ్యము గావించి, ఒకసారి పదిరోజులు మరొకసారి ముప్పై రోజులు, ఇంకొకమాటు 40 రోజులు ఉపవాసముండి తాను శరీరముగాదు అందరిలో వ్యాపించియున్న ఆనందసాగర రూపమైన ఆత్మనని చాటిచెప్పిన మహాత్ముడు.

సృష్టికి ఆదిలో ప్రణవమే వెలువడెను. దానిని జపించుచు పరమాత్మతో ఏకత్వమును పొందుటయే మానవుల జీవిత లక్ష్యమని ఉపదేశించెడివారు. ఆ ఓంకారమును జపించుచు పరమాత్మ బిడ్డనని భావించవలయుననెడివారు. అందరినీ అన్ని జీవజంతువులను ప్రేమించువారు దైవప్రార్థన చక్కగా చేయగలడనెడివారు. వేదములలో శాస్త్రములలో చెప్పిన ఉపదేశములు బయటకు తీసి మనస్సులో ముద్రించుకుని వారిని అనుభవించుడనెడివారు. మహాత్మాగాంధీగారు చెప్పినట్లు ఇతరులలో చెడు చూడవద్దు, చెడు వినవద్దు, చెడు మాట్లాడవద్దనెడివారు. ఈ విధముగా ఉపదేశించుచు వారు విశ్వశాంతికి తోడ్పడిరి.

# క్షమయా సాధ్యతే సర్వమ్

- పూజ్యశ్రీ స్వామి పరిపూర్ణానందగిరి
శ్రీ వ్యాసాశ్రమము, ఏర్పేడు.

*క్షమ గలిగిన సిరిగలుగును*
*క్షమ గలిగిన వాణి గలుగు సౌర ప్రభయున్*
*క్షమ గలుగ దోన గలుగును*
*క్షమ గలిగిన మెచ్చు శౌరి సదయుడు తండ్రీ!*

క్షమ అంటే ఓర్పు - తొందరపాటు లేకుండా వుండడం. దీనివలన ఎట్టి క్లిష్టమైన సమస్యలైనను చక్కబెట్టుకోవచ్చును. లేక సాధించుకోవచ్చును.

మన భారతదేశంలో ముఖ్యంగా మూడు మతాలున్నాయి. అద్వైత మతము, ద్వైతమతము, విశిష్టాద్వైత మతము, ఈ మత స్థాపకులు క్రమముగా శ్రీ శంకరాచార్యులు, శ్రీ మధ్వాచార్యులు, శ్రీ రామానుజా చార్యులు. శ్రీ రామానుజాచార్యుల వారి గురువు శ్రీ యమునాచార్యులవారు. వారు చాలా గొప్పవారు. అన్యుల మనస్సును నొప్పింపక తానొవ్వక తన కార్యాలు తాను చేసుకొంటూ ఉండేవారు. ఎంత మంచివారికైనా గిట్టనివారు కొందరు ఉంటూనే వుంటారు. వారు ఒకనాడు నదిలో స్నానం చేసి సంకల్పం చెప్పుకొని దైవ భావంతో సన్నని త్రోవగుండా వస్తున్నారు. యోగ శాస్త్ర ప్రకారం మనుష్యుడు నడిచేటప్పుడు నాలుగు బారల కంటే ముందు చూడకూడదు. మరియు అటూ యిటూ కూడా చూడకుండా నడవాలి. అలాగే ఈ స్వామి నడుస్తూ వస్తున్నాడు. మార్గమధ్యంలో దుండగులు వ్రేలాడగట్టిన పాదరక్షల తోరణం దగ్గరలో చూచారు. వెంటనే చేతిలో ఉన్న చెంబును ప్రక్కకు పెట్టి యిలా స్తుతించాడు.

*కర్మావలంబకాః కేచిత్ - కేచిత్ జ్ఞానావలంబకాః।*
*వయంతు హరిభక్తానాం - పాద రక్షావలంబకాః॥*

కొందరు నిష్కామ కర్మలు నేను చేస్తున్నాను అని, మరికొందరు నేను అనెడి అహంకార బుద్ధి లేకుండా చక్కగా దైవార్పిత బుద్ధితో కర్మలను చేస్తూ, నిష్కామ ఉపాసనలతో మల విక్షేప దోషాలను తొలగించుకొని సాధన చతుష్టయ సంపత్తిని అలవర్చుకొని అధికారులవుతున్నారు. అట్లు అధికారులైనవారు సద్గురువులును ఆశ్రయించి శ్రవణ మనన నిదిధ్యాసలు చేసి జ్ఞానులై ముక్తిని పొందుచున్నారు. మరికొందరు ఏకాంతములో జ్ఞాన సాధనలు తీవ్రముగా చేసి ముక్తులగుచున్నారు.

కాని నాలాంటివారు (శ్రీయమునాచార్యులవారు తన్ను గురించి చెప్పుకొంటున్నారు) భాగవతోత్తముల పాదరక్షలను ఆశ్రయించి ముక్తిని పొందుతుంటారు. అని ఆనంద బాష్పాలతో శ్లోకాన్ని పఠించారు. ఇది చూచి ఆ దుర్మార్గులు అమాంతంగా ఆయన పాదాల మీద బడి క్షమాపణ గోరి సజ్జనులైపోయారు. ఆహా! చూచితిరా క్షమాగుణము యొక్క గొప్పతనము.

శ్రీ వినోభాబావేగారు పంచ భూతాలు ఎలా ఓర్పు గలిగి ఉంటాయో అలాంటి ఓర్పును మీరును కల్గియుండాలని హెచ్చరించారు. చూడండి భూమిని మనము గడ్డపారతో త్రవ్వుతాము, నాగలితో

దున్నుతాము, పారతో చెక్కుతాము, దానిపైన మలమూత్ర విసర్జన కూడా చేస్తున్నాము. ఇన్ని చేసినా భూమి చలించుట లేదు. మనలను తిరస్కరించుట లేదు. అలాగే జలము పాత్రలు తోముటచేత, స్నానము చేత, ఇంటిని కడుగుట చేత, మాసిన గుడ్డలను ఉతుకుట చేత, యెన్నో విధాలుగా మనము ఆ జలమును మురికి చేస్తున్నాము. కాని ఆ జలం మనలను తిరస్కరించుట లేదు. అట్లే అగ్ని, వాయువు, ఆకాశం ఇవన్ని కూడ మనం స్వార్థం కొరకు చేసే పనులకు కించిత్తైనా చలింపక ఓర్పుతో మనకు సహకరిస్తూనే యున్నవి. అట్లే మనం కూడా అట్టి క్షమను కల్గియుండాలి.

*భగవద్గీత 10 అధ్యాయములో భగవంతుడు –*

**కీర్తిః శ్రీర్వాక్చ నారీణాం స్మృతిర్మేధా ధృతిఃక్షమా!** మాతృదేవతలతో క్షమ విశేషంగా ఉంటుంది. ఆ క్షమ నేనేనని భగవంతుడు అన్నాడు. మాతృమూర్తులు గర్భం ధరించి శిశువును నవమాసాలు మోస్తున్నారు. పుట్టిన తరువాత ఆ శిశువులకు మలమూత్రాలు తొలగించడం దగ్గర నుంచి ఓర్పుతో యెన్నో సేవలు చేస్తున్నారు. వారు అంత ఓర్పుతో పోషించబట్టే మనమింతవారము అయ్యాము. మాతాజీలకు ఉన్న ఓర్పు చెప్పలేనంత. తండ్రి బిడ్డను యెత్తుకున్నాడనుకోండి. ఇంతలో వాడు మల విసర్జనో లేక మూత్ర విసర్జనో చేశాడనుకోండి. ఇక ఆయనగారు వెర్రి కేకలు వేసి నానా హంగామా చేయడం జరుగుతుంది. అప్పుడు ఆ తల్లియే వచ్చి శుభ్రం చేయడం మనం చూస్తూనే వుంటాము. కాబట్టే వేదాలు, శాస్త్రాలు మాతృదేవోభవ, సమాతుః పరదైవతమ్, అని విశిష్టమైన స్థానాన్ని మాతృదేవికి యివ్వడం జరిగింది.

వసిష్ఠునకు విశ్వామిత్రునకు చిరకాల వైరం. రాజులు ఋషి అయితే రాజర్షి అంటారు. బ్రాహ్మణులు ఋషియైతే బ్రహ్మర్షి అంటారు. దేవతలు ఋషియైతే దేవర్షి అంటారు. విశ్వామిత్రుడు క్షత్రియుడు. అతడు ఋషి అయితే రాజర్షి అవ్వాలి. కాని తాను బ్రహ్మర్షి అవ్వాలని పౌరుషాన్ని పెంచుకొని తపస్సు తీవ్రంగా ఆచరించాడు.

***విశ్వామిత్రేన మునినా దైవ ముత్సృజ్య దూరతః ।***
***పౌరు షేణైవ సంప్రాప్తం బ్రాహ్మణ్యం రామ నాన్యథా ॥***

బ్రహ్మదేవుని మెప్పించి రాజర్షి అనిపించుకోవలసింది పోయి బ్రహ్మర్షి అనిపించుకొనెను. కాని వసిష్ఠ మహర్షి బ్రహ్మర్షి అని తన్ను అనలేదనే ఆవేదనతో ఆవేశంతో వసిష్ఠులవారి నూర్గురు కుమారులను గూడ చంపివేసెను. అంతటితో కోపము చల్లారక వసిష్ఠుల వారిని చంపాలనుకొనెను. రాత్రి పెద్ద గుండురాయి పట్టుకొని పొదచాటున కూర్చుండియుండెను. శ్రీ వసిష్ఠులవారు, అరుంధతీదేవి ఉద్యానవనమందు వెన్నెలలో కూర్చుని యిష్టాగోష్ఠిగా వేదాంత విషయాలు ఈ క్రింది విధంగా ముచ్చటించుకొంటూ ఉన్నారు.

***యోగవాసిష్ఠంలో –***

**"అత్రాహారార్థం కర్మకుర్యాదనింద్యం**
**కుర్యాదాహారం ప్రాణ సంధారణార్థమ్ ।**
**ప్రాణాస్సంధార్యా స్తత్వజిజ్ఞాసనార్థం**
**తత్త్వం జిజ్ఞాస్యం యేన భూయోనజన్మ ।**

32 వేల శ్లోకాలతో కూడిన యోగవాసిష్ఠ గ్రంథంలో ముఖ్య శ్లోకమిది. దీని అర్థము. ప్రతివారు ఆహారార్థం కర్మ చెయ్యాలి. ఆ కర్మ వ్యాపారము కావచ్చు, ఉద్యోగము కావచ్చు, మరేపనైనా కూడా కావచ్చు.

కాని అది దోషరహితమైనదిగా ఉండాలి. అలా పనిచేస్తూ ధనాన్ని సంపాదిస్తూ ఆహారాన్ని స్వీకరించాలి. ఆ ఆహారము ప్రాణాలు నిలుపుకోవడానికి మాత్రమై ఉండాలి. ప్రాణాలు నిలుపుకోవడము ఎందుకు? తత్త్వజ్ఞానం సంపాదించే దాని కొఱకు. జ్ఞానం ఎందుకొరకు సంపాదించాలంటే, జన్మ రాహిత్యము కొరకు. జన్మ రాహిత్యము యెందుల కొరకు, దుఃఖము లేకుండుట కొరకు. ఈ దుఃఖాలు ఆధ్యాత్మిక, ఆధి భౌతిక, ఆధి దైవికము అని మూడు రకాలు. ఈ దుఃఖాలు నుండి తప్పించుకోవాలంటే జన్మరాహిత్యం కావాలి. అని ఈ విధంగా చర్చించుకునే సమయములో అరుంధతీ దేవి, పిండారబోసినట్లు స్వచ్ఛంగా వెలుగుచున్న వెన్నెలను చూచి ఈ వెన్నెల ఎంత స్వచ్ఛంగా ఉన్నదో చూడండి. ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. అని ఈ విధంగా చెప్పుచుండగా వసిష్ఠులవారు ఔను ఔను నిజమే నీవు చెప్పినది. విశ్వామిత్రులవారి కీర్తి చంద్రికలవలె ఈ వెన్నెల ప్రకాశిస్తున్నది. అని చెప్పుటతోడనే ప్రక్క నుండి విన్న విశ్వామిత్రుడు ఓహో! ఈ బ్రహ్మర్షికి నాయందు ఎంత సద్భావమున్నదో ఇప్పుడే తెలిసికొంటిని. అని మనసులో ఉప్పొంగిపోవుచు వసిష్ఠులవారి పాదములపై పడిపోయి బ్రహ్మర్షీ! నన్ను క్షమించు. మీ హృదయాన్ని తెలిసికోలేకపోతిని. అంటూ గట్టిగ పాదములను పట్టిన పట్టు వదలకపోయెను. విశ్వామిత్రా! లెమ్ము అని ఎన్ని పర్యాయములు చెప్పినను లేవకపోయెను. అప్పుడు బ్రహ్మర్షీ ! లెమ్ము అని అనిన తోడనే లేచి నమస్కరించి బ్రహ్మర్షీ! ఈ మాట ఇంతకుముందే అని ఉంటే నీ నూర్గుర కుమారులను చంపి ఉండేవాడను కాను కదా! అని చెప్పగా వసిష్ఠులవారు నేను తపస్సు చేశానని అహంకారం నీలో నిండుకొని యున్నది. అహంకారం ఉంటే భక్తుడే కాడు, జ్ఞాని కాడు, బ్రహ్మర్షి అసలే కాడు. కావున నిన్ను బ్రహ్మర్షీ అని సంబోధించలేకపోతిని. ఇప్పుడు నీలో అహంకారం పూర్తిగా నశించింది. కావుననే నిన్ను బ్రహ్మర్షీ! అని సంబోధించితిని. నూరుమంది పుత్రుల కంటే ఒక సత్యం గొప్పది అనెను. చూచితిరా తన నూర్గురు పుత్రులను విశ్వామిత్రుడు చంపినను ఓర్పుతో ఆయనను అనునయించెను.

ఒక సాధువుగారు పడవలో ప్రయాణం చేస్తున్నారు. తోటి ప్రయాణీకులు ఇతనిని సూటిపోటి మాటలతో బాధిస్తున్నారు. ఇతడు ఏ మాత్రం చలనం లేకుండా దైవభావనలో కూర్చుని యున్నాడు.

***అనన్యాశ్చింతయంతోమాం యేజనాః పర్యుపాసతే ।***
***తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్॥***

అనన్య భక్తితో ఎవరు భగవంతుని ధ్యానించు చుందురో అట్టివారీ యోగక్షేమాలను భగవంతుడే చూడగలడని గీతావచనము.

ప్రయాణీకులు సాధువుగారి మంచితనాన్ని ఓర్పును అలుసుగా తీసుకొని పాటలు పాడుతూ అతని శిరస్సుపై పాదరక్షలతో తాళము వేయసాగిరి. ఇంత జరిగినా భక్తుడు చలించలేదు. దైవభావనతో కూర్చుని యున్నాడు. వారి దుశ్చర్యను సాధువుగారు సహించినా భగవంతుడు సహించలేకపోయాడు. భక్తునకు ప్రత్యక్షమై ఏమయ్యా! ఇంతటి సహనం పనికిరాదు. నీవు చెప్పావంటే పడవనే తలక్రిందులుగా చేసి వీరిని నీటిలో ముంచివేస్తానన్నాడు. ఆ భక్తుడు భగవంతుడా! నీవు సంకల్పించిన పడవనేగాదు ప్రపంచాన్నే తలక్రిందులు చేయగలవు. కాని వద్దు. వారి బుద్ధులను మాత్రం తలక్రిందులు చేసి సరియైన మార్గంలో ఉంచు అని అన్నాడు. ఆహా! చూచితిరా భక్తుని యొక్క క్షమాగుణము. మనం కూడా యిట్టి ఓర్పు గల్గియున్నప్పుడే భగవంతుని సాన్నిధ్యము ఆయన అనుగ్రహము పొందగలుగుతాము.

# ఓంకారము

**– డా॥ ఉమర్ అలీషా నవమ పీఠాధిపతి**
శ్రీవిశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠము, పిఠాపురం.

**'ఓం'కారము అతి పవిత్రమైన ధ్వని.** భగవంతుని ప్రార్థన 'ఓం'కారముతో ప్రారంభమై 'ఓం' కారముతో పూర్తవుతుంది. మనం ప్రార్థన చేయునపుడు 'ఓం'కార శబ్దముతో ప్రారంభిస్తాము. ఆ స్థితిలో శరీరం మనస్సుతో, మనస్సు ఆత్మతో ఏకీకృతం అవుతుంది. ఆ రకమైన ఏకత్వ స్థితి 'ఓం'కార రూపమైన ధ్వనిగా పరిణామం చెందుతుంది. ప్రార్థనలో ఉండే మహోన్నతమైన శక్తి భగవంతుని మహోన్నతమైన లక్షణమును పొందే స్థితిని ప్రసాదిస్తుంది. ఆ లక్ష్యసిద్ధి చేత భగవంతుని ఆశీస్సులు మనపై ప్రసరింపబడతాయి.

ఓంకారము ప్రణవనాదమని, జీవరూపమని ఆధ్యాత్మిక వాఙ్మయములో తెలియబడుచున్నది. ఈ ఓంకారము **అకారము, ఉకారము, మకారము** అను మూడు శబ్దముల కలయికచే ఏర్పడిన ధ్వని. త్రిమూర్త్యాత్మకమైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను కలిగిన సృష్టి, స్థితి, లయములనే మూడు శక్తులకు మూలమని చెప్పబడుచున్నది. ఖురాన్‌నందు **ఆలీఫ్, లామ్, మీమ్** అను మూడు అక్షరముల విషయము కూడా ఇదే అర్థమును తెలియజేయుచున్నది. ఓం సాక్ష్యాత్తు పరబ్రహ్మస్వరూపమైన బీజాక్షరం (ఓ మిత్యే కాక్షరం బ్రహ్మం...) ఈశ్వర తేజోరూపమైన సద్రూపధ్వని. కావున ప్రతీ మానవుడు తన జన్మ సార్థకతకు 'ఓం'కారము గురించి తెలుసుకొనుట అత్యంత ఆవశ్యకము.

**ఓంకారము – పరిణామక్రమము**

**"ఆదిని గల్గదొక్క యణువైనను తేజముదక్క దానిలో**
**నాదము పుట్టి యాకళను నాకము జీవులు భూతకోటియై**
**కాదన కీయజాండము ప్రకాశమొనర్చెను రెండుగాకయే**
**కోదధి వీచికాకృతి సమున్నతి నీగతి నిన్నెఱుంగగన్". బ్రహ్మర్షి డా॥ ఉమర్ ఆలీషా (షష్ఠమ పీఠాధిపతి)**

* విరాడ్రూపమైన మహాతేజస్సు 'ఓం'కార ధ్వని సమ్మిళితమైయున్నది.
* ఆ విరాడ్రూపము నుండి 'ఓం'కార ధ్వని జీవరూపంలో ధ్వనించుట వలన కలిగిన కదలిక వలన శక్తి, పదార్థ మిశ్రితమైన దైవకణము/ఈశ్వరాణువు మానవాకారమైన అణువుగా విడివడినది.
* అలా విడిపోయిన అణువులో 'ఓం'కారం ప్రవేశించి (తత్ సృష్ట్వాతదేవాను ప్రావిసతు)ఓంకార రూపమైన అణువు సృష్టిగా వ్యాపించినది.
* సృష్టిగా మారిన అణువు పంచభూతాత్మక శక్తులతో పంచభూతాత్మక పదార్థములుగా మారిపోయినది.
* ఈ పంచభూతాత్మక పదార్థముల నుండి జీవరాసులు ఏర్పడినవి.
* అలా ఏర్పడిన 84 లక్షల జీవరాసులలో ఆ ధ్వని (ఓం) ధ్వనించి వాటి అంత్యపరిణామము మానవరూపముగా మారి, మానవరూపములో "నేను" అనే ధ్వనిలో వ్యక్తమగుచున్నది.
* అలా ఏర్పడిన మానవ రూపములో విరాడ్రూపమైన తేజస్సు జీవచైతన్యమైన ఆత్మగా తెలియబడుట చేత 'ఓం'కారమే జీవముగ తెలియబడుచున్నది.

* ఆ ఓంకారమే యావత్ సృష్టిని నిండియున్న భగవత్ స్వరూపముగా తెలియబడుచున్నది.
* ఆ భగవత్ స్వరూపము యొక్క శక్తి మనలో 'అహం బ్రహ్మాస్మి' (నేను బ్రహ్మ స్వరూపిని అయితిని)గా తత్త్వ మార్గములో నిరూపణ కాబడుచున్నది.

దీనినే తత్త్వవేత్తలు 'ఓం'కారమే జీవమనుచు నమ్మి ఆకారమును వీక్షించిన" నాడు నీవు ఈశ్వరత్వము తెలుసుకొనగలవని నుడివినారు.

**ఓంకారమే జీవమనుచు నమ్మి**
**నాకారమునను వీక్షించు**
**ఏకమౌను నీలో ఆకారమును బొంది**
**ఆకంటి నడుమ నీ**
**వఖిలమై నిలిచెదవు ॥ఓం॥ 1**

**ఓంకారమునకు నాదామునకు భేద**
**మున్నా దేమిటో తెలియ వలయు**
**ఓంకార మిహమగును నాదము నీవగును**
**శంకలెంచక తనుతా సాధించి జూచితే ॥ఓం॥ 2**

**తొలిజన్మ పదము లన్నిటిని తలచి**
**తలచి నే జాలి నొందితిని**
**ఇలకొన్ని జన్మములు ఈ జన్మమున జరిపి**
**తెలివిలోపల తెలివై తేజము కనుగొంటిని ॥ఓం॥ 3**

**ఆది యనాది మర్మంబు తెలివి**
**సాధించి గనుట ధర్మంబు**
**బిందుబీజము నందు నీవై నిలిచి నాద**
**మందు లగ్నంబై యా నందము నొందెదవు ॥ఓం॥ 4**

**నేనైనను జూచు చుంటిని ఆఖై**
**లలిగురు నచట గంటిని**
**జ్ఞాన సమాధి మొహియదీన్ భాష్యా సం**
**ధాన ధ్యాన మిదియె తర్కించి చూచితె ॥ఓం॥ 5**

**బ్రహ్మర్షి శ్రీమొహియద్దీన్ బాద్షా**
**(పంచమ పీఠాధిపతి)**

యోగ రూపములో జీవరూపము సగుణ బ్రహ్మయని, దానిని సాధించిన సృష్టియంతయు స్వస్వరూపమయిన జీవముగ నమ్మి సాధించిన ఈ సృష్టి జీవ సమ్మిళితమైన 'ఓం'కారముగ నున్నదని తెలుసుకొనిన ఇది సాక్షిరూపముగ మారి అవ్యయమై నిర్గుణమైన విధానములో సర్వసాక్షిగ మారి ధ్వనించినప్పుడు ఈ 'ఓం'కార నాదమే ప్రణవనాదము (సోహం). ఈ ప్రణవనాద సంభూతమైన ధ్వనే

ఓం = సోహం.

ఈ ప్రణవనాద సంభూతమైన ధ్వని 'ఓం'కార రూపంలో జీవరూపముగా తెగిన అణువు మానవాకారముగ నున్నదని నిశ్చయముగాన 'ఓం'కారము జీవము యొక్క స్వరూపమని నిశ్చయించి అది నేనుగా ఉన్నానను విషయానికి వచ్చి, ఈ స్థితికి వచ్చిన స్థితిలో 84 లక్షల జీవాలలో ముక్తి పొందుటకు ఆకారమయిన మానవరూపము వరకు వచ్చి మానవరూపము పొందిన క్షణమందే ఆశాబద్ధమైన రెండు భావములుగ విడిపోయినది – అది

1. ప్రాపంచిక స్థిరమైన వస్తురూపములందు ఆశగ భ్రాంతి జన్యమైన జడజన్మల వైపు మరలించు ధ్వనిని ఆకారము చేసుకొనిన "నేను" జడజన్మలు పొందుచున్నది.
2. పై దానిని విస్మరించి ఈశ్వర సంభూతమైన విరాడ్రూపము "నేను"గా గ్రహించిన ఆశ సగుణ రూపంలో ప్రకృతి వైశేశికమైన ఈ సృష్టిని తనలో లీనం చేసుకొని అవ్యయమై నిర్గుణోపాసన రూపంలో విరాడ్రూపమైన రసస్వరూపంలో లీనమగుచున్నది. (ముక్తిని పొందుచున్నది).

**సీ॥ గృహమందున్ననే గుహలందు దాగిన**
**జ్ఞానంబు ఫలమును గాంచవలయు**
**విజ్ఞాన మీశ్వర జిజ్ఞాస వ్యవసాయ**
**మట్లు ఫలప్రదమై తనర్చు**
**జీవజడత్వ విచ్ఛిన్నంబు నందవలయు**
**పగలు రేయను కాండపటముల మాటున**
**మఱుగైన శక్తిని యెఱుంగవలయు**
**తే॥గీ. అదియోంకార మీవని యరయవలయు**
**బిందు నాదంబు కళయందు బెట్టవలయు**
**ప్రకృతి జీకటియను తెరబాయవలయు**
**నీవు నీవైన చోటులో నిలువవలయు**

**బ్రహ్మర్షి డా॥ ఉమర్ అలీషా (షష్ఠమ పీఠాధిపతి)**

ఈశ్వర తేజోరూపమైన ఈ సద్రూప ధ్వనిని (ఓంకారము) నీ అంతరమందు నీవు సాధనారూపంలో, సద్గురు ఆలంబనతో గ్రహించి, చూచి, వినగలవు.

క్షాళనమైన తేజస్సు నుండి 'ఓం'కార రూపమైన ఈశ్వరాణువు తెగి, సృష్టిగా మారి జగద్రూపమై, శూన్యంలో కలిసి, మానవాకారమైన విశ్వరూముగా మారి, మానవజన్మగా వచ్చి, మానవాకారంలో 'నేను'గా ధ్వనించుచున్నది. ఈ నేను తిరిగి సద్గురుని ఆశీస్సులతో జగద్రూపముగా మారి (స్వయంభూ తేజస్సు) క్షాళనమైన "నేను" అనే సద్గురు స్వరూపముగా మారి సాయుజ్యము పొందుచున్నది. తురీయాతీతమైన ఈ తేజస్సునే వేదఋషులు అణువుగా దర్శించి **"నీవారశూక వర్తన్వీ పీతాభా స్వత్యణూపమా"** అన్నారు.

దీనినే జీసస్ మంటలాగ చూశారు.

మహమ్మదు ప్రవక్త మేరాజ్‌లో చూశారు.

శ్రీకృష్ణుని విరాడ్రూపమూ ఇదే

ఇదే పరంజ్యోతి, ఆపోజ్యోతి, ఇదే ఈశ్వర సాక్షాత్కారము.

ఓం ఓం ఓం

# ప్రణవము

**– బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు,** కాకినాడ.

ఆత్మ యొక్క సంకల్ప విశేషణం చేత ఒక ఆశ్రమం కాని, ఒక వ్యవస్థ కాని కాల పరీక్షకు తట్టుకొని ఈ భూమ్మీద మహాత్ములు ఎటువంటి సంకల్పం చేశారో అటువంటి సంకల్పాన్ని వ్యాప్తి చేయడం కోసం ఆ సందేశాన్ని అందించడం కోసం అలా నిలబడగలుగుతుంది.

అలా వంద సంవత్సరాలు పై చిలుకు కాలగతిలో నిలబడి వూన్చుకొని ఈ శాంతి ఆశ్రమం ఇంతమందికి దివ్య సందేశాన్ని అందించగలుగుతోంది. ప్రేమైక జీవనాన్ని అందించగలుగుతోంది. ఇంతమంది మహానుభావులు ఆ ఓంకారస్వామివారు అందించినటువంటి పరమ ప్రయోజనాత్మకమైనటువంటి సందేశం ఏది ఉందో, దాన్ని అందుకొని ఆ మార్గాన్ని అవలంబించగలుగుతున్నారు అంటే, వారి యొక్క తపస్సు, వారి యొక్క సత్సంకల్పం. నూరు సంవత్సరాలు దాటినటువంటి సందర్భాన్ని పురస్కరించుకొని చేస్తున్నటువంటి ఉత్సవాలలో ఈ సంవత్సరం ఈ ప్రసంగం ద్వారా నేను కూడా పాల్గొనగలగడం నాకు అత్యంత ముదావహమైనటువంటి విశేషం.

ప్రణవం లోపల్నుంచి వస్తుంటుంది. అది పరబ్రహ్మము ఎక్కడ వుంటాడో అక్కడ్నుంచి శబ్దం ఒకటి ఉత్పన్నమవుతుంది. "ఆయన ఒకటి", "నాదమొకటి", "ప్రణవమొకటి" కాదు సుమా! 'ప్రణవోపాసన' చేయుట అంటే, ఉపాసన అన్న మాటకి అర్థం ఏమిటంటే, దగ్గరగా కూర్చోవటం. ఆయన ఉపాసకుడండీ అంటారు. 'ఆసన' అంటే కూర్చోవడం. 'ఉపాసన' అంటే దగ్గరగా కూర్చోవటం. అంటే, పక్కన కూర్చోవటం కాదు. "దగ్గరగా ఆలోచన చేస్తూ ఉండటం, ప్రణవోపాసనము అంటే 'ఓం కారమును" గూర్చి బహు భంగిమల ఆలోచించుట. అది అదే పనిగా అంటే 'ఓంకారమును' గూర్చి బహుభంగిమల ఆలోచించుట. అది అదే పనిగ ఎవరు ఆలోచిస్తారో, అలా ఆలోచించినవాడు యోగియై అదే లోకమునందు కనబడుతుంది.

**"యోగరతోవా భోగరతోవా, సంగరతోవా సంగవిహీనః,**
**యస్య బ్రహ్మణి రమతే చిత్తం, నందతి నందతి నందత్యేవ". (భజగోవింద స్తోత్రం)**

అంతటా "ప్రణవమే", ప్రపంచమంతట ప్రణవాకారం అయిపోతుంది. చివరకు తానేమైపోతాడు. ప్రణవమే అయిపోతాడు. అందుకే ఆయన పేరేమిటో ఎవ్వరికీ తెలీదు. నేను వస్తూ అడిగా, ఆయన ఋషీకేష్‌లో అక్కడ గట్టిగా ప్రణవం చెప్తూండేవారట, ఎప్పుడూ ప్రణవమే, నేను విన్నది ఒకసారి వైద్యశాలలో వుండి కూడా ప్రణవమే, ఎప్పుడూ ప్రణవం, ప్రణవం, ప్రణవం పకలడమే. అంతట కోకిల పలికినా ఏది పలికినా ఆయనకు ప్రణవమే వినపడేది. ప్రణవంగా జగత్తుని చూసేవారు. అలా చూడడం వల్ల ఏమైపోయిందంటే యదార్థంగా ఆయన పేరు ఏం పెట్టారో తెలీదు. సన్యాసాశ్రమం తీసుకుంటే తల్లిదండ్రులు పెట్టిన పేరు పోయి దీక్షానామం వస్తుంది. దీక్షానామమేమిటో తెలీదు. ఆయన పేరేమయ్యిందంటే "ఓంకార స్వామి" గారైయింది. ఆ స్థాయికి వెళ్ళారు కాబట్టే ఆయన పెట్టిన ఆశ్రమంలో ఆ శక్తి నిలబడింది. కాబట్టే శత సంవత్సరములు దాటిపోయినా ఆశ్రమం అలాగే చెక్కు చెదరకుండా ఉండి, భక్తులందరికీ అనుగ్రహ సందేశాలను అందిస్తూనే ఉంది. అంతటి పరమ పవిత్రమైనటువంటి

స్థితిని మహానుభావులు పొందారంటే, నాదముగా, శబ్దముగా, ఊపిరిగా, ప్రణవముగా, పరబ్రహ్మముగా ఆయన లయమైపోయి, అంతటా నిండి నిబిడీకృతమైపోయారు. అప్పుడు ఇంకా ఏదో పరిమితి అన్నమాట ఉండదు. గది గోడని పగులకొట్టేస్తే, అంతా ఏకమైపోయినట్లుగా, ఆయన శరీరము పతనమైపోయిన తరువాత యోగి అంతటా నిండిపోతాడు. అందుకే శరీర పతనమైపోయేవరకు "బ్రహ్మము"ను దర్శించినప్పటికీ, శరీరముతో వుంటే, "జీవన్ముక్తుడు" అంటారు. శరీరములో ఉండి మోక్షమును పొందాడు అంటారు. అనంతమైనటువంటి ఆకాశంలా వ్యాప్తి చెందాడు. దీన్నే 'మోక్షము"ను పొందాడు అంటారు. ఇటువంటి మహానుభావుడు కాకినాడ పట్టణమునకు దగ్గరలో అంత గొప్ప ఆశ్రమమునకు నిర్మాణం చేయడం, వారి పేరు మీద సభలు జరగడం, ఆ సభలలో పాల్గొని నేను దాన్ని గురించి మాట్లాడడం, ఆయన అనుగ్రహం తప్ప వేరొకటి కాదు. కాబట్టి ఆ'ప్రణవ' మనేటటువంటి దాని ఉపాసన చేయగా చేయగా తెలుస్తుంది తప్ప, నిజానికి దాని గురించి వివరణ చేయడం ఒకరోజులో చేసేది కాదు. రెండు రోజుల్లో చేసేది కాదు. చాలా గంభీరమైనటువంటి విశేషం కానీ స్పృశించమన్నారు. కాబట్టి పెద్దలు అటువంటి ఆశ్రమానికి వచ్చి కాదనడం ఎందుకని దాన్ని గురించి స్పృశించాను. అందుకే గీతాచార్యుడు ఒక మాటంటాడు. ఎక్కడో ఎవరో ఆ ఒక్క అక్షరమైనటువంటి "ఓంకారము"ను ఉపాసన చేసినవాడు పునరావృత్తి లేని స్థితికి వెళ్ళిపోతున్నాడు అని తీర్పు చెప్పాడు గీతలో.

(శ్రీ శాంతి ఆశ్రమ శతాబ్ధి ఉత్సవాల సందర్భంగా తేది 30.11.2016న కాకినాడ శాఖలో ఇచ్చిన సందేశం నుండి ఒక చిన్నభాగం ప్రచురిస్తున్నాం.)

* తమ హృదయములను ప్రేమతో పూర్ణముగా నింపి, భక్తితో నిరంతర నామస్మరణతో, బాహ్య జగత్తును మరచి, తమ అంతరాంతములో నున్న అఖండ సచ్చిదానంద సాగరములో ప్రవేశించగలిగినచో దివ్యజ్యోతి దర్శనము లభించి పరిపూర్ణత్వము నొందగలరు.
* కేవలము పెదవులు కలిపి ప్రార్థన పఠించినంత మాత్రాన భగవంతుని సన్నిధి పొందుట అసాధ్యం. మనస్సు కరిగి ఆత్మలో లీనమైనపుడే ఆ దివ్యజ్యోతిని దర్శింపగలము.
* మానవులందరూ ఒకే విధమైన సృష్టియైనను, వారి వారి సాధనా తీవ్రతను బట్టి ఆత్మవిదులుగా వుండి బ్రహ్మ సాక్షాత్కార భాగ్యము పొందుదురు.

# తమ సర్వస్వమును విశ్వశాంతి కొరకు సమర్పించిన శ్రీ ఓంకారస్వామీజీ

**– శ్రీ విజ్ఞానానందగిరి మాతాజీ**, వంగలపూడి

పరమ పూజ్య శ్రీ ఓంకార గురుదేవుల పాద పద్మములకు హృదయపూర్వక శిరసావందనములర్పిస్తూ పూజ్యశ్రీ శ్రీశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీవారికి శిరసా నమస్కరిస్తూ పరమ పూజ్య ఓంకారస్వామివారు 1917వ సంవత్సరములో విశ్వశాంతి కొరకు వారు స్థాపించిన శాంతి ఆశ్రమము. 2017వ సంవత్సవరములో శతవత్సర మహోత్సవములతో స్వామీజీ ధ్యేయమైన విశ్వశాంతి లక్ష్యాన్ని చేరుకున్నట్లు సంతోషిస్తున్నాను. ఈ శత జయంతి ఉత్సవములు ఆశ్రమమునకో, గ్రామమునకో, మండలమునకో, జిల్లాకో, దేశమునకో కాక యావత్ ప్రపంచ మానవులు, మానవేతర ప్రాణికోట్లకు సంబంధించిన మహాభాగ్యముగా తలుస్తున్నాను.

భారతదేశము నందలి అన్ని రాష్ట్రములలో గల ఆశ్రమములు, పీఠములు, మఠములు, దేవాలయములు మొదలగు అన్ని ఆధ్యాత్మిక కేంద్రముల నుండి చిన్న పెద్ద తారతమ్యము లేకుండా అందర్ని ఆహ్వానించి ఆదరించి వారిచే ప్రవచనములగావించిన విధానములు. శ్రీ ఓంకారస్వాములు వారే అందరి యందు అన్నిటి యందు దర్శిస్తున్నట్లున్నది. పరమపూజ్య జ్ఞానేశ్వరి మాతాజీవారు శ్వేతవస్త్రధారులై మౌనముద్రలో వుంటారు. ఆయమ్మను దర్శించినవారికి శాంతి దూతగా శాంతి ప్రదాతగా అనుభూతమౌతుంది.

**"యేనజాతేన జాతి సమున్నతింయాతి"** – ఎవని పుట్టుక చేత లోకం ఉద్ధరింపబడుతుందో సజాతః – వాడు నిజంగా పుట్టినవాడు. అట్టివారిని లోకం గౌరవిస్తుంది. పూజిస్తుంది. ఆరాధిస్తుంది. నిరంతరం స్మరిస్తుంది. వారి జయంతి ఉత్సవములను శతాబ్ది ఉత్సవములను వారి ఆరాధనలను జరుపుకొంటుంది. ఇట్టి కోవకు చెందినవారు శ్రీ ఓంకార స్వాములవారు. మన స్వాములవారి జన్మచేత లోకం ఆధ్యాత్మికంగా చైతన్యవంతమై ఆనందిస్తుంది. ప్రస్తుతం వారు మన ముందు లేకపోయినా వారి స్మృతులు చైతన్యవంతములై ఉత్తేజపరస్తున్నవి. కాబట్టి వారి ఈనాడు భక్తులు శిష్యులు పెద్దఎత్తున వారి శతాబ్ది మహోత్సవాలను జరుపుతున్నారు. ప్రతి సంవత్సరము వారి జయంతులను, ఆరాధనలను విశేష కార్యక్రమములను నడుపుచున్నారు.

శ్రీ శాంతి ఆశ్రమ శతాబ్ది మహోత్సవాలు శ్రీ పరమేశ్వరుని దివ్యానుగ్రహము చేతను, లోకపావన తత్పరులగు మహర్షుల చేతను. శ్రీ సద్గురు దేవుల కృపాకటాక్ష వీక్షణముల చేతను దివ్యాంగాభవ్యంగా జరిగి లోక కళ్యాణమునకు కారకములగును గాక!

**ప్రార్థన ప్రాముఖ్యత అద్వితీయమైనది. మానవుడు దైవముతో గావించు సంభాషణకు కావలసిన పరిభాషయే ప్రార్థన.**

# శ్రీ శాంతి ఆశ్రమము భూలోక కల్పతరువు

– **శ్రీ నిర్విశేషానందగిరి మాతాజీ** , వంగలపూడి

పరమ పవిత్రమైన ఈ భారతావనిలో ఎందరో ముక్త పురుషులు జన్మించియున్నారు. అటువంటి మహాత్ములలో ఒక సత్పురుషుడు శ్రీ ఓంకార స్వామీజీ.

ప్రతి జీవిలోను పరమాత్మ స్వరూపమును దర్శించుచు, తనలోని ప్రేమను విశ్వప్రేమగా మార్చి సర్వసృష్టిని తన స్వరూపముగా భావించి, తాను తరించి ఇతరులను తరింపజేసిన మహా యోగీశ్వరులు పూజ్యశ్రీ ఓంకార స్వామీజీ. భక్తులకు, సాధకులకు, సజ్జనులకు, జిజ్ఞాసులకు, సర్వులకు శాంతి లభించవలెనని భక్తి వైరాగ్యములను బోధించి, దైవ సాక్షాత్కారమును పొందింపచేయవలెనని శ్రీ స్వామీజీ వారి సంకల్పము. వారి సంకల్పమునకు అనుగుణముగా ఒక ఆశ్రమమును నిర్మాణము చేయవలెనని వారి ఆశయము. ఏదైనా లోక కళ్యాణము చేయవలెననినా తపస్సు చేసి దైవానుగ్రహమును పొందాలి. తపస్సు చేతనే మానవులు పునీతులు కాగలరు. శ్రీ స్వామీజీ తోటపల్లి కొండలలో అతి కఠినమైన దీక్షతో కీకారణ్యములో అనేక సంవత్సరాలు. **"నభూతో నభవిష్యతి"** అనునట్లుగా తపస్సు చేసి దైవానుగ్రహమును పొందిరి. వారు పొందిన శాంతి, ఆనందములను సర్వులకు ప్రసాదింపచేయు నిమిత్తము శ్రీ శాంతి ఆశ్రమము స్థాపించిరి. శ్రీ శాంతి ఆశ్రమము భూతల స్వర్గము. దేవలోకములో ఉన్న కల్పవృక్షము కోరిన కోర్కెలు మాత్రము తీరుస్తుంది. ఇక్కడ ఈ శాంతి ఆశ్రమము శాంతి సౌఖ్యములతో పాటు జ్ఞానామృతమును కూడా ప్రసాదిస్తుంది. ప్రతి వృక్షచ్ఛాయలో ప్రశాంతముగా కూర్చొని ధ్యానము చేసుకోవడానికి అనుకూలముగా ఉన్న రాతి దిన్నెలు చూస్తుంటే శ్రీ స్వామీజీ ధ్యానమునకు ఎంత ప్రాముఖ్యము ఇచ్చేవారో అర్థమౌతుంది.

ప్రతి సంవత్సరము శ్రీ స్వామివారి జన్మదినమును మహాపర్వదినముగా భావించి వేలాదిమంది భక్తులు ఆశ్రమమునకు వచ్చి శ్రీ స్వామివారిని దర్శించుకొని వారి జన్మదిన సందేశమును శ్రవణము చేసి, ఆ జ్ఞానోపదేశములను హృదయములలోని నింపుకొని, శ్రీ స్వామివారి తపఃఫలితముగా వారి వాక్కు ద్వారా వెలువడిన లోకశాంతి ప్రార్థనను పదే పదే స్మరించుకొనుచు, తమ జీవితములను ధన్యము చేసుకొన్న మహాభక్తులు ఎందరెందరో ఉన్నారు. **"సాధూనాం దర్శనం పుణ్యం"** అన్నట్లుగా జ్ఞానచిహ్నముగా, సంపూర్ణ వైరాగ్యముతో ధరించిన కాషాయాంబరముతో, వారి అపూర్వ త్యాగ ఫలితముగా లభించిన చేతికఱ్ఱ నూతగా గైకొని, సృష్టిలో ఉన్న ప్రతి ప్రాణిని ప్రేమగా చిరునవ్వుతో పలకరిస్తూ సర్వులకు శాంతిని ప్రసాదిస్తున్న ఆ దివ్య మంగళమూర్తిని దర్శించుటే భక్తులకు ఎన్నో జన్మల పుణ్యఫలము.

సాధు మహాత్ములు ఫలవృక్షములవంటివారు. తాము ఆశించకుండా సర్వులకు ఫలముల నొసంగు మహావృక్షముల వలె, సాధు సజ్జనులు, మానావ మానములు నిందాస్తుతులను సమానముగా భావించి లోకమునకు సేవలందిస్తారు. వ్యక్తి శాంతియే లోకశాంతి, పక్షులు ప్రార్థిస్తున్నవి. సముద్రము ప్రార్థిస్తుంది. పంచభూతములు ప్రార్థిస్తున్నవి ఓ మానవుడా! నీవేల ప్రార్థించవు? అని తమ దివ్యబోధలచే సర్వుల మనస్సులను దైవము వైపు మరలింపజేయుచు ప్రతిశ్వాసలోను పరమాత్మను ప్రార్థిస్తూ లోకశాంతిని

కోరుతున్న ఋషీశ్వరులు స్వామీజీ. అనేక సంవత్సరములు అవిరామముగా కృషి చేసి, భూతల స్వర్గధామముగా తీర్చిదిద్దిన శ్రీ శాంతి ఆశ్రమములో మానవాళికి లభించేది శాంతి స్వరూపము మరియు ఓంకారనాదము. ఇవియే మోక్షమునకు ద్వారములు.

పరమపూజ్యశ్రీ ఓంకార స్వామివారు జీవన్ముక్త స్వరూపులు. తమ జ్ఞానమును, శాంతిని, తమ ఓంకార స్వరూపమును ఆశ్రమమంతా వెదజల్లి పరమాత్మలో విలీనమైనారు. వారి సేవకై ఈ లోకమునకు వచ్చిన శ్రీ శాంతిమాత వారి సేవ పూర్తి కాగానే వారి పాదపద్మముల దివ్య సన్నిధికి చేరుకొన్నారు. **"గురుసేవ యాప్రాప్స్యసిసర్వం"** అను వాక్యమే ఆ తల్లి జీవితము.

పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ స్వామీజీవారి అడుగుజాడల ననుసరిస్తూ అతి విశాలమైన ఆశ్రమ బాధ్యతలను సక్రమముగా జరిపిస్తూ భక్తులందరికి ఆనందోత్సాహములను కలిగిస్తూ, జ్ఞానముతో పాటు శారీరకముగా ప్రాప్తించిన వార్ధక్యమును దివ్యవరముగా భావిస్తూ తన త్యాగమయ జీవితమును పునీతము చేసుకొంటూ శాంతిగా జీవితమును గడుపుచున్నారు. నిత్యము పూజా, పారాయణలు, సత్సంగములు, లోకశాంతి ప్రార్థనలతో ఆశ్రమమంతా కళకళలాడుచు భక్తులకు శాంతి ఆనందములు ప్రసాదిస్తుంది.

పూజ్యశ్రీ మాతా వినమ్రానంద సరస్వతీవారు తన సహజస్వభావమైన విద్యావినయ వివేకములతో, సర్వులను ప్రేమతో పలుకరిస్తూ మాతాజీవారి యందున్న భక్తి గౌరవములతో ఉత్తరాధికారిణిగా తమ బాధ్యతలు సక్రమముగా నెరవేరుస్తూ, మాతాజీవారి సంకల్పములను చక్కగా రూపొందిస్తూ మరికొందరు జిజ్ఞాసులకు శిక్షణ ఇస్తున్నారు.

మేము కూడ కొంతకాలము శ్రీ శాంతి ఆశ్రమములో పవిత్ర జీవితము గడుపుట పుణ్య విశేషము. అదియే మాకు శ్రీ శాంతి ఆశ్రమముతో శ్రీ మాతాజీలతో ఉన్న అనుబంధము. పూజ్యశ్రీ ఓంకార స్వామీజీ వారి దివ్యానుగ్రహముతో ఆశ్రమ శతాబ్ది ఉత్సవాలు జయప్రదముగా జరుగవలెనని హృదయ పూర్వకముగా కోరుకుంటున్నాము.

అక్షర రూపమైన ఈ చిన్ని పుష్పమును కల్పతరువైన శ్రీ శాంతి ఆశ్రమమునకు సమర్పించుకొంటూ ఈ అవకాశమును మాకు కల్పించిన పూజ్యమాతలకు కృతజ్ఞతలు తెలుపుకొంటు పూజ్యశ్రీ ఓంకార యతీంద్రుల దివ్యానుగ్రహము మాపై కలుగవలెనని సదా ఆశిస్తూ, దైవస్మరణతో ఈ వ్యాసము పూర్తి చేస్తున్నాము.

హరిః ఓమ్

**జీవన యాత్ర విజయవంతము, ఆనంద దాయకము కావలెనన్న ఆత్మ విశ్వాసము, ధైర్యము ముఖ్య సాధనములుగా చేసుకొనవలెను.**

# శాంతి నిలయం

- స్వామిని సేవానంద
చిన్మయ మిషన్, తెనాలి

శాంతాశ్రమమే శాంతి నిలయం. ఓంకారస్వామి వారి దివ్య తపఃశక్తి తరంగాలు ఆశ్రమానికి వచ్చిన వాళ్ళందరికి శాంతి కిరణాలుగా అందరి మనసులలో ప్రసరిస్తూ వుంటాయి.

శాంత్యాశ్రమం ఒక కల్పవృక్షం. ఎలాంటివారికైనా ఆశ్రయమిచ్చే దివ్యలోకమే శాంతి ఆశ్రమం. వశిష్ఠ మహర్షి లోక కళ్యాణార్ధం కృషి చేసినట్లే. ఓంకారస్వామివారు అపర వశిష్ఠులుగా లోక శాంతికై అవతరించినవారు. వారి తపశ్శక్తితో, పాదస్పర్శతో పునీతమైనది శాంతి ఆశ్రమం. మన భారతదేశంలో వున్న క్షేత్రాలకు గాని, నదులకు గాని, మహిమను పవిత్రను తెచ్చినది ఋషులే కదా! ఆ పవిత్ర తరంగాలు వేల సంవత్సరాలు గడిచినా మనకి అందుతూనే వుంటాయి. అలాగే శాంతి ఆశ్రమంలో స్వామివారి తపఃశక్తి తరంగాలు ఆశ్రమమంతా వ్యాపించి ఉండటం వల్ల మనం ఆశ్రమంలోకి రాగానే శాంతి తృప్తి, ఆనందం కలుగుతాయి.

జ్ఞానేశ్వరి మాతాజీవారు గురువుగారి అడుగుజాడలలో నడుస్తూ అందరికి ఆదర్శమై, హృదయం నిండిన ప్రేమతో వచ్చిన వాళ్ళందరికీ పంచి ఇస్తుంటారు. కాని తరగదు. సముద్రంలో నీళ్ళు ఎన్ని తోడిన తరగనట్లు మాతాజీ హృదయం ప్రేమ సముద్రం. అది తరగని ప్రేమ. నిష్కల్మషమైన ప్రేమ. గోపికలు పొందిన మధుర ప్రేమ. దానికి భగవత్ చింతనాసక్తులై (వశవర్తులై) అందరూ ఆ దివ్యత్వాన్ని పొంది, ఆత్మానందంలో ఓలలాడాలన్నదే ఆ ప్రేమ పరమార్ధం. ఈ చిరు అక్షర పుష్పాన్ని సద్గురు పాదపద్మములకు అర్పిస్తూ...

- **కాలమనెడి సర్పము మృత్యువనెడి నోరు తెరచి స్వార్ధపరులను, సోమరులను మ్రింగివేయుటకు వేచియున్నది.**
- **మాటలు పోరాటమునకు దారి తీయును. ధ్యానము ఆత్మ సాక్షాత్కారమును పొందించును.**

# అద్వితీయ ఆరామము

- స్వామిని శ్రుతానంద
చిన్మయ మిషన్.

శ్రీ శాంతి ఆశ్రమము శతాబ్ది వేడుకల సందర్భముగ ఆశ్రమ వాతావరణములో నూతన ఉత్సాహము వెల్లివిరిస్తున్నది. ఆశ్రమము ఎందరో సాధకులకు, నేటి మహాత్ములకు ఆశ్రమము అండగా నిలిచియున్నది. ఆశ్రమము పేరు తలవగానే హృదయములో ఎంతో శాంతి మరియు పరమపూజ్య జ్ఞానేశ్వరి మాతాజీ వారి చిరుమందహాస వదనము ప్రేమ భరితమైన వారి దృష్టి మదిలో మెదలును. శ్రీ శాంతి ఆశ్రమ ప్రార్థన 1992 సం॥రం॥ చిన్మయారణ్యములోని గ్రంథాలయములో బ్రహ్మచారి శిక్షణలో పూజ్య శారదమాతాజీ వారి దగ్గర ఉన్నప్పుడు మొదటిసారిగా చూసాను. మనసులో తెలియని ఆనందము, ఉపనిషత్తులసారము ఇదే కదా అని భావించాను. అప్పుడే బ్రహ్మచారిగా యశోదగారు కూడ శిక్షనకై చిన్మయారణ్యమునకు పూజ్య జ్ఞానేశ్వరి మాతాజీ మరియు పరమపూజ్య చిదానంద మహారాజ్ వారి ఆశీస్సులతో రావడము జరిగినది. **పరమపూజ్య శారదాప్రియానంద అమ్మగారు తరచుగా "ఓంకార స్వామివారి గురించి సత్సంగములో చెప్పడము ఈ చిన్మయ అరణ్యము వారి దివ్యప్రేరణ వలన సద్గురు చిన్నయానంద మహారాజ్ వారి అనుగ్రహముతో ప్రారంభింపబడినది" అనేవారు.** ఒకసారి శిక్షణలో ఉండగానే పూజ్య జ్ఞానేశ్వరి మాతాజీ చిన్మయారణ్యమునకు విచ్చేసినారు. మాతాజీవారు పూజ్య అమ్మను మా అందరిని ఉద్దేశించి సత్సంగములో మాట్లాడమన్నారు. అమ్మ మొదట నిరాకరించినారు. తరువాత శారదా ప్రియానంద మాతాజీ (మా గురువుగారు) మాటను మీరలేక మూడుసార్లు ఓంకారముతో మొదలయిన వారి ప్రవచనము దాదాపు అరగంట సేపు అందరి హృదయాలపై చెదరని శాంతి ముద్రవలె వ్యాపించినది.

పూజ్య శారద ప్రియానంద మాతాజీవారు 1997 సం॥న శ్రీ శాంతి ఆశ్రమములో 'బ్రహ్మ సదస్సు' ఆశ్రమములో శిక్షణ పొందిన ఆచార్యులకై నిర్వహించినారు. అప్పుడు మొదటిసారిగా శాంతి ఆశ్రమమునకు రావడము జరిగినది. ఎంతచూచిన తనవి తీరదు. ప్రతిచోట సూక్తులు మనస్సును కట్టి పడవేస్తాయి. ప్రతి వాక్యము కూడ ఉపనిషత్తుల సారము. బ్రహ్మ సదస్సులో భాగముగ పూజ్య ఓంకారస్వామివారికి చిన్మయానందుల వారికి శారదా ప్రియానంద అమ్మగారు, జ్ఞానేశ్వరి అమ్మగారు ఇద్దరు కలసి పూజ చేశారు. ఆ వైభవము ఎప్పటికి మరవలేము. మూర్తీభవించిన ఉత్కృష్టమైన ప్రేమ స్వరూపము సాధకులందరికి ఇక్కడ గడిపిన రోజులను హృదయములో స్మరించినంత మాత్రమున. "ఉఛ్వాస నిశ్వాసలో శాంతిని నిలుపుకొనుము" అన్న స్వామి మాట హృదయములో మెదులును.

దేశ విదేశాలలో ఆధ్యాత్మిక చరిత్రలోనే ఇటువంటి ఆశ్రమము మరెక్కడా మనకు కన్పించదు. అన్నిమతములవారికి, ఎవరు ఏ స్థాయిలో సాధన చేస్తున్నవారైనా సరే వారందరిని ఒకే దివ్య స్వరూపముగ, ప్రేమగ ఆదరించే పరమపూజ్య జ్ఞానేశ్వరి పాద పద్మాలకు హృదయ పూర్వక వందనాలతో ...

# శ్రీ శాంతి ఆశ్రమం

- **స్వామిని విచార స్వరూపానంద**, శ్రీ శాంతి ఆశ్రమం.

శ్రీ శాంతి ఆశ్రమం 1917 సం॥లో ఓంకార గురుదేవుని ద్వారా స్థాపితమై, ఇప్పుడు శతజయంతి జరుపుకుంటున్నది. ఈ శుభ సమయమున మూలకారకులైన ఆ గురుభగవానుల స్మృతులను గుర్తు చేసుకోవటం నా పూర్వ జన్మ భాగ్యము.

శ్రీ గురుదేవుల ఆధ్యాత్మిక తపోసన్నిధి యొక్క శక్తి వలనే ఈ స్థలము అందరినీ ఆకర్షించింది. శాంతి ఆశ్రమము గొప్పతనము, తోటల అందాలు, అద్భుతాలు అన్నీ ఓంకారుల అద్భుతమే. వారికన్న ముందు ఇలాంటి సంస్థ కాని, వ్యవస్థ కాని లేదు.

శ్రీ గురుదేవులు తమ సన్నిధికి ఎవరు వచ్చినా "ఇది మీ ఆశ్రమము" అని పలుమార్లు చెప్పి స్వాగతించేవారు. పొరపాటుగా ఎవరైనా ఆహారము స్వీకరించక వెళ్ళిపోయిన, తాను ఉపవసించేవారు. (తనకు తానే స్వయంగా శిక్ష వేసుకునేవారు).

గురుదేవుని బోధనా పద్ధతి అంతా ఆచరణాత్మకమైనది. మౌనంగా అన్నీ జరిగేవి. వారు ఆచరించే వారు కూడా తోటపల్లిలో మాత్ర ఆశ్రమమే కాక ఇంకా నాలుగు శాఖలు కలవు. అవి కాకినాడ, పిఠాపురం, విశాఖపట్నం, కోటగిరి (నీలగిరి కొండలు). విశాఖపట్నం ఆశ్రమంలో మూగవారికి ప్రత్యేకంగా విద్యాసంస్థ పెట్టించి సేవ చేస్తున్నారు.

ఆ మహానుభావునకు అర్హులైన శిష్యులుగా వుందామని ప్రార్థిద్దాము. వారు నడచిన బాటలోనే నడుద్దాము. నిజమైన శిష్యుడు, గురువు నిర్దేశించిన, ఆచరించిన మార్గంలో నడవాలి. తపస్సాధన, త్యాగాన్ని గురుదేవుని హృదయములో ఎల్లప్పుడూ రగులుతూ వుండేది. వారి దృష్టిలో ఈ ఆశ్రమాలు వారివి కావు. అంతా భక్తులు కొరకే. ఎంతో వైరాగ్యంతో వచ్చారు. అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచేరు, తపస్సు చేసేరు.

ఈ ఆశ్రమ నిర్వహణ ఓ అద్భుత కార్యక్రమము. సాధు సన్యాసులకు ఇలాంటి బ్రహ్మాండమైన ఆశ్రమాలను నిర్వహించే అవసరం లేదు. వారికి ఇలాంటి సంస్థలలో ఆసక్తి ఏమీ వుండదు. "అని ఈ ఆశ్రమ గౌరవాధ్యక్షులు శ్రీ చిదానంద స్వాములవారు అన్నారు. ఇంకొక మాట కూడా సెలవిచ్చారు. ఈ మహా గురువుల వెనుక ఏదో మహత్తరమైన, అనిర్వచనీయమైన దైవశక్తి ప్రభావం ఉందన్న విషయం సాధన చేసినవారికి అనుభవంలోనికి వస్తుంది. గురుదేవుల సాన్నిధ్యం, ఆధ్యాత్మిక ఔన్నత్యం కంటికి కనిపించదు. అది సజీవం అన్న విషయం సాధకులకి తెలుస్తుంది."

# శ్రీ శాంతి ఆశ్రమ ఓంకార స్వాములవారు

– **శ్రీ లక్ష్మణస్వామి**, ఎరుకంపాలెం.

పరమపూజ్య శ్రీ ఓంకార స్వాములవారు మనపాలిట నడియాడే దైవము శ్రీ స్వాములవారి సుశిక్షణలో మలచబడిన పూజ్యశ్రీ జ్ఞానేశ్వరీ మాతాజీవారు నడియాడే దేవత, శ్రీ శాంతి ఆశ్రమము ఆంధ్ర దేశానికి ఆంధ్రేతర రాష్ట్రములకు విదేశములకు కూడా పుట్టినిల్లు.

శ్రీ స్వాములవారిచే స్థాపించబడిన శ్రీ శాంతి ఆశ్రమ ముఖ్య ఆశయము విశ్వశాంతిని నెలకొల్పవలయునని, శ్రీ స్వాముల శాంతి ప్రార్థన ద్వారా వ్యక్తమగుచున్నది.

ఆశ్రమ ప్రాంగణ సూక్తులలో శాంతి మానవుని జన్మహక్కని చెప్పినమాట, శ్రీ స్వాములవారి జీవితానుభవము. మానవ జీవితంలో శాంతి మినహా ఏమి వున్నను నిష్ప్రయోజనం. శాంత గుణముగల వ్యక్తియే శాంతిని పంచగలడు. అందువలననే శ్రీ స్వాములవారు, తోటపల్లి విశాఖపట్నం కోటగిరి, కాకినాడ, తుని, పిఠాపురం మొదలగు చోట్ల శాంతి ఆశ్రమ అనుబంధ శాఖలను నెలకొల్పిరి.

1995 సం॥లో పూజ్యశ్రీ ఓంకార స్వాములవారి శతజయంతి ఉత్సవములలో శ్రీ శాంతి ఆశ్రమంలో మూడు రోజులు వుండి మా గురుదేవులైన పూజ్యశ్రీ నిర్విషయానందగిరి స్వాములవారికి, కేశవదాసుపాలెం శ్రీ బ్రహ్మానంద స్వాములవారికి సేవ చేసుకొనే భాగ్యం కలిగినది. ఇప్పుడు ఇరవై సంవత్సరముల తరువాత ఆశ్రమ శతజయంతి సంచికలో పూజ్యశ్రీ ఓంకార స్వాములవారు శ్రీ జ్ఞానేశ్వరీ మాతాజీవారు ఈ లోకానికి చిరకాలము అందించిన సేవలను స్మరించుకొనే సదావకాశం కల్గినది.

* **తిరిగి మానవజన్మ లభించునో లేదో చెప్పజాలము. కర్మభూమిలో లభించునో లేదో చెప్పలేము గదా! గావున భగవంతుడిచ్చిన యీ సదవకాశమును అందరూ సద్వినియోగం చేయుటకు నిత్యం ప్రయత్నించెదరు గాక!**
* **మనదేశమునకు, శాంతి ఆశ్రమమునకు మంచిపేరు ప్రతిష్ఠలు సంపాదించుటకు ప్రయత్నము చేయువారు. (అమూల్యమైన) మానవజన్మ గమ్యస్థానమును మరువనివారు.**

# "శాంతి దూత" నేను సైతం

**- స్వామి హరిహరానంద భారతి**

శ్రీ శాంతి ఆశ్రమం.

పరమ పూజ్య స్వామి ఓంకార్‌జీ మహరాజ్ పాద పద్మములకు నమస్కారములు చేసుకొనుచూ వ్రాయుచున్నాను.

ఎందరో మహానుభావులు శాంతి అనబడే ఆయుధంను చేబూని ఈ సకల జగత్తును విశ్వశాంతి ఆలయంగా రూపుదిద్దారు. వారిలో మదర్ థెరిసా, గాంధీ మహాత్ములు, మహర్షులు ఎందరో.

ఏ ఒక్కరినీ, ఏ మార్గం నందు అయినా ప్రయాణించిన వారిని చూడగా అకుంఠిత దీక్ష, అఖండ సంకల్పబలం, ఇవే దైవీగుణ సంపత్తిగా వెలయుచున్నవి.

**ఉత్తిష్ఠత జాగ్రత్త ప్రాప్యవరాన్ని బోధత।**
**క్షురస్యధారా నిశితా దురత్యయా**
**దుర్గం పథస్తత్కవయో వదన్తి॥**
**అశబ్దమ స్పర్శ మరూప మవ్యయం**
**తథా రసం నిత్యమగన్ధ వచ్చయతౌ।**
**అనాద్యనన్తం మహతః పరంధ్రువం**
**నిచాయ్య తన్మృత్యు ముఖాత్ప్రముచ్యతే ॥**

ఉత్తిష్ఠ = లే మేల్కో. పరిస్థితులకు తలవొగ్గి, రాజీపడి, వారి శాంతి స్థితిని కోల్పోయి జీవించువారు కేవలం పశువులతో సమానం. ఎవరయితే శాంతి ఆయుధంను చేబూని శాంతి దూతగా తనను తాను మార్పు చెందించుకొని శాంతి ప్రసరణ చేయుదురో అతడే తనను తాను ఉద్ధరించుకొనిన వ్యక్తి.

సూర్యుని నుండి కిరణములు ఎలా వెదజల్లబడుచూ సర్వజగత్తుకూ కాంతి ప్రసరణ జరుగుతుందో, అలాగే జ్ఞానుల నుండి జ్ఞాన ప్రసరణ జరుగుతూ వుంటుంది. ప్రతి అణువు అణువు నందు ఈశ్వర తత్త్వంను నీవు దర్శించగలిగినట్లయితే ఆ శాంతి స్థితిలో వుందువు.

1. శబ్ధము నందు ఈశ్వరుడిని నిలిపినచో
   శబ్ధ రహిత స్థితిలో వుందువు.
2. దృక్కు నందు ఈశ్వరుడిని చూచినచో
   దృశ్య రహిత స్థితిలో వుందువు.
3. స్పర్శ మందీశ్వరుడిని చూచినచో
   స్పర్శ రహిత స్థితిలో వుందువు.
4. చలనం నందు ఈశ్వరుడిని చూచినచో
   చలన రహిత స్థితిలో వుందువు.

5. సంకల్పం నందు ఈశ్వరుండిని
గాంచినచో సంకల్ప రహితుడవై యుందువు.
6. ఉచ్ఛ్వాస నిశ్వాసములందీశ్వరుడిని గ్రహించినచో
ఈశ్వర స్వరూపుడవై వెలుయుదువు

గీతలో కూడా ఈ తత్త్వంను **"సర్వేంద్రియ వివర్జితమ్"** ఇంద్రియముల యొక్క గుణములను వదిలివేస్తే ఏమీ వుండదు. కేవలం ఈశ్వర తత్త్వం, నిర్గుణ తత్త్వం, శాంతి తత్త్వంమై వుండును.

శాంతియుత దయాగుణం ద్వారా ఓంకార స్వామీజీ అశాంతిలో వున్న వారికి శాంతి పంచుటకై శాంతి ఆశ్రమం నందు ఉన్న ప్రతి అణువు, అణువు నందు తన శాంతి కిరణముల శక్తితో నింపి మేల్కోల్పినారు. శాంతివనంగా, శాంతి ఆశ్రమంగా రూపుదిద్ది నూతన శాంతియుత జీవన శాంతి దళంను సృష్టించారు.

వనంలో వున్న మామిడి వృక్షం మౌనంగా నేను సైతం మామిడి ఫలాలు ఇచ్చుచూ సేవ చేయుచున్నాను. ఒక్క మామిడియే కాదు, వనంలో వున్న సమస్త వృక్షాలు నేను సైతం శాంతి ప్రసరణ చేయుచున్నాను. అని ఉత్తేజపరుచుచున్నవి మౌనంగా.

సూర్య భగవానుడు : నేను తేజస్సును. తేజస్సు నాలో ఉన్నది. నేను తేజోమయ స్వరూపుడిని అని శాంతి కిరణములతో అణువు – అణువు దివ్య కిరణముల ప్రసరణ చేయుచున్నాడు.

మరీ! జల దేవత – నేను సైతం
అగ్ని దేవుడు – నేను సైతం
భూదేవి – నేను సైతం
వాయుదేవుడు – నేను సైతం

"శాంతినే ఉచ్ఛ్వాస – నిశ్వాసములలో నింపుడు" అనే ఏకైక శాంతి మంత్రం ద్వారా "శాంతి దూతగా" మారి "విశ్వశాంతి దూతగా" ఎదిగిన ఓంకారస్వామి ఆదర్శ బాట యందు నిలబడిన శాంతి ఆశ్రమ శాంతి దూతలు అందరిలో "నేను సైతం". అందరికీ నా శిరస్సు వంచి పాదాభివందనం చేస్తూ... నేను సైతం – శాంతి దూత.

* **పవిత్రమయిన శ్వాస 'సో హమ్' - అహంకారమును నశింపజేస్తుంది. అజ్ఞానమును అంతమొందిస్తుంది. హృదయంలో ప్రేమను, హాసమును, ఆత్మలో శాంతిని కలిగిస్తుంది.**

# ఓంకార స్వామీజీతో నా స్నేహం

- శ్రీ వి.వి. గిరి
మాజీ రాష్ట్రపతి

నేడు పూజ్యశ్రీ స్వామీజీని కలియుటచే చాలా సుదినముగా భావించుచుంటిని. వీరినే గాక భారతావనికి అఖండ సేవలోన గూర్చిన పూజ్యశ్రీ రామానంద తీర్థజీ ని కూడ ఇచ్చట కలియుట కదు ముదావహము. మా పరిచయము నేటిదిగాదు. మా పదునైదు సంవత్సరముల ప్రాయము నుండియు వర్ధిల్లుచున్నది. స్వామీజీ, దైవము సర్వాంతర్యామి అనియు, ఆయన కాంతి ప్రత్యణువునుండియు ప్రస్ఫుటమగు చుండుననియు చెప్పిరి. కాని ఆ విధముగ చెప్పగలవారెవరు! ఆ దైవమును కాంచగల్గిన వారికే, ఆ తేజస్సును గ్రహింపగలిగిన వారికే అది సాధ్యము. అట్టి కాంతిని బడసిన వారి సన్నిధిలో నేడు మనము వుండుట చాలా అదృష్టము.

పదునైదు సంవత్సరముల ప్రాయము నుండియు స్వామీజీ తోడి స్నేహలత దినదినాభివృద్ధి గాంచుచునే యున్నది. వారి జీవితము ఇతరుల సేవభాగ్యములోనే గడుచుచున్నది. ఆ విధముగా లభించు ఆనందమునకు సాటి లేదు. నిస్వార్థ సేవారూపమున ప్రజలను ఎట్లు అర్థము చేసుకొనవలయునో బోధించుచుండిరి. చాలా సంవత్సరముల నుండి అట్టి సేవా రూపములోనే తమ జీవితమును గడుపుచుండిరి. వారు ఏ విషయములను యదార్థ జీవితమునందు గుర్తింతురో, వానినే సదా బోధింతురు. కొందరు ఆర్థిక రీత్యా గొప్పవారు కావచ్చు. కాని ఆర్థిక దారిద్ర్యమే మానవుల నున్నతుల జేయుచున్నది. దైవ సన్నిధానమును జేర్చునది. నిన్ను నీవు గుర్తించుట అత్యంత ప్రధాన విషయము. తన్ను తాను గొప్పవాడనని భావించు వారెన్నటికిని గొప్పవారు కాజాలరు. ధన ధాన్యము నిజమగు సంపద కాదు, గాంధీ వలె, జీసస్ వలె, బుద్ధుని వలె దైవమును గుర్తించగలుగుటయే యదార్థ సంపద.

ఈ విషయములనే స్వామీజీ 55 సంవత్సరముల నుండి అవిరామముగ చెప్పుచుండిరి. పదవులుగాని, బాహ్య ఆడంబరములు గాని, నాకు ప్రీతికరములు కావు. వాస్తవముగా సత్యము, సేవా నన్నాకర్షించి బంధించునవి. ఉద్యోగ నిర్వహణ యందే యెంతయే కాలము వ్యర్థమై పోవుచుండెను. హృదయానందకరములగు పనులను చేయుటకు కాలమునే లేకుండ చేయును.

నిజముగ నలుబది ఐదు సంవత్సరముల నుండి ఈ ఆశ్రమమును సందర్శించవలెనని యెంతయో అభిలాష కలదు. విశాఖపట్నము నందలి ఆశ్రమమును, కోటగిరి యందలి ఆశ్రమమును దర్శించితిని గాని, ఇచ్చటకు రాజాలనైతిని. నేటికెట్లో నా కోర్కె నెరవేరినది. శ్రీ స్వామీజీ యొక్క సన్నిధానమే గాక శ్రీ రామానంద తీర్థజీవారి సన్నిధానము గూడ నాకెంతయో సంతోషమును కూర్చుచున్నది. జాతి, మత, కుల విచక్షణ లేక ఇచ్చట కావింపబడుచున్న వివిధ సేవా కార్యక్రమములకు నాకెంతయో ఆనందముగ యున్నది.

ఓం తత్ సత్ ఓం

# శాంతి నిలయం

**- శ్రీ ఖండూ భాయ్ దేశాయ్**

మాజీ గవర్నరు

భక్తవరేవణ్యులారా! స్నేహితులారా! ఖండూభాయి దేశాయి అని పిలువబడే నాకు దైవమేమిటో తెలియకున్నను, ఆ దైవ నిర్ణయము ప్రకారమే మీ ఆశ్రమమునకు వచ్చితినని తెలియును. దైవసాన్నిధ్య మనుభవించుటకు ఇచ్చట ప్రయత్నించుచున్న వారందరకు నా కృతజ్ఞతలు. శాంతిని బాహ్యమున పొందగోరుట వ్యర్థమని మన శాస్త్రములు తెల్పుచున్నవి. మనలోని ఆత్మజ్యోతియందే శాంతి గలదు. ఒక పర్యాయము నేను, మహాత్మాగాంధిగారి నిట్లు ప్రశ్నించితిని. **"ఈ ప్రపంచమున వివిధములైన సమస్యలు గలవు. వివిధ రకములైన జనసమూహములతో సంచరించుట ఎట్లు?"** వారిట్లు సమాధాన మొసంగిరి, **"ఏమియు విచారింపకుము. ఇతరులు ఏమిటి అని యోచింపకుము. నిన్ను నీవు సరిదిద్దుకొనుచు, అంతరంగమున కేంద్రీకరించుకొనుము. మిగిలినది దానికదియే చక్కబడును."**

శ్రీ స్వామీజీ నుడివినట్లు సర్వసంగ పరిత్యాగమనగా స్వధర్మము నుండి, కర్తవ్యము నుండి, బాధ్యతల నుండి వైదొలగుట కాదు. అందుచేత ప్రతివారును, వారి వారి పరిధులలో కర్మనాచరించుట, అత్యంత ఆవశ్యకము. నేను ఈ ఆశ్రమ ఆవరణ యందదుగిడగనే ఈ క్రింది సూక్తి నన్నెంతయో ఆకర్షించెను. **"నీవా దైవమును చేర సంకల్పించితివా నీ ప్రతికార్యమునందును. దైవమునే కాంచుము. అందరియందును దైవమునే గాంచుము."** ముక్తదశను పొందుట కిదియే మార్గము.

నేను నాసిక్ జైలు నందుండగా స్వామి వివేకానందుని సంపూర్ణ సారస్వతము చదువు భాగ్యము నాకు కలిగెను. అది నా దృక్పథమునంతయు మార్చివేసెను. అన్ని మతములు మూల సిద్ధాంతములు నా కవగతము కాజొచ్చెను. క్రైస్తవ మతమేమి, మహమ్మదీయ మతమేమి, మరేమతమైననేమి, ఒకే మతము యొక్క వివిధ దృక్ కోణములు. అన్నియు ఒకే ధర్మసూత్రములను బోధించుచున్నవి. ఆయా మతకర్తలు నివసించిన దేశకాల పరిస్థితులు వేరగుటచే వ్యక్తీకరించిన తీరు భిన్నమై చూపట్టుచున్నది. నేను ఖొరాను పఠించుచుండ, భగవద్గీతనే చదువుచుంటినే మోయని ఆశ్చర్యపడుచుండెడివాడను. గీతను చదువుచున్న, ఖురాన్ అని భ్రమించెడివాడను. నేను క్రైస్తవ కళాశాల యందు చదువునప్పుడు బైబిలు నందు కూడ మాకు పరీక్ష జరిగెడిది. ఆ బైబిలునందలి ధర్మసూత్రముల కించుకయు భేదము కన్పింపలేదు. ఇదేవిధముగ జొరాష్ట్రియన్ మొదలగు మతములు తమ మతమొక్కటియే ఉన్నతమని భావించుట కేవలము మౌఢ్యము. నా మతము అద్వైత సిద్ధాంతములపై నాధారపడి యుండును. శ్రీ స్వామీజీవారు స్వల్ప మాటలలో బోధించి నటుల, సకల మతముల సారము అద్వైతమునందు కలదు. దానితో పూర్ణముగానే నేకీభవించుచుంటిని.

శ్రీ స్వామీజీ నుడివినట్లు వర్తమానమున, భవిష్యత్తును ఎవరికి వారే సంస్కరించకొనవలసిన బాధ్యత ప్రతివారిపైనను గలదు. కామ, క్రోధ, లోభ, మోహ, మధ, మాత్సర్యములే ప్రపంచము నందలి సర్వారిష్టములకు మూలము. భౌతికముగ మనమెంతయో పురోగమించి యుండవచ్చు. అణుశక్తినేమి, విద్యుఛ్ఛక్తి నేమి, వివిధ రీతుల వినియోగించుకొనుచుండవచ్చును. కళలను, శాస్త్రములను అనేకము మన కళాశాలల యందు, ఉన్నత విద్యాస్థానములందు బోధింపబడవచ్చును. కాని అవి అన్నియు కేవలము

సాధనములు మాత్రమే. మనగమ్యమది కానే కాదు. మన భారతవర్షమంతయూ ఒకే సంస్కృతిచే బంధింపబడియున్నది. భౌతిక జీవితమంతయు ఆధ్యాత్మికముగ అనువర్తింపబడెను. ఆధ్యాత్మికతత్త్వమనగా ఊహమాత్రము కాదు. ఆధ్యాత్మికత అనగా నేమి? మానవ జీవిత విధాన మెట్లుండవలయునో, తోటి మానవునితో ఎట్లు మెలగవలెనో, ఆర్థిక, సాంఘిక ధర్మములెట్లు నెఱపవలయునో, ఉన్నతులు, నీచులు అనెడి భేదమించుకయు లేక అందరు అఖండ సత్‌చిత్ ఆనంద సాగరమునందలి భాగములే యనెడి మహనీయ సిద్ధాంతములన్నియు ఆధ్యాత్మికములే. స్వామీజీకాని మరే ప్రవక్తకాని బోధించుచున్నట్లు ఇతరులతో కలసి జీవించుట ఇతరుల కొరకై కాదు. తమ యొక్క శ్రేయస్సునకే. వాస్తవమునకు, ఇతరులను సేవించుట, మనకు మనమే మేలు చేసుకొనుట. దైవము మన వద్దకు పీడిత రూపమునను, దుఃఖితుల రూపమునను, బీదల రూపమునను ఏతెంచును. తన్ను తాను తెలుసుకొనిన వారు ఈ జగత్తునందలి కాంతినంతయు కాంచగలరు. అట్టివారు అహింస నెంతమాత్రము చేయజాలరు. ఈ అహింసా సిద్ధాంతమును గాంధీ మహాత్ముని సన్నిధానములో నేర్చుకొంటిని. ఎవరికి వారు ఇచ్ఛాపూర్వకముగా, ఇట్టి సంగతులు నేర్చుకొనవలయును. ఇట్టి ఆశ్రమములనుండియే అట్టి సందేశ తరంగములు, విశ్వవ్యాప్తము చెందవలయును. మనదేశమునం దెల్లెడల ఇట్టి ఆశ్రమములు విరివిగ విలసిల్లి లోకశాంతికి తోడ్పడవలయునని కోరుచుంటిని.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు!

---

* నీవు ఏది తలంతువో అదే నీవు కాగలవు. నీ మనస్సే ఆత్మ.
* ఏ పనిలోనైనను జయము కలుగుటకు ఆధ్యాత్మిక జీవితము, స్వార్థ రహితమైన ప్రేమ జీవితము, ఈశ్వర కృప, దైవబలము ముఖ్యావసరములు.
* మనము విన్న సద్వాక్యములు హృదయములో శాశ్వతమైన వాటిగా పదిలపరచుకొని మానవ జీవిత పరమావధి తెలుసుకొని తరించగోర్తాను.

# మనో మాలిన్యము - ఆత్మ సంస్కరణ

**(21-1-72 తేది శ్రీ స్వామీజీ జన్మదినమునాడు, ఆశ్రమాధ్యక్షులు, శ్రీ తెన్నేటి విశ్వనాథముగారు యిచ్చిన ఉపన్యాస సారాంశము)**

పూజ్యశ్రీ స్వామీజీకి ప్రణామములు. సభికులెల్లరకు నమస్కృతులు. నేడు సుదినము. మనము భక్తితో మనలను మనం తరింప జేసుకొను తలంపుతో శ్రీ స్వామీజీ సమ్ముఖమున జేరియుంటిమి. గతములో డెబ్బదిఏడు జన్మదినములు జరిగియుండెను. కాని యీ డెబ్బది ఎనిమిదవ జన్మదినము చాలా విశిష్టమైనది. రాత్రంతయు తిమిరాంధకారమున దారి తెలియక తిరుగాడిన పాంధునకు ప్రభాతభానుని బంగరుకిరణము లెట్లానందప్రదమో అట్లే పునర్జన్మ తుల్యమగువారి నేటి జన్మదినము మనకు అత్యంత ఆనందప్రదము. మన పూర్వజన్మ సుకృతముచే నేడు మనము అద్దానిని జరుపుకొనుచుంటిమి.

అనంతమగు ఆత్మకు పరిమిత శరీరమెట్లుస్థానమో అట్లే మనలోని విశ్వజ్యోతిని గుర్తించుటకు ఈ శాంత్యాశ్రమము కూడ. సమున్నత ప్రాకార వృతమగు భవనములు బాహ్యమునకు కానరానట్లు, ధూళిధూసరమగు శరీరము కాంతి విహీనమైనట్లు, మాలిన్యపూరితమగు మనస్సున జ్యోతి ప్రకాశింపనేరదు. కామ, క్రోధ, మద, మాత్సర్యాది ఆవరణ విచ్ఛేదము గావించినగాని మనస్సునకు స్వచ్ఛత కలుగనేరదు. మృత్యువు అనగా శరీర పతనము కాదు. కామ ప్రేరణచే చేయరాని పనులొనగూర్చుటయే మృత్యువు.

బృహదారణ్య కోపనిషత్తునందు అశ్వీలుడు. లోకమంతా మృత్యువుచే నిండియుండెను కదా. దానిని తప్పించుకొను ఉపాయ మేమియు లేదాయని, కేవలము యీ బాహ్య స్వరూపమును గూర్చి యాజ్ఞవల్క్యులవారిని ప్రశ్నించగా వారు ఈ శరీర పతనము మృత్యువు కాదు. ఆశాపాశములచే బంధింపబడుచు కామక్రోధములచే నిండి యున్న, శరీరము లేకున్నను సుఖదుఃఖములన్నియు అంటియే యుండును. సంపూర్ణ వాసనారహితమగునంత వరకు శరీరపతనమైనను. ఆశాపాశయులన్నియు అమరము, అనంతము, అద్వితీయమగు ఆత్మజ్యోతి ప్రకాశించును. మనోమాలిన్యమున్న యెడల వాసనారహితము కాదు. బహుళయత్న మొనర్చినగాని మనోమాలిన్యము నాశము కాదు. జ్ఞానమున్న గాని యత్నము ఫలింపదు. మృత్యువు ఎప్పుడో వచ్చును. దానధర్మములతో ముక్తి లభించునని మనోమాలిన్యము నశించుననియు భ్రమచెందవలదు. అనిక్షిప్తమగు అంతశ్శక్తి కంటికి కానవచ్చునది కాదు. చేతికి దొరుకునది కాదు. దానిని పవిత్రీకరించుట ఎట్లు? ఆత్మసంస్కరణ, మనోసంయమము యిందుకు ప్రాతిపదికలు. ఎట్టి యత్నము లేకనే (జన్మజన్మల నుండి) సంప్రాప్తమైన మనోమాలిన్యము బహుళయత్నము చేసిన గాని సమసిపోదు.

ఒక్కొక్కప్పుడు పెద్ద పెద్ద పేరు ప్రఖ్యాతులు కన్నవారి యందేమి, గురువుల యందేమి, సాధు సన్యాసులయందేమి, అందరియందును యీ మనోమాలిన్యము కానవచ్చును. కాని ప్రతివారు తమ మనసునందెట్టి మాలిన్యము లేదని భ్రమయుచుందురు. ఇతరుల సంస్కరింపజూచుచుందురు. ఇతరుల సంస్కరించు ముందు తమ్ముతాము సంస్కరించుకొనుట శ్రేయస్కరము. అందువలననే మనపూర్వులు

మనోనిగ్రహమునకై యమనియమాదుల నేర్పరిచిరి.

కొందరు పూజల వలన, యాత్రా దర్శనముచే మనోమాలిన్యము తొలగునని తలంతురు. అది కూడ ఒక మార్గము కావచ్చు. కాని ఆ బాహ్య కార్య కలాపములతో అసి ధారవలె మానసిక చింతన కూడ వానితో జోడింపకున్న వాటికెట్టి ప్రయోజనము యుండనేరదు. మనోమాలిన్యమున్న మానసిక చింతన ఎన్నడు ఒనగూడదు.

దీపం వెలిగించగానే పరిసరములు కాంతివంతమైనట్లు, యమనియములతో అరిషడ్వర్గములను జయించిన వారియందు మానసిక జ్యోతి ప్రకాశించును. అదియే ఇతరులకు మార్గదర్శి కాగలదు. ఇతరులను సంస్కరించవలసినది మన ప్రవర్తన వల్లనే. మాటలచే గాదు. వారు ఎల్లప్పుడు మన ప్రవర్తన వల్లనే గ్రహింతురు. ప్రతి క్షణం అప్రతమత్తులమై క్రమబద్ధమైన ప్రవర్తన కలిగి యుండలెను. లేనిచో క్షణములో మసిబారిన గాజుచిమ్నీ నుండి కాంతి ప్రసరించనట్లు అంతయు వ్యర్థమైపోవును. అవిరళ కృషిచే మనోమాలిన్య నాశనమొనగూడిన హృదయమున దివ్యజ్యోతి జ్వాజ్వల్యమానముగా ప్రకాశించును.

ఈ మూలనుండి మనం ఒక్కరం ఏమి చేయగలం అని చింతించవలదు. ముందు మన హృదయం సంస్కరించుకొనిన లోకం దానియంత అదియే సంస్కరింపబడును. సర్వజ్ఞుడగు రాముని ఆత్మజ్యోతి దర్శనము యుగయుగములుగా నేటికి మనకు దీప్తిని ప్రసరించుచుండుటలేదా? ప్రేమ స్వరూపుడగు ఏసుప్రభువు రెండు వేల సంవత్సరముల నుండి మార్గదర్శికాలేదా? అతడు చిన్నతనములోనే అంతయు చేయగలిగెను కదా.

ప్రవర్తనయే మనిషికి గీటురాయి వంటిది. శ్రీ స్వామీజీ అరువది సంవత్సరముల క్రిందటనే విశ్వశాంతికై వారి జీవితము త్యాగము చేయుటే వారి ప్రవర్తనకు తార్కాణం. మనము మూడు నెలల క్రిందట వారి ఆరోగ్యము గూర్చి చాల భయపడితిమి. అందుకే నేడు వారి సమ్ముఖమున నేడు మనము సమావేశమగుట యింత ఆనందము కలుగుచున్నది. శ్రీస్వామీజీ మనకు సదా తెల్పుచున్నట్లు మనలోని జోతిని కాంచవలెను. ఆత్మ సంస్కారము కావలెను. అంతటను వెలుగొందునది ఒకే జ్యోతి స్వరూపము. జ్ఞానము కలిగిననే మనోమాలిన్యము సమసిపోవును. బుద్ధి జ్ఞాన ధైర్యము లొసంగుగాకయని దైవమును వేడుకొందుముగాక!

ఓం ఓం ఓం

**ఈ ఆశ్రమము మీ అందరి జ్ఞాన గృహము. ఈ జ్ఞాన గృహములో నివసించుటకు దైవ పరతాపము అను అర్హత కావలయును. మీ అందరూ అందుకు అర్హులుగా నుందురుగాక.**

# శాంతి ఆశ్రమంలో - ఋషి పుంగవుడు

**- శ్రీ భాట్టం శ్రీరామమూర్తి,** విశాఖపట్నం

ఇది నైమిశారణ్యమా? బదరికాశ్రమమా? శుక, శౌనకాది మహర్షులు, మహనీయులు సంచరించిన పవిత్ర తపోవనమా? ఇది శాంతి ఆశ్రమమా? లేక ప్రశాంతి నిలయమా? ఇది కాంతిపుంజమా? లేక శాంతికపోతమా?

## శాంతిధామం - ప్రణవనాదం

ఇక్కడ పక్షులు - వృక్షాలు - ప్రణవమంత్రం జపిస్తాయి. ఫలపుష్పాలు శాంతి దేవత నివేదనకు వినియోగపడతాయి. వనవిహారం చేసే మలయ పవనాలు, వాగులు! నాగులు కూడ ప్రణవనాదం చేస్తాయి. ప్రకృతి, పరమ పురుషుడి ఒడిలో కనుమరగయి నిలువెల్లా వెలుగయి - నిత్యదీవెనగా దివ్యజీవనం ప్రసాదిస్తుంది. కాలపురుషుడు సవ్వడికి కలత చెందని, వెతల పొందని, మార్పు నొల్లని నిత్యసనాతన, వినూతన, తేజో నిలయం, శాంతిధామం శాంతి ఆశ్రమం.

## గాఢతమస్సు మధ్య - ఘోరతపస్సు

మొదట్లో మనిషిని భయభ్రాంతుడ్ని చేసిన నాటి క్రూర మృగాలు, విష సర్పాలు, కీకారణ్యాలు ఏమయ్యాయి? ఏ దివ్య పురుషుని దైవగానంలో పరవశించి - ప్రభావితం అయ్యాయి? దట్టమైన కారుచీకట్లు క్రుమ్మురించే వనభూమి, నందనవనంగా ప్రశాంత తపోవాటికగా ఎలా మారింది. సుందర సుమసౌరభాల స్వాగత గీతం - అందీ అందకముందే దేవగంధర్వులు, నిశీధంలో యిటు విచ్చేస్తారెందుకు? తపోనిష్ఠా గరిష్ఠులు మహర్షులు, యతీశ్వరులు, యెందరెందరో బ్రహ్మముహూర్తములో యిచట సంచరిస్తారు.

## దైవదూత - శాంతిప్రదాత

విశ్వకర్మను ఆశ్చర్యచకితం చేసే యీ పవిత్ర క్షేత్ర నిర్మాత - ప్రాణప్రదాత నేత ఎవరు? ఆ దైవదూత ఎవరు? ఆ తపోధనుడెవరు? విశ్వశాంతిని విశ్వకాంతిని సందర్శిస్తున్న దృష్ట ఎవరు? ప్రష్ట ఎవరు? శాంతి ఆశ్రమ అంతరాత్మ ఎవరు? ఆత్మాభిముఖుడైన ఆ సత్య స్వరూపుడ్ని ఆశీర్వదించిన తేజఃపుంజం ఆశ్రమ వాసుల హృదయగుహలోని తమస్సుకు బదులు ఉషస్సును నిలుపుగాక!

## భువనత్రయాల్లో శాంతి కుసుమాల పరిమళాలు

వెలుగు కిరణాలు విశ్వవ్యాప్తమై, ఖండాంతరాలు దాటి సప్త సముద్రాల వెలుపల గిరి శిఖరాలను సహితం, తేజోవంతం చేయాలని - భూనభోంతరాళాల్లో ప్రణవమంత్రం ప్రతిధ్వనించి, మానవ మనస్సులో శాంతి-కాంతి వెల్లివిరియాలనీ ఆశించిన, ఘోషించిన, ఆత్మస్వరూపుడెవరు? నిత్యాసత్యాన్వేషకుడెవరు? లోక కళ్యాణం కోసం విశ్వమానవ శ్రేయస్సు కోసం, సర్వమానవ సౌభ్రాతృత్వం కోసం, ఆహరహం పరితపించిన, పలవరించిన, విశ్వాత్మ స్వరూపుడెవరు? కలహాలు, కార్పణ్యాలు, విద్వేషాలు, మాత్సర్యాలు, వైషమ్యాలు, వ్యత్యాసాలు, సమసిపోయి సుఖశాంతులు వెల్లివిరిసె భూతల స్వర్గానికై తపించి, వసుధైక కుటుంబం అవతరించాలని, అహర్నిశలు కలవరించిన, జగదేక కుటుంబీకుడెవరు? తన జీవిత కుసుమాన్ని విశ్వప్రేమకు, విశ్వేశ్వరార్చనకు పూజాపుష్పంగా అంకితం చేసిన ఆ ధన్యజీవి ఎవరు? శాంతిప్రదాత ఎవరు? ప్రేమైక మూర్తి ఎవరు?

## దివ్యదర్శనం - ధన్యజీవితం

వ్యాసమహర్షిని చూడబోము వాల్మీకి ఋషిపుంగవుని సేవించి తరించబోము, చరాచరా జగత్తు తమ ఆకాంక్షలను స్పందిస్తూ తమ ఆజ్ఞలను ఔదలదాల్చగా త్రిలోకాల నుండి జడప్రకృతి వరకు నీరాజనాలు అందుకున్న త్రికాల వేదులు దైవజ్ఞులు మన కంటికి ఆగుపించరు. కనీసం శాంతి ఆశ్రమంలోని ప్రేమ స్వరూపుడ్ని కరుణామయుడ్ని కన్నులార చూసి తరించలేమా? అమృతం చిలికే పలుకులు, వెన్నెల వెదజల్లే మధుర మందహాసాలు, హృదయపాత్రను ప్రేమతో నింపుకొని కారుణ్యం తొణికిసలాడే కనుచూపేదో ఆయతీశ్వరుని సందర్శన అక్కడ లభిస్తుంది! అక్కడ ఉన్నది ఒక పుష్పక విమానం అందరు సందర్శకులకూ అక్కడ చోటు ఉంటుంది. అక్కడ కల్పవృక్షమా? కామధేనువా? అందరికీ అన్నీ సమకూర్చే అన్నపూర్ణ స్వామీజీ కనుసన్నలలో మెలగునేమో? అంతా ఆదరణ-సర్వత్రా ఆప్యాయత-ఎంతో ప్రేమ వెరసి యివన్నీ కలసి, వెలసిన అద్వైత్వమూర్తి ఓంకారస్వామి,

## సుందర స్వప్నాలు - సుమధుర ఫలాలు

ఆయన ఆరముగ్గిన పండు 86 ఏళ్ళ నిండు జీవితంలో ఎన్నో సుందర స్వప్నాలను కాంచేరు. మరెన్నో ఉన్నత ఆదర్శాలలో భాసించేరు. మహోన్నత ఆధ్యాత్మిక విలువల్లో జీవించి తరించేరు. 'సర్వశక్తి సంపన్నుడు కార్యభారం స్వీకరిస్తున్నాడు. మానవ మాతృడు నిష్క్రమించే తరుణం ఆసన్నం అవుతుంది', అన్నారాయన. "స్వామీజీ కనుపించకపోవచ్చును, జగమంతా ఓంకారంతో నిండి ఉంటుంది." అంటారు ఓంకార స్వాములు. మహాభినిష్క్రమణకు రంగస్థలం సమాయత్తం చేస్తున్నారా?

గాయపడిన మనస్సుకి ఊరడి కల్గించేదెవరు? కలతపడి, వెతల చెందిన మనస్సు ఒకగాడిలో పడేదెలా? ఆపదలో, ఆర్తిలో, కన్నీళ్ళతో మనఃక్లేశాలలో మునిగి తేలే మానవుడ్ని శాంతి పథానికి చేర్చేదెవరు? పాపపంకిలం నుండి దివ్యజీవనం వైపు చీకటికూపం నుండి కాంతి వలయంలోకి, నడిపించేదెవరు?" అనుక్షణం విశ్వనాధుడు నీకై వేచి ఉన్నాడు. ప్రతిక్షణం అమూల్యం! కాలం వృధాచేస్తే దేవుని ప్రణాళిక వ్యర్థం అవుతుంది. నీ జీవితం నిరర్థకం అవుతుంది" అని తరచి చెప్పేదెవరు? సుదూర క్షేత్రాలల్లోనూ, విను వీధుల్లోనూ కాదు-స్వర్గసీమలోనూ కాదు-హృదయసీమలో విశ్వాత్మను సందర్శించమని ప్రభోదించేదెవరు? సాధకులకే గాని, సోమరులకు దివ్యజీవనం అలవడదనీ, దైవసాన్నిధ్యం లభించదనీ చాటి చెప్పేదెవరు? దేవుడు జాగరూకుడై ఉన్నాడు. నువ్వు ఎలా నిద్రించగలవు? అని ఘోషించి కళ్ళు తెరపించి, దైవం మ్రోల మనలను హాజరుపరచేవారెవరు?

## ప్రత్యక్ష ప్రవక్త - జీవన్ముక్త

ఓంకారస్వామి సాన్నిధ్యంలో క్షణక్షణం పునీతులం అవుతాం. ప్రతిక్షణం దేవ కటాక్షం కోసం నిరీక్షిస్తాం. ఉచ్ఛ్వాశ, నిశ్వాసాల రూపంలో విశ్వాత్మను ప్రతినిత్యం పరామర్శిస్తాం. అజ్ఞాన నైర్మాల్యాన్ని, సోహం భావంతో పరిత్యజించి, దేహాన్ని దేవాలయంగా మార్చుకోమని ప్రభోదించే బోధకుడు - తాత్వికుడు, చింతనాపరుడు స్వామీజీ, గ్రంధ వక్త, ప్రవక్త ఓంకార్‌స్వామి, ఆయన నిత్యసత్యాన్వేషకుడు, నిర్విరామ సాధకుడు, నిరంతర తపస్సమాధిచే పునీతుడు, స్వామిఓంకార్ ప్రణవస్వరూపుడు, ప్రేమైకమూర్తి, కరుణాంతరంగుడు.

### శాంతి - కాంతి

మనదేశ ఆధ్యాత్మిక వారసత్వ సంపదకు, ఆధిభౌతిక దివ్యజీవన స్రవంతికి స్వామీజీ ఒక ప్రతిబింబం, స్వామీజీ నిత్యసత్యవ్రతుడు. స్వామీజీ కర్మయోగి. ఆయన పతాకం శాంతి. ఆయన సంకేతం కాంతి. ఆయన ప్రేమకు ప్రతీక. కరుణకు ప్రతిరూపం. విశ్వశ్రేయస్సుకు ఆయన వేగుచుక్క!

# శాంతి ఆశ్రమ ప్రార్థనల విలువ

**– శ్రీమతి సరస్వతిదేవి,** చిక్కవరం, జమిందారిణి

శ్రీ పూజనీయులగు శ్రీ ఓంకారస్వామివారి శాంతి ఆశ్రమంలో శ్రీవారి ఆదివార సత్సంగ సమావేశంలో పాల్గొనే భాగ్యం నాకు కలిగినది. శ్రీవారి ఆజ్ఞానుసారం శాంతి పాఠకులతో నా ఆనందాన్ని పంచుకొనదలచి, ఈ చిన్నవ్యాసం వ్రాయడమైనది. శ్రీ స్వామివారిచ్చిన అనేక అమూల్య సందేశములలో అతి ముఖ్యమైనది : నా అనారోగ్య కారణముచే యెక్కువ మాట్లాడగూడదని అనేకమంది హెచ్చరికలు చేయుచున్నప్పటికి, నా అంతిమ శ్వాస ఆడువరకు మీ కందరికి నేను ఉపయోగపడడమే నాకు కావలసినది. నేను కోరునది, నేను యిక్కడ వున్నా లేకపోయినా, యిదే రీతిగా ఆదివారం నాడు కనీసం 2 గంటలయినా, భక్తులంతా సమావేశమై భగవంతుని అనుభవిస్తూ, శాంతి సుఖములను పొందమని, భగవంతుని అనుభవించే విధానము అతి సులభమైన మాటలతో స్వానుభవముతో, భక్తులందరి హృదయాలను కదల్చి, చైతన్యము కల్గించి, వారియొక్క ఆనందానుభూతిని అందరికి పంచిపెట్టిరి. వారు ఉపయోగపడటానికి ఎంత ప్రయత్నించుచున్నారో వారిని ఉపయోగించుకొనుటలో, వారి ప్రయత్నంలో నూరవ వంతయినా మనం త్రికరణ శుద్ధిగా ప్రయత్నించిన నూరు రెట్లు సహాయం వారి నుండి మనం పొందగలం. జడ పదార్థములయిన, రాయిరప్పా, చెట్టు, పుట్ట నుండి వారు భగవంతుని సందేశాలందుకొంటూ భగవంతుని అనుభవిస్తూ, భగవంతుని అన్నిటిలో చూడగల్గుచున్నారు. గాని, మనమో, భగవంతుని అవతారమే స్వామివారంటూ, వారితో పాటు భగవంతుని చూడలేకపోతున్నాము. మన శ్వాసలో, పాటలో, కంటిపాపలో, సర్వంలో భగవంతుడే వున్నాడన్న వారి బోధనలు వింటున్నాము గాని, ఆ పనిమాత్రం చేయలేకపోతున్నాము. కనీసం ప్రయత్నమన్నా చేస్తున్నామా? అది యెవరికి వారు తెలిసికోవలసిన ముఖ్య విషయం. మహాత్ములు, అనేక సాధనలు చేసి కఠోరమైన తపస్సులు చేసి, వడ్డించిన విస్తరివలె, మనకు వారి యొక్క తపస్సును, అనుభవాన్ని ధారపోసి అతి సులభ మార్గములో భగవంతుని అనుభవించే విధానాన్ని నేర్పుచున్నారు. గుడిలోనున్న విగ్రహానికిచ్చే విలువనైనను, మహాత్ములకు మనమివ్వలేకపోతున్నాము. ఎందుచేత? వారు మనకు చాలా అందుబాటులో నున్నందువలన ప్రత్యక్ష దైవాన్ని చూడలేని మనము, పరోక్ష దైవాన్ని యెట్లు చూడగలము?

ఈ నమ్మకాలకు, అనుభవాలకు పూర్వజన్మ సుకృతముండాలి. అవి త్రోసిపుచ్చకండి. పూర్వజన్మ సుకృత ముండుటవలననే మహాత్ముల దర్శనము, సంభాషణ, స్పర్శ మనకు కలుగుచున్నవి.

ఎంతో కష్టపడి చదువుతాము. సంగీతం నేర్చుకుంటాము. కుట్టుపని నేర్చుకుంటాము గాని ఆధ్యాత్మిక సాధన విషయంలో ఆసక్తి యుండదు. కారణం దానిమీద నమ్మకం లేకను చెప్పే వారి యెడల పూర్తి విశ్వాసం లేకను ఆత్మవిచారణ చేసుకున్నచో, మన ప్రశ్నలకు తగిన జవాబులు వస్తవి. మన లోపాలు యితర్లకు చెప్పుకోవటం కష్టంగాని, మనకు మనం తెల్సుకోవడములో కష్టంగాని,

చిన్నతనంగాని లేదుగదా? రాతిగోడలో పువ్వు పుట్టి, ఆ పువ్వే అమూల్యమైన సందేశమిచ్చినదని, భగవంతుడే ఆ పువ్వు రూపంలో ప్రత్యక్షమైనాడని శ్రీస్వామివారు సెలవిచ్చిరి. ఇది యెంత మధురమైన భావన.

వారు మానవరూపంలోనున్న మహాత్ములు, మనం గూడా మానవులమే గదా! అదే సూక్ష్మ దృష్టిని మనమెందు కలవర్చుకోగూడదు? సముద్రుడు భగవానుడైయుండగా, అల, భక్తుడని స్వామివారు సెలవిస్తారు. భక్తునికి, భగవానునికి వున్న అతి పవిత్రమైన సంబంధాల్ని నిరూపించే సదుపదేశాలెన్నో వారిచ్చియున్నారు. వారి రచనలే ప్రత్యక్ష ప్రమాణములు. అవి అనుభవంలోనికి తెచ్చుకునే మార్గాలను సదా నేర్పుచున్నారు.

ఇంతకన్నా యే దేవుడు మనకు సహాయం చేయగలడు? యే దేవుడైనా మానవరూపంతోనే గదా చేయగలడు.

శ్రీవారి సందేశాన్ని ఒక్క జీవియైనా అర్థం చేసుకొని తరించినా, వారి జన్మ సఫలమైదనుకుంటారు. భగవంతునిలో లీనమై సర్వకాల సర్వావస్థలయందూ సమాధ్యవస్థలో కాలం గడపవలసిన మహనీయులు, మనకందుబాటులో వుండుటకు ఆశ్రమము నిర్మించుకుని, అనేక కష్టనిష్టురములను భరిస్తూ, మనమధ్య నెందులకు మసలుచున్నారు? ఒక్కసారి ఆలోచించండి. కీర్తి ప్రతిష్ఠల కొరకా? సమాధిలో కూర్చుంటేనే, చాలా గొప్పగా చెప్పుకుంటారు గదా, విభూతి రాసుకొని కౌపీనం ధరించి, జడలు పెంచితే మరీ గొప్పగా చెప్పుకుంటారు గదా కీర్తి ప్రతిష్టల కొరకు మనతో మసలవలసిన అగత్యం లేదు. సర్వేశ్వరుడు వారి ఆయువును పొడిగించి, మనకండ్ల యెదుట మళ్ళీ వార్ని నిలిపినాడంటే అది మన అందరి అదృష్టమనక తప్పదు. దైవమే ఏ భక్తురాలి ప్రార్థన విన్నాడో, యే దాసునిమొర ఆలకించాడో!

మహాత్ములకు మరణం తృణప్రాయం. యుగాంతము వరకూ వున్నా వుంటారు. ఇపుడే రమ్మన్నా వెళ్తారు. గాని మనకు, వారు దేహంతో నున్నపు డుపయోగించుకొనుట సులభం. యిపుడు వారు నేర్పినవి, నేర్చుకున్నచో, వారే దేశంలో యే లోకంలో నున్నా వార్ని చూపగలం, అనుభవించగలం. కృపామయుడైన సర్వేశ్వరుడు మనకీ సదవకాశాన్ని పొడిగించాడు. ఈ అవకాశాన్ని మనము ఉపయోగించుకుందాము. వారికి తృప్తిని కలిగిద్దాము. వారు క్షేమంగా, సుఖంగా తోటపల్లి తల్లి ఆశ్రమానికి దయచేయుచున్న ఈ శుభ సమయంలో శ్రీ సద్గురు పరమాత్మను. శ్రీవారి ఆయురారోగ్యాభి వృద్ధికి ప్రార్థిస్తూ శ్రీ సద్గురు చరణములపై ప్రణమిల్లుచున్నాను.

# వ్యక్తిశాంతి లోకశాంతి కెట్లాధార భూతమగును?

**– శ్రీ సాధు మార్కండేయ**, కోటగిరి

ఈ ప్రశ్న చాలా అగాధమగు అర్థము కలిగియున్నది. మానవ జీవిత తత్వమంతయు ఇందిమిడి యున్నది. ఈ సమస్యను అర్థము చేసుకొనుటకు ముందు మనము (World Peace) ప్రపంచము – శాంతి అను పదములను అర్థము చేసుకొనవలసి యున్నది.

ప్రపంచము – మనము ప్రపంచమును గూర్చి ముచ్చటించుట మన అందుగల అయిదు మహాఖండములు అందు వశించు నూరుకోట్ల ప్రజల గూర్చియు ఎంతమాత్రము గాదు. అందుగల ఏ కొలదిమంది మహనీయుల గూర్చియో మాత్రమే. ఇది మీకు కొంత ఆశ్చర్య జనకము కావచ్చును. అందుకు కొంత వివరణ అవసరమై యున్నది.

చీమ మొదలు ఏనుగు వరకును గల సకల జీవరాసులు తినుట, త్రాగుట, విషయ సుఖానందము, ఈ మూడింటితోనే జీవయాత్ర సాగించుచున్న వను విషయము మీ ఎల్లరకు తెలిసిన విషయమే. మనము గూడ ఈ మూడింటియందును జీవించుచుండిన, పంచేంద్రియ బానిసలగు మనము ఆ జంతువుల కంటే ఉత్తములమని గాని, అధికులమని గాని భావింప పనిలేదు. మనకు దైవము ప్రసాదించిన విజ్ఞానముచే మంచి చెడ్డల, సత్యా సత్యముల, ఉన్నతాధముల వ్యత్యాసమును గుర్తించి విచక్షణా జ్ఞానముచే జీవించిననే మానవ జీవిత సార్థకత. ఈ భౌతిక జీవితమున కల్గు కార్యాకారణ విచక్షణా జ్ఞానము గుర్తించుటకే అరుదగు బుద్ధిని దైవము కల్పించి యుండెను. అంతరంగమునకు చని అనంతమగు లోపలి శక్తిని గుర్తించి, ఈ సకల చరాచర సృష్టికిని కారణము గుర్తించవలెను. మరియొక మాటలో చెప్పవలెనన్న స్థూలరూపమున కానవచ్చు యీ భౌతిక జగత్తును గూర్చియు, చర్మ చక్షువుల కగోచరమగు అనంత విశ్వము, అనంత శక్తి, సత్ చిదానంద స్వరూపమును – స్వభావమును గూర్చి మనము తెలుసుకొనవలసి యున్నది. దైవమును గూర్చి తెలుసుకొనుట యనగా దైవీస్థితి నొందుటయే. ఆ విధమగు కార్య కారణ విచారము విచక్షణ క్రమముగా మనలను దివ్యత్వమునకు – సృష్టికర్త – సన్నిధికి కొనిపోవును. అప్పుడు మనకు మానవజన్మ లభించినందుకు ఫలితము సిద్ధించును. కాని ఎందరు ఆ విధమగు జీవితమును నడుపుచుండిరి? మనము గమనించిన యీ నూరుకోట్లమందిలో ఏ వందమందియో యీ విధమగు సార్థకమగు జీవితము పొందుచుందురు. ఈ ప్రపంచ స్థితిని గూర్చి చెప్పుటనని వీరిని గూర్చి చెప్పుటయే తగియుండును. ప్రపంచస్థితి వారిలోనే ఆధారపడి యున్నది.

**శాంతి :–** శాంతిని గూర్చి తెలుసుకొనుటకు దాని అర్థమును ముందు తెలిసికొనవలసియుండును. శాంతియనగా కాషాయాంబరములను ధరించుట గాని, ఏకాంతవాసులై ధ్యానము సల్పుటగాని ఎంతమాత్రము గాదు. అనాసక్తత వలను, బంధరాహిత్యము చేతను శాంతి లభించుచుండును. ఒక పర్యాయము ఒక సాధువు తన శిష్యునికి ఒక గ్లాసు గంగాజలమును తెమ్మనిచెప్పి, తాను సమాధిలోనికి వెడలెను. ఆ విధముగ మూడువందల సంవత్సరములు గడిచెను. అతడు కన్నులు తెరచి తిరిగి తాను కోరియుండిన నీటినే మొదట అడిగియుండెనట. అతడు మూడువందల సంవత్సరములు తదేకముగ ధ్యానము సల్పుచుండినను, అతనిలోని కోర్కె అదేవిధముగ నిల్చియుండెను. మనమేమి చేయుచున్నది ప్రధానము కాదు. మనమేమిటి అనునదే ముఖ్యము. ఈ దినములలో భాగ్యవంతులు, బీదలు కూడ శాంతి లేకుండుట మనము కాంచుచుంటిమి. ఎందువలన? ఏలనన ప్రతివారు ఏదియో విధమగు కోరికను కలిగియుండటయే. బీదవారు భాగ్యవంతులగుటకు, భాగ్యవంతు లింకను భాగ్యవంతులగుటకు కోరుచుందురు. ఈ విధముగా అందరును అశాంతిచే అలమటించుచుందురు.

ఈ సందర్భమున జీవన్ముక్తుడగు జనక మహారాజు జీవితమున జరిగిన ఒక సంఘటన పేర్కొనతగినది. ఒకదినమున ఒక ముని జనకునికడ ఏదైన నేర్చుకొనుట కాతని వద్ద కేగెను. కాని ఆ మహారాజు భోగ భాగ్యములను

చూచి మౌని ఆశ్చర్యాన్వితుడాయెను. ముని తనలో ఇట్లు తలపోసెను. "ఈ విలాసములలో మునిగియున్న యీ మహారాజు జీవ న్ముక్తు డెట్లగును?" ఇంతలో ఈ రాజప్రసాదము దగ్ధమగుచుండెను. జనకుడు నిర్లిప్తముగా అట్లే నిల్చియుండెను. ఆ మౌని మాత్రము తాను ఆరవేసిన అంగవస్త్రము అగ్నిలో దగ్ధము కాకుండ కాపాడుటకై ఆ గది నుండి పరుగిడెను. సకల సామ్రాజ్యమును పరిపాలించుచుండిన చక్రవర్తి అయినను జనకుడు నిర్లిప్తుడుగానే యుండెను. "సర్వసంగ పరిత్యాగ మొనర్చిన సన్యాసి అయినను, అతడు కోరికచే బంధింపబడియే యుండెను." అని ఒక ఆంగ్లేయకవి చెప్పి యుండెను. కర్మ ఫలాశక్తి నుండి విడివడుటే బంధము నుండి, కోర్కెల నుండి విడివడుట.

మానవుల దుఃఖ కారణము కనుగొనుటకై బుద్ధ భగవానుడు ఏడు సంవత్సరములు తపస్సు చేసెను. కడకు కోరిక, బంధన ఇదియే సమస్త దుఃఖములకు కారణమని కనుగొని యుండెను. ఈ సత్యమును బుద్ధుడు తనతోనే యుంచుకొనక విశ్వవ్యాప్త మొనర్చెను. కావుననే బౌద్ధమతము విశ్వవ్యాప్త మొందియుండెను.

ఇప్పుడు వ్యక్తి శాంతి విశ్వశాంతికెట్లు ఆధారభూతము అనెడి సమస్యకు తిరిగివత్తము. గీత, ఉపనిషత్తులు. బైబిలు మొదలగు గ్రంథ రచయితలు గతించినను. నాడు, నేడు కూడ అవియే పఠింపబడుచున్నవి. అనుసరింపబడుచున్నవి. ఎవరు శాంతిని తమలో గాంచగలిగిరో వారిచే అవి లిఖింపబడుటచే వాటికాశక్తి కలిగెను. వారి వ్యక్తి శాంతియే జగతిని అనంత శక్తితో పరివ్యాప్తమైనది. ఇందుకు శ్రీ స్వామీజీని చక్కని ఉదాహరణగా మనము చెప్పవచ్చును. వారేమి చెప్పినను ఏమి చేసినను అవి విశ్వశాంతిని దృష్టిలో నిడుకొనియే అని మనము కాంచవచ్చును. వారు అమెరికా మొదలగు దేశములేగి శాంతి వ్యాప్తికై అచ్చట శాంతి కేంద్రములను స్థాపించవలసిన అవసర మొద్దియు లేదు. ఈ వార్ధక్యమున శాంతి కేంద్రమును, దాని కార్యక్రమములను సముద్ధరించుటకు వారేమియు చేయవలసినది లేదు. మీకు ఆశ్చర్యము గొలువవచ్చును. కాని వారి సుఖముల కంటె, విశ్వశాంతియే వారికి ముఖ్యము. అందుకు కారణమేమని మీరు ప్రశ్నించవచ్చును. నా సమాధానమిది :- పుష్పము తన సౌరభము నేల వెదజల్లును? సచ్చిదానంద స్వరూపమును గూర్చి సంపూర్ణ విజ్ఞానము వికసించిన, తక్కిన సర్వము తమకు తాము వికసించును. తమలో శాంతిని కనుగొనుట యనగా తమ పరిమిత వ్యక్తిత్వమును సంపూర్ణముగా కోల్పోవుట, లేక సమస్త జగత్తులో తానేకత్వము నందుట. కావుననే ఎప్పుడు శాంతోదయమగునో అప్పుడు విశ్వశాంతి కూడ కల్గుచుండును. ఎట్లని మీరు ప్రశ్నింపవచ్చును. సమాధానమిది, శాంతి పరమేశ్వరుని అనంత కరుణా స్వరూపము, ఆ కరుణామయునిచే సృజింపబడిన యీ జగత్తు నుండి అది ఎట్లు వేరు కాగలదు? అంతయు ఒకే అఖండ సచ్చిదానంద స్వరూపము.

శ్రీ రామకృష్ణ పరమహంస ఒక్కరే. కాని నేడు వారి సంస్థలు విశ్వవ్యాప్తమై యున్నది. రామకృష్ణు డెన్నడును వారి వసతిని కూడ దాటి యెరుగరు. గాని వారు తమలో కనుగొనిన శాంతి జగద్విఖ్యాతమైనది. అది ఎట్లు సంభవించునని అడుగవచ్చును.

శాంతిని తమలో గాంచినవారు దానిని వ్యాప్త మొనర్చుటకు ఎట్టి ప్రయత్నము చేయవలసిన అవసరముండదు. అతని శాంతిస్థితియే విశ్వము నతని చెంతకు కొనివచ్చును. ఒక పర్యాయము రమణ మహర్షిని ఒకరిట్లు ప్రశ్నించిరి. "భగవాన్! మన సనాతన ఋషుల వలె మీరు కూడ పలుతావుల కేగి మీ సందేశముల నేల తెలుపరు?" రమణులిట్లనిరి, "నేనిట్లు చేయుట లేదని నీవెట్లు చెప్పగలవు?" వాస్తవమునకు రమణ మహర్షి ఎన్నడును తిరువణ్ణామలై దాటియుండలేదు. గాని వారు ధైర్యముగా తాము కూడ ఇతరులవలె వ్యాప్తి చేయుచున్నట్లు చెప్పియుండిరి. అది ఎట్లు సంభవము? చిత్రముగా కానవచ్చినను అది జరిగినది. పాల్‌బ్రౌన్ మెన్ అను ప్రసిద్ధ ఆంగ్లేయ జర్నలిష్టు రమణ మహర్షిని గూర్చియు, అతని సందేశముల గూర్చియు తెలుసుకొను తలంపులో తిమవణ్ణామలై వెళ్ళియుండిరి. వారే "పవిత్ర హిందూ దేశమున తమ పరిశోధన" (In Search of Secret India) అనెడి పుస్తకమున రమణ మహర్షిని గూర్చి ప్రపంచమున వ్యాప్తి యొనర్చినది. రమణ మహర్షి వారికి కబురుచేసి రప్పించలేదు. మహర్షికి వారంతకు పూర్వము తెలియనే తెలియదు. ఈ విధముగనే వ్యక్తి శాంతి విశ్వశాంతికి మూలమగుచుండును.

కావున ప్రథమమున మనము అనాసక్తతతో బంధరాహిత్యులమై మనలో శాంతి నెలకొల్పుకొనవలెను. తక్కిన దంతయు తనకు తానే లభించుచుండును.

ఓం ! తత్సత్ ! ఓం !

# శాంతి ఎచ్చట లభిస్తుంది?

**– శ్రీరమణ జీ,** ప్రేమ సమాజం

తోటపల్లి కొండల ప్రక్కన యున్న శాంతి ఆశ్రమములో ! ! !

ప్రపంచానికి ఆదర్శనీయులు పరమపూజ్యశ్రీ ఓంకార్ మహరాజ్ తమ శరీరమును తృణప్రాయముగానెంచి ఆత్మ సాక్షాత్కారము కొరకు కృషి చేసి, ఆత్మసాక్షాత్కారమును పొంది వారు పొందిన అనుభూతిని ప్రపంచములో యున్న వారికందరకు పంచిపెట్టాలనే సంకల్పముతో శాంతి ఆశ్రమాన్ని 1917లో స్థాపించి స్వదేశ విదేశములలో ప్రచారము చేసి, అనేకమైన భౌతిక కష్టములనుభవించారు, దీనికి కారణం! ఆత్మ పరీక్ష, ఈ పరీక్షలో నెగ్గగలరా నెగ్గలేరా అన్నదే దైవసంకల్పము స్వామీ శ్రీమహరాజ్ నెగ్గగలరు. నిరామయమైన తోటపల్లి కొండలలో 200 ఎకరముల విస్తీర్ణము గల పీటభూమికి ఒకరూపము దిద్దగలిగారు. ఫల వృక్షాలతో పుష్పవనాలతో సిద్దపురుషుల విగ్రహాలతో రకరకాల పక్షుల ఓంకార ధ్వనులతో ఎచ్చట నిలబడిన కూర్చున్నా ఓంకార శబ్దము వినిపిస్తూ యుంటుంది. సహజ ప్రశాంత నిలయం, శాంతి ఆశ్రమము. దీనికి అనుబంధ సంస్థలు విదేశములలోను, స్వదేశములోను కూడా నెలకొల్పి అనేకమంది భక్తులను తరింపజేస్తూ యున్నారు. శాంతి ఆశ్రమము పూర్తిగా అభివృద్ధి కాకపోవడానికి కారణం ఒకటి యున్నది ఏమనగా! శాంతిశుద్ధ సాత్వీక గుణము. కోరికలతో కూడుకున్నది రాజసము, యించుమించు ప్రపంచములోని ఆశ్రమాలన్ని రాజసముతో కూడుకున్నవే. తమోగుణముతో గూడిన మహత్తులను చూపడం ద్వారా ప్రజలకు వ్యామోహం కల్పించడం, ఆ వ్యామోహములో ప్రజలు పడి, వారి కోరికలు ఫలించాలని ఆశ్రమాభివృద్ధికి సహకారం అందజేయడం జరుగుతూ యుంటుంది. ఈ విధముగా ఆశ్రమాలు అభివృద్ధి పొందుతూ యుంటాయి.

అయితే ఈ శాంతి ఆశ్రమములో తమోగుణ రాజస మహత్ములు లేకుండా అందరిలోను పరమాత్మయున్నాడు. ఆయాత్మానుభూతిని ఎవరికి వారే పొందవచ్చును. అని ప్రపంచములో యున్న వారందరకు ప్రభోదిస్తూ యుంటారు ఓంకార్ స్వామీజీ.

ఆత్మసాక్షాత్కారమంటే సామాన్య విషయమా! అయినా వారి అనుభవాన్ని అతి సులువైన మార్గములో భక్తులకు భోదిస్తూ యుంటారు. స్వామీజీ అజప గాయిత్రీ మంత్రాన్ని (అనగా "సోహం" సో, అనగా పరమాత్మ, హం, అనగా నేను – సో×హం–సోహం నేనే పరమాత్మను, ప్రతి జీవి జన్మించగానే నేనే పరమాత్మను అని మౌనముగా శ్వాస ద్వారా జపిస్తూనే యుంటుంది. మనలో యుండే మనస్సుకు మాత్రం తెలియదు. (ఆ మనస్సుకు తెలియజేయుటే రహస్యం) శ్వాస ద్వారా సర్వకాల సర్వాస్థలందు జపించమని బోధిస్తూ యుంటారు. ఆ మంత్రాన్ని సాధన చేసినవార్కి సంసార వ్యామోహం తగ్గి అమనస్కులై ఆత్మసాక్షాత్కారమునకు చాలా దగ్గరగా చేరగలరనేది సత్యం. అది సాధకుని దీక్షను బట్టి యుంటుంది ఫలితం.

సాధారణముగా స్వాములవార్లు పాదపూజలు చేయించుకొని కట్నాలు పుచ్చుకొని మంత్రోపదేశము చేస్తూ యుంటారు. ఓంకార స్వాములవారిని 43 సంవత్సరముల నుండి నేను ఎరుగుదును. ఈ నలుబది మూడు సంవత్సరములలో ఏ ఒక్కరి చేత పాదపూజ చేయించుకొని ధనమార్జించునట్లు కనిపించలేదు.

అందువల్లే శాంతి ఆశ్రమము స్థాపించి సంవత్సరములు నడుస్తూ యున్నా తాబేలు నడకవలె నడుస్తూ యుంది. కుందేలు వలె పరుగెత్తలేదు. ఎప్పటికైనా తాబేలే విజయము సాధిస్తుంది అన్నది సత్యం.

ఇటువంటి ప్రశాంతమైన స్థలము మన ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా లేదనే చెప్పాలి. శాంతి ఆశ్రమము అభివృద్ధి పొందవలసినది చాలా వున్నది. శ్రీ ఓంకార్ స్వాములవారు అనుకున్న ప్రకారం అభివృద్ధి పొందినట్లయితే సర్వ ప్రపంచమునకు ఆదర్శనీయమైన ఆశ్రమముగా మారగలదు. శాంతిని కోరే అన్ని దేశాలవారు శాంతి ఆశ్రమాన్ని దర్శించి శాంతిని పొందగలరు.

శాంతి ఆశ్రమము స్థాపించుటకు మూల కారణం! ప్రపంచములో జాతిమత వర్గబేధములు లేకుండా సర్వత్రా నిండియున్న పరమాత్మను అందరు పొందుటకు హక్కు గలదని సాధకులకు కుటీరములు ఏర్పాటు చేసినారు.

అన్ని జన్మలకంటే మానవజన్మ ఉత్తమమైనది. ఈ జన్మలోనే మోక్షార్హత యున్నదని దైవజ్ఞులు అంటూ యుంటారు. దేవతలకు మోక్షార్హత లేదనియు వారి పుణ్యక్షయము క్షీణించిన వెంటనే భూలోకములో జారిపడతారని పురాణాలు ఘోషిస్తూ యున్నాయి. శాంతిని పొంది పరమాత్మను పొందాలనే కోరిక అందరికి యుంటుంది. అయితే శాంతిని పొందదానికి ఓ నిర్ణీతమైన స్థలమంటూ యుండాలి. అట్టి స్థలము శాంతి ఆశ్రమము.

మనము జీవించి యుండగానే మంచిపనులు చేసి పరమశాంతిని పొంది పరమాత్మను దర్శించాలి. గనుక ప్రపంచములోని ఆత్మసోదర సోదరీమణులందరు ముందుకువచ్చి ప్రపంచ శాంతిని కోరే శాంతి ఆశ్రమమును ప్రపంచశాంతి నిలయముగా రూపొందించగలమని ఆశిద్దాం.

హరి ఓం తత్సత్ ఓం

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

* **మతమనగా భగవదారాధన. ఈ సమస్తమైన చరాచర ప్రపంచమంతయు భగవంతుడే. జ్ఞానికి మతము, జీవితము ఒక్కటే.**

* **ఆత్మ ఒక మహాసముద్రము. ప్రతిబిందువు ఎంత అల్పమైనను సంపూర్ణమైన సాగరము కంటే భిన్నము కానట్లే జ్ఞాని యొక్క ప్రతి ఆలోచన విశ్వమంతకు చెందిన కర్మగానగును.**

# నేనెరిగిన ఓంకార్ స్వామీజీ

**– శ్రీ కంభంపాటి రామశాస్త్రి (తారకం)**

భారతదేశంలో ఒక మారుమూల 'శాంతి ఆశ్రమం' ఉన్నది. దేశ దేశాల నుండి ప్రజలు యాత్రికులుగాఆ ఆ పావన ప్రాంగణంలో నిరంతరం ప్రవేశిస్తుంటారు. భాష, భావం, దేశం, వర్ణం, ఆచారం, వాతావరణం, వీటిలో ఉండే వ్యత్యాసాలన్నింటిని స్మరించి దూరమనక, భారమనక, వ్యయ ప్రయాసల కోర్చి, గంపెడాశతో తోటపల్లి కొండల ప్రాంతానికి భిన్నరుచులు గల స్త్రీ పురుషులు ఎందుకు పయనమౌతారు? ఆ ప్రదేశంలో ఉన్న ఆకర్షణ ఏమిటి? వింతలా, వినోదాలా, ప్రాచీన కళాఖండాలా, ఆధునిక కర్మాగారాలా, ప్రకృతి శోభలా, ప్రణయ విహారాలా, భూసారమా, భూగర్భ సంపదా? అక్కడ ఒక మహాఋషి సందర్శన బాగ్యం కొరకు, అక్కడ అనుభవానికి వచ్చే ప్రశాంత వాతావరణం కొరకు–అంతే!

స్వామి ఓంకార్‌కు 70 సం॥లు నిండబోతున్నాయంటే ఆ శాంతి దూతను గురించి ఎన్నెన్నో విశేషాలు, వారి శిష్యులకు, పరిచయస్థులకు, భక్తులకు స్మృతి పథంలోకి రావడం సహజం. నేను బ్రహ్మ సామాజికుడను, గురువుల యందు మూఢభక్తి అంధవిశ్వాసం ఉండే వారిలో నేనొకడిని కాను. స్వామీజీలో నన్నాకర్షించినదేమి? ఆధ్యాత్మిక విజ్ఞానంలో, సాధన సంపత్తిలో, భక్తి విశ్వాసాలలో మహోన్నత స్థాయికి చేరుకొన్న మహామహుల మార్గదర్శకత్వాన్ని, అనుభవ పూరితమైన ప్రబోధాలని అందరూ అంగీకరిస్తారు.

నేనెరిగిన స్వామీజీ గురుశుశ్రూష సహించరు, తామే సామాన్య మానవసేవ చేస్తామంటారు. ఎక్కువగా ప్రబోధాలు చెయ్యరు. తామే వింటామంటారు, వ్యర్థమైన వాక్యార్థాలతో కాలం వృథా చెయ్యరు. అర్థమయ్యే సామాన్య సంభాషణలో భక్తి మార్గాన్ని వ్యక్తపరుస్తారు. నిగూఢమైన సత్యాన్వేషణతో కాక, నిరాడంబరమైన జీవితం, ప్రగాఢమైన విశ్వాసాన్ని ప్రకటిస్తారు. తానే గురువునని తానే చెప్పేదే వేదమనీ అనక, మహాత్ములందరు విన్నవించిన విషయాలన్నీ వినదగుని సమన్వయపరుస్తారు. శాంతి కొరకు కళ్లు మూసుకొనక, శాంతి కొరకు అహర్నిశలు పామరులచే కూడ ప్రణవమంత్రం పలికిస్తారు. సమీపంగా చేరడానికి భయం గొల్పే మఠాధిపతిగా దూరం చెయ్యక దగ్గరగా చేర్చుకొనే తండ్రివలె శాంతి వెదజల్లుతూ అనాథలను, ఆశ్రితులను సమీపిస్తారు. ఆయనకు దేశం విదేశం అనే వివక్ష లేదు. ఆయన కొండమీద నుండగలరు. కోటలో నివసించగలరు. రాళ్లమీద నడవగలరు. కారులో వెళ్లగలరు. ఏకాంతంగా ధ్యానించగలరు. సమూహంలో ఉపాసన చెయ్యగలరు. కోయిల పాట విని, కొలనులో నీరు త్రాగి ఉండగలరు. అన్ని అవస్థలలోను ఒక్కరీతిగా ఉండగల సాధకులాయన. స్వామీజీ ఆశ్రమం అనేకులకు ఆశ్రయం, భక్తులకు ఆరామం, దీనులకు నిలయం, ఆరోగ్యం కొరకు వైద్యాలయం, విజ్ఞానం కొరకు విద్యాలయం, పరమార్థం కొరకు ప్రార్థనాలయం, ఆయన ఆశ్రమంలో అంగాలుగా జీవరాసులను ఆకర్షిస్తాయి. నెనెరిగిన స్వామీజీ. ఉపనిషత్సుక్తులనే, తన నిత్యజీవన వేదంలో నుంచి, అనుక్షణ నైతికానుభవాల నుంచి సేకరించి, మెల్లగా, చల్లగా ఉపదేశిస్తారు. అవి హృదయాలకి హత్తుకుంటాయి. కార్‌డ్రైవర్లు, కంకరరాళ్లు, ముళ్లపొదలు, పాముపుట్టలు, మెకానిక్కులు, వంటవాళ్లు, డ్రైవర్లు, రాజులు, రాణీలు, దొరలు, దొంగలు, పరిపాలకులు, తపోధనులు, అన్న అందరూ ఆయన కార్యవస్తువులే. ఆయన ప్రసంగ పాఠములే. నెనెరిగిన స్వామీజీ వంటి మహాసంసారి లేరు. స్వార్థనాశనమే ఆయన సన్యాసం. 'ఇక్కడే, ఇప్పుడే' భగవానుని చింతించడం, ప్రేమను ప్రసాదించడం. శాంతిని ప్రచారం చెయ్యడం, విశ్వాసంతో జీవించడం, ఇదే నేనెరిగిన స్వామీజీ మతం. అవని మీద కాళ్లు, ఆకాశంలో విహారం.

అనర్హుడనైన నేను అవ్యాజమైన ఆయన ప్రేమకు ఎంతో ఋణపడ్డాను. కేలుమోడ్చి. వారు శతాధిక వత్సరాలు ఆయురారోగ్యానందాలతో శాంతిని విరివిగా పంచి పెడుతూ వర్ధిల్లాలని భగవానుని ప్రార్థిస్తూ ఓంకార్‌జీకి ప్రణమిల్లుతున్నాను.

# శ్రీ గురుదేవులతో నా చిన్ననాటి కొన్ని జ్ఞాపకాలు

– శ్రీ కక్కిరాల ఆత్మారాం

నాకు 4 సంవత్సరముల వయస్సుప్పుడు మేము మా తాతగారింట పిఠాపురంలో వుండేవారము. శ్రీ స్వామీజీ హిమాలయముల నుండి సామర్లకోటలో అయోధ్యరామయ్యగారింటికి వచ్చినట్లు కబురు వచ్చుటచే నేను మా అమ్మగారితో రెండెడ్లబండిలో సామర్లకోట వెళ్ళితిని. వెళ్ళగనే స్వామీజీ నన్ను ఆదరముగ దరికి తీసుకొని ఒడిలో కూర్చోపెట్టుకొని నుదిటిపై ఓంకారము వ్రాసి, హరేరామ నామము పఠింపచేసి ఎప్పుడూ రాంరాం అనుకోమని చెప్పారు. తరువాత భక్తులు కొందరు మీరు హిమాలయములకు వెళ్ళి దర్శన భాగ్యము లేకుండ చేయుటకన్న ఇచ్చటనే యుండి మీ సేవకు అనుగ్రహించమనిరి. ఒక భక్తుడు శ్రీ లక్ష్మణస్వామి ఈ స్థలము ఇచ్చుట జరిగినది. అప్పటినుండి తల్లిదండ్రులతో తరచు వచ్చేవాడిని ఇది అంతా అరణ్యము. తుప్పలు, ముళ్ళలో నుండెడిది. అప్పుడు దిమ్మలు కట్టిన మామిడిచెట్టు ఒక్కటే వుండేది. దానికి ఉయ్యాల కట్టుకొని వుండెడివారు. ఆ చెట్టుపై ఒక పొడుగు వెదురుపై కాషాయ జండా వుండేది. చాలా దూరము కనపడేది. రోడ్డు లేదు. పుంత మార్గమే. దుర్గాడ స్టేషను నుండి రెండెడ్ల బండిలో ప్రయాణము. ఆశ్రమపు బండి వుండేది. ఆ ఎడ్లకు రామలక్ష్మణులని పేరు. ఎంత గోతులయినా జాగ్రత్తగా తీసుకువచ్చేవి.

ఆశ్రమంలో స్వామీజీయే స్వయముగా త్రవ్వి రాళ్లు రప్పలు తీసి బాగుచేసెడివారు. సాయంత్రము ఆగుసరికి చేతులు బొబ్బలెక్కి రక్తము కారేది. మా అమ్మగారిని అందరు తల్లిగారు అనేవారు. ఆవిడ స్వామీజీ చేతులకు నూనె వ్రాసేవారు. ప్రతిదినము అదే దినచర్య. తరువాత నుయ్యి త్రవ్వించి మొక్కలు పెంచారు. పువ్వుల మొక్కలన్న వారికెంతో ఇష్టము. ఎక్కడెక్కడినుండో తెప్పించి పెంచేవారు. ఎప్పుడూ ధనలోపము. కూలివాళ్ళకు ఇవ్వవలసిన డబ్బులేక కాలినడకన రాత్రి బయలుదేరి రాజమండ్రి వెళ్ళి తెల్లవారుసరికి నాన్నగారి నుండి డబ్బు, బియ్యము, పప్పులు తీసుకొని వచ్చెడివారు. మొదట ప్రార్థన మందిరం మా తల్లిదండ్రులు కట్టించారు. ఇప్పుడున్న సుశీల మందిరముకు ఇవతలగా ఒక కుంకుడు చెట్టు వుండేది. స్వామీజీ అక్కడే ఒంటిరాటపాకలో ఉయ్యాలలో వుండేవారు. ఆ రాటకు ఒక నల్లని త్రాచు చుట్టుకొని వుండేది. మా చిన్నతనములో పాములు యధేచ్ఛగా తిరుగుతూ కనబడేవి. ఎవరినీ ఏమి చేసేవికావు. ఇంక చెదలు అపరిమితము. స్వామీజీ బోధ విని లేచేసరికి చాపక్రింద చెద పురుగులు ఒకోసారి మా బట్టలు కూడ తినేసేవి.

తరువాత గుహకట్టారు. బ్రహ్మచారిగా నేను స్వామీజీ దగ్గరనే వుండేవాడిని. స్వామీజీ ఎప్పుడూ వ్రాసుకొనుచు, చదువుకొనుచు వుండేవారు. రాత్రి అంతా ఇంచుమించు అలాగే వుండేవారు. గంటలు తరబడి ధ్యానములో వుండేవారు. అక్కడ అరుగు మీద పడుకునేవారు. నేను వారి కాళ్ళ దగ్గర పడుకునేవాడిని.

కొంతకాలం నలుగురు బ్రహ్మచారులం వుండేవాళ్ళం. స్వామీజీ మమ్ములను క్రమశిక్షణలో వుంచేవారు. ఉదయం 4 గంటలకు లేచుట, ధ్యానము చేయుట చేసేవారము. డైరీ తప్పక వ్రాయించేవారు.

నానబెట్టిన పెసలు, గోధుమలు, పచ్చికూరలు తినేవాళ్ళము. కొంతకాలము తరువాత వంట చేసుకునేవాళ్ళము. ఒక్కొక్కసారి మర్నాటికి ఏమి వుండేది కాదు. స్వామీజీ రేపటికి ఒక బియ్యపు గింజ కూడ లేదు అంటే భయపడకండి దేవుడే చూస్తాడు అనేవారు. అలాగే మరుసటి రోజు ఎవరో ఆశ్రమ సందర్శనకు వచ్చుటో లేక పోస్టులో మనియార్డరు రావటమో జరిగేది.

స్వామీజీ ఎప్పుడు చాలా ధైర్యముగా వుండేవారు. తోటపల్లి కొండలలో ఒక గుహలో పిచ్చివాడనేవాడు వుండేవాడు. అతను ఆశ్రమ అభివృద్ధి చూడలేక స్వామీజీ అంటే ఈర్ష్యతో వుండేవాడు. అటువంటివాడు స్వామీజీని తన గుహలో వుండుటకు రమ్మనెను. మాకెవరికి ఇష్టము లేదు. కాని ఒక సాయంకాలము వెళ్ళారు. కాని మర్నాడు ఉదయమే రాలేదు. మాకు కంగారు. స్వామీజీని ఏమైనా చేసి వుంటాడను భయము ఆందోళనతో వుండగా చాలా ఆలస్యముగా వచ్చి **"ఎందుకు అధైర్యము, చావు అనునది ఒకేసారి వచ్చును దానికి సిద్ధముగా నుండవలెను. దైవమును నమ్మినవానికి హాని కలుగదు"** అని చెప్పారు. శత్రువులను కూడా మిత్రులుగా చూచేవారనుటకు ఇది ఒక ఉదాహరణము. స్వామీజీ ఇంకా "బద్ధకము వుండకూడదని, ఏదో ఒక మంచిపని చేయాలని, ప్రతి ఉచ్ఛ్వాశ నిచ్ఛ్వాశలో దేవుని స్మరించాలని, ధ్యానము ముఖ్యమని" నుడివెడివారు.

ఆశ్రమం స్థాపించిన మొదటి రోజులలో స్వామీజీ మంత్రించి ఇచ్చిన జలముతో జబ్బులు నయమగుచున్నవని చాలామంది చుట్టుప్రక్కలవాళ్ళు వచ్చేవారు. స్వామీజీ తేలును చేతిపైకి ఎక్కించుకునేవారు. తరువాత ఇవి మానివేసినారు. ఎందుకని ప్రశ్నించగా ఇవి అన్ని సాధనలో వచ్చునని, మనిషి నీళ్ళపై నడచుట, ఆకాశములో ఎగురుట మొదలగు అనేక శక్తులు వచ్చునని, వాటికి లొంగిన పతనమేనని, వాటికి త్రొక్కి పైకి పోతేనే మోక్షమునకు, దైవ సాన్నిధ్యము చేరుట జరుగునని నుడివెడివారు.

స్వామీజీ రాజమండ్రి తరచు వచ్చేవారు. వంకాయలవారి వీధిలో ఇప్పుడు శ్రీరామ బాలభక్తి లైబ్రరీ వున్న ఇంటిలో మేము వుండేవారము. ఒకసారి దసరా టైమ్‌లో స్వామీజీ మా ఇంటికి వచ్చారు. నేను నాయుడు స్కూలులో చదివేవాడిని. పిల్లలందరము దసరా పద్యములు చదువుతూ రోడ్డుపై అందరిండ్లకు వెళ్ళేవారము. ఒకరోజు ఇంటికి వచ్చేసరికి స్వామీజీ ఒరే రాముడూ నీమాట అందరికన్నా బాగా వినబడుతున్నదని అన్నారు. నేనంటే వారికంత ప్రీతి.

1924లో అమెరికా వెళ్ళే ముందు శ్రీ స్వామి రాజేశ్వరానంద మన ఆశ్రమములో వుండేవారు. నాకు ఇంగ్లీషు చదువుట మాట్లాడుట నేర్పారు. మేము అమెరికా వెళ్ళినప్పుడు ఆశ్రమము ఆయనే చూచుకొనేవారు. మదర్ మరియ, ఎంట్రికనులు ఫిలడల్ఫియాలో వుండేవారు. స్వామీజీ గురించి ఏదో పత్రికలో చదివి ఉత్తర ప్రత్యుత్తరములు జరిపేవారు. వారికి సంతానము లేదు. స్వామీజీనే తమ సుపుత్రుడని అమెరికా రావలసినదని ఒత్తిడి చేసి అన్ని ఏర్పాట్లు చేసినారు. కావలసిన బట్టల దగ్గర నుండి ప్రయాణము ఖర్చుల వరకు పంపినారు. అప్పుడు స్వామీజీ నన్ను పంపమని మా తల్లిదండ్రులను అడుగగా వారు అంగీకరించి ప్రయాణ ఖర్చులు భరించినారు. అచ్చట 1 1/2 సంవత్సరములు మరియ ఆశ్రమంలో వున్నాము. మదర్ మరియ, ఎంట్రికన్‌ల గృహమును ఆశ్రమముగా స్వామీజీ ఉపయోగించెడి వారు వారమునకు ఒకరోజు క్లాసులు నడిపెడివారు. అక్కడి వారందరు వచ్చి స్వామీజీ బోధలు విని రోజూ

డైరీ వ్రాసి తరువాత వచ్చినప్పుడు వారివారి ఆధ్యాత్మిక సందేహములను తీర్చుకొనెడివారు.

నేను హైస్కూలులో చదువుచుండగా సోదరి సుశీలగారు అమెరికా నుండి వచ్చినారు. అమ్మగారితో కొలంబో వెళ్ళి ఆమెను ఆశ్రమమునకు తీసుకువచ్చినాము. ఆమె ప్రేమ, దయాదేవత. మూగజీవులను కూడ ఎంతో ప్రేమగా చూచేవారు.

నేను స్వామీజీ, సుశీలగారితో కలసి ఉత్తరదేశములోని అనేక పట్టణములు చూచుకొనుచు కాశ్మీరు వెళ్ళితిమి. ఆ సందర్భములో జరిగిన ఒక సంఘటన. మేము రావల్పిండికి రైలులో 3వ తరగతిలో ప్రయాణము చేయుచుంటిమి. సుశీలగారిని కొంచెం సదుపాయముగా కూర్చుండబెట్టాము. ఒక స్టేషనులో చాలామంది ఆ పెట్టెలో ఎక్కారు. అందులో ఒక పంజాబి అతను మాతో ఆమె అలా కూర్చొనుటకు వీలు లేదని వారికి కూర్చొనుటకు స్థలము లేదని గొడవ చేసెను. వెంటనే స్వామీజీ తను లేచి అతనికి స్థలము ఇచ్చిరి. తరువాత కొన్ని కరపత్రములు ఇచ్చి బోధించిరి. అంత కోపముగా నున్న అతను స్వామీజీని క్షమాపణ కోరి మమ్ములను టికెట్లు రద్దు చేయించి సయాల్‌కోటలో వారి బంధువుల ఇంటికి తీసుకువెళ్ళి 4 దినములు మంచి ఆతిథ్యము ఇచ్చి వారి కారులో జమ్ము తీసుకువెళ్ళిరి. వారే కాశ్మీరు రాజావారి మత గురువుల ఆతిథ్యము ఏర్పాటు చేసిరి.

స్వామీజీకి బహిరంగ సభలలో ప్రసంగించుట ఇష్టము లేదు. తమ వద్దకు భక్తితో వచ్చి చెప్పినది మననము చేసి ఆచరణలో పెట్టేవారంటేనే ఇష్టము.

ఒక జన్మదిన సందర్భమున నిర్వాణ మందిర శంకుస్థాపన జరిగినది. అప్పుడు నేను శ్రీ స్వామీజీతో ఇప్పుడు ఉన్న కుటీరములే ఖాళీగా ఉంటున్నవి ఇంకనూ ధనము ఖర్చు చేసి నూతన కుటీరములెందుకు ఆ ధనము ఆశ్రమము గురించి ప్రచారము చేయుటకు ఉపయోగించిన బాగుంటుందని అన్నాను. మా అమ్మగారితో శంకుస్థాపన జరిపించినారు. ధనము కుటీరము కట్టుటకు ఉపయోగించుట నాకు ఇష్టము లేనందున మా అమ్మగారు శంకుస్థాపన చేయుటకూడ నాకు ఇష్టము లేదు. కాని ఇప్పుడు ఈ అభివృద్ధి చూచిన తరువాత నా యొక్క సంకుచిత బుద్ధికి సిగ్గు పడుచున్నాను. వారి మనోభావం తెలియని అల్పుడను. ఈ లౌకిక ప్రపంచములో పడి స్వామివారి వద్ద వుండి సేవ చేయాలనే కోరికను తీర్చుకోలేకపోయాను.

ఓం. ఓం. ఓం.

**తృప్తి లేనివారికి మానసిక వ్యథ తప్పదు. అది తప్పవలెనన్నచో దైవమును శరణు వేడి కలిగినదానితో తృప్తి చెంది శాంతిగ జీవించవలెను.**

# చదువు - చదువు - చదువు

- శ్రీమతి గవరసాన సుభద్ర, U.S.A.

ఉదయం లేచిన దగ్గర్నుండి ప్రతి ఇంట - ప్రతి నోట మనం వినేది బిడ్డలను శ్రద్ధగా చదవండి, కష్టపడి చదవండి. మీరు డాక్టర్లు కావాలి, ఇంజనీర్లు కావాలి, లాయర్లు కావాలి ! ! దేనికి ??

బిడ్డలను క్రమశిక్షణతో పెంచి చక్కటి వ్యక్తులుగా తీర్చిదిద్ది, కష్టపడి చదువుకోమనడంలో తప్పు ఏమి లేదు!

బిడ్డలకు లేచిన వెంటనే, "ఓం శాంతి" మంత్రం జపించడం ముందుగా నేర్పించాలి! సంవత్సరానికి ఒకసారి తోటపల్లి వెళ్ళి, మాతాజీ గారిని చూపించి, శాంతి మంత్రం జపిస్తే సరిపోదు! మనం ఇంటికి వచ్చాక కూడా మన బిడ్డలతో సాధన చేయించాలి.

మనం శాంతి మంత్రం జపిస్తూ, మన బిడ్డలతో చేయించాలి. వారిని చేయమని, వారితో పాటుగా మనం కూడ ఓం శాంతి మంత్రాన్ని జపించాలి.

బిడ్డలకు ఉదయాన్నే లేవగానే ఒక గ్లాసు మంచినీళ్ళు తాగించాలి! తరువాత ఓం శాంతి మంత్రాన్ని 2 లేదా 3 ని॥లు చేయించాలి. తరువాత 3 సార్లు సూర్య నమస్కారాలు చేయించాలి. తరువాత 10 ని॥లు ధ్యానం చేయించాలి. ఇది బిడ్డల దినచర్యగా వుండాలి!!

Modern Technology సమాజానికి ఎంతవరమో, అంత శాపం కూడ. మనిషికి మనిషికి మధ్య కమ్యూనికేషన్ లేదు. ఏ టెక్నాలజీ అయినా తగినంతవరకు, అవసరం అయినంత వరకు ఉపయోగించుకోవాలి. యువతరం అశాంతితో అల్లాడిపోతుంది. న్యూక్లియర్ ఫ్యామిలీస్ వచ్చాయి. కుటుంబమంటే భార్యా - భర్త, పిల్లలు. ప్రస్తుత కుటుంబ వ్యవస్థ అలా వుంది.

## నేటి యువకులే - రేపు నాయకులు

చక్కటి యువకులుంటే - చక్కటి నాయకులు తయారవుతారు.

తలిదండ్రులను బట్టి - బిడ్డలుంటారు.

Children are Mirrors of their Parents

Families represents Society

విద్యా వ్యవస్థ మారాలి. ప్రస్తుత విద్య ధనసంపాదనకే కేవలం ఉపయోగపడుతుంది. మనోవికాసానికి ఉపయోగపడదు. మనిషికి ధన సంపాదన అవసరం. లోకంలో బిడ్డలకు చదువు - ధన సంపాదనతో పాటుగా మానవత్వపు విలువలు కూడ నేర్పించాలి.

బిడ్డలకు ముందుగా ఇంట్లో వారితో, గౌరవంతో, దయతో ప్రవర్తించడం నేర్పించాలి. అలా పెరిగిన బిడ్డలు పెద్దయ్యాక తల్లి-దండ్రులను, భార్యా బిడ్డలను గౌరవంతో చూడగలరు.

లోకంలో అతి కష్టతరమైంది బిడ్డల సంరక్షణ. తల్లిదండ్రులే వారికి ఆదర్శం. తరువాత మంచి

గురువు సన్నిధి కావాలి. బిడ్డల పెంపకంలో తల్లిదండ్రులు చాలా త్యాగం చేయాలి. బిడ్డలు చేయకూడదు. ఈ విధంగా మాట్లాడకూడదు. అనుకున్నవి ముందుగా వారు చేయకూడదు. దానికి చాలా త్యాగం, క్రమశిక్షణ కావాలి తల్లిదండ్రులకు!

వచ్చిన ఆదాయంలో ప్రతినెల కొంత దాన ధర్మాలకు కేటాయించడం బిడ్డలకు నేర్పాలి! అనాథ శరణాలయాలను బిడ్డలకు చూపించాలి. వివరంగా చెప్పాలి. దయా దానం కరుణ ఇవి ఇంటి నుండి మొదలు కావాలి!!

బిడ్డలను బయట ఆడుకోనివ్వాలి. వారు ఆటల్లోనే పాఠాలు నేర్చుకుంటారు. సంగీతాన్ని నేర్పించాలి. సంగీతం మనసును సున్నితం చేస్తుంది. శాంతి పత్రికలో వచ్చే శ్లోకాలను చదివి వినిపించి, వారితో చెప్పించాలి. దానివలన వారి ఉచ్ఛారణ బాగుంటుంది. ఆలోచన పెరుగుతుంది. తల్లిదండ్రులమనే అధికార భావం చూపించకూడదు. వారి మనసును అర్థం చేసుకొని, సున్నితంగా ప్రవర్తించాలి. స్నేహితులుగా మెలగాలి. అప్పుడు వారు సున్నితంగా వుంటారు. పిల్లలను కొట్టడం, కసరడం లాంటివి చేయకూడదు. వారి సున్నితమైన మనసు గాయపడుతుంది! బిడ్డలు దైవ స్వరూపులు, శాంతి ప్రియులు! భవిష్యత్తు వారిదే! మనది కాదు.

సమాజానికి మనమందించే అమూల్యమైన కానుక బాధ్యతతో, సేవా భావంతో, క్రమశిక్షణతో పెరిగిన బిడ్డలను! వారితో చక్కటి నవ సమాజం ఏర్పడుతుంది.

సర్వేజనా సుఖినోభవంతు!!

## శ్రీ స్వామి ఓంకార జీ

**- బ్రహ్మశ్రీ సాంబమూర్తి**, శ్రీ శాంతి ఆశ్రమం

నేను సాంబమూర్తిని తేది 2-3-1993 సం.లో శ్రీ శాంతి ఆశ్రమమునకు వచ్చితిని. తేది 21.1.1995 పూజ్య శ్రీ స్వామి ఓంకార మహారాజ్ వారి శత జయంతి ఉత్సవములు. పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీవారు ది. 21.1.1995 ఉదయం 5 గం॥లకు నన్ను పిలిచి పూజ్యశ్రీ స్వామి చిదానంద మహారాజ్ వారిచే శ్రీ ఓంకార స్వామీజీ వారి షోడశపచార పాదుకపూజ చేయించండి. అని చెప్పి పూజా విధానం పుస్తకము నా చేతికిచ్చారు. సద్గురు కరుణ వలన చాలా బాగా జరిగినది. భక్తులు 55 వేల మంది ఆశ్రమానికి వచ్చారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు శ్రీ స్వామి ఓంకార జీ వారి పాదుక పూజ చేస్తూనే వున్నాను. అనేకసార్లు పాదుక పూజ చేస్తున్నప్పుడు శ్రీ స్వామీజీ మౌనంగా దర్శనం ఇస్తున్నారు.

# శ్రీ శ్రీ శ్రీ ఓంకార స్వామికి సమర్పించిన నవశ్లోక సుమమాలిక

- శ్రీ కనమలూరు వేంకట శివయ్య, I.A.S.., Rtd.

శ్లోకం 1 : ద్రష్టు మిచ్ఛసి వైకుంఠం
కైలాసం, బ్రహ్మ మందిరమ్
గచ్ఛ శాంత్యాశ్రమం భక్త్యా
సర్వం త్వం తత్ర పశ్యసి

మిత్రమా! వైకుంఠం, కైలాసం, సత్యలోకం చూడాలని ఉన్నదా! భక్తి భావంతో, శాంత్యాశ్రమం పో, అచట మూడు లోకాలు చూస్తావు

శ్లోకం 2 : శాంత్యాశ్రమ వనేసంతి
ఫలపుష్ప సమన్వితాః
వృక్షాస్తే, స్వామిన్, పుష్ప
ఫలానిచ దదత్య హో!

శాంత్యాశ్రమంలో, పుష్ప ఫలములతో గూడిన చెట్లు ఉన్నాయి. ఆ చెట్లు, మన స్వామికి ఓంకార స్వామికి, నిత్యం పూలు పండ్లు సమర్పిస్తాయి.

శ్లోకం 3 : పికాశ్చ సంతి వృక్షాగ్రే
కూజంతా శ్చ సర్వదా
ఓంకార స్వామి చారిత్రం
తత్ర గచ్ఛ, చ - తత్ శ్రుదు

ఆ శాంతి ఆశ్రమంలోని చెట్లపై, కోకిలలు కూర్చొని, మధుర మధురంగా ఓంకార స్వామి గాధను గానం చేస్తున్నాయి. అచటకి పో, హాయిగా స్వామి గాధను విను.

శ్లోకం 4 : తద్వనే భూరుహే, పత్రే
లతాయం కుసుమ్నే పిచ
ఓంకార స్వామినం పశ్య
ధన్య స్త్వం భవసి ధ్రువమ్

ఆ వనంలోని చెట్లలో, చెట్లలోని ఆకులలో, పూతీవెలలో, పూలలో సర్వాంతర్యామి అయిన ఓంకార స్వామి దర్శనమిస్తారు. పో, పోయి చూడు, తప్పక నీ జన్మ తరిస్తుంది. నీవు ధన్యుడవు అవుతావు.

శ్లోకం 5 : పరబ్రహ్మాంశ సంజాతం
వేద వేదాంత వేదినమ్
శ్రీ శాంత్యాశ్రమ ధాతారం

ఓంకార స్వామినం భజ

మిత్రమా! పరబ్రహ్మ అంశలో పుట్టినవారూ, వేదములు, వేదాంగములు, వేదాంతము తెలిసినవారూ, శ్రీ శాంత్యాశ్రమమునకు పుట్టుక నిచ్చిన వారూ అయిన ఓంకార స్వామిని పూజింపుము.

శ్లోకం 6 : యో భక్తా శ్రిత మందారం
యో భక్తం పాతి సర్వదా
భక్త సేవా నిమగ్నస్తం
ఓంకార స్వామినం భజ

భక్తుల పాలిటి వరములూ, ఆశ్రయము ఇచ్చు మందారవృక్ష సమూహం, భక్తులను ఎల్లప్పుడూ రక్షించువాడూ, భక్తులకు సేవ చేయుటలో నిమగ్నుడూ, అయిన ఓంకార స్వామిని పూజింపుము.

శ్లోకం 7 : మహాజ్ఞానీ మహాభక్తః
మహాగురుః మహాసుధీః
కృపా శైవలినీ యస్త్వం
ఓంకార స్వామినం భజ

సర్వము తెలిసినవారూ, మహా భక్తుడూ, గొప్ప గురువూ, గొప్ప పండితుడూ, దయానిధీ అయిన ఓంకార స్వామిని పూజింపుము.

శ్లోకం 8 : సత్యమేవ ధనుర్యస్య
ధర్మోయస్య శరఃఖలు
అధర్మఘ్నః సదా యస్తం
ఓంకార స్వామినం భజ

సత్యమును విల్లుగా కలిగినవాడూ, ధర్మమును బాణముగా కలిగినవాడూ, ఎల్లప్పుడూ అధర్మమును ధ్వంసం చేయువాడూ అయిన ఓంకార స్వామిని పూజింపుము.

శ్లోకం 9 : త్రికాలజ్ఞం గుణాతీతం
స్థిత ప్రజ్ఞంచ, యోగినమ్
లోక సంక్షేమ కర్తారం
ఓంకార స్వామినం భజ

జరిగినదీ, జరుగుచున్నదీ, జరుగనున్నదీ తెలిసినవాడు. తామస, రాజస, సత్త్వ గుణములను అధిగమించినవాడూ, సుఖ దుఃఖములకూ, చలి, వేడిమి – ఇలాంటి ద్వంద్వములకు అతీతుడూ, లౌకిక భోగములను విసర్జించిన యోగీశ్వరుడూ, లోకమునకు శాంతి భద్రతలు చేకూర్చువాడూ అయిన ఓంకార స్వామిని పూజింపుము.

# మధుర స్మృతులు

**- శ్రీ వింజమూరి రాధాకృష్ణ,** కాకినాడ.

అత్యంత మధురాతి మధురమైన సంఘటన 1953 సంవత్సరం ఆగస్టు నెలలో జరిగింది. నాకు 10 సంవత్సరముల వయసు. గోదావరికి ఉధృతంగా వరదలు రావడం వల్ల రైళ్ళ రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. మా అదృష్టవశాత్తు స్వామీజీ మాత్ర ఆశ్రమంలోనే ఉన్నారు. వారితో సన్నిహితంగా గడిపే అదృష్టం లభించింది. ఒకరోజు సత్సంగంలో 'నువ్వు శాంతి ప్రార్థన చెప్పు' అని నాకు మహాదవకాశం ఇచ్చారు. తన్మయత్వంతో రోజూ చేసే ఆ ప్రార్థన చేసి ఇంకా చాలా ఉన్నాయి చెప్పనా అని అమాయకంగా అన్నాను. వారు నవ్వి సరే కానియ్ అని సంజ్ఞ చేశారు.

భగవద్గీత 15వ అధ్యాయం ప్రార్థనగా చేశాను. స్వామీజీ ముచ్చటపడి దగ్గరకు తీసుకున్నారు. ఇప్పటికీ ఆ సంఘటన తలుచుకున్నప్పుడు ఈ జన్మ ధన్యమైనది అనిపిస్తుంది. ధృవుడు భాగవతంలో శ్రీ మహావిష్ణువు స్పర్శలో బహుశ ఇట్టి అనుభూతే పొంది ఉంటాడు అనిపిస్తుంది. అందుచేతనేమో పెద్దయ్యాక స్వామీజీతో మా కుటుంబ అనుబంధం మరింత అర్థవంతమైంది. శాంతి పత్రిక చదవడం, స్వామీజీ నుంచి ఆదేశాలు అందుకుని అమలు పరచడం వంటివి వానిలో కొన్ని. ముఖ్యంగా ఆనాటి కార్యదర్శి రాజుగారు స్వామీజీ ఆదేశాలు చీటి రూపంలో తెచ్చేవారు. పేదపిల్లల్ని కాలేజీలో చేర్చడం, వారి గురించి ప్రత్యేక శ్రద్ధ వహించడం, ఆశ్రమం నుండి కాకినాడ వచ్చిన స్వాములని స్వామీజీ ఇతర భక్తుల ఇండ్లకు గాని పోవడం లాంటి సేవలు ఎంతో ఆనందాన్నిచ్చేవి.

1975 సం॥లో ఈ సంఘటన జరిగింది. మా కుటుంబమంతా ఆశ్రమం వెళ్ళాము. వేసవికాలం మామిడి, జీడి మామిడితో చెట్లన్నీ ఆహ్లాదంగా ఉన్నాయి. సాయంత్రం సత్సంగం అయింది. ఆశ్రమంపై తీసిన 16 ఎంఎం ఫిల్ము కూడా చూచి, అందరం జయ జయ రామకృష్ణ హరి ఓం... అంటున్నాము. అందరం వరుసలో స్వామీజీ స్వహస్తాలతో ఇచ్చే ప్రసాదం ఆనందంగా స్వీకరిస్తున్నాం. స్వామీజీ ముందు ఆశ్రమంలో మిగల ముగ్గిన పనసతొనలు అరటి ఆకు నిండాపోసి ఉన్నాయి. అందరం పనస తొనలు అందుకుంటున్నాం. భక్తులు వందమందిపైనే ఉంటాం. అందరికీ పనసతొనలిస్తున్న స్వామీజీ హఠాత్తుగా అది ఆపి మా అమ్మగారికి మాత్రం ప్రక్కనే ఉన్న సీసాలోని కలకండ ఇస్తూ "సంతోషమే కదా!" అన్నారు. అమ్మ కళ్ళు చెమర్చాయి. గదికి వచ్చాక మహానుభావుడురా, ప్రత్యక్ష దైవంరా స్వామీజీ అంటూ ఎంతో ఉద్వేగ భరితురాలైంది. "ఈ రోజు నేను మనసులో స్వామీ ఏమిటీ పరీక్ష నాకు అనుకున్నా" ఎందుకంటే పనస నేను కాశీలో వదిలేశాను. ఏం చెయ్యాలి? ఆయనకున్న సమదృష్టి స్థాయి మనం అందుకోలేం. నా మానసిక మొర విని స్వామీజీ నాకు మాత్రం కలకండ ఇచ్చి నన్ను ధన్యురాలిని చేశారు!! అన్నారు. స్వామీజీ ఒక **MISTIC YOGI.**

**జీవన్ముక్త :** స్వామి రామానంద తీర్థ వంటివారు స్వామీజీని 'జీవన్ముక్తుని'గా భావించారు. ఇందుకు నాకూ వేలాదిమంది భక్తులకు ఒక అనుభవం కలిగింది. అది 1980వ సంవత్సరం. నేను పైండా వారి కాలేజీలో లెక్చరరుగా ఉన్నాను. మా కళాశాల అధ్యక్షులు శ్రీ రామకృష్ణమూర్తి గారు ధార్మికులు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎన్నో నిర్వహించే విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షులు. వారి అధ్యక్షతన కాకినాడలోని ఆనందభారతి మైదానంలో 15వ అఖిలాంధ్ర సాధు పరిషత్ మహాసభలు జనవరి 25, 26, 27 తేదీల్లో వైభవంగా

జరిగాయి. స్వామీజీని ఒకరోజు ప్రసంగం చేయవలసిందిగా సాధు పరిషత్ వారు కోరారు. స్వామీజీ అయిష్టంగానే 'సరే' అని చివరకి అంగీకరించారు. శ్రీ బద్రీ నారాయణ లునానీ కార్యదర్శిగా ఉన్నారు. ఆయన స్వల్ప అస్వస్థత వల్ల సంయుక్త కార్యదర్శిగా ఆ సభ నిర్వహణ బాధ్యత నాపై పడింది. మధ్యాహ్నం 3 గం॥లకు స్వామీజీ ప్రసంగం. నేను "ఇప్పుడు శాంతాశ్రమ వ్యవస్థాపకులు శ్రీశ్రీశ్రీ స్వామి ఓంకార్‌జీ మహారాజ్ తమ దివ్యాశీస్సులని మనకు ఇస్తారు" అని ప్రకటించా. వేదికపై నున్న అనేకమంది స్వాముల మధ్య దివ్య తేజస్సుతో వెలిగిపోతున్న శ్రీ ఓంకార స్వామిపై వేలాది కళ్ళు తిరిగాయి. అందరూ చెవులు రిక్కించుకొని ఆతృతగా స్వామి అమృతవాక్కు వెలువరిచే దివ్య సందేశం కొరకు చకోర పక్షుల్లా ఎదురు చూస్తున్నారు. గాఢమైన నిశ్శబ్దం, పిల్లా, పాపా ఉన్నా గానీ చీమ చిటుక్కుమంటే వినిపించేంత నిశ్శబ్దం. అంతా ప్రశాంతత, క్షణాలు నిమిషాలూ దొర్లిపోతున్నాయి. స్వామీజీ అనట్టు కాలం ఆగదుగా అదే నిశ్శబ్దం... ప్రశాంతత. సుమారు 10 నిమిషాలు గడిచిపోయి ఉంటాయేమో తెలీదు. స్వామీజీ ప్రక్కనే ఉన్న పెద్దాపురం ఓంకార స్వామి నెమ్మదిగా మన స్వామీజీ చెవిలో "స్వామీజీ మీ ప్రసంగానికై అందరం ఆతృతగా ఎదురుచూస్తున్నాం" అని గుర్తు చేశారు. ఈ సన్నివేశం తలుచుకున్నప్పుడల్లా అనిర్వచనీయమైన ఆనందానుభూతి కలుగుతుంది. స్వామీజీ సచ్చిదానందానుభూతిలో బ్రహ్మైక్య భావనలో ఉంటారు. అది వేదికైనా ఆయన మందిరమైనా ఆయనకు ఒకటే. వేలాదిమందిని మేము చూస్తున్నాం. ఆయన దృష్టి వేరు. తరువాత నిశ్శబ్దాన్ని ముగిస్తూ స్వామీజీ నెమ్మదిగా ప్రణవనాదం చేసి "నా మౌనాన్ని అర్థం చేసుకోండి. నా మాటలూ అర్థమౌతాయి. ఎవరు మాటలాడాలి? ఎవరితో మాట్లాడాలి. "ఏకమేవా ద్వితీయం" అని ప్రారంభించి 'సోహం'పై కొద్దిసేపు ప్రసంగించారు. వారిది అత్యున్నత స్థాయి అని గ్రహించే శ్రీరామానంద తీర్థ "స్వామీజీ మీరున్న ప్రపంచం వేరు. దానిలోనే మీరుండండి" అన్నారు. అంతటి అద్వైత స్థాయికి ఎవరు చేరగలరు. ఏ రమణ మహర్షివంటి వారో తప్ప. ఇలాంటిదే ఒకసారి ఆదివారం ఎలిమెంటరీ స్కూల్లో ఉదయం జరిగే సత్సంగంలో అందరం "జయ గణేశ జయ గణేశ" అని భజన చేస్తున్నాము. 5 సం॥ల వయసున్న మా అబ్బాయి నా ఒళ్ళో కూర్చుని కొంచెం కునుకు తీస్తున్నాడు. నేను తట్టి భజన చెయ్యి అన్నాను. వాడు నెమ్మదిగా "స్వామీజీ నిద్రపోతున్నారు" అన్నాడు అమాయకంగా. అర్ధనిమీలిత నేత్రాలతో కేవలం భౌతిక శరీరం మాత్రమే ఇక్కడ ఉండి, ఆ బ్రహ్మైక స్థితిలో ఉన్న స్వామీజీని చూచినపుడు "సర్వశక్తి పనిచేయుచున్నది. జీవుని విశ్రమింపనిమ్ము" అనే దానికి ఆయన సజీవ ఉదాహరణయే అనిపించింది. ఒకసారి సాయం సంధ్యవేళ ఒక సేవకుడు వచ్చి "స్వామీజీ మోటారు చెడిపోయింది. నీళ్ళు రావడం లేదు" అన్నాడు. స్వామీజీ నిశ్చలంగా శరభవరం/కత్తిపూడికి మనిషి వెళ్ళాడా అన్నారు. అతడు "పంపించాము సరైపోతుంది" అన్నాడు. అంతకు రెండు రోజుల ముందే నాకు కాకినాడలో ఈ సమస్యే వచ్చింది. నేను మూర్ఖంగా అజ్ఞానంతో "స్వామీజీ మీకు కూడా ఈ బాధలు తప్పవా! అన్నాను. ఆయన జవాబుగా ఇచ్చిన చిరునవ్వు నా కళ్ళకి కట్టినట్టు నేటికి కనిపించి సేద తీరుస్తుంది. నా అజ్ఞానాన్ని దివ్వెగా పటాపంచలు చేస్తుంది. బాధలు అందరికీ ఒకటే! నువ్వు పడ్డ బాధ 'నీ' కోసం. నేను పడే బాధ 'మీ' కోసం. అమ్మ, పిల్ల, పాపలతో వచ్చావు కదా! ఇలా ఎంతమంది ఆశ్రమ వాసులున్నారు. రేపు ఉదయం నీళ్ళు రాకపోతే ఎన్ని ఇబ్బందులు పడతారు?" అన్నారు. నిజమే స్వామీజీకి నీళ్ళ కొదవేమిటి?

# నాకు తెలిసిన ఓంకార స్వామి

**- శ్రీ యాసరపు సత్యనారాయణ**

ఓంకారస్వామి వారి పాదపద్మములకు ప్రణామములు అర్పిస్తూ, నా బాల్యము నుండి శ్రీ స్వామి సన్నిధిలో పెరిగాను. నాకు చిన్ననాటి నుండి 4 గం॥లకు లేవడం అలవాటు. ఎప్పుడు లేచి చూచినా స్వామివారు ఏదో ఒకటి వ్రాస్తు ఉండేవారు. ఆ రోజులలో ఆశ్రమములో విద్యుత్ కాంతులు లేవు. కాని స్వామి తపస్సు ఫలితము యొక్క ప్రభావంతో తేజోవంతమైన వాతావరణం వలె ఉండేది. ఈ ఆశ్రమము ఇక్కడ వెలియడం మన పూర్వపుణ్యము. ఆయన శ్రమ అంతయింతయని చెప్పలేము. ఈ ఆశ్రమం పెద్ద పెద్ద గుబురు పొదలతో ఉండేది. దీనిని పరిశుభ్రం చేయించి, నిత్యం ఆశ్రమం గురించి పరితపించేవారు. పనిచేసేవారు అంటే స్వామికి అమితానందం.

నిత్యం కొండ ప్రక్కన శివాలయం ఉన్నది. ఆ గుడివద్దకు రోజు ఆయనతో పాటు మమ్ములను తీసుకు వెళ్ళేవారు. ఆయన నిరంతరం ధ్యానపరులు. ఉదయం 6 గం॥లకు వెళితే 9 గం॥లకు తిరిగి వచ్చేవాళ్ళం. ఎవరైనా భక్తులు వచ్చి స్వామిని దర్శించి వెళ్ళేటప్పుడు 3 సార్లు ఓంకారం జపించి, రాం రాం అంటూ ఆశ్రమము చూసి వంటశాల దగ్గర ఫలహారం తీసుకొని వెళ్ళమనేవారు.

స్వామివారికి అన్నిమతాలు సమానమే. కృష్ణ పరమాత్మ విగ్రహం - వేదాల సారాన్ని, క్రీస్తు విగ్రహం ఓర్పు-శాంతిః సహనంగా ఉండాలని, బుద్ధ విగ్రహం - ఎంత రాజకుమారుడైనా విరాగియై ధర్మాచరణ చేయాలని. గాంధీజీ విగ్రహం - ఎల్లప్పుడు సత్యవ్రతుడై నిత్యము మెలగవలెనని, ఆ విగ్రహాలను చూసి మానవాళి మసులుకుంటారని స్వామీజీ మార్గం చూపించారు.

# ఓంకారస్వామి ఆశయాలు

**- శ్రీ వై.ఎస్.ఎన్. మూర్తి**

ఓంకారస్వామి ఆశయం, జీవాత్మ పరమాత్మ లయం సిద్ధించటానికి సర్వమానవులకు శాంతి ఆశ్రమ స్థాపన, ముముక్షులకు శాంతి ప్రార్ధన. ఆత్మయొక్క ఉనికి, విశ్వ జ్ఞానానికి ఎంతో తేజస్సు, ఓజస్సు కలిగిస్తుంది. శాంతి ప్రార్ధన అర్ధం జీర్ణించుకుని, ఓంకార ఆనందమయ ఆత్మ స్వరూపాన్ని అనుభవించాలని, ఓంకార స్వామి శాంతి ప్రార్ధనను ప్రసాదంగా యిచ్చారు.

గీతలో శ్రీకృష్ణ పరమాత్మ చెప్పినట్లు, జ్ఞానేశ్వరీ మాతాజీ కర్మయోగులు, అనాసక్తిగా, సదా ఓంకార స్వామి కర్తవ్య కర్మను ఆచరిస్తూ, ముముక్షువులను ఆర్తులు అక్కునజేర్చి, ఆత్మ జ్ఞానాన్ని, అలసిన జీవాత్మలకు, ఆనందాన్ని అందిస్తున్నారు. జనకుడు మొదలైనవారు చిత్తశుద్ధిని కర్మయజ్ఞం వల్లే ముక్తిని పొందారు. శ్రేష్టులైన వ్యక్తుల ఆచరణ వలనే శాంతి ఆశ్రమము ఎల్లకాలం బ్రహ్మ విద్యాకేంద్రంగా భాసిల్లాలని ఆశిస్తూ ...

# శ్రీ శాంతి ఆశ్రమంతో నా అనుబంధం

**- శ్రీమతి ఇందిర**

పూర్వాశ్రమములో శ్రీ శాంతి ఆశ్రమములో తొలి గురుకుల బాలికల 5 గురిలో ఒకరినైన నా పేరు ఇందిర. నా తొలి ఆధ్యాత్మిక గురువు శ్రీ ఓంకారస్వామివారు. ఆనాడు మేము 5 గురమే స్వామివారి శిక్షణలో ఉండేవారము.

స్వామీజీతో మా అనుభవాలు చిన్ననాటివే అయినా తక్కువ కాలములోనే మా జీవితాలలో ఆధ్యాత్మిక పునాది స్వామివారి శిక్షణలోనే పడిందని నేను ఎల్లప్పుడూ తలంచుకుంటాను.

7, 8 సం॥ల మధ్య వయస్సులో నేను శాంతి ఆశ్రమంలో ఉన్నట్లు గుర్తు. అప్పటికి అక్కడ ఉన్న ఎంతోమంది సాధకులతో మాకు మంచిమాటలు, మంచి పనులు, మంచి శ్లోకాలు, మంచి పాటలు నేర్పించేవారు. తోటపల్లి ఆశ్రమ బ్రాంచి విశాఖపట్నము కూడ స్వామీజీతో పాటు మమ్మల్ని తీసుకొని వెళ్ళేవారు. మాకు స్వామి స్వయంగా సముద్రములో ఈత నేర్పించేవారు. కైలాసగిరి ఆశ్రమము స్వామితో నడచి సునాయాసంగా ఆ కొండపైకి ఎక్కేవారము. అవన్నీ మాకు తీపి గుర్తులుగా తలంచుకుంటాము.

స్వామీజీ మా ఆట పాటలను కూడ గమనిస్తూ ఉండేవారు. ఇసుకలో గూళ్లు కట్టి పిచ్చి మొక్కలతో అలంకరిస్తూ, ఆడుకుంటూ ఉన్నప్పుడు స్వామివారు కూడ కొన్ని మొక్కలు అందిస్తూ అవి అమర్చుకుంటూ ఉంటే చూసి చాలా ఆనందించేవారు. మరునాడు వారు వ్రాసే వ్యాసాలలో ఆ సందర్భాలు కనిపిస్తూ ఉండేవి. మా పుట్టినరోజు వస్తే మమ్మల్ని విష్ చేసిన పిమ్మట రకరకాల పండ్లతో, చాక్లెట్స్, డ్రైఫ్రూట్స్, పెన్నులు, పెన్సిల్స్, పుస్తకాలు ఒక చక్కటి బాస్కెట్ అందంగా అలంకరించి, అవి ఒక్కొక్కటిగా ఓపెన్ చేసి చూడమనేవారు. అవి ఒక్కొక్కటిగా విడదీసి చూసుకొని ఎంతో ముచ్చటపడే మమ్మల్ని చూసి స్వామీజీ ఎంతో ఆనందించేవారు.

స్వామివారు భోజనము చేసే సమయములో మేము ఆ పరిసరాలలో ఉంటే గోధుమ అన్నం, కూరలు కలిపిన ముద్దలు మా చేతిలో పెట్టేవారు. ఆ ప్రసాదము ఎంతో రుచికరముగా ఉండేది. ఇవన్నీ ఒక దివ్యమైన అనుభూతిగా ఎల్లప్పుడూ తలంచుకుంటూ ఉంటాను.,

శ్రీ రాజుగారి క్రమశిక్షణ, శ్రీ జ్ఞానేశ్వరి మాతాజీవారి ఆలన పాలన, శేషమ్మగారి ఆహార సదుపాయములతో మేము కొంతకాలము శాంతి ఆశ్రమములో పెరిగినాము. తదుపరి తిరిగి మా తల్లితండ్రుల వద్దకు వచ్చేసి కౌమార, సంసార జీవితములతో కొంత ఆశ్రమ జీవితానికి దూరమయినాము. కాని ప్రస్తుతము మేము సీనియర్ సిటిజన్స్ అయి ఎన్నో జీవితానుభవాలతో గడిపినవారమే అయినా ఒక్కసారి శ్రీ శాంతి ఆశ్రమముతో అనుబంధము ఉన్నవారమెవరైనా మా ఆశ్రమము అనే భావనతోనే ఉండటము శ్రీ స్వామీజీ ప్రేమానుభవాల దివ్యానుభూతిగా భావిస్తూ ఉంటాము.

ఎందరో మహానుభావుల ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, నిత్యము సత్‌సంగాలు, ప్రార్థనలు జరుగుతూ సహజ ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ గడపి ఎంతో శాంతితో తిరిగి రాగలిగే ప్రదేశము మన శ్రీ శాంతి ఆశ్రమము అనుట అతిశయోక్తి కానే కాదు.

# సద్గురు పరబ్రహ్మణే నమః

**– శ్రీరాంజీ మాష్టారు**, విశాఖపట్నం.

శాంతి ఆశ్రమ శతాబ్ధి ఉత్సవంలో అందరం పాల్గొని శాంతి ప్రార్థన చేస్తూ విశ్వశాంతి కోసం ఓంకారుల పాద పద్మములను ధ్యానం చేసే భాగ్యం కలగడం మా పూర్వజన్మ పుణ్య ఫలం. స్వామి ఓంకారులు తను శాంతిని పొంది అందరిలో తననే దర్శించి వారి ఆనందమే తనకు శాంతి సుఖముగా భావించి శాంతి ఆశ్రమమున స్థాపించారు. 1917లో వారు స్థాపించిన శాంతి ఆశ్రమము సంసారమనే ఎడారిలో నీటి కోసం తాపత్రయపడే బాటసారులకు నీటిని – నీడను ఇచ్చే చెట్టు సూర్యతాపము పోగొట్టి ఆశ్రయం కల్పించినది, నీటిచెలమలాంటిది శాంతి ఆశ్రమం. అచ్చట ఆశ్రయం పొందిన నేను 1977లో హిందీ ఉపాధ్యాయునిగా చేరాను. వాల్తేరు ఆశ్రమం ప్రశాంత వాతావరణం. ఆశ్రమ పాఠశాలలో 7వ తరగతి వరకు విద్యార్థులు ఉన్నారు. చుట్టూ పెద్ద పెద్ద వృక్షాలు రావి, మర్రి, మామిడి, వేప వృక్షాలు. దగ్గరలోనే సాగర తీరం. ప్రతిచెట్టు కొమ్మలకు తెలుగు, ఇంగ్లీషు భాషలలో దివ్యమైన సూక్తులు వాటిని చదువుతూ వుంటే, ఆ చెట్లే మనకు ఆ సూక్తులు బోధిస్తున్నాయన్న అనుభూతి కలిగింది నాకు. 250 సూక్తులు వాటిని నేను వ్రాసుకుని, ప్రతిరోజు సూక్తులు చదివి, వానిని జీవితంలో ఆచరణలో పెట్టి దాని ఫలితంగా స్వామి వారు బోధించిన శాంతిని అనుభవిస్తూ సంకీర్తన – శాంతి ప్రార్థనతో జీవితం సాగిస్తున్న సాధకుడను.

నేను 10,000 (పదివేల సార్లు) శాంతి ప్రార్థన లెక్కపెట్టి చేశాను. తర్వాత లెక్క పెట్టడం మాని వేసి, నేను శాంతి ప్రార్థన చేస్తూ పదిమందితో చేయిస్తున్నాను. స్వామి వారి 'మౌనపు ఘడియలు' ప్రార్థనలు చేస్తూ మా భక్త బృంద సభ్యులందరు ఆశ్రమ సేవలో పాల్గొని శాంతి – సౌఖ్యములు పొందాము.

సాధకుడా! వ్యక్తి శాంతి లోకశాంతికి పునాది. నీ కుటుంబమును "శాంతి కేంద్రము"గా మార్చుము. అన్న స్వామీజీ సూక్తిని 40 ఏళ్ళుగా ఆచరణలో పెట్టి దాని ఫలితముగా శాంతిని పొంది ప్రశాంత జీవితము గడుపుచున్న వ్యక్తిని. నాలాంటివారు చాలామంది ఉన్నారు. మా బృందములో మరికొన్ని స్వామీజీ సూక్తులు.

పని చేయవానికి తినే హక్కు లేదు. ప్రార్థన చేయనివానికి జీవించే హక్కు లేదు. ఈ సూక్తులను పదిమందికి ప్రచారం చేస్తూ శాంతి ప్రార్థన వారితో చేయిస్తూ ఉన్నాము. 100 గ్రామాలలో శతాబ్ధి ఉత్సవ సందర్భంగా శాంతి ప్రార్థన కేంద్రాలను ఏర్పాటు చేస్తామని మా బృంద సభ్యులు శ్రీ మాతాజీ వారి ఆశీస్సులు కోరుతూ...

# భూతల స్వర్గం కోటగిరి శ్రీ శాంతి ఆశ్రమం

**- శ్రీ మేళ్ళచెర్వు వీరాంజనేయులు,** నరసరావుపేట

తమిళనాడులోని నీలగిరి పర్వత శ్రేణులలో 3 ముఖ్య పట్టణాలు (హిల్ స్టేషన్స్) ఉన్నాయి. 1. ఉదక మండలం (ఊటీ) 2. కూనూరు 3. కోటగిరి. సముద్ర మట్టానికి సుమారు 6,800 అడుగుల ఎత్తులో కోటగిరి వున్నది. పచ్చని తేయాకు తోటలు, జామాయిల్ చెట్లు (యూకలిప్టస్), సతత హరితముల వలె 365 రోజులు చల్లని ప్రదేశం ఊటీ కంటే చల్లని ప్రదేశం. ఊటీ కంటే జీవన వ్యయం (కాస్ట్ ఆఫ్ లివింగ్) చాలా తక్కువ. ప్రతి 10 నిమిషములకు ఊటీ వెళ్ళడానికి, ప్రతి 15 నిమిషములకు కూనూరు వెళ్ళడానికి, ప్రతి 30 నిమిషాలకు కొండ క్రింద ఉన్న మెట్టుపాలెం వెళ్ళడానికి బస్సు సౌకర్యం ఉంది. ఊటీకి 27 కి.మీటర్లు, కూనూరుకు 22 కి.మీ., మెట్టుపాలానికి 32 కి.మీ. దూరంలో కోటగిరి వున్నది.

కోటగిరి శాంతి ఆశ్రమంలో స్వామీజీ నెలకొల్పిన ప్రాథమిక పాఠశాల ఉచిత విద్య అందించాలనే తలంపుతో ఏర్పడింది. మాతాజీ దాని అభివృద్ధి కొరకు నాడెంతయో కృషి చేశారు. నేడు విశ్వశాంతి మెట్రిక్యులేషన్ పాఠశాలగా కేవలం కోటగిరి ప్రాంతమే కాకుండా నీలగిరి జిల్లాలో మొదటి శ్రేణిలో తమిళనాడు రాష్ట్రంలో పేరు ప్రఖ్యాతులు పొందింది. ఎల్.కె.జి. నుండి మెట్రిక్యులేషన్ వరకు కంప్యూటర్, తదితర అధునాతన విద్యను బోధిస్తున్నారు. విద్యార్థులకు ఇక్కడ సీటు దొరకడం చాలా కష్టం. లభించినవారు మంచి మార్కులతో ఉత్తీర్ణులై వారి భవిష్యత్తును తీర్చిదిద్దుకుంటున్నారు. భారతదేశంలో నేడు యోగ గురించి ప్రచారం జరుగుతున్నది. కానీ, మొదటి నుండి యోగ & మెడిటేషన్ (ధ్యానం) జరగటం ఈ పాఠశాల ప్రత్యేకత. ఈ పాఠశాల అభివృద్ధికి దాతల విరాళాలు, చక్కటి అధ్యాపక సిబ్బంది ముఖ్యంగా శ్రీమాన్ సాయిబాబా సి.ఎ. గారి నిరంతర కృషి కారణమని చెప్పడానికి సందేహం లేదు.

ఆ రోజులలో కోటగిరి ఆశ్రమంలో వసతులు అంతంతమాత్రంగా ఉండేవి. స్వామీజీ, మాతాజీ తదితర భక్త బృందం ఉండే భవనం, ప్రార్థనా మందిరం, ప్రక్కన గదులు, చల్లారాం గెస్ట్‌హౌస్ - ఒక పెంకుపంచతో నాలుగు గదులు దాని ప్రక్కనే వంట గది - 20 మంది మాత్రం కూర్చునే భోజనశాల ఉండేది. నల్లస్వామి, పాపాయమ్మల వంటకాలతో తృప్తి పడి ఆధ్యాత్మిక జీవనం గడిపేవారము.

నేడు 100 మందికి సరిపడే అధునాతన భోజనశాల 60,70 మంది భక్తులకు సరిపడే అన్ని వసతులతో కూడిన భవనాలు, గదులు. మే నెల మొత్తం 2 పర్యాయాలుగా సాధనా శిబిరములో కోటగిరి శాంతి ఆశ్రమం దేదీప్యమానంగా విరాజిల్లుతున్నది. సాధనా శిబిరములలో అవకాశం దొరికినవారు చాలా అదృష్టవంతులు. చల్లటి ప్రదేశం, ప్రాతఃకాలం 5 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు - చక్కటి కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, విందు భోజనాలతో ఏర్పాట్లు చేయడం గొప్ప అనుభూతి.

మాతా జ్ఞానేశ్వరి, మాతా వినమ్ర, సాయిబాబా గార్ల పర్యవేక్షణలో పై కార్యక్రమాలన్నీ నిర్వహిస్తూ భక్తులను తల్లివలె ఆప్యాయతతో ఆదరిస్తూ అహర్నిశలు మాతృ ఆశ్రమం, కోటగిరి ఆశ్రమం, తదితర బ్రాంచి ఆశ్రమాలన్నింటికి అందించే సేవకు కొలమానం లేదు.

సుమారు 30 సంవత్సరాల నుండి పై ఆశ్రమాలన్నిటితో పరిచయ భాగ్యం కలిగి క్రమం తప్పకుండా కోటగిరి ఆశ్రమానికి, వీలును బట్టి మిగితా ఆశ్రమాలకు వెళ్ళటం మా పురాకృత సుకృతంగా ఆశిస్తున్నాము.

ఆశ్రమ శతజయంతి ఉత్సవాలు కదు రమ్యంగా జరుగుతాయని, అటువంటి శక్తి స్వామి ఓంకార్‌జీ మనందరికి తప్పక కలగజేయగలరని నా ప్రగాఢ విశ్వాసం.

# పంచరత్న పద్యమాలిక

- శ్రీ ఆకొండి సూర్యప్రకాశరావు
తెలుగు పండితుడు, శంఖవరం

తే॥ శ్రీలు పొంగుచు నిండారు సీమ భువిని
తోటపల్లెను గ్రామంబు మేటి గాను
రామతీర్థ బోధనలతో రమణులైన
పూజ్య ఓంకారస్వామి! ఓ పుణ్య చరిత!!

సీ॥ నీటి తుంపర యెన్ని పాటులందిన గాని
తెలియనేర్చునె మహాజలధి గుట్టు
నదియెంత పొంగినా అది పట్టునే పయో
నిధిని హస్తములతో నిముషమైన
చీమకు సాధ్యమా చెట్టుకొనకు ప్రాకి
భాస్కరు వర్ణింప భగ్నమగును
అజ్ఞాని పల్కునా సుజ్ఞాన బోధనల్
తలక్రిందలుగా పడి తపముజేసి

ఆ.వె. అటులే శాంతి ఆశ్రమా స్థాపకుల శ్రేష్ఠ
శాంతి ప్రార్ధనొసగు సచ్చరితుని
శక్తి తేజమెంచ సాధ్యమా? జనులకు
ఎంతవారికైన ఎన్నియుగములైన

తే॥ భావ సంశుద్ధి కలుగుటే భక్తి అగును
పుణ్యకార్యాలు చేయుటే పూజయగును
అట్టి స్థితి నేడు జనులకు ఎట్టులనిన
అవని "ఓంకార సద్బోధ"యందె గలుగు

ఆ.వె. నిఖిల లోకములకు నిండుగా ధీటైన
అఖిల పాప జాల మణచివైచి
లోకశాంతి కొరకు ఏకమౌ ప్రార్థనే
భక్త జనులకు రక్ష! భద్రమగును !

ఆ.వె. సంద్రమందు పడిన చాలును బిందువు
తాను సింధువగును, దానివలెను
మనసు శాంతి మార్గమై సంచరింపగ
చాలు, ఇతర దారులేల మనకు!!

# నేనెరిగిన శాంతి ఆశ్రమం

**- శ్రీ గొల్లపూడి నాగేశ్వరరావు,** శ్రీశాంతి ఆశ్రమం

నా ప్రథమ ఆశ్రమ సందర్శన1982లో అప్పటికి ఇప్పటికి ఆశ్రమం ఎంతో అభివృద్ధి చెందినది. పూజ్య స్వామివారితో కలసి మాట్లాడే భాగ్యం నాకు దొరకలేదు.

1982 నుంచి పూజ్య మాతాజీ ఆధ్వర్యంలోనే ఆశ్రమం మంచి అభివృద్ధి అయినదని నా ఉద్దేశ్యం. పూజ్య మాతాజీ వారి భక్తి, నిరాడంబరము, వారి కృషి గురించి నాకు ఎన్నో సంఘటనలు తెలుసును. కొన్ని మాత్రమే వ్రాసెదను. 1985 నుంచి నేను పూజ్య మాతాజీతో కోటగిరి వెళ్ళుతూ వుండేవాడిని. వారు చెప్పే పనులు చేసేవాడిని. ఒకసారి నాతో కోయంబత్తూరు నుండి సామర్లకోట రైలు టికెట్లు తీసుకోమని చెప్పినారు. అమ్మా! ఏజంటుకు ఫోన్ చేస్తే సరిగ్గా పని జరగటం లేదు గాన ఉదయమే మెట్టుపాలెం వెళ్ళి టిక్కెట్లు తెచ్చెదను అన్నాను. (అచ్చట అల్పాహార సమయం 9.00 గంటలకు) అలాగే వెళ్ళే ముందు నాకు కనపడి వెళ్ళమని చెప్పినారు. ఆ ప్రకారమే 6.30 గంటలకు వెళ్ళినాను. ఈలోగా వారు యిడ్లీ సిద్ధం చేయించి అరుణతో నాగేశ్వరరావు వస్తారు. యిడ్లీ పెట్టు అని చెప్పి వారు గదికి వెళ్ళినారు. పెద్ద ఆశ్రమంనకు ఆధ్యాత్మిక అధిపతి అయినా ఆమె నా గురించి అంత శ్రద్ధ తీసుకొనుట వారి నిరాడంబరమును సూచిస్తుంది. ఇటువంటివి ఎన్నో ఉదాహరణలు గలవు.

పూజ్య మాతాజీ సంకల్పించుకుంటే ఆ పని పూర్తి అగును. ఎవరిని విరాళం అడగరు. శాంతి పత్రికలో వేసెదెరు అంతే.

ఒకసారి పూజ్య మాతాజీ వారితో హైదరాబాద్ వెళ్లినాను. శ్రీరతన్‌లాల్‌గారి ఇంటివద్ద వున్నాము. వారు చాలా మంచి కుటుంబము. దాన ధర్మములు బాగా చేసేవారు. ఒకసారి మాతాజీతో ఆశ్రమమునకు ఏదైనా అవసరము వున్న చెప్పిన చేయించెదమని శ్రీమతి పుష్పగారు (రతన్‌లాల్ గారి ధర్మపత్ని) అన్నారు. దానిపై మాతాజీ అన్ని వున్నవి. ఏమీ అవసరము లేదన్నారు. నేను దగ్గరగానే వున్నాను. తర్వాత మాతాజీ ఒక్కరే వున్నప్పుడు అమ్మా! వంటశాలకు కరెంటు పోతే చాలా కష్టం అవుతూ వున్నది. జనరేటరు వుంటే నీరు, లైటింగు వుండును చెప్పమని కోరినాను. నేను అడగను అన్నారు. 3 రోజులుండి వచ్చి వేసినాము. ఆశ్రమం వచ్చిన రాత్రి సత్సంగము అయిన తర్వాత రేపు 10 గంIIలకు ఒకసారి పైకి రమ్మనమని చెప్పినారు. ఆ ప్రకారం వెళ్ళగా హైదరాబాద్‌లో భక్తులు యిచ్చిన కవర్లు విప్పి అన్ని వ్రాయమన్నారు. అన్ని పేర్లు, మొత్తం రశీదులు వ్రాయగా 35, 36 వేలు అయినది చెప్పగా మీరు ఏదో అడగమని చెప్పినారు గదా అది ఈ సొమ్ముకు వచ్చునా అన్నారు. వచ్చునని చెప్పగా కొనమని చెప్పినారు.

వాసవీ సదన్ (సత్రం గదులు) మరామత్తుకు 10 లక్షలు అగునని అంచనా వేసి శాంతి పత్రికలలో వేసినారు. మే నెలలో కోటగిరి వెళ్ళినాము. అచ్చట వుండగా వాసవీ కన్యకాపరమేశ్వరి జన్మదినము వచ్చినది. వైశ్యులు అందరూ పూజ చేసి ప్రసాదములు పంచినారు. విరాళములు వచ్చినవి. బాగుగా గదులు తయారు అయినవి.

2011 వేసవి తరగతులు కోటగిరిలో పూర్తి అయిన రోజున మద్రాసు, విజయవాడ, తిరుపతి, గుంటూరు నుండి వచ్చిన భక్తులు పూజ్య మాతాజీవార్ని ఆశ్రమం గురించి, పూజ్య స్వామీజీ గురించి

ఏమైన చెప్పమని కోరగా పూజ్య మాతాజీ 1 గంట చెప్పినారు. ఆ గంటలో వారి గురించి కాని, పూజ్య శాంతమ్మగారు (స్వామివార్కి గొప్ప సేవ చేసిన పూజ్య మాతాజీగారి చెల్లి గారు) గురించి గాని ఒక్క ముక్క రాకపోవుట విశేషము. పూజ్య మాతాజీ అనుమతి 2 నిమిషములు అవకాశము తీసుకొని నా అనుభవములు అని మాతాజీ ఆధ్వర్యములోనే గొప్ప అభివృద్ధి, పెద్ద పెద్ద పక్కా కట్టడాలు, శాశ్వత నిధులు జరిగినవి అని చెప్పినాను. దానిపై పూజ్య మాతాజీవారు పూజ్య స్వామివారు నా అనంతరము నా ఆత్మ ఎక్కువ పనిచేయునని అనేవారు. ఆ ప్రకారమే జరుగుతూ ఉన్నది అని చెప్పి వారి నిరాడంబరము వ్యక్తపర్చినారు.

ఎంతోమంది మహానుభావుల సహకారముతో వృద్ధి అయినది. నాకు రాజుగారు చెప్పినవి, మాతాజీ చెప్పినవి కొన్ని వ్రాసెదను.

కరెంటు రాజమండ్రి వరకు వచ్చి అక్కడతో ఆగినదట. గౌరవనీయులు శ్రీ మర్రి చెన్నారెడ్డిగారు ఆశ్రమమునకు రాగా తోటపల్లి గ్రామం గిరిజన గ్రామము అని తెలిసి వెంటనే గిరిజన అభివృద్ధిగా 4 రోజులలో కరెంటు స్తంభాలు, వైర్లు వచ్చి ఆశ్రమం మీదుగా తోటపల్లికి కరెంటు వచ్చినది.

1999 దసరా నవరాత్రులలో పూజ్య వినమ్రానందగారి సన్యాసదీక్ష కార్యక్రమములు పూర్తి చేసుకొని హృషీకేష్ నుంచి ఢిల్లీ సుమోలో వస్తూ వుండగా మోడీనగర్ అనే ఒక వూరు వచ్చినది. ఆ గ్రామం చూచి పూజ్య మాతాజీగారు చెప్పిన విషయం. ఈ శేఠ్‌గారితో పూజ్య తెన్నేటి విశ్వనాథంగారు ఆంధ్రాలో ఒక మంచి ఆశ్రమం, ఒక గొప్పస్వామి వున్నారని చెప్పగా వారు రూ. 20,000 విరాళం పంపినారట. ఆ డబ్బుతో 20 ఎకరముల ధాన్యం పండే పొలం, కొంత డిపాజిట్ చేసినారట.

ఒకరోజు నేను పూజ్య మాతాజీ గారి వద్ద వుండగా ఒక వృద్ధ దంపతులు వచ్చినారు. మావారు తరచు భయం భయం అని అంటారు అని చెప్పగా పూజ్య మాతాజీ శాంతి ప్రార్థన కాగితము యిచ్చి తరచు చదవుకోమని చెప్పినారు. తర్వాత ఒక సంవత్సరము గడిచిన తర్వాత భార్య ఒక్కరే వచ్చినారు. మాతాజీతో మీరు యిచ్చిన శాంతి ప్రార్థన చదివిన తర్వాత మావారి భయం పోయి శాంతిగా వుండేవారు. ఈ మధ్యనే కాలం చేసినారు అని చెప్పి వారి చేతిని వున్న బంగారు గాజులు ఒక జత తీసి యిచ్చినారు. మాతాజీవారు వద్దు, వద్దు అని అన్నారు. వారు బలవంతం పెట్టగా తీసుకొని నాకు యిచ్చి ఇవి అమ్మి ఆ సొమ్ముతో శాంతి స్థూపమునకు రశీదు వ్రాయమని వారు ఎదుటనే చెప్పినారు. వారు ఎంతో సంతోషించినారు.

అనేకమంది అశాంతితో ఆశ్రమం వచ్చి పూజ్య మాతాజీ దర్శనం, ఆశ్రమ వాసము చేస్తూ శాంతి అనుభవిస్తూ వున్నారు.

ఎంతోమంది ఆర్థికంగా వెనుకబడిన పిల్లలు యిక్కడ చదివి, పెద్దవారు అయి మంచి హోదాలో వున్నారు. ఈ విధముగానే ఇంకా ఎన్నో వందలు సంవత్సరాలు అభివృద్ధించవలెనని భగవంతుని ప్రార్థించుతూ సెలవు.

ఓం ఓం ఓం

# శాంతి ఆశ్రమంతో నా అనుబంధం

- శ్రీమతి చెలికాని శారదాదేవి

విశాఖపట్టణం

శాంతి స్వరూపులు, ఓంకార స్వామీజీ 100 సం॥ల క్రితం వేసిన బీజం ఈనాటి శాంతి ఆశ్రమ నీడలో ప్రశాంతంగా కొన్ని వేలమంది సేద తీరుతున్నారు. చుట్టుప్రక్కల వూళ్ళ నుండి దేశ, విదేశాల నుండి వచ్చి శాంతి పొంది వెళ్తుంటారు. ఎవరు, ఏ మహాత్ములు శ్రీ శాంతి ఆశ్రమానికి వచ్చినా మేము మా చిన్నప్పుడు, ఏదో ఒక సమయములో ఇక్కడకి వచ్చామని దీనితో మాకు అనుబంధమున్నదని చెబుతూ వుంటే ఆశ్చర్యమనిపిస్తుంది. ఆశ్చర్యమేమి లేదు. శ్రీ సద్గురువులు మహాత్ములు. వారు చేయలేనివి ఏమీ వుండవనిపిస్తుంది. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్‌స్వామి వారు 2006లో శ్రీ శాంతి ఆశ్రమానికి వేంచేశారట. అప్పుడు వారు శెలివిచ్చారట. వారికి నాలుగు సంవత్సరాల వయసున్నప్పుడు వారి తండ్రిగారు శ్రీ శాంతి ఆశ్రమం వైద్యులుగా ఉండేవారనీ, అప్పుడు తండ్రిగారితో ఆశ్రమానికి వచ్చానని శెలవిచ్చారట. ఎంత విచిత్రం ఇలా ఎంతోమంది మహాత్ములకి ఈ పరమ పవిత్ర శాంతి ఆశ్రమంతో అనుబంధం వున్నది. శ్రీశ్రీశ్రీ రంగ రామానుజ జియ్యరుస్వామివారు కూడా 6 సంవత్సరాలు శాంతి ఆశ్రమంలో వున్నారట.

శ్రీ జ్ఞానేశ్వరీ మాత చాలా చిన్నతనం నుండి శ్రీశ్రీశ్రీ ఓంకార దేవుల అడుగుజాడలు వీసమయినా తప్పకుండా అనుసరించేవారు. వారి తరువాత ఆశ్రమాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారు. వైజాగ్ కైలాసగిరిపై 6 సంవత్సరాలు మౌన దీక్షలో వున్నారు స్వామి. అక్కడ కూడా వారి దర్శనం చేసుకొనేవాళ్ళము. స్వామి వారి మనసులో కైలాసగిరిపై విశ్వశాంతి క్షేత్రం నిర్మించాలని వుండేదట. వారున్నప్పుడు జరగలేదు. ఎంతోమంది సాధకులకి, భక్తులకి వినియోగపడేటట్లు కట్టించిరి శ్రీ జ్ఞానేశ్వరి మాత. కోటగిరి ఆశ్రమం చాలా ప్రశాంతంగా వుంటుంది. అక్కడ చాలా అభివృద్ధి చేశారు శ్రీ మాతాజీ. వైజాగ్, కాకినాడ, పిఠాపురం శాఖలు, పాఠశాలలు, వైద్యశాలలు, కుటీరాలు ఎంతోమంది పేద పిల్లలకి, చెముడు మూగ పిల్లలకు వినియోగపడుతున్నవి. జనవరి 21వ తేదీ శ్రీ ఓంకార స్వామివారి జన్మదినోత్సవం. ఆ రోజు చుట్టుపక్కల ఊళ్ళ నుండి పిల్లలు, పెద్దలు, అందరూ ఎంతో ఆనందంగా కొత్తబట్టలు వేసుకొని, కొన్ని వేలమంది వస్తుంటారు. ఆ రోజు అందరికీ పర్వదినం. ఆ రోజు చూచి తరించవలసినదే. అలాగే శ్రీ జ్ఞానేశ్వరీ మాతాజీ జన్మదినమైన అక్టోబరు 13ని కూడా అలాగే వస్తారు. ఆ రోజు కూడా భోజనాలు ఆశ్రమం వారే ఏర్పాటు చేస్తారు.

ఈ సేవకురాలికి 11 సంవత్సరాల వయసపుడు శ్రీ శాంతి ఆశ్రమానికి దగ్గరగా వెంకటనగరంలో మా పెద్దక్కగారు రావు సీతాదేవి, బావగారు శోభనాద్రిరావు గారు వుండేవారు. అక్కడ కొద్దికాలం నేను వుండటం జరిగినది. అప్పటినుండి శాంతి ఆశ్రమంతో అనుబంధమేర్పడినది. అక్కతో వెళ్ళేదాన్ని

సాయంత్రం పూట. ఆ రోజుల్లో క్రింద ప్రార్థనా మందిరమే ఉండేది. ఆ ప్రార్థనా మందిరం వరండాలో కూర్చుని శ్రీ ఓంకారస్వామి వారు సత్సంగం సెలవిచ్చేవారు. తరువాత మా గురుదేవి చిక్కవరం రాణిశ్రీ సరస్వతి దేవిగారి (బొబ్బిలి)తో చాలాసార్లు వెళ్ళేవాళ్ళము. వారితో వీణపై కీర్తనలు పాడించుకునేవారు. శ్రీ ఓంకారస్వామి వారికి పాటలన్న చాలా ఇష్టముండేది. **శ్రీ రాణి సరస్వతి దేవిని 'సోహం దేవి' అని పిలిచేవారు.** వారు ఆశ్రమ ట్రస్టీగా కూడా ఉండేవారు. వీరి సోదరి బొబ్బిలి రాణీవారు కూడా శ్రీ శాంతి ఆశ్రమానికి వచ్చేవారు. ఆనాటి నుండి ఈ అనుబంధం కొనసాగుతున్నది. నాకు వివాహమయినాక నా భర్త చెలికాని శ్రీరంగనాయకులు గారు కూడా నాకంటే శ్రీ శాంతి ఆశ్రమ సేవలో ఎంతో మమేకమై వుండేవారు. శ్రీ జ్ఞానేశ్వరీ మాతాజీకి అంతరంగ సేవకులుగా వుండేవారు. ఇద్దరం వెళ్ళి కొన్నిరోజులుండి వస్తూ వుండేవాళ్ళము. శ్రీ జ్ఞానేశ్వరీ మాతని చూడగానే ఈ ప్రపంచాన్నే మరచిపోతాము. వారి ప్రేమలో, వారి చిరునవ్వులో, వారి స్పర్శలో, వారి స్వరూపంలో మాత మరెక్కడలో లేరు వారే వారే. శ్రీ ఓంకార స్వామి వారి తరువాత ఇంచుకైనా తేడా రాకుండా వారి ఆశయాలు, వారి శాంతి ప్రేమలు అమలుపరుస్తూ వచ్చిరి. ఇంకా ఎక్కువగానే జరిపిస్తుండిరి. మహాత్ములు, సద్గురుదేవులు వారి ప్రియ శిష్యులను వారే ఏరి తెచ్చుకుంటారట. జ్ఞానేశ్వరి మాతను చూస్తే అదే అన్పిస్తుంది. అదే రీతిగా శ్రీ వినమ్రానంద మాతాజీని శ్రీ శాంతి ఆశ్రమానికి చేర్చిరి. వారి సేవలు అనంతమయినవి.

శ్రీ ఓంకారస్వామి వారు చేసిన శాంతి ప్రార్థన ప్రతిఒక్కరూ రెండు పూటలా నిత్యం చదివి తరించి ఈ కలియుగ ప్రభావాన్ని తగ్గించుకుందామని నా మనవి. ఆశ్రమం అంతా వారి సూక్తులతో నిండిన శాంతి వనమే.

లోకాసమస్తా సుఖినోభవంతు

ఓం శాంతిః శాంతిః శాంతిః

**ఎవరిలోను, ఎన్నడు, చెడు చూడకుండుట, అందరిలోను దైవమునే చూచుచు, మంచినే చూచుచు ఆనందముతో, ప్రేమతో నుండగలుగువారు అట్టి స్వార్థ రహిత జీవితములకు అంకితము చేసినవారు ప్రతిక్షణము అమూల్యముగ గడపగలరు.**

# స్వర్గధామం - శ్రీ శాంతి ఆశ్రమం

**- శ్రీమతి కె. సత్యరాణి**, విశాఖపట్టణము

పరమ పూజ్య ఓంకారస్వామి శాంతిని సర్వులు సకల జీవులు ఇచ్చటనే యీ భూలోకమునందే యీ మానవ శరీరం తోడనే ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసలో అనుభవింపవలెనను పరమాశయముతో తోటపల్లి కొండలలో శ్రీ శాంతి ఆశ్రమమును 1917లో స్థాపించినారు. ఇంకను విశాఖపట్టణం, కాకినాడ, పిఠాపురం, కోటగిరి మున్నగు స్థలములలో శాఖలు నెలకొల్పిరి. ప్రతి మానవ హృదయంలోను శాంతి వెల్లివిరియవలెనని పరితపించి తన దివ్య జీవనము ద్వారా ప్రేమపూరిత సందేశములతో దేశ విదేశములలో అనంత ప్రచారము గావించినారు.

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శ్రీశ్రీశ్రీ ఓంకారస్వామి శ్రీ శాంతి ఆశ్రమము ద్వారా ఎట్టి ప్రచారాలు, ఆర్భాటాలు లేకుండా తమ సేవలను జీవితాంతము వరకు మానవ కళ్యాణమునకే అంకితము చేశారు. వారి అడుగుజాడలలోనే మాతాజీ జ్ఞానేశ్వరీ, శ్రీ స్వామిని వినమ్రానంద నడుస్తున్నారు. వారి యొక్క నిస్వార్థత, సమతా దృక్పథము సర్వ ప్రాణికోటుల ఎడల ప్రేమ భూతదయ, పరహితాభిలాష, ఓర్పు క్షమాది గుణముల వలన ఈ నాటికీ శాంతి ఆశ్రమము శ్రీ ఓంకారస్వామి ఆశయాలను సజీవంగా ఇప్పటికి మనముందు నిల్పగలిగారు. ఆశ్రమ సేవలో మాతాజీకి బాసటగా శ్రీ ఓంకారస్వామి విద్య, వినయము, సమర్థత, చురుకుదనము, ఉత్సాహము, బుద్ధి, కుశలత కలిగిన వినమ్ర మాతాజీని కానుకగా పంపించిరి. బాల్యమున శ్రీ శాంతి ఆశ్రమములో విద్య అభ్యసించి చిన్మయారణ్యములో శ్రీ శారదా ప్రియానంద మాత సన్నిధిలో ఆధ్యాత్మిక విద్యలో సుశిక్షణ పొంది పూజ్యనీయులు శ్రీ ఓంకారస్వామి ఆశయాలకు అనుగుణంగా ఆశ్రమములో వైద్యసేవలు, బాల బాలికలకు ఉచిత విద్యాబోధన చేయుచున్నారు. 1958లో తోటపల్లి శాంతి ఆశ్రమములో సుశీల ఆసుపత్రిని ప్రారంభించి ఉచిత వైద్యసేవలను అందించుచున్నారు.

శ్రీ స్వామీజీ కేవలం ఓంకారం నీటిపై వ్రాసి ఆ మంత్రజలం ఇస్తే చాలామంది జబ్బులు నయమయ్యేవి. 'వైద్యో నారాయణోహరిః" దైవమే రోగ నివారణ చేస్తారు. వైద్యులు కేవలం నిమిత్తమాత్రులు అని అనేవారు.

ఆశ్రమములో యోగా శిబిరములను ఉచిత హోమియో వైద్య సదుపాయములను కల్పిస్తున్నారు. కీ॥శే॥ యోగాచార్య శ్రీరాపర్తి రామారావు గారు శ్రీ శాంతి ఆశ్రమములో యోగా తరగతులను నిర్వహించేవారు. అట్టి తరుణంలో నేను శాంతి ఆశ్రమంలో ఉంటున్న శ్రీ స్వామి సర్వేస్వరానందను దర్శించుటకు వచ్చేదాన్ని. అప్పుడు రామారావుగారి వద్ద ప్రకృతి చికిత్సను తీసుకొని, ఆయాసంను తొలగించుకొని ఆరోగ్యవంతురాలనైనాను. నావలెనే అనేకమందికి అది ఆరోగ్య ప్రదాయిని అయినది.

ఆశ్రమములలో ఎందరో అనాధ విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యాలను కలిగిస్తున్నారు. విద్యార్థులను అన్నిరంగాలలో ప్రోత్సహిస్తూ అర్హత గల వారికి ఉన్నత విద్యాభ్యాసానికి, వృత్తి విద్యలకు చేయూతనందిస్తున్నారు.

స్వామికి చిన్ననాటి నుండి జాతి, కుల, మత బేధాలు లేవు. సర్వమానవ కళ్యాణము సర్వమత సమన్వయము ప్రపంచశాంతి అనే మహోన్నత ఆశయాలకు అనుగుణంగా సర్వధర్మ సమైక్య చిహ్నమును ప్రతిపాదించారు. 1955లో శ్రీ స్వామి షష్టిపూర్తి సందర్భముగా తోటపల్లి ఆశ్రమంలో సర్వధర్మ సమైక్య స్థూపమును శ్రీశాంతి ఆశ్రమ చిహ్నమును ప్రతిష్టించారు.

శ్రీ స్వామి బోధలు సరళంగా జీవితంలో మార్పు తెచ్చేవిగా ఉండేవి. ఋషీకేష్‌లో సాధు సమావేశంలో స్వామి కేవలం భగవన్నామం జపించడమే సాధువు కర్తవ్యం కాదు. భగవత్ స్వరూపులైన మానవుల్లోని దైవత్వాన్ని చూస్తూ వారికి సేవ చేయుట సాధువుల ధర్మం అని చెప్పారు. అది సాధువులకే కాదు మనందరకు కూడా వర్తిస్తుంది.

అమెరికా వెళ్ళినప్పుడు పత్రికా ప్రతినిధులతో ప్రజల అజ్ఞానాంధకారాన్ని ప్రారద్రోలి జ్ఞాన జ్యోతిని వెలిగించడానికి అమెరికా దేశం వచ్చానన్నారు.

ఈ ప్రపంచము నా గృహము అందుండే ప్రజలందరూ నా సోదర సోదరీ స్వరూపులు వారిని ప్రేమించి, సేవించి వారికి సహాయము చేయుటయే నా మతము.

శ్రీశాంతి ఆశ్రమములో ఎందరెందరో జిజ్ఞాసువులు ఈ పరమపద పరమార్థ మార్గంలో శాంతి, విశ్రాంతి ప్రశాంతిని పొంది తరించిరి. ఇకముందు కూడా ఎందరెందరికో ఇది శాంతి ప్రదాయకం కాగలదని ఆశిస్తూ ...

**మానవులుగా జన్మించినందులకు దాని విలువలు గ్రహించి మనస్సుని భగవంతునిపై మరల్చి బాహ్య ప్రవృత్తి పరమైన వాటికి వలయునంత దూరముగా నుండి మానవజన్మకు మూలమైన దైవమును గమ్యస్థానమును చేరి ధన్యులు కావలెను.**

# అమ్మ అమ్మే

**– కుమారి అరిశెట్టి ఇందుమణి**

మా నాన్నగారు గురునాథం గారు 1989 వ సంవత్సరం ఆగష్టులో తోటపల్లి శాంతి ఆశ్రమంలో జరిగే డయాబెటిస్ చికిత్సా శిబిరానికి అనుమతి కోసం గురుదేవులు యోగాచార్య రాపర్తి రామారావుగారి వద్దకు వెళ్ళారు. (అప్పటికే మేము విశాఖపట్నం లాసన్స్‌బే కోలనీలోనే ఉండటం వలన మా యింటికి దగ్గరలోనే వున్న విశాఖ శాంతి ఆశ్రమ శాఖలో ప్రతిరోజూ యోగాభ్యాసం చేస్తుండేవారు నాన్నగారు). గురువుగారితో మాటల సందర్భంలో "మా అమ్మాయి ఇందుమణిని కన్యాకుమారిలో వివేకానంద ఇన్‌స్టిట్యూట్‌కి అయిదు సంవత్సరాల కోర్సుకి పంపిద్దామనుకుంటున్నాను" అని చెప్పడంతో "ప్రస్తుతం తోటపల్లి శాంతి ఆశ్రమంలో స్కూలు పిల్లల హాస్టల్ వార్డెన్ సెలవు పెట్టింది, మీతో పాటు మీ అమ్మాయిని తీసుకురండి" అన్నారు గురువుగారు. అప్పటికి గురువుగారు ఆశ్రమానికి వైస్ ప్రెసిడెంట్‌గా ఉండేవారు.

నేను అదే మొదటిసారి తోటపల్లి శాంతి ఆశ్రమానికి వెళ్ళడం. పేరుకు తగినట్టే ఎంతో ప్రశాంతంగా ఉంది. పొడవైన రోడ్లతో ఒక చిన్న గ్రామంలా ఉంది. శివానంద కుటీరంలో గదులు విశాలంగా ఉండడంతో గురుదేవుల గదిలోనే నాకు, మా నాన్నగారికి కూడా ఉండే ఏర్పాటు చేయించారు. ఉదయం 3 గంటల నుండి రాత్రి 10 గం.ల వరకూ ఎక్కడెక్కడ ఏయే కార్యక్రమాలు చేయాలో గురుదేవులు నిర్దేశించేవారు. ఉదయం 4 గంటల కల్లా నా స్నానాది కార్యక్రమములు ముగించుకుని హాస్టల్‌కి వెళ్ళి భజన పాటలు పాడేదానిని. ఆ పాటలు వినడంతోనే పిల్లలంతా ఆనందంగా లేచిపోయేవారు. చిన్న పిల్లలకు జడలు వేసేదానిని. పెద్దపిల్లలు తయారైపోయి వచ్చి వాళ్ళకు అర్థంకాని పాఠాలు అడిగి చెప్పించుకునేవారు. వాళ్ళంతా స్కూలుకు వెళ్ళిపోయాక మాతాజీ కుటీరానికి వెళ్ళేదానిని.

అప్పటివరకూ స్కూలూ, చదువులే తప్ప వంట ఇంటి పనులు అలవాటు లేదు. అదే మొదటిసారిగా మాతాజీ వద్దనే అన్నం వండడం నేర్పించారు. ఇంచుమించు 2 గంటల సమయం "అమ్మ" వద్దనే ఉండి చిన్న చిన్న పనులు చేసేదాన్ని. అమ్మ నన్ను ఎంతో ప్రేమగా చూసుకునేవారు. నాకు ఎంతో ఆనందంగా ఉండేది. తరువాత ఆఫీసులో ఉత్తరాలకు, పత్రికలకు అడ్రసులు వ్రాయడం, తేదీలవారీగా పెట్టడం కరస్పాండెంట్‌గారైన కృష్ణమూర్తిగారి వద్ద ఫైల్స్ అన్నీ ప్రతి పేపరును కేటలాగ్‌లో రాయడం మొదలగు పనులు ముగించుకుని మళ్ళీ పిల్లల వద్దకు వచ్చేసేదానిని. చిన్న, చిన్న బుజ్జి పిల్లలను చూస్తే ఎంతో ముద్దొచేవారు. కొందర్ని ఎత్తుకుని తిప్పేసేదాన్ని. వాళ్ళు మణక్క రాక కోసం ఎదురుచూస్తున్నట్లుండేవారు. ఉదయం, సాయంత్రం కూడా నేను వచ్చేసరికి మణక్క వచ్చింది. మణక్క వచ్చిందని కేరింతలు పెట్టేవారు. అందువలనే ఉదయం 4 గంటలకైనా నాకు ఎవ్వరినీ లేవండి అనే పదమే వాడాల్సిన అవసరం లేకుండా నా గొంతు వినగానే అంతా గబగబా లేచి పనులు త్వరత్వరగా ముగించుకుని నాచుట్టూ చేరిపోయేవారు వారి పుస్తకాలతో.

ఈ కార్యక్రమాలలో ఉండిపోయానే కాని స్వామి రామతీర్థ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగే తరగతులకు ఎన్నడూ వెళ్ళలేదు. అక్కడ గడిపిన ఆ 15 రోజులు 15 నిమిషాల్లో ఎంతో ఆనందంగా గడచిపోయాయి.

15 రోజుల తర్వాత వెళ్ళిపోతానంటే పిల్లలంతా ఏడుపులు "మణక్కా! నువ్వు వెళ్ళవద్దు, ఇక్కడే ఉండిపో అని" అటు మాతాజీ కూడా పిల్లను వీడలేని తల్లిలా విలవిలలాడిపోయి ఇంక ఆగలేక గురువుగారిని "ఇందుమణి ఇక్కడ అందరికీ తలలో నాల్కలాగ అయిపోయింది, తనను ఇక్కడే ఉంచేయండి, మీరు తీసుకువెళ్ళవద్దు" అని అడిగేసారు. గురువుగారు "మళ్ళీ తీసుకువస్తాను లెండి అని ఎలాగో నచ్చచెప్పి వెళ్ళటానికి అనుమతిని ఇప్పించారు. అమ్మ వీడలేక, వీడలేక తప్పదన్నట్లు పంపించారు. తల్లిప్రేమ అలాంటిది.

ఆ తరువాత కాలంలో నాన్నగారికి తెర్లాం ట్రాన్స్‌ఫర్ అయ్యి వెళ్ళిపోవలసి వచ్చింది. చిన్న అక్క విద్యావాణి బి.యల్. చేస్తుండటం వలన తనను వైజాగ్‌లోనే వదిలేయవలసి వచ్చింది. అప్పుడు గురుదేవులు వైజాగ్‌లో ఉన్న శాంతి ఆశ్రమ శాఖలోనే వాణి ఉండేందుకు ఏర్పాటు చేయించారు. బి.ఇడి. అడ్మిషన్లు అయిన కారణంగా నేను ఖాళీగానే ఉన్నాను. కనుక నేను తనకు తోడుగానే ఉండడం జరిగింది. ఉదయం గురుదేవులు ప్రతిరోజూ వచ్చేవారు. ఎవరెవరికి ఏయే ఆసనాలు, ప్రాణాయామాలు, క్రియలు మొదలగు నేర్పించలో చెప్పేస్తే నేను వారికి అవి నేర్పించేదాన్ని. తరువాత నేను సాధన చేసుకుని భోజనం చేసేసి గురువుగారి ఇంటికి వెళ్ళి సందర్శకుల అవసరాలు తీర్చడం, పుస్తకాలు సర్దడం, పుస్తకాలు చదవడం, వ్రాయడం మొదలగు వంటి పనులు చెప్తే చేస్తుండేదాన్ని. అప్పటినుండి గురుదేవులు ఎప్పుడూ తోటపల్లి శాంతి ఆశ్రమానికి వచ్చినా వారితోనే తీసుకువచ్చేవారు. వచ్చిన వెంటనే మాతాజీని సందర్శించుకుని అమ్మ ఆశీస్సులు, ప్రసాదం తీసుకునేవాళ్ళం. అమ్మ నన్ను చూసేసరికి పొంగిపోయేవారు. ఎంతో ఆప్యాయంగా పలకరించేవారు. ప్రతిరోజూ సాయంత్రం జరిగే సత్సంగంలో ఇందుమణీ! నువ్వు పాట పాడు అని, పాడించుకుని ఆనందించేవారు.

కోటగిరిలో గురుదేవులు, నేను 10 రోజుల క్యాంప్ చేయడం జరిగింది. తోటపల్లి ఆశ్రమం చుట్టూ కొండలు, అక్కడ ఆశ్రమం కొండపై ఉండి చుట్టూ తేయాకు తోటలు. ఆశ్రమం చుట్టూ వాతావరణం కూడా ఎంతో అందంగా, ఆహ్లాదకరంగా ఉండి ఎవ్వరికైనా, ఎట్లాంటి పరిస్థితుల్లో ఉన్నవారికైనా ఆనందాన్ని చేకూర్చగలిగేదిగా ఉంటుంది. అమ్మ ఎలా తన పిల్లల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటారు అనేదానికి ఉదాహరణ.

మేము సంవత్సరం కోర్సు అయిపోయిన తరువాత దారిలో గురుదేవుల అవసరాలు ఏమైనా ఉంటే చూసుకుని మా రూముకు వెళ్ళిపోయేవాళ్ళము. ఒకరోజు శివానంద కుటీరం ఎదురుగా మేము రాత్రి 9.30కు సత్సంగం ముగించుకుని వస్తుంటే అమ్మ ఎదురయ్యారు. ఆ సమయంలో అమ్మను అక్కడ చూసి ఎంత అర్జంట్ పని పడిందో చేసేవాళ్ళెవరూ లేక అమ్మ స్వయంగా రావలసి వచ్చిందేమో అని బాధ పడిపోతూ అయ్యో! అమ్మా ఈ సమయంలో మీరు అంత శ్రమ పడి రావడం ఏంటమ్మా? కబురు పడితే మేమెవ్వరమైన వచ్చేవారము కదమ్మా అని చాలా బాధ పడిపోయాము. ఏం పరవాలేదులే, ఊరకే వచ్చాను అని ప్రేమతో చెప్పేసి అమ్మ చక చకా నడుచుకుంటూ వెళ్ళిపోయారు. ఈ విషయం గురువుగారికి చెప్తే ఆయన మహోగ్రులు అయిపోయారు. మీరెవరు మధ్యలో అమ్మను ప్రశ్నించడానికి? ఆమె ఈ రాజ్యానికి రాణి. ఆమె యిష్టం. ఏ సమయంలోనైనా ఎక్కడికైనా వెళతారు. మీరు ఆమెను

ప్రశ్నించడమేమిటి? అని. అప్పటికి గాని మాకు అమ్మ అలా రాత్రనక, పగలనక తన పిల్లల యోగ, క్షేమాలని అంత స్వయంగా చూసుకుంటారని బోధ పడలేదు. ఆ అమ్మ అంత ప్రేమని తలచుకుంటుంటేనే ఇప్పటికీ పులకరించిపోతున్నాను.

ఓంకార స్వామి సాధకుల సాధనాభివృద్ధికై ఎంతో మంచి వాతావరణాన్ని అక్కడ అభివృద్ధి చేసారు. అమ్మ ఆయన అడుగుజాడల్లో నడుస్తూ దానిని కాపాడుతూ వస్తున్నారు. హైపవర్ కరెంటు తీగల్లో ప్రవాహంలోగ ఉండేది ఆ చైతన్య దర్శనం. బయట 10 సంవత్సరాల్లో పొందే ఆధ్యాత్మిక అభివృద్ధి అక్కడ ఒక్క సంవత్సరంలోనే పొందామనేది అతిశయోక్తి ఎంతమాత్రం కాదు. 2006 ఆగష్టులో నాన్నగారు, 2010 ఫిబ్రవరిలో అమ్మ చనిపోయారు. రెండుసార్లు గురుదేవులు బాధను ఉపశమింపచేసేశారో, ఏమో అస్సలు ఏడవలేదు. అమ్మ చనిపోయిన అనంతరం శ్రీ గురు హృదయం పుస్తకం వ్రాస్తున్నప్పుడు శాంతి ఆశ్రమం గూర్చి, మాతాజీ గూర్చి వ్రాస్తుంటే మాత్రం దుఃఖం పొంగుకు వచ్చేసి పరుగెత్తుకు వెళ్ళిపోయి అమ్మను చూసేయాలన్నంత ఆతృత కలిగి దుఃఖం ఆపుకోలేక అప్పుడు అమ్మకోసం (మాతాజీ) ఏడ్చేశాను. కాని గురుదేవులను విడిచి వెళ్ళలేను కదా!

"తలచిన ప్రతి ఆలోచన కోరిన ప్రతి కోరికా రూపుదాల్చు జగతిలోన నియమమిదే తప్పక" అన్నట్లుగా బిడ్డ ఏడుపు విని ఆగలేక పరుగు పరుగున వెళ్ళి ఎత్తుకుని గుండెలకు హత్తుకుని నిమురుతూ ఊరుకోబెట్టే తల్లిలాగ, నేను ఏడ్చిన కొద్ది రోజుల్లోనే 15 సంవత్సరాల నుండి రాని అమ్మ తోటపల్లి శాంతి ఆశ్రమం నుండి విజినిగిరి యోగ చైతన్యారామానికి ఎంతో శ్రమపడి పరుగు పరుగున వచ్చేసింది. అప్పటికి కొద్దిగా అనారోగ్యం (దంత సమస్య) కూడా ఉన్నట్లుంది. అయినా బిడ్డ కోసం తన ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయని తల్లిలాగానే ఈ అమ్మ కూడా వచ్చేసింది. అమ్మ వచ్చే సమయానికి అక్కడ శిబిరం జరుగుతోంది. ఆ రోజు అమ్మ వచ్చేసిందని తెలిసి ఇంక గురుదేవులకు కన్పించకుండానే పరుగు, పరుగున అమ్మ ఉన్న కుటీరానికి వెళ్ళిపోయి అమ్మ కాళ్ళ వద్ద కూర్చుండిపోయి, అమ్మ కాళ్ళు పట్టేసుకుని, అమ్మ ఒడిలో తల పెట్టేసుకుని ఎవరున్నారా? లేరా? ఏమనుకుంటారా? ఏమీ ఆలోచించకుండా అరగంట పైనే బిగ్గరగా ఏడ్చేశాను. అక్కడే ఉన్న వినమ్రానందగారు, ఒక విదేశీ భక్తురాలు, ఫొటోస్ తీయడానికి వచ్చిన సీనియర్ సాధకులు రామన్‌గారు, అర్జున్ అందరూ నా ఏడుపుకి అవాక్కయి ఉండిపోయారు. అమ్మ మాత్రం నేను అందుకే వచ్చాను అన్నట్లుగా ప్రశాంతంగా నా తల నిమురుతూ కూర్చున్నారు. అప్పటికి గాని నా తల్లిదండ్రులను కోల్పోయినప్పుడు కరడు కట్టుకుపోయిన గుండె భారం దిగిపోలేదేమో!

**తమ హృదయములను ప్రేమతో పూర్ణముగా నింపి భక్తితో నిరంతర నామస్మరణతో, బాహ్య జగత్తును మరచి, తమ అంతరాంతములో నున్న అఖండ సచ్చిదానంద సాగరములో ప్రవేశించగలిగినచో దివ్యజ్యోతి దర్శనము లభించి పరిపూర్ణత్వమునందగలరు.**

# నేను (నా) శాంతి ఆశ్రమం

**- శ్రీ గణేశచరణ్ ఆచార్య,** శ్రీ శాంతి ఆశ్రమం

ఆశ్రమంలోనికి ఇన్నేళ్ళయినా ఎందుకు వచ్చాను? ఆశ్రమ వాసానికి పర్యవసానం సాధనే అయితే అది ఎంతవరకు పురోగమించింది. నేను పూర్తిగా ఆత్మాన్వేషణ జరుపగలుగుతానా? ఈ ప్రశ్న అందరికి వచ్చినట్టే నాకూ వచ్చాయి. ముఖ్యంగా ఈ సాధనా ఫలితం జన్మరాహిత్యంకు దారి తీస్తుందో లేదో తెలియదు కాని ప్రస్తుత జన్మలో అవసాన దశలో శాంతిని అన్వేషిస్తూ సాధన చేస్తే అది మాత్రం అందుతుందని ఘంటాపదంగా చెప్పగలిగే శక్తి వచ్చింది. దీనికి సదా చరణ, సేవ, సత్సంగం, మౌనం సోపానాలు.

ప్రకాశంలో నేనున్నాను. ప్రకాశం నాలో ఉన్నది. నేనే ప్రకాశాన్ని .. అని ఆశ్రమంలో ఒక ఉవాచ. 'యద్భావం తద్భవతి'.. కాబట్టి నేను శాంతిలో ఉన్నాను. శాంతి నాలో ఉంది. నేనే శాంతిని అని కూడా అనుకోవచ్చు.

ఆచరణ లేకపోతే ఏదీ సాధ్యం కాదు. ఆచరణ, సేవా, సత్సంగం ద్వారా క్రమేపి సాధ్యమౌతుంది. ఆ అనిర్వచనీయమైన శాంతియే ఆత్మ సాక్షాత్కారానికి దోహదపడుతుందని నా విశ్వాసం.

ఆశ్రమం అంటే కేవలం కొన్ని కుటీరాలు మందారం, వృక్షాలే కాదు. అది ఒక ఆధ్యాత్మిక గురువు యొక్క కృప, తపస్సుకీ ప్రతీక. ఇక్కడే నిష్కల్మషమైన సాధకునకు ఆత్మ సాక్షాత్కారానికి తగిన ప్రేరణ కలిగించే ప్రాణాధారమైన సజీవ క్షేత్రం. కనుకనే ఇది కలకాలం ముముక్షువులకు ఆశ్రయం ఇచ్చి, భగవంతుని వైపు పయనించే మార్గమును నిర్దేశిస్తుంది. ఏ ఆసరా లేనివాళ్ళు, దిక్కులేని అభాగ్యులు ఈ ఆశ్రమాలలో చేరతారని లోకుకులలో ఒక న్యూనతాభావం ఉంది. కాని ఆశ్రమ వాసానికి భగవత్కృపయే కారణం అని, పూర్వజన్మ సుకృతం వల్లనే ఈ అవకాశం లభిస్తుందని వారి నిమ్న బుద్ధికి అందదు.

నేనెవరు? నా స్వస్థానమేది? ఎందుకు వచ్చిందీ జన్మ? దీని తర్వాత మళ్ళీ జన్మేనంట! ఇలా ఎలా? ఎన్ని జన్మలు?... తెలియదు. అది తెలుసుకోవాలంటే ఆశ్రమ జీవితం ఉండాలి.

మానవ ప్రయత్నమంతా దుఃఖభూయిష్టమైన ఈ లోకంలో శాంతి కోసమే కాని ప్రపంచం శాంతినివ్వదు! నరజన్మ లభించటం, మోక్షకాంక్ష కలిగి ఉండటం, మహాత్ములు ఆశ్రయం. ఇవి కేవలం దైవానుగ్రహం వల్లనే లభిస్తాయి.

మనకీ లోకంలో ఈ జన్మకు ఈయబడిన పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామా? లేదా! అన్న ప్రశ్నే లేదు. కారణం సర్వేశ్వరుడు వ్యక్తుల సామర్థ్యాలను బట్టి స్థల, కాల పరిస్థితులకు వీలుగా నిర్ణయించి ఏర్పాటుచేసే ఉంటాడు. అందుచేత జీవులు తామే చేస్తున్నామని అహం అవసరం లేదు.

ముక్తి ఎప్పుడు సిద్ధిస్తుందో ఎన్ని జన్మలకో చెప్పలేను. కారణం మన చేతిలో లేదు. ముక్తినిచ్చేవాడి చేతిలో ఉంది. మనచేతిలో ఒక్క నిష్కామ కర్మ చేసే పని ఒకటి ఉంది. అది సరిగ్గా చేస్తే భగవంతుడు మోక్షమిచ్చే పరీక్షలో మనం పాసయినట్టే.

చూద్దాం ...

# ఓంకార స్వామీజీ ఆశీస్సులతో తరించిన మా అమ్మగారు

- శ్రీమతి లలిత

ముత్తా మహాలక్ష్మి గారిది సొంత ఊరు కాకినాడ. వీరి భర్తగారు ముత్తా వెంకటేశ్వర్లు గారు. వీరు మహా రామభక్తులు. పగలంతా వ్యాపారము చేసి రాత్రంతా రామకోటి వ్రాస్తూ ఉండేవారు. చాలా దాన ధర్మములు చేసేవారు.

నేను వారి 2వ కుమార్తె లతితను. అప్పుడు నా వయస్సు 9 సంవత్సరములు. 1946 సం॥లో నాన్నగారికి జ్వరము వచ్చి అందర్ని వదిలి స్వర్గస్తులైనారు. అప్పటికి అమ్మకు 28 సం॥లు. తొమ్మిదిమంది సంతానము. ఆఖరి పిల్లకి 3 నెలల వయస్సు. అమ్మ షాక్‌లోకి వెళ్ళింది. అమ్మ చీకటి గదిలో శూన్యంలోకి చూస్తూ ఉండిపోయారు. మమ్మల్ని అమ్మమ్మ నాయనమ్మ చూసేవారు. ఈ లోగా చంటిపిల్లకు సుస్థి చేసింది. అప్పటికి గాను అమ్మకు కర్తవ్యం గోచరించలేదు. చాలాసేపు దుఃఖపడి తేరుకుని చంటి పిల్లను సంరక్షించుకుంది.

ఓ రోజు మధ్యాహ్నం అమ్మ మమ్మల్ని అందర్నీ తీసుకుని శాంతి ఆశ్రమానికి వచ్చింది. ముందు నుంచి అమ్మ స్వామివారి భక్తురాలు. ఆ రోజుల్లో ఆశ్రమం చాలా నిర్మలంగా, ప్రశాంతంగా ఉండేది. స్వామివారి ఆశ్రమం ముందు కుడివైపున ఒక రావిచెట్టు ఉండేది. దాని చుట్టూ రాతి దిమ్మ వుండేది. దానిమీద కూర్చుని స్వామివారు దర్శనం ఇచ్చేవారు. ఇప్పటికి నాకు చాలా గుర్తు. స్వామివారి పాదముల వద్ద మా అందర్ని కూర్చోపెట్టి స్వామి వీళ్ళని చూడండి. వీళ్ళని పెంచే ధైర్యం, శక్తి గాని, తెలివితేటలు గాని నాకు లేవు. నేను ఏమి చేయలేని స్థితిలో వున్నాను. దీనికి పరిష్కారం మీరే చెప్పండి. అని బాధపడుతూ వేడుకుంది.

శ్రీ ఓంకార స్వామీజీ ఎంతో వాత్సల్యంతో ముందుగా అందరిచేత శాంతి మంత్రము చెప్పించి, అమ్మా! శేషమ్మ అని లోపలివార్ని పిలిచారు. శేషమ్మగారు వచ్చాక పిల్లలందరూ ఆకలితో వున్నారు. వెంటనే పలహారం చేయించి పెట్టమన్నారు. అప్పుడు అమ్మతో చూడు తల్లి నీకు కష్టం కలిగించిన భగవంతుడు నీకు కావలసిన ధైర్యము, శక్తిని, సమస్తమును నీకు తప్పక ప్రసాదిస్తాడు అని చెప్పిరి. మా అందరికి మాతృమూర్తికి మించిన దైవము లేదని అమ్మ మాట చివరి వరకూ పాటించమని చెప్పిరి.

అమ్మ స్వామివారితో మాకు మీరే కనిపించే దైవము మీ ఆశీస్సులతో ఈ బిడ్డలందర్ని పెంచి పెద్ద చేస్తాను అని చెప్పింది. ఆ రోజులలో జ్ఞానేశ్వరీ మాతాజీ, శాంతి మాతాజీ స్వామివారి వెన్నంటే వుండి, స్వామి వార్ని కంటికి రెప్పలా చూసుకునేవారు. ముఖ్యంగా శాంతి మాతాజీ స్వామివారి సంరక్షణ చూసుకునేవారు. జ్ఞానేశ్వరి మాత ఇతర విషయములు చూసుకునేవారు. వీరిద్దరూ కూడా చిన్నవయసు నుండి స్వామివారి దగ్గరే వుండేవారు. వీరిద్దరి ముఖములో ఏదో తెలియని తేజస్సు, వర్చస్సు, దైవత్వము

కనిపించేవి. ఇన్ని సంవత్సరములు అయిన తరువాత కూడా నాకు జరిగిన విషయములు అన్ని కళ్ళ ముందు కదలాడుతూనే ఉన్నాయి. శ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ శాంతి ఆశ్రమమును ఇంతలా వృద్ధిలోకి తీసుకువచ్చిన కారణ జన్మురాలు.

ముత్తా మహాలక్ష్మి గారు స్వామివారి ఆశీస్సులతో పిల్లలందర్ని బాగా చదివించి ప్రయోజకుల్ని చేసిన ధన్యజీవి. ఆవిడ సంతానంలో ఎంతోమంది పేరుగాంచిన వైద్యులు, శాస్త్రవేత్తలు, రాజకీయాలలో మంత్రిగా 3వ కుమారుడు శ్రీ ముత్తా గోపాలకృష్ణ గారు రాణించారు. ఈయన 'లా' చదువుతూనే పైలట్ ట్రైనింగ్ అయ్యారు. ఆ రోజుల్లో ఇండియాకి పాకిస్థాన్‌కి మధ్య యుద్ధము జరుగుచున్నది. ఆయన సైన్యములో చేరి యుద్ధ విమానాలు నడుపుటకు సిద్ధపడిరి. డిఫెన్స్‌వారు అమ్మకు లేఖ రాశారు. మీరు అనుమతిస్తే మీ అబ్బాయిని యుద్ధ విమానం నడుపుటకు అంగీకరిస్తారన్నారు. వద్దు అని అమ్మ ఎంత చెప్పినా వినలేదు. అప్పుడు తన కుమారుడ్ని రప్పించి స్వామివారి వద్దకు తీసుకువచ్చి చెప్పించిరి. అప్పుడు స్వామీజీ నచ్చచెప్పి తల్లిని బాధ పెట్టవద్దు. దేశ సేవ చేయాలంటే చాలా మార్గాలు వున్నాయన్నారు.

ముత్తా మహాలక్ష్మి గారు స్వామివారి దివ్య ఆశీస్సులతో శాంతి ఆశ్రమంలో అనాధాశ్రమానికి చాలా సహాయపడ్డారు. మా కుటుంబంలో అందరూ ఇంతగా ప్రయోజకులు అయ్యారంటే కేవలం స్వామివారి ఆశీస్సులు వుండటం వలనే మహాలక్ష్మి గారు వైరాగ్యంలో ఎన్నో పూజలు చేసేవారు. చివరిగా భీష్మ ఏకాదశినాడు స్వర్గస్తులైనారు. ఇవన్నీ స్వామీజీ ఆశీస్సులు వుండబట్టే జరిగినవని మాకు గట్టి నమ్మకం.

* మానవులందరూ ఒకే విధమైన సృష్టియైనను, వారి వారి సాధనా తీవ్రతను యిట్టి ఆత్మవిదులుగా వుండి బ్రహ్మ సాక్షాత్కార భాగ్యము పొందుదురు.
* మీరెల్లప్పుడు నిర్మలముగా ప్రశాంతముగా వుండి ఇతరులకు మేలు చేయుటే పరమావధిగా జీవింపవలెను.

# శ్రీ శాంతి ఆశ్రమం - నా అనుభవాలు

- **శ్రీమతి గాలి రుక్మిణి,** శ్రీ శాంతి ఆశ్రమం

శ్రీ శాంతి ఆశ్రమ నివాసిని అయిన నేను, నా పది సంవత్సరముల ఎన్నో అనుభవములలో కొన్నింటిని వ్రాయుచున్నాను. శ్రీ శాంతి ఆశ్రమ నివాసం మాకు ఎన్నో జన్మల పుణ్యఫలంగా లభించినది. ఇది మాకు పుట్టినిల్లు. ఇక్కడ దొరికే శాంతి, ఆనందం మాకు ఇంకెక్కడా లభించదు.

పూజ్యులైన ఓంకారస్వామి తపఃశక్తిచే విరాజిల్లే భూమి. ఈ వనంలో తరువులన్నీ మునీశ్వరులే. ఎంతోమంది స్వాములు సాధన చేసిన భూమి. ఎందరో స్వాముల దర్శనాలు, ప్రవచనాలు, వారి ఆశీస్సులు ఇచ్చట మాకు ఎల్లప్పుడూ లభించుచూ వుండును. అటువంటి పుణ్యభూమి.

ఓంకార స్వామిని మేము దర్శించకపోయినా, ఆశ్రమంలో వారు నడయాడుతున్నట్లే అనుభవం పొందుతాము. పూజ్యశ్రీ జ్ఞానేశ్వరీ మాతాజీలోనే, మేము ఓంకార స్వామిని దర్శిస్తూ వుంటాము. ఈ ఆశ్రమంలో, ఈ పుణ్యభూమిలో మాకు ఎక్కడ చూసినా, ఆనందమే ఆనందం, సంతోషమే సంతోషం.

ఓంకార నాదంతో ఈ ఆశ్రమం ఎల్లప్పుడూ ధ్వనిస్తూ వుంటుంది. మాకు తరగని శక్తిని, శాంతిని ఆనందాన్ని ప్రసాదిస్తుంది. మా జన్మ ధన్యమైనది.

శ్రీ పూజ్య జ్ఞానేశ్వరీ మాతాజీ మమ్ముగన్న తల్లి.

శ్రీ పూజ్య వినమ్రానంద మాతాజీ మమ్ము పాలించే యశోదామాత.

శ్రీ పూజ్య సుహిత మాతాజీ మా హితాన్ని కోరే శ్రేయోభిలాషియైన చిన్నమాతయే.

ఈ ముగ్గురు మాతాజీలను మాకు ప్రసాదించిన ఓంకార స్వామియే మమ్ము కన్నతండ్రి.

ఇంకా ఎన్నెన్నో అనుభవాలు. అయినా ఇంతకన్న అక్షర రూపంలో పెట్టలేని అశక్తురాలును.

**ఈ ఆశ్రమ స్థాపన ముఖ్య ఉద్దేశ్యము, భగవంతునిలో సదా నివసించుట. ఇతరులు కూడ అట్లు చేయుటకు తోడ్పడగలవారుండాలి. అనగా తాము ధర్మప్రవృత్తులైయుండి, ఇతరులను కూడ ధర్మాచరణ పరులుగా జేయు దీక్షగల వారుండాలి.**

# శ్రీ శాంతి ఆశ్రమంలో నా జీవితం

– శ్రీ పోసిన సత్తిబాబు

మన శ్రీ శాంతి ఆశ్రమం నూరు వసంతాల పర్వము జరిపించుకొనుట నాకు మహదానందము. శాంతి ఆశ్రమం 1917వ సంవత్సరంలో పూజ్య గురుదేవులు శ్రీ ఓంకార స్వామీజీ మానవ జీవిత సాఫల్యానికి స్థాపించారు.

పూజ్య జ్ఞానేశ్వరీ మాతాజీ వారి ఆశీస్సులతో దిన దినాభివృద్ధి చెందినది.

నా బాల్య దశ నుండి నేటివరకూ యీ ఆశ్రమంలో పొందిన నా అనుభవములను కొన్నింటిని మీ ముందుంచి తృప్తి పొందుదామని తెల్పుకొనుచున్నాను.

సుమారు 1966 వ సంవత్సరంలో మా తల్లిగారు పోసిన సత్యవతి గారు, మా సోదరి మాలతీదేవి యీ ఆశ్రమంలో అడుగు మోపినారు. తదుపరి మా అమ్మగారు జ్ఞానేశ్వరి అమ్మను మా అబ్బాయి యున్నాడు అమ్మా అని మా అమ్మ అడుగగా వెంటనే తీసుకొనిరా చదివిద్దాం అనిరి. సుమారు 1967వ సంవత్సరంలో నేను శాంతి ఆశ్రమానికి రావడం జరిగినది.

స్వామీజీ ప్రతి ఆదివారం ప్రత్యేక సత్సంగము నేటి ప్రాథమిక పాఠశాల ఆవరణములో ఉదయం 10 గం॥ల నుండి 2 గం॥ల వరకూ జరిపేవారు. పరిసరవాసులు – కాకినాడ – పిఠాపురం – తుని మొదలగు గ్రామాల నుండి భక్తులు వచ్చి భక్తి శ్రద్ధలతో స్వామీజీ బోధనలు వినేవారు. స్వామీజీ ఆహారం తీసుకొనేటప్పుడు పిల్లలను (అందులో నేను ఒకడిని) పిలిచి ప్రేమతో ఒక ముద్ద పెట్టేవారు. ఆ ప్రసాద మహిమే నేటికీ నా భోజనానికి లోటు లేదని సంతోషపడుతూ వుంటాను.

ఆనాటి రోజులలో ఆర్థికంగా యిబ్బందులు పడినరోజులు గుర్తుకు వస్తూ వుంటాయి. ఒక రోజు కూలీలకు డబ్బు యివ్వడానికి ఎన్ని యిబ్బందులున్నా స్వామీజీ తపఃప్రభావం వల్ల ఆశ్రమ భక్తుల నుండి ఆ ధనం వచ్చేది.

మా చదువు అయిన తరువాత ప్రతిరోజు సాయంకాలం సేవ చేయుటకు వెళ్ళేవారము. సూర్యాస్తసమయంలో ధ్యానం చేసేవారు. మమ్ములను స్వామీజీ గమనిస్తూ ఉండేవారు.

ఆశ్రమ భక్తులను తరచూ స్వామీజీ వద్దకు తీసుకొని వెళ్ళమనేవారు రాజుగారు. అక్కడున్న "ఓమీ" (కుక్క) నన్ను చూసి వెంటపడేది. నేను పరుగెత్తుతూ వచ్చే విషయం గుర్తుకు తెచ్చుకుంటే నాలో నాకే నవ్వు వస్తుంది.

నేటికీ ఆశ్రమ జీవితం గడుపుటకు నాకు అదృష్టము కలిగించి నందులకు కృతజ్ఞతలు తెలుపుకొనుచున్నాను. మా అబ్బాయిలకు స్వామి వారి కృప – మాతాజీ ఆశీస్సులు సదా లభించాలని కోరుచున్నాను.

# శాంతి ఆశ్రమం - సాధకులలకు స్వర్గధామం

**- శ్రీ ఎస్.గణపతిరావు**

పరమపూజ్య స్వామీశ్రీ ఓంకార్ వంద సంవత్సరాల క్రితం ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి తోటపల్లిలో శాంతి ఆశ్రమాన్ని స్థాపించారు. సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో, ప్రశాంత వాతావరణంలో జనబాహుళ్యానికి దూరంగా, శబ్ధ వాయు కాలుష్యాలకు దూరంగా, పచ్చని తోటలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో, ప్రశాంతతకు ప్రతిరూపంగా స్వామీజీ ఈ ఆశ్రమాన్ని తీర్చిదిద్దారు. కులమతాల ప్రమేయం లేకుండా, అన్నివర్గాలవారు ఇక్కడ ధ్యానం చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఓంకార స్వామీజీ తన బోధనలతో మౌనానికి, ధ్యానానికి అత్యంత ప్రాధ్యానతను ఇచ్చారు.

ఓంకార స్వామివారు రూపొందించిన 'లోకశాంతి ప్రార్థన'ను విన్నప్పుడు భగవంతుని ఎడల ఆయనకు గల సంపూర్ణమైన భక్తితో పాటు, ప్రతి మనిషిలోను, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక జాతుల మధ్య శాంతి సామరస్యాలను ప్రతిష్ఠింప చేయాలన్న విన్నపం ఉంది. ప్రతి దినమూ ఈ శాంతి ప్రార్థనను చేయమని ఆశ్రమ వాసులకు సందర్శకులకు చెప్పేవారు. స్వామివారు తరుచుగా దీర్ఘకాలంపాటు మౌనంలో ఉంటూ గాఢమౌన ధ్యానం చేయడమే కాకుండా, ఆశ్రమానికి వచ్చే వారందరికీ ధ్యానం చేసుకోవడానికి అవసరమైన సౌకర్యాలను ఏర్పరిచారు. తోటపల్లితో పాటు విశాఖపట్నంలో సముద్ర తీరాన్న, కైలాసగిరి పైన, తమిళనాడు కోటగిరిలో పచ్చని తేయాకు తోటల మధ్య ఆశ్రమాలను నెలకొల్పి అనేకమందికి ధ్యానం చేసుకునే అవకాశం కల్పించారు.

శ్రీ ఓంకారస్వామివారి తదనంతరం ఆశ్రమ బాధ్యతలను చేపట్టిన మాతాజీ జ్ఞానేశ్వరీదేవి స్వామీజీ ఆశయాలకు అనుగుణంగా ఆశ్రమానికి వచ్చే సాధకులను ఎంతో ప్రేమతోను, దయతోను ఆహ్వానిస్తూ వారి సాధనకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా అవసరమైన సహాయ సహకారాలను అందిస్తున్నారు.

మామిడి, జీడి మామిడి తోటల మధ్య ధ్యానానికి అనువుగా ఉండే ప్రదేశాలెన్నో ఉన్నాయి. వార్తా పత్రికలు, టెలివిజన్ సెట్లు, టెలిఫోన్ల చప్పుళ్ళకు దూరంగా నిశ్శబ్దానికి ప్రతిరూపంగా, స్వచ్ఛమైన ప్రశాంతతకు నెలవైన ఇలాంటి ప్రదేశం కంటే సాధకుడు కోరుకొనేది 'ఏముంటుంది'! ఏకాంతంలో మౌనంగా ఉంటూ ధ్యానం చేసుకోవాలన్న కోరిక, తపన ఉన్నవారికి ఇది స్వర్గమే కదా!

మనం ధ్యానం ద్వారా లభించే దివ్యానందాన్ని అనుభవిస్తూ మనస్సంతా శాంతి భావనలతో నింపుకుని ప్రపంచ శాంతికి దోహదపడదాం!

# శ్రీ శాంతి ఆశ్రమము
# శ్రీ స్వామీజీ, శ్రీ మాతాజీ గార్లతో నా అనుబంధం

**- శ్రీమతి యక్కల నిర్మలజ్యోతి,** గుంటూరు

గురుతుల్యులైన శ్రీశ్రీశ్రీ ఓంకార స్వామీజీ వారి పాద పద్మాలకు ప్రణామములు. శ్రీ స్వామీజీతో, శాంతి ఆశ్రమంతో నాకు 60 సం॥ల అనుబంధం వుంది. మా తాతగారు రామారావుగారు, నాయనమ్మ రత్తమ్మగారినించి మేము స్వామీజీ భక్తులం. మా నాన్నగారు కక్కిరాల ఆత్మారాం స్వామీజీ ప్రియశిష్యులు. మా చిన్నతనంలో స్వామీజీ జన్మదినానికి, వేసవి శలవలకు ఆశ్రమానికి వచ్చేవాళ్ళం. వేసవిలో శ్రీ స్వామీజీ వాల్టేరులో వుంటే అక్కడికి వెళ్ళేవాళ్ళం. తోటపల్లి ఆశ్రమంలో వుంటే ఇక్కడికి వచ్చేవాళ్ళం. ఇప్పటిలా బస్సులు, ఆటోలులాంటి ప్రయాణ సౌకర్యాలు లేవు. నాన్నగారు పలానరోజు ఆశ్రమానికి వస్తామని ఉత్తరం రాస్తే రాజుగారు రెండెడ్ల బండి తీసుకుని కత్తిపూడి వచ్చేవారు. మార్గమధ్యలో ఒకచోట పెద్ద చెఱువు వుండేది. అక్కడ రోడ్డు చాలా సన్నగా వుండేది. మా అక్కలు, తమ్ముడు, నేను బండి దిగి కొంతదూరం నడిచి తిరిగి బండి ఎక్కేవాళ్ళం. అలా బండిలో ప్రయాణం బలే సరదాగా వుండేది. ఆ రోజుల్లో ఆశ్రమంలో రోడ్లు లేవు, కరెంటు లేదు. లాంతర్లు పట్టుకుని తిరిగే వాళ్ళం. మంచినీళ్ళు నూతిలో తోడి ఇచ్చేవారు. ప్రశాంతంగా, ఆహ్లాదంగా వుండే ఆశ్రమమన్నా, చిరునవ్వుతో, ప్రేమతో చూచే స్వామీజీ అన్నా మాకు ఎంతో ఇష్టం. శేషమ్మగారు నిజంగా అన్నపూర్ణాదేవే. విసుగు, విరామం లేకుండా అతిథులు ఏ సమయంలో వచ్చినా భోజన సదుపాయాలు చూచేవారు. శాంతక్క, అమ్మాజీ అక్క ఎంతో ప్రేమగా, ఆప్యాయంగా అతిథులను పలకరించేవారు. శాంతక్క ఎప్పుడూ చిరునవ్వుతో, శాంతంగా వుండేది. అమ్మాజీ అక్క (మాతాజీ) చురుకుగా, చక్కగా మాట్లాడేది. ప్రతి సంవత్సరం స్వామీజీ జన్మదినానికి తప్పక వచ్చేవాళ్ళం. స్వామీజీ షష్ఠిపూర్తికి సర్వమత చిహ్నం ను నిర్మించారు. అక్కడ దంపతులచే కోటిపత్రి పూజ నిర్వహించబడింది. మేము పిల్లలం చాలా ఆనందంతో వారికి బుట్టలతో పత్రి వేసి అందించేవాళ్ళం. అప్పుడు ఇన్ని కుటీరాలు లేవు. తాటి ఆకుపాకలు వేసి దానిలో చాపలు పరచి, కుండతో నీళ్ళు, లాంతరు పెట్టేవాళ్ళు. అతిథులు అందులో వుండేవాళ్ళు. ఇప్పటిలా ప్రయాణ సౌకర్యాలు లేకపోయినా భక్తులు చాలామందే వచ్చేవారు. ఇప్పుడు ప్రయాణ సౌకర్యాలు బాగా వచ్చాయి. రోడ్లు, కరెంటు వచ్చాక భక్తుల సంఖ్య బాగా పెరిగింది. ఒకసారి శ్రీ స్వామీజీ తన ప్రియ శిష్యులకు "గురుకులం" పెట్టాలని వుంది. మీ పిల్లలలో ఒకరిని పంపండి అని లేఖ వ్రాసారు. మా నాన్నగారు నన్ను పంపారు. నా వయస్సు 6 సం॥లు. నా పేరు నిర్మల జ్యోతి. నేను, ఇందిరా, గాయత్రి, శాంతి మా నలుగురు బాలికలతో "గురుకులం" ప్రారంభించారు. మా మొదటి గురువు "శ్రీ స్వామీజీ". సుశీల మందిరంలో స్వామీజీపైన, శాంతక్క, అమ్మాజీ అక్క మేము నలుగురుం క్రింద వుండేవాళ్ళం. ఉదయాన్నే శ్రీ స్వామీజీతో పాటు ధ్యానం చేసేవాళ్ళం. తరువాత ఆసనాలు, సూర్య నమస్కారాలు చేసేవాళ్ళం. మాతాజీగారిని అమ్మాజీ అక్క అని పిలిచేవారు. శ్రీ స్వామీజీ, శ్రీ మాతాజీ మాకు చదువు చెప్పేవారు. పగలు తోటంతా తిరుగుతూ చాలా ఆనందంగా గడిపేవాళ్ళం. క్రింద ప్రార్థనా సమయంలో స్వామీజీ కుర్చీ ప్రక్కనే కూర్చునే నేను వారి కాళ్ళమీద తలపెట్టి నిద్రపోయేదాన్ని. ఎంతటి అదృష్టం. ఆ మహానుభావుడి సన్నిధిలో బాల్యం గడపడం నిజంగా మా నలుగురి పూర్వజన్మ సుకృతం. మా తల్లిదండ్రులు మాకిచ్చిన గొప్పవరం. స్వామీజీతో పాటు గుహలో ధ్యానం చేసేవాళ్ళం. కాని అప్పుడు దాని ప్రాముఖ్యం

మాకు తెలియదు. మల్లిఖార్జునధార దగ్గరకి శ్రీ స్వామీజీతో పాటు నడచివేళ్ళే వాళ్ళం. స్వామీజీ చాలా వేగంగా నడిచేవారు. మేము వెనక పరుగెత్తేవాళ్ళం. వారికి పాటలంటే చాలా ఇష్టం. ఎవరు వచ్చినా పాట పాడమనేవారు. "శ్రీ రామ జయరామ జయజయ రామ ఓం", "జయ జయ రామకృష్ణ హరిఓం" పాటలంటే చాలా ఇష్టం. మేము పాడమనగానే గట్టిగా పాడేవాళ్ళం.

ఒకసారి స్వామీజీ జన్మదినానికి నేను, గాయత్రి, ఇందిరా బుర్రకథ చెప్పాం. నేను చాలా అల్లరి చేసేదాన్ని. అయినా ఎప్పుడు కోపగించలేదు. ప్రేమతో మందలించేవారు. కాని ఒకే ఒక్కసారి నాపై కోపం ప్రదర్శించారు. విశాఖ ఆశ్రమంలో ఉన్నప్పుడు రోజూ సముద్ర స్నానానికి స్వామీజీతో వెళ్ళేవాళ్ళం. శ్రీ స్వామీజీ సముద్రం లోతుకి వెళ్ళి నీటిపై తేలుతూ ధ్యానం చేసేవారు. మేము ఒడ్డున కూర్చునేవాళ్ళం. ఒకరోజు స్వామీజీ సముద్రం లోతుకు వెళ్ళగానే నేను కూడా లోపలికి వెళ్ళాను. కాళ్ళకి భూమి అందక, ఊపిరి ఆడక మునిగిపోతున్నాను. అప్పుడు స్వామీజీ చూచి నా జుట్టు పట్టుకుని ఒడ్డుకు చేర్చి కోపంతో కొట్టారు. అంత కోపం నేను ఎప్పుడూ చూడలేదు. దీనిని బట్టి నేను తెలుసుకున్న నీతి పెద్దల మాటలను గౌరవించాలని.

మొదటిసారి శ్రీ స్వామీజీ పునర్జన్మనిస్తే, రెండవసారి మాతాజీ పునర్జన్మనిచ్చారు. ఇంకొకసారి అదే సముద్రపు ఒడ్డున కూర్చుని పిల్లలం ఇసుకలో పిచ్చుకగుళ్ళు కడుతున్నాము. మాతాజీ నిల్చుని మమ్మల్ని చూస్తూ ఆనందిస్తున్నారు. ఇంతలో ఒక పెద్ద కెరటం వచ్చి మమ్మల్ని లోపలికి లాగేస్తుంది. మేము భయంతో ఏడుస్తూ మాతాజీ కాళ్ళు గట్టిగా పట్టుకున్నాం. నిజంగా మాతాజీ శక్తి స్వరూపిణే కాబట్టి మమ్మల్ని కాపాడగలిగారు. ఈ రెండు సంఘటనలు మనస్సులో ఇప్పటికి నిలిచిపోయాయి. శాంతి ఆశ్రమంలో అడుగు పెట్టగానే స్వామీజీ చెప్పిన ఎన్నో "సూక్తులు" మనకి కనబడతాయి. శ్రీ స్వామీజీ ఎప్పుడూ ఈ ఆశ్రమం మీది అనే చెప్పేవారు. ఇలా చెపుతారేంటి అనుకునేదాన్ని. కాని దాని అర్థం వయస్సు పెరిగిన తరువాత తెలిసింది. అందరూ శాంతిని పొందాలని అది ఈ శాంతి ఆశ్రమం ద్వారా పొందవలెనని వారి కోరిక. ఆశ్రమంలో అడుగు పెట్టగానే శాంతి, ప్రశాంతత మనకి నిజంగానే కలుగుతాయి. అంతేకాదు "శాంతి ప్రార్థన" పఠించినప్పుడు మనసుకు ప్రశాంతత ఏర్పడుతుంది. ఇది నా అనుభవం. అప్పుడప్పుడు స్వామీజీ మందిరంలో కూర్చున్నప్పుడు ఏదో తెలియని భావోద్వేగం, కళ్ళవెంట నీళ్ళు తెలియకుండానే కారుతాయి. శ్రీమాతాజీ శ్రీ స్వామీజీ ఆశయాలకు ప్రతిరూపం. కాబట్టే ఆశ్రమం స్థాపించి వంద సంవత్సరాల పండుగను చేసుకుంటున్నాం. విసుగు, విరామం లేకుండా చిరునవ్వుతో, ప్రేమతో భక్తులను పలకరిస్తారు మాతాజీ, ఆశ్రమానికి వచ్చినందుకు మీ మనస్సుల నిండా శాంతిని నింపుకుని వెళ్ళండి. మీ ప్రార్థనలతో పాటు ఈ శాంతి ప్రార్థనని కూడా రోజూ పఠించండి అని అందరితో చెపుతూ వుంటారు. మాతాజీలో సేవాభావం మెండు. వారి సేవను పొందగలిగాను.

చిన్నతనంలో ఆశ్రమంలో వున్నప్పుడు ఒకసారి సైకిలు చక్రంలో కాలు పెట్టాను. గాయమయింది. చీము, నెత్తురు, దుర్వాసనతో గాయం పెద్దదయింది. పురుగులు కూడా వచ్చాయి. శ్రీ మాతాజీ అసహ్యించుకోకుండా సేవాభావంతో రోజూ గాయాన్ని శుభ్రం చేసి మందు వేసి కట్టు కట్టేవారు. నడవలేకపోతే ఎత్తుకొనేవారు. శ్రీ స్వామీజీ, శ్రీ మాతాజీల సన్నిధిలో గడిపిన మా నలుగురి బాల్యం ఎంతో ధన్యం. ఆనాడు శ్రీ స్వామీజీ మా నలుగురితో ప్రారంభించిన గురుకులం దినదినాభివృద్ధి చెంది, ఎందరో గురుకుల విద్యార్థులు ఉన్నతమైన స్థాయిలో వున్నారు. నాటి గురుకుల బీజానికి పునాది అయిన మేము నలుగురం ధన్యజీవులం.

– ఓం తత్సత్ –

# శాంతి ఆశ్రమము - బ్రహ్మసమాజ అనుబంధాలు

**- శ్రీమతి టి.రాజ్యలక్ష్మి,** కాకినాడ

1950 ప్రాంతంలోననుకొంటాను మా నాన్నగారు తారకం గారు (కంభంపాటి రామశాస్త్రి) సకుటుంముగా శాంతి ఆశ్రమాన్ని దర్శించడానికి అవకాశం ఏర్పరచుకొన్నారు. అమ్మ సుగుణ మహాలక్ష్మి గారు, మా అక్కలు, తమ్ముళ్ళు నేను, ఓంకార స్వామివారి దర్శనానికి వచ్చాము. కాషాయ వస్త్రధారులైనటువంటి నిరాడంబరులు వారు. ఆఖరున మెడలో పూసల దండ, ఒక నూలు చొక్కా, నూలు పంచె ధరించిన ఒక ఆజానుబాహుడైన వ్యక్తి. ఒక గుండ్రటి దిమ్మె మీద కూర్చుని ఉన్నారు. నాన్నగారిని చూడగానే లేచి ఆలింగనం చేసుకున్నారు. నేను విచిత్రంగా నిలబడి చూస్తూ వున్నాను. అంత దగ్గరగా ఒక "సన్యాసి" లేక "విరాగిని" చూడటం అదే మొదటిసారి. ఎందుకంటే చిన్నప్పటి నుండి మేము పెరిగిన విధానములో పెద్దలను గౌరవించడం మాకు విధానం, కాషాయ వస్త్రదారులను, నిరాడంబరులను చూడటం, పరిచయాలు అదే ప్రథమం. ఆ తరువాత వారి ఉపన్యాసం, నాన్నగారి ప్రార్థన మమ్మల్ని పరిచయం చేయడం జరిగింది. తరువాత స్వామీజీ ప్రతి సంవత్సరం కుమారి జ్ఞానేశ్వరి గారితో పాటు కాకినాడలో కొమ్మిరెడ్డి వారి మేడపైన ఒక నెల రోజుల పాటు ఉపన్యాసాలు చేసేవారు. నాన్నగారితో పాటు మేమంతా పాల్గొనేవారము. ఇది 60 సంవత్సరాల వెనుక జ్ఞాపకాలు. శాంతి ఆశ్రమ ఆవరణ అంతా ప్రవేశ ద్వారము నుండి 'ఓమ్'తో హిందూ, మహమ్మదీయ క్రిష్టియన్ సిద్ధాంతాలు వ్రాయబడి ఉండేవి. బ్రహ్మసమాజ ఆదర్శాలకు చాలా అనుగుణంగా అవి ఉన్నాయి. అందుకే అనుకుంటాను నాన్నగారికి ఆ అనుబంధం స్వామీజీతో.

రామమోహనరాయులు ప్రతిష్టించిన బ్రహ్మసమాజ సిద్ధాంతాలు ముఖ్యంగా, మానవ సౌభ్రాతృత్వం, ఏకేశ్వరుని ప్రార్థన, విశ్వజనీనత, దేవుడు ఒక్కడే జగత్పిత అని, అన్నిటికి మూలం ప్రేమ, శాంతి అని స్వామి ఓంకార్ గూడా బోధిస్తున్నవే. ఓంకార్ గారి శాంతి ఆశ్రమము, బ్రహ్మ సమాజము ఒకటే బోధిస్తాయి. అది నిజమైన సెక్యులియరిజమ్, అంటే అన్ని మతాలకు మూలం మానవత్వం అని.

శాంతి ఆశ్రమములో స్వామీజీ అన్వయించిన విధానం పూర్తిగా మానవత్వంతో కూడినది. పెద్ద పెద్ద పట్టణాల్లో కాకుండా ఒక మారుమూల గ్రామంలో ఒక స్థలమును కొనుగోలు చేసిన తరువాత ఒకటి కాదు రెండు కాదు ఎన్నో ఎన్నెన్నో కార్యక్రమాలు బీద, అనాధ, అనారోగ్య, బాలుర, స్త్రీల, ఆహార, విద్యా, ఆధ్యాత్మికత కొరకు పెంపొందించారు. ఒక్క విశిష్ట వ్యక్తి వల్లనే ఇవన్నీ సాధ్యమయ్యాయి. వారి తదనంతరం గూడా ఈ కార్యక్రమాలు జరుపుటకు జ్ఞానేశ్వరీ మాతాజీను తయారు చేసారు స్వామీజీ.

మాతాజీ జ్ఞానేశ్వరీ స్వామీజీ ప్రక్కనే ఉంటూ, వారి ఉపదేశాలు, ఉపన్యాసాలు జరిపే రోజుల్లో పైన పేర్కొనినట్లు మా నాన్నగారు బ్రహ్మసమాజ నాయకులు తారకంగారి వెంట నేను కూడా కొమ్మిరెడ్డి వారి భవనం (కాకినాడ టెంపుల్ స్ట్రీట్)లో హాజరయ్యేదాన్ని నేను కాలేజీ సెలవులకు ఇంటికి వచ్చినప్పుడు. ఆధ్యాత్మికత అంతగా నాకు తెలియని వయస్సు.

నాన్నగారు తారకం గారు గతించిన (17-8-1981) కొన్ని నెలలకే స్వామీజీ దైవసాన్నిధ్యం పొందారు. యాధృచ్ఛికమా? కాని వీరివురి ఆశయాలు. ఇద్దరూ సాగించిన ప్రయత్నాలు ఇంకా కొనసాగడానికి శాంతి ఆశ్రమ సేవలు మాతాజీ కొనసాగిస్తూనే ఉన్నారు అహోరాత్రులు. అందులో ఒక చిరు ఇసుక రేణువులా అప్పుడప్పుడు నేను శాంతి ఆశ్రమ దర్శనానికి వెళ్తుంటాను. మాతాజీ కోరికపై నాకు తెలిసిన బ్రహ్మ సమాజ ప్రార్థన చేస్తుంటాను.

– వీరి శాంతి ప్రార్థన ఎల్లప్పుడూ పాటించదగ్గది.

– వారి చల్లని చూపులలోని కరుణ, మానవసేవే మాధవ సేవ అనే దృక్పథం, ప్రేమే జీవిత ధ్యేయం.

– వారి ధ్యేయాల్ని ముందుకు మున్ముందుకు నడుపుతున్న ధన్యజీవి మాతాజీ జ్ఞానేశ్వరి దేవికి ఆ పరమేశ్వరుని చేయూత ఎల్లప్పుడూ ఉండవలెనని నా ప్రార్థన. ఇదే నా అణుసమాన తర్పణము.

* **మనము చేయు ప్రతికార్యము నందు పరమాత్మయే స్వయం వ్యక్తమగుచుండినని గ్రహించినచో అహంకార మమకారములను మరువగలము.**

* **భగవంతుని యందు భారముంచి ఒక అడుగు ముందుకు వేసినచో, ఆయన ఆత్రముతో ఎదురువచ్చి భక్తుని శ్రమను నివారింపచేయును.**

* **ఓ మానవుడా! కోపమును విజ్ఞతతో ప్రేమమయముగా మార్చుకొనినపుడు జీవితమే శాంతిమయమగును.**

* **మోక్షమును కోరువారు గుణరహితులుగా నుండుటకు సాధన చేయవలెను. గుణములకు అతీతుడైన వాడే మోక్ష సామ్రాజ్యమును పొందగలడు.**

# విశాఖ శాంతి ఆశ్రమ పాఠశాలతో నా అనుబంధము

- శ్రీమతి కె. కృష్ణకుమారి

నేను శ్రీ శాంతి ఆశ్రమములో చేరిన తొలిరోజులు అనగా ది. 2-6-1982నే ఇంటర్వ్యూ నిమిత్తము శ్రీ శాంతి ఆశ్రమమునకు వచ్చితిని. చల్లని ప్రశాంత వాతావరణములో చుట్టూ చెట్లతో ఎంతో ఆహ్లాదకరముగా ఉన్న వాతావరణంలో ఉన్న ఆ పరిసరాలను చూస్తే నాకు ఎంతో ఆనందము వేసింది. అక్కడ రెండు పాఠశాలలు ఉన్నాయి. 1. డెఫ్ స్కూల్, 2. యస్.జి.యు.పి. స్కూల్. అన్ని చెట్లే 1వ తరగతి నుండి 7వ తరగతి వరకు ప్రతి క్లాస్‌కి ఒక్కో చెట్టు. అటువంటి వాతావరణములో నాకు పూజ్య శ్రీ ఓంకార్ స్వామివారు మరియు గౌరవనీయులైన కీ॥శే॥ లయన్ యమ్. వరహాల రాజు గారు నిర్మించిన డెఫ్ స్కూల్ నాకు ది. 26-6-1982లో ఆరుగురు సభ్యులతో అనగా లయన్ యమ్. వరహాల రాజు గారు, లయన్ యస్. కాశీమ్ మహిది, ప్రొ॥ కె.వి. రమణగారు, కొండలరావు గారు, లయన్. ఎ.యస్.యన్. ప్రసాద్‌గారు, నాగవరపు సూర్యనారాయణగారు, డా॥ డి. కొండలరావు గారు కలసి సంయుక్తంగా నాకు ఇంటర్వ్యూ నిర్వహించిరి. ఆ సమయములో వారు నాకు జీతము 300/- నిర్ణయించినారు. మాది సొంత ఊరు గరివిడి ప్రస్తుతం విజయనగరం జిల్లా. నేను డిప్లొమా ఎడ్యుకేషన్ ఇన్ డెఫ్, లక్నో అలహాబాద్ యూనివర్శిటీ ద్వారా చేసితిని అనగా అప్పట్లో ఏ.పి.లో ఈ స్పెషల్ ఎడ్యుకేషన్ సెంటర్ లేదు. ఇంటర్వ్యూ జరిగిన తరువాత ది. 16-7-1982లో అనగా పరమ పూజ్యులు శ్రీ స్వామి ఓంకార్ మహారాజు గారి (40 రోజులు) ఫంక్షన్ అనగా మండలారాధన రోజున నా పూర్వజన్మ సుకృతము కొద్ది నాకు జాయినింగ్ తేది. రూ. 300/-తో విశాఖ పట్టణములో జీవించుట కష్టము కావున ఆ స్కూలు భవంతి నందు నాకు వసతి కల్పించారు. అప్పట్లో 5 గదులు ఉండేవి. అందులో 1 నాకు నివాసము, 2 ఉపయోగముగా లేదు మిగతా 3లో 1వ గదిలో 1,2,3 తరగతులు, 2వ గదిలో 4, 5 తరగతులు ఉండేవి. నేను ఇంటర్ డి.ఎడ్.డి చేసి స్కూల్‌లో జాయిన్ అయితిని. నాతో పాటు యన్.వి.యన్. త్రినాధ్‌రావు గారు, యమ్.ఎ. శ్రీకాంత్ గారు, వేంకటేశ్వర చౌదరి గారు పనిచేసేవారు. 1 నుండి 5వ తరగతికి 25 మంది ఉండేవారు. అప్పట్లో క్లాస్ అనేవారు కాదు. ఈ స్పెషల్ స్కూల్‌కి గ్రేడ్స్ అనేవారు. మొట్టమొదటి సారిగా 1985 6వ కామన్ ఎగ్జమ్ తో నార్మల్ చిల్డ్రన్ అన్ని సబ్జెక్ట్స్‌తో 7 గురు స్టూడెంట్స్‌తో బి+జి 4+3తో పంపించాను. కె.డి.పి.ఎం. స్కూల్ సెంటర్‌గా ఆ విధముగా 1986, 1987 3 బ్యాచ్‌లు పంపించి సక్సెస్ సాధించాము. స్వామీజీ అనుగ్రహముతో 1985 నుండి 2002 వరకు ప్రిన్సిపాల్‌గా చేసితిని. తరువాత హైస్కూల్ ఎలిమెంటరీ విడిపోయాక 2002 నుండి 2007 వరకు ఎలిమెంటరీ హెడ్‌మాస్టారుగా చేసితిని. అప్పట్లో వరల్డ్ డిజేబుల్డ్ డే చాలా ఘనంగా చేసేవారు. మొట్టమొదటిసారిగా 1984లో నేను, శ్రీ యన్.వి.యన్. త్రినాధ్‌గారు కలసి 12 మంది పిల్లలను తీసుకొని స్టేట్ లెవెల్ మీట్‌కి హైదరాబాద్ తీసుకొని వెళ్ళాము. యల్.బి. స్టేడియమ్‌లో స్పోర్ట్స్ నిర్వహించేవారు. నాంపల్లి మున్సిపల్ గెస్ట్‌హౌస్‌లో మా బస. 100 మీటర్లు రన్, షాట్‌పుట్, జావెలెన్ త్రో మన స్కూల్ పిల్లలే ఫస్ట్. ఆ విధముగా 1985 విశాఖపట్నంలో స్పోర్ట్స్ మీట్ నిర్వహించినప్పుడు

అప్పటి సోషల్ మినిస్ట్రీ శ్రీమతి ప్రతిభా భారతి చేతుల మీదుగా 1. Best in March Fast, 2. Best in Sports & Games, 3. Best in Cultural, 4. All round championship మన విద్యార్థులు సాధించారు. ఆ విధంగానే 1986లో తిరుపతి 1987 కర్నూలు, 1988 ఖమ్మం పిల్లలను తీసుకొని వెళ్ళాము. మీట్స్ సాధించుట జరిగింది. 2001లో మొట్టమొదటిసారిగా గౌరవనీయులు నారా చంద్రబాబునాయుడు గారు సి.యమ్. ప్రతిభ అవార్డు ప్రవేశపెడితే అందులో మన విద్యార్థులకు 3 లభించుట మన పాఠశాల అదృష్టము. వారు కె. అరుణ, యన్. శాంతిబాబు, యన్. వెంకటగిరి. ఈ ఫంక్షన్ యల్.బి. స్టేడియంలో జరిగెను. శ్రీమతి బేగమ్ మరియు తల్లిదండ్రులు, లయన్ యస్. కాశిమ్ మెహిది, లయన్ ఎ.యస్.యన్. ప్రసాద్‌గారి సహాయముతో హైదరాబాద్ తీసుకెళ్ళి యల్.బి. అవార్డు తీసుకొనుట జరిగింది. అదేవిధముగా 11-9-2001 నందు వరల్డ్ డే ఆఫ్ డెఫ్ సందర్భముగా జరిగిన డెఫ్ ఆర్ట్ కల్చరల్ సొసైటీ వారు నిర్వహించిన డ్యాన్స్, డ్రామా, పేయింటింగ్, సోలో డ్యాన్స్‌లో ప్రథమముగా నిలిచి ఆల్ ఇండియా డెఫ్ మీట్ భువనేశ్వర్‌లో జరిగితే, ది. 28-12-2001 నుండి 30-12-2001 ఎ.పి. తరపున మన పాఠశాలను ఎంపిక చేసి అక్కడ కూడా ఆల్ ఇండియా లెవెల్ సెకండ్ బెస్ట్ ప్లేస్ ఇన్ గ్రూప్ డ్యాన్స్ బెస్ట్ డిక్షన్ అవార్డును మన స్కూల్ స్వామీజీ పూజ్యశ్రీ జ్ఞానేశ్వరీ మాతాజీ అనుగ్రహముతో పొందింది.

తెల్లవారి 5 గం॥లకు లేచి నగర సంకీర్తన, సాయంత్రం 6-7 గం॥ల వరకు సత్సంగము ఉండేది. అప్పట్లో శాంతక్క, జ్ఞానేశ్వరీ మాతాజీని కూడా అక్క అనేవారు. అప్పట్లో శాంతి ఆశ్రమము రాజు గారు సి.యవి. రాజు కూడా వచ్చి పర్యవేక్షించి వెళ్ళేవారు. చాలా నియమములతో కూడిన ఆ పాఠశాలలో పనిచేయుట నా అదృష్టము. ఆశ్రమములో ఉంటూనే నేను ఏ.యు. ద్వారా బి.ఎ., ఎస్.వి. యూనివర్సిటీలో పెళ్ళికి ముందు బి.ఇడి. పూర్తి చేశాను. పాఠశాలకు 1987లో ఎంతోమంది ఎన్నోవిధాలుగా సహాయము చేసితిరి. వారిలో డి.ఇ.ఓ. లు యస్. రవికుమార్, అమర ప్రసాద్, సత్యానందముగారు, యమ్.ఎల్.ఎ. (లేటు) ఈ.టి. విజయలక్ష్మి, యమ్.ఎల్.ఎ. రాజాన రమణి ఉన్నారు. 1989లో గ్రాంట్-ఇన్-ఎయిడ్ విషయములో ప్రొ॥ కె.వి. రమణ గారు, లయన్. యమ్. వరహాలరాజుగారు, లయన్ ఎ.యస్.యన్. ప్రసాద్, అనుమోలు సత్యన్నారాయణ గారు, చెంగయ్యగారు, (లేటు) శంకరరావు మాష్టారు, పి. భువనేశ్వరరావు గారు, బి. రామోజీ ముఖ్య పాత్ర వహించిరి. ఇంతమది పెద్దల సహాయ సహకారాలతో ఈ స్కూలు ఈరోజు 36 గదులు, 200 విద్యార్థులతో సక్సెస్‌ఫుల్‌గా నడుస్తున్నందుకు నేను ఎంతో సంతోషిస్తున్నాను. ఆ స్కూలు నందు పనిచేసి నేను 31-8-2013లో సుమారు 32 సం॥లు పనిచేసి పదవీ విరమణ చేసాను. ఈ అవకాశము కల్పించిన పరమపూజ్యులు ఓంకార్ మహరాజ్ గారికి పరమ పూజ్యులు మాతాజీకి నా హృదయ పూర్వక నమస్కారములు.

# శాంతి సుమాలు

– శ్రీ ఆకొండి శ్రీరామ గంగాధర శర్మ
పూర్వ విద్యార్థి, మెకానికల్ యింజనీరు, శంఖవరం

1. ఓంకారమే పరమావధిగా
శాంతి స్థాపనే జీవన గమ్యంగా
ఈ తోటపల్లి ఆశ్రమాన వెలసిన
ఓంకార స్వరూప స్వామీజీ
నిన్ను తలంచి సదా మ్రొక్కెదన్ !!

2. చీకటి నిండిన మా హృదయాలలో
జ్ఞాన జ్యోతిని వెలిగించి
ముక్తి మార్గమును చూపిన దివ్య స్వరూపా
నీకివే మా మనస్సుమాంజలులు

3. మానవ సేవయే మాధవ సేవని
జీవిత పథములో నిరూపించి
పరుల జీవితాలలో వసంతాలు నింపిన
ఓ పుణ్యమూర్తీ! సరిరారు నీకెవ్వరూ ఈ భువిలో

4. భక్తి మార్గమే మోక్షదాయకమని
విశ్వవ్యాప్తముగా వివరించి
భువి నలుదిశల ప్రజల మనసున
దివ్య జ్యోతుల నింపిన మహానుభావా
అందుకో మా వందనాలు

5. నీరూపే మా కన్నులలో నింపుకొని
నీ మాటే మా హృదయంలో దాచుకొని
నీ బాటలోనే ప్రతిక్షణం పయనించి
నీ ఆశ్రమాన గడిపాము నూరు వసంతాలు

6. విద్యాలయాలలో మేటిది శాంతి విద్యాలయం
నేటినా జీవన పథానికి కేంద్రమే మీ నిలయం
సత్పురుషుల సాంగత్యం, మాతాజీ ఆశీస్సులు
మరువలేనివి నా జీవిత దృక్పథంలో

# జ్ఞాపకాల పుష్ప సమర్పణ

**- శ్రీ ఎ. వీరభద్రరావు**

నేను 10 సంవత్సరముల ప్రాయంలో 1957 పిఠాపురం స్కూలులో చదివే రోజులలో ఓంకార్ స్వామివారి సన్యాస శిష్యులలో ఒకరి ద్వారా స్వామివారి ప్రవచనాల సారాంశం విని ప్రభావితుడనై తోటి మిత్రులతో కలసి స్వామివారిని దర్శించు భాగ్యము కలిగినది.

ప్రేమ మూర్తులగు స్వామివారు మమ్ములను హృదయానికి హత్తుకొని ముద్దాడి చక్కని భోజనం వడ్డించారు అప్పుడొక మాట చెప్పారు. **"పనిచేయని సోమరికి తినే హక్కు లేదు"**. చక్కగా చదవని వార్కి ఇదేగతి అని అన్నారు. ఆ వాక్యం మా అందరికీ తారకమంత్రమై మా జీవితాలు ఉన్నత స్థితికి చేరుకొనుటకు కారణమయినది.

స్వామివారు విశ్వ ప్రేమికులు, క్రిమి, కీటకములు, పశు పక్ష్యాదులు సమస్త జీవులను, చెట్టు చేమలను ప్రేమించిన ప్రేమమూర్తి.

ఒకనాడు వారు ఒక చెట్టు విత్తనాన్ని చూపి ఇది భూమిలో వేసి పోషిస్తే మొక్క అవుతుంది. కాండములు, కొమ్మలు బలమైన వృక్షమై పూలను, పండ్లను, నీడను మరలా విత్తనములు ఇస్తుంది. ఎండి చివరకు కట్టెలుగా మారి ఉపయోగపడుతుంది. అట్లానే మీరు మీ జీవితము ఇతరులకు ఉపయోగపడాలి. మాలో మానవత్వాన్ని మేల్కొలిపి పశుత్వాన్ని పారద్రోలిన విశ్వప్రేమికులు వారు.

వారు ఒకమాట అనేవారు ఆత్మ సాక్షాత్కారం పొందుటకు సన్యసించనవసరం లేదు. విశ్వప్రేమికులు ఎవరైనను సద్గురు కృపతో ఆత్మ సాక్షాత్కారము పొందగలరు. వారి హృదయ మందిరమే సద్గురు నివాసము. అదే పరంధామము. అదే అనంతాత్మ అదే పరబ్రహ్మము.

కారణాంతమున బోధానందపురీ మహారాజ్ చింతలపూడి విశ్వనాథ్ మఠ్‌లో స్వామివారి వద్ద శ్రీ విద్య నేర్చుకొనుటకు అక్కడ గడపవలసి వచ్చినది. స్వామివారు కఠోపనిషత్ భాష్య ప్రవచనం చేయుచు, **"ఇదివరకే తోటపల్లి జగద్‌గురువుల వద్ద అనుభవ పూర్వకముగా నేర్చినవారికి ఈ భాష్య ప్రవచనము రుచించునా?"** అన్నారు.

నాకు ఓంకార్ స్వామి వారి మాట ఒకటి గుర్తుకు వచ్చినది. **"ఏది సత్యమో ఆ సద్వస్తువు అంతటా ఒక్కటియే. అది పరమ గురువుల వాణీనాదమే గాని అన్యము కాదు. సందేహింపనేల"** అని అప్రయత్నము గానంటిని. బోధానందపురీ మహారాజ్ బ్రహ్మానందభరితులై అశ్రునయనులై, **"జై బోలో ఓంకార్ స్వామీజీకీ"** అని అందరిచేత అనిపించిరి.

ఇదే వారికి గుర్తు చేశాను. వారు శాంతి ఆశ్రమంలో శివానంద మహర్షితో గడపిన రోజులలో కూడా వారితో జగద్గురు ఓంకార్ స్వామి మహారాజ్ అన్నది ఇదేనని గుర్తు చేసుకొన్నారు.

# స్వామీజీ బాటలో పయనిస్తాం

**– శ్రీమతి మాజేటి సీతాదేవి**

మా తండ్రిగారు పైడా శ్రీరామకృష్ణయ్యగారు, కాకినాడ, స్వామీజీ పట్ల శాంతి ఆశ్రమము నందు భక్తి, విశ్వాసములు కలవారు. వారి సంతానమైన మమ్ములను కూడ ఆశ్రమమునకు తీసుకొని వెళ్ళెడివారు. కొన్ని దినములు అక్కడ ఉండే అదృష్టం కలిగించారు. తోటపల్లి ఆశ్రమములో ఒక కుటీరము కూడా కట్టించినారు. విశాఖపట్టణము, కోటగిరి ఆశ్రమములో కూడా కొన్ని దినాలు గడిపాను.

స్వామివారు ఋషీకేశ్, బదరీ, హిమాలయాల వరకు చెప్పులు లేకుండా కాలి నడకన వెళ్ళి అనేక కష్ట నష్టాలను సహించి మహాసాధన చేసిరి. వారి శాంతియుత సత్ప్రవర్తనచే అచ్చటి సాధు సత్తముల మనస్సులను రంజింపచేసెడివారు. వీరు 4 పర్యాయములు విదేశముల కేగి వీరి సత్‌సంకల్ప, శాంతియుత ప్రవర్తనచే వారి ఆదరణ, ప్రేమను పొందెడువారు. అమెరికాలో అనేక శాంతి కేంద్రములను స్థాపించారు. అచట మరయామాత, సుశీలా మాత వంటివారు వీరికి మాతృ సమాన ప్రేమ నందించెడివారు. అందులకే స్వామివారు తమకు అనేక మాతృమూర్తులు గలరు అనేవారు. అందరిని మాతృమూర్తులుగానే చూచెడివారు.

ఇప్పటి ఆశ్రమము అప్పుడు ఒక మహారణ్యము. మొదట స్వామివారు ఒక చెట్టు క్రింది తపస్సు చేసిరి. ఇప్పటికిని ఆ వృక్షము కలదు. క్రమక్రమముగా "వామనమూర్తి వటుడింతై" అన్న విధంగా దాతల సహాయ సహకారములతో ఆ మహారణ్యము మామిడితోటలో కుటీరములు, పోస్టాఫీసు, గ్రంథాలయము, స్థూపము, ప్రార్థనాలయము, భోజనశాల, శాంతి గుహ, అనాథబీదల వసతులు, గోశాల, వృద్ధాశ్రమము, విశ్వవ్యాప్త ప్రకృతిని తిలకిస్తూ పైకి వెళ్ళిన కొలదీ, అతిథుల వసతి, మరికొన్ని కుటీరాలు, ధ్యాన మందిరం, చెట్లచుట్టూ భక్తుల జప, తప, ధ్యానాదులు నిమిత్తము గట్లు, నేలగుహలు, హేరంబ వినాయక గుహ, ఇంకా పైకి కొండ మీద వెండి కొండపై శివునిలా విశ్వనాథాలయం. ఈ నా అనుభూతులన్నీ వ్రాస్తున్నాను.

ఇందులో శాంతి గుహ ప్రధానమైనది. ఇందు స్వామివారు మౌనంగా, ఉపవాస దీక్షతో కొన్ని నెలలు ధ్యాన, తపస్సు లాచరించిరి. ఇది స్థాపించి శత సంవత్సరములు పూర్తి కావచ్చుచున్నది.

స్వామి సదా ప్రకృతిలో విశ్వాత్మను, పరమాత్మ శక్తిని, అనుభవిస్తూ ఆత్మానందమును పొందెడివారు. అనుభవించుటే కాదు మనవంటివారికి సందేశాత్మకంగా కాగితములపై వ్రాసెడువారు. వాటినన్నటిని ఎల్లప్పుడు ఇంగితజ్ఞతతో వారి పరిచర్యలు చేస్తున్న మాతా జ్ఞానేశ్వరి (అమ్మాజీ) ఆ కాగితములను చక్కటి ప్రతులుగా వ్రాసెడివారు. ఒక రాతిని పూజార్హమైన విగ్రహంలా మలచినట్లు స్వామివారి సత్సాంగతము వల్ల అమ్మాజీ మాతాజీగా పూజార్హమైనారు. అందరిలో మంచినే, శాంతినే చూచే స్వామివలె మాతాజీ కూడ అందరిలో మంచినే చూస్తూ ప్రేమాభిమానములతో ఆదరిస్తారు. మాతాజీకి నేనంటే ఇష్టం, నేనంటే ఇష్టం అని ఎవరికి వారే తలంచే భావన కలిగిస్తారు. "నేను వ్రాయడం కాదు స్వామీజీయే తమ ఆత్మకథ యందు జ్ఞానేశ్వరి నా మాతలా, ప్రేమగా, గౌరవంగా, పూజ్య భావంతో సేవ చేసెడిది. ఆమె మనస్సు దొడ్డది. ఉన్నత భావాలు గలది. గురువుగా, మిత్రురాలిగా, శిష్యురాలిగా నాకు తోడ్పడేది. ఆమెకు పొగడ్తలన్నా, ఇతరులను కష్టపెట్టాలన్నా ఇష్టం ఉండదు" – ఇవి స్వామివారి మాటలు.

సదా దైవ స్మరణ వల్ల తన ప్రాపంచిక రూపాన్ని విడిచి దైవ రూపాన్ని పొందుతుంది దేహం. కర్తృత్వ భావన లేక, ఫలితాన్నాశించకుండ దైనందిన కర్తవ్య కార్యాలను చేస్తుంటే మన యోగ క్షేమాలను దైవమే చూచుకుంటాడు.

# ఓం

**- శ్రీ ఎం.ఎస్. రంగారావు (బన్ను)**, గొల్లప్రోలు

అక్షరం నాశనం అవ్వదు
అక్షరానికి మరణం లేదు
అక్షరానికి గౌరవం పెంచు
నీ గౌరవం వికసిస్తుంది
అక్షరం విత్తులాంటిది
వృక్షంలా నిన్ను విస్తరిస్తుంది.
మనం మట్టిలో కలుస్తాం
అక్షరం మనసుల మధ్య కలిసే ఉంటుంది
ఓంకార స్వామి మన మధ్య లేరు
ఆయన సాహిత్యాలు మన మధ్య శాశ్వతంగా ఉన్నాయి
ఆయన భావాలు సూర్యకిరణాలులా మనల్ని తాకుతూనే ఉంటాయి
దూకే జలపాతాలులా
కెరటాలులా
ఆయన అక్షరాలు మనల్ని స్పందింపచేస్తూనే ఉంటాయి
ఆశ్రమంలో ప్రతీ చిగురు ఆయన భావాలు ప్రదర్శిస్తూనే ఉంటాయి
పూచే ప్రతి పువ్వులోను ఆయన అనురాగాలుంటాయి
వృక్షాలు ఒదిగి ఉంటాయి. స్వామీజీ ఎదిగే కొలదీ ఒదిగి ఉండమంటారు
ఆయన అక్షరాలలో భావాలు ఎప్పుడూ వర్ధిల్లుతూనే ఉంటాయి.

# సర్వమత సాధనాలయము శ్రీ శాంతి ఆశ్రమం

**– శ్రీమతి ఎ. సుగుణ,** విజినిగిరి

శతజయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న శ్రీ శాంతి ఆశ్రమము నాకు పుట్టిల్లు. యిటువంటి ఉత్సవాలు యింకా ఎన్నో ఎంతో ఘనంగా జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ శ్రీ ఓంకార మహారాజ్‌కి, మాతాజీ జ్ఞానేశ్వరి గారికి శత సహస్రవందన మందారాలు సమర్పించుకుంటున్నాను.

ఏదైనా ఒక ఆశ్రమము గాని, ట్రస్ట్ గాని, సంస్థ గాని వంద సంవత్సరాలు నిరాటంకంగా దినదినాభివృద్ధి చెందుతూ నడపటం అంటే సామాన్యమైన విషయం కాదు. శ్రీ ఓంకార స్వామి స్థాపించిన ఆశ్రమాన్ని ఆయన ఆశయాలకు, ఆదర్శాలకు తగినట్లుగా ఏ మాత్రం వన్నె తగ్గకుండా నిర్వహిస్తున్న మాతాజీ జ్ఞానేశ్వరిగారి శక్తి, గురుభక్తి, ఆత్మవిశ్వాసం, సంకల్పబలం, ఆవిడ నియమబద్ధమైన జీవితమే పునాదిగా సాగుతోంది ఆశ్రమం. భారతదేశంలో స్థాపించిన నాటి నుండి ఈనాటి వరకు తలమానికంగా నిలబడ్డ ఆధ్యాత్మిక సంస్థల్లో రామకృష్ణ మిషన్, ఆర్.ఎస్.ఎస్. చిన్మయ మిషన్, శ్రీ శాంతి ఆశ్రమముగా చెప్పుకోవచ్చు.

శ్రీ శాంతి ఆశ్రమంలో నాకు 1980 సం॥ నుంచి అనుబంధం కలిగి వుండటం పూర్వజన్మల పుణ్యఫలంగా భావిస్తున్నాను. ఎందుకంటే ఆశ్రమాలు స్థాపించిన స్వామీజీలు, మాతాజీలు అందరినీ ఆదరిస్తారు. రమ్మంటారు. వారి ప్రేమతత్వం అలాంటిది. కాని అది పొందడానికి మనకు దైవానుగ్రహం వుండాలి. ఆ దైవకృప వలనే నేను శాంతి ఆశ్రమంలోకి రాగలిగాను. ఆరోజు నుంచి నేటి వరకు శాంతి ఆశ్రమం నన్ను కన్నతల్లిలాగ ఆదరిస్తూనే వుంది. అందుకనే ప్రారంభంలోనే నా పుట్టిల్లు అని రాయడం జరిగింది. నా ఆధ్యాత్మిక జీవితానికి బీజం పడింది, శాంతి ఆశ్రమంలోనే. భగవంతుడిచ్చిన నా జీవితానికి విలువ తెలుసుకోలేక లౌకిక జీవితంలో ఆటుపోట్లుకు తట్టుకోలేక ఏం చేయాలో తెలియని నాకు "ఇది కాదు నీ జీవితం దానికి వేరే పరమార్థమున్నది. అది సాధించడానికి నీకివ్వబడింది ఈ జీవితం" అనే అవగాహన కలిగించి నన్ను ఆధ్యాత్మిక జీవితం వైపు మరలించేటట్లు చేసినవి శాంతి ఆశ్రమంలో ఓంకార స్వామి రాసిన సూక్తులు, ఆశ్రమంలో మహాత్ములవారి దర్శనం. వారి సాంగత్యము. దాని ఫలితమే నాకు సద్గురువు సన్నిధి లభించడం అది కూడ శాంతి ఆశ్రమంలోనే. ఆవిధంగా శాంతి ఆశ్రమానికి నేను ఎంతో ఋణపడి ఉన్నాను.

సర్వమత సాధనాలయము శాంతి ఆశ్రమము. ఎందుకంటే చాలా ఆశ్రమాలు చూశాను. వాటిలో వాళ్ళ గురువుల ఫొటోలనే పూజించాలి. వాళ్ళ ప్రార్థనలే చేయాలి. వారి సాంప్రదాయాలనే పాటించాలి. అందరూ సర్వమతాలు, అందరూ దేవుళ్ళు సమానమే అని చెబుతారు. కాని **ఓంకారస్వామి అనటమే కాదు సర్వమత సమ్మేళనము చేసి చూపించారు. శాంతి ఆశ్రమంలో ఏ మతంవారైన, ఏ గురు**

**సాంప్రదాయానికి చెందిన వారైనా వారి సాధనలు వారు నిరభ్యంతరంగా, నిరాటంకంగా చేసుకోవచ్చును.** ఎవరినీ విమర్శించరు. యిది చాలా అరుదైన విషయం కనుకనే ఎంతోమంది మహాత్ములు, యోగులు, యిక్కడకు వచ్చి తపస్సులు చేసి తరించిన తపోభూమి శాంతి ఆశ్రమము. అందుకే ఆశ్రమం గేటులో అడుగుపెట్టిన దగ్గర్నుండి ఎక్కడకు వెళ్ళినా ఆధ్యాత్మిక తరంగాలు తెలుస్తూ వుంటాయి. ముఖ్యంగా శ్రీ ఓంకార స్వామి, అనేక సంవత్సరాలు తపస్సు చేసి ఆయన శక్తినంతా ప్రతిచెట్టు, ప్రతిరాయి. ప్రతి జీవినందు ప్రవేశపెట్టి సూక్ష్మంగా ప్రతి అణువులో ఆయన సంచరిస్తున్న గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రము. సాధన చేసుకునేవారికి అన్ని అవకాశాలు వున్నాయి. ఎక్కడో హిమాలయాల్లో దర్శనమిచ్చే ధ్యానగుహాలు శాంతి ఆశ్రమంలో నెలకొల్పారు ఓంకారస్వామి.

నేను నా జీవితంలో ఓంకార స్వామీజీని చాలా తక్కువసార్లు దర్శించుకున్నాను. కాని వారి ప్రేమను మాతాజీగారి ద్వారా 100% పొందగలిగిన అదృష్టవంతురాలిని. మాతాజీగారు, మా గురువు గారు నా దృష్టిలో వారివురూ ఒకటే. నా జీవితాన్ని నిలబెట్టిన మహనీయులు. నేను ఏదైనా నేర్చుకున్నాను అంటే వారివురిని చూసే. మాతాజీగారి యొక్క నిరాడంబరత, ప్రేమతత్వమే యిన్ని వేలమందిని యిన్ని సంవత్సరాల నుంచి యిక్కడికి తీసుకువస్తున్నది. శాంతి ఆశ్రమం గురించి రాయాలంటే సముద్రం గురించి వర్ణించటం లాంటిది. అయితే ఆ సముద్రంలో ఒక నీటిబొట్టులా నేను కూడ పాలుపంచుకుంటున్నందుకు మరొక్కసారి శాంతి ఆశ్రమానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను.

హరిః ఓం తత్సత్

- **కనీసము జన్మదినము రోజునైనను, పాత వాసనలను, అలవాట్లు నన్నింటిని విడచి మౌనములో నిర్జన ప్రదేశములో కూర్చుని మన లోకశాంతి ప్రార్థనను 108 సార్లు స్మరించి తరించమని కోరుచుండును.**
- **ఈ శరీరమున ప్రాణముండగానే పగలు రాత్రి బేధమును మరచి మనస్సులను భగవంతుని వైపు మరల్చి అన్ని దశలయందును అంతర జ్యోతిని దర్శింపగల ధన్యులకు అంతయు ప్రకాశ మానముగానే గానవచ్చును.**

# ఓంకార్ స్వామీజీ నాలో ఉన్నారు

**- శ్రీమతి నిర్మల**

నా వయస్సు అయిదారు సంవత్సరాలు ఉండవచ్చును. ఆ వయసులో నా కాలు ఎలా విరిగిందో తెలియని పరిస్థితుల్లో కాలి ఎముక విరగడం. మా నాన్నగారు వి.ఎల్.ఎన్. మూర్తి గారు. ఓంకార స్వామీజీని యాదృచ్ఛికంగా కలవడం, వారు నా పరిస్థితిని తెలుసుకొని తమ కాలి ఎముక ఇస్తానని వారి ఎముకను నా కాలులోనికి గ్రాఫ్ట్ చెయ్యడం జరిగాయి. ఈ కారణం వలన నా తల్లిదండ్రులు స్వామీజీ పట్ల, ఆశ్రమ వాసుల పట్ల అత్యంత భక్తి శ్రద్ధలతో ఉండేవారు. మా నాన్నగారు ఆశ్రమానికి సెక్రటరీగా ఉండి స్వామి విధించిన కర్తవ్యాలు నిర్వహించేవారు. మా అమ్మ కనకమహాలక్ష్మిని "Mother of Golden Heart" అనేవారు స్వామీజీ. ఆమె ఇంటికి విచ్చేసిన ఆశ్రమ వాసులని ఆదరించి భోజనాలు పెట్టేది. కాలు సర్జరీకి ముందు, తర్వాత కూడా అమ్మాజీ (జ్ఞానేశ్వరి మాతాజీ) శాంతి అక్క నన్ను ప్రేమతో బుజ్జగించేవారు. అమ్మాజి అన్నం ముద్దలు అత్యంత ప్రేమతో పెట్టడం, స్వామిజీ ప్రేమానురాగాలు, ఆపరేషన్ చేసినపుడు స్వామిజీ వద్ద ఉన్న మధుర క్షణాలు తల్చుకొంటే 65 సంవత్సరాలు గిర్రున తిరిగిపోయి అవన్నీ ఇప్పుడే జరిగాయా అనిపిస్తుంది. నాకు ఆపరేసన్ అయిన నాలుగైదు నెలల తర్వాత శాంతి పత్రిక కోసం నా ఫొటో కావాలని ఆశ్రమానికి తీసుకువెళ్ళారు. ఫొటో తీయించుకోనని గొడవ చేశాను. వేసుకొన్న గౌను నచ్చలేదనుకొంటాను. అప్పుడు మా అమ్మాజీ నాకు కొత్త చొక్కా వేసి, బుజ్జగించి ఫొటో తీయించారు. ఫొటో తీస్తున్నప్పుడు నవ్వమంటే నవ్వలేదు, నా బుంగమూతి ఫొటోలో కన్పిస్తుంది.

జీవిత పుస్తకంలో ఎన్నో అధ్యాయాలు - చదువు, వివాహం, పిల్లలు, ఆ పైన వాళ్ళ చదువులు, పెళ్ళిళ్లు, అనారోగ్యాలు, అలలుగా ఒకదానిపై ఒకటి. ఈ అలల అలజడిలో నాకు నా 'శాంతి ఆశ్రమం' దూరం అయింది. నా భర్త ఆర్మీలో పనిచేస్తూ ఉండడంలో, నేను ఆంధ్రా నుండి ఉత్తరదేశ ప్రాంతాలకు సెలవుల్లో తిరగడంలో సరిపోయేది. నేను ప్రభుత్వ కళాశాలలో లెక్చరరుగా పనిచేయడం వలన ట్రాన్స్ఫర్లు వలన ఎన్నో కాలేజీలలో ఉద్యోగం చేస్తూ జీవిత యానం సాగించాను. 1982 సంవత్సరంలో తీవ్ర అనారోగ్యానికి గురి అయ్యాను. నా ఆరోగ్యం బాగోలేనందున 1984 వరకు సెలవు పెట్టవలసి వచ్చింది. నేను బ్రతుకుతానని అనుకోలేదు. ఆ సమయంలో మంత్రాలయ స్వామి రాఘవేంద్రులు కలలో కన్పించి ఆశీర్వదించటంతో నా వ్యాధి తీవ్రత తగ్గు ముఖం పట్టి, 1984లో పాలకొల్లు కాలేజీలో చేరాను. ఇది ఎందుకు రాస్తున్నానంటే 21 జనవరి 2016 స్వామీజీ జన్మదినోత్సవాలకు అమ్మ జ్ఞానేశ్వరి మాతాజీ

పిలవడం వలన నేను, నా భర్త ఆశ్రమానికి వచ్చాము. రాత్రి కుటీరంలోని పుస్తకాలను తిరగవేస్తోంటే ఓంకార స్వాములవారు 1982 సంవత్సరం మే నెలలో పరమపదించారని చదివాను. ఆ నెలలోనే నేను విపరీతమైన అస్వస్థతకు గురి అయ్యాను. ఆలోచిస్తే నాకు, వారి శరీరపు భాగం నాలో ఉంది కనుక అదే సమయంలో అస్వస్థత గురి అయ్యానా అన్పించింది. స్వామీజీ ఎముక నా శరీరంలో ఉండడం చేత ఆ విధంగా స్పందించిందా... స్వామీజీ అనుగ్రహించిన ఎముక గ్రహించిన వ్యక్తిగా నేను ఎందరి ప్రేమానురాగాలకు పాత్రురాలినయ్యాను! అందరూ నన్ను చూసి మీరు ఎంత అదృష్టవంతులు! మీలో ఒక గొప్ప సాధు మహాత్ముల ఎముక వుందని చెప్పారు. వారు సమాధి చెందిన సమయంలో నా శరీరానికి కూడా అంతుపట్టని వ్యాధి బాధించినదని గుర్తించాను. స్వామీజీ వారికున్న దివ్య లక్షణాలు అన్నీ లేకపోయినా, నాలో కొద్దిపాటిగానైనా మనోధైర్యం, అన్ని జీవుల పట్ల సమదృష్టి, అందరిలోనూ భగవంతుని చూడడం వంటి లక్షణాలు అలవడ్డాయి. నా అనారోగ్యం తగ్గాక నాలో చాలా మార్పు వచ్చింది. ఉద్యోగం చేస్తున్నా, దైవచింతన మినహా నాకు మరో ధ్యాస లేదు. స్వామీజీ సందేశం, **"నువ్వే నేను, నేనే నువ్వు"** అర్థం గ్రహించాను.

* మోక్షమును కోరువారు గుణరహితులుగా నుండుటకు సాధన చేయవలెను. గుణములకు అతీతుడైన వాడే మోక్ష సామ్రాజ్యమును పొందగలడు.
* పరబ్రహ్మము సముద్రము వంటిది. వాక్కున కతీతము. మౌనము నందు మాత్రమే అనుభవైక వేద్యము.
* మనలో దాగియున్న ఎట్టి చిన్న చెడ్డ తలపునైనను దాన్ని హానికరముగా పెరగనీయక వెంటనే త్రుంచి వేయవలెను.

# ఏం చెప్పేది? ఎలా చెప్పేది?

- **శ్రీమతి దాసరి శేషారత్నం,** శ్రీ శాంతి ఆశ్రమం

స్వామి ఆశ్రమం స్థాపించి వందేళ్ళు అయిందట
అబ్బో! అందులో నేనూ ఒక అణువుని అంటే
నాకెంత అబ్బురంగా వుందో

ఏదో వ్రాయమన్నారు ఏం వ్రాసేది? ఎలా చెప్పేది?
ఎక్కడో ఋషీకేశ్‌లో వుండాల్సిన నేను
నా గురువు ఆజ్ఞతో ఎగిరి గంగానది నుంచి
తోటపల్లి కొండలలో వాలిన నన్ను

అమ్మ చేరదీసి అక్కున చేర్చుకుని
ఆదరించిన వైనం ఎలా చెప్పేది?
తేనె తియ్యగా వుంటుంది. ఆ తీపి ఎలా వుంటుంది.
అంటే ఎలా చెప్పేది?

ఒడిలో పసిపాపను అమ్మ గురించి
చెప్పమంటే బోసి నోటితో నవ్వుతూ
కాళ్ళూ, చేతులూ తపటప కొట్టు
కోవడం తప్ప ఏం చెపుతుంది?

విధి కొట్టిన దెబ్బకు విలవిల్లాడినప్పుడు
అమ్మ గుండెల్లో దొరికిన ఓదార్పు
ఏం చెప్పేది? ఎలా చెప్పేది?
అని నాలో నేనే సతమతమౌతున్నాను.

# సాధకులలకు మోక్షధామం శ్రీ శాంతి ఆశ్రమం

– డా॥ వీపూరి సుదర్శన్

**సువిశాల మిదం విశ్వం పవిత్ర బ్రహ్మమందిరం** – ఈ సువిశాలమైన ప్రపంచమంతా ఆ భగవంతుని ఆలయమే. ఇది పంచభూతాలలో నిండి వున్నది. సమస్త ప్రాణులూ పంచభూతాల సమాహారమే. **"ప్రేమయే సహజీవనానికి నాంది"** ప్రేమతత్త్వం సమస్త ప్రాణులలో ఉంది. మానవుడు నాగరీకుడై వ్యామోహపరుడై ప్రేమను చంపి స్వార్థాన్ని పెంపొందించుకున్నాడు. ఈ స్వార్థమే సమస్త దురావస్థలకు, దుఃఖానికి కారణమైనది. మానవుల జన్మలను సార్థకం చేయడానికి ఎందరో మహాత్ములు ప్రపంచమంతా యుగయుగాలుగా జన్మిస్తూ, ప్రేమ, కరుణ, సమత, మానవతలను పెంపొందింపజేస్తూ సమస్త మానవాళికి మోక్షమార్గాన్ని చూపించారు.

ఆధునిక యుగంలో ఓంకారస్వాములవారనే మహాత్ముడు నవయవ్వనంలో గంగామాత ఒడిలో సన్యసించి, తపస్సు చేసి తూర్పు కనుమల్లోని తోటపల్లి కొండల్లోని ముళ్ళ పొదల ప్రాంతాన్ని స్వర్గధామంగా సృష్టించి శ్రీ శాంతి ఆశ్రమాన్ని ఏర్పాటు గావించినారు. అది భారతదేశంలోని సమస్త పుణ్యక్షేత్రాల్లోకెల్లా పరమ పవిత్రమైన పుణ్యక్షేత్రం. వందలాది మహాత్ముల పాదస్పర్శతో అమృత వాక్కులతో పరావృతమైన స్వర్గధామమది.

ప్రాచీన యుగంలోని బుద్ధ భగవానుని వలె ఓంకార స్వాములవారు సర్వమానవాళి సముద్ధరణ కొరకు ఆధునిక యుగంలో జన్మించారు. బుద్ధుడు సమస్త దుఃఖాలకు కారణం "కోరికలు" అని పేర్కొనగా, ఓంకార స్వాములవారు మానవుడి దుఃఖానికి కారణం "అశాంతి", శాంతిని పొందడం ద్వారా దానిని నివారించుకోవచ్చని అన్నారు.

'ఓంకారము' విశ్వమంతా నిండి ఉన్నది. సమస్త ప్రాణులు తమ, ఉశ్చ్వాస – నిశ్వ్వాసలలో 'సోహం' అదే ఓంకారాన్ని తీసుకుంటున్నాయి. అలాగే ఓంకారస్వాములవారు ఒకే జాతికి, ఒకే దేశానికి గాని చెందక ప్రాక్ పశ్చిమాలకు అనగా విశ్వమానవాళికందరికి చెందియున్నాడు.

ఆస్తికులైనా – నాస్తికులైనా మీరెవరైనా కావచ్చును. నాకు ఏ విధమైన బేధము లేదు. ఈ ఆశ్రమం మాకు ఎంత చెందినదో మీకు అంతే. శాంతి కాముకులందరికి ఈ ఆశ్రమం హక్కై ఉన్నదన్నారు. మీరు శాంతి కావలెనని పవిత్ర హృదయంతో పరితపించుచున్నారా అయితే రండి. మీ శాంతి కొరకు ఈ శాంతి నిలయాన్ని అన్నిజాతుల, అన్ని మతముల వారికి అర్పించుచున్నాను. "విశ్వమానవులందరికి శాంతిని లభింపజేయుటకు దైవమునన్నొక పనిముట్టుగా ఉపయోగించుకున్నదని అన్నారు".

పరమపూజ్య ఓంకార స్వాములవారు ప్రకృతి పట్ల, సమస్త ప్రాణుల పట్ల ప్రేమ, కరుణను కల్గి వున్నారు. శ్రీ శాంతి ఆశ్రమాన్ని అనేక రకాలైన పండ్లు, పూలు, ఔషధ మొక్కలతో అభివృద్ధి పరిచారు. వాటి నిలయంగా ఆధారపడి ఎన్నో పక్షులు, ఎన్నెన్నో జంతువులు నివసిస్తున్నాయి. శాంతి ఆశ్రమ పరిసర గ్రామాల అమాయక ప్రజల పిల్లల విద్య (జ్ఞానము) కొరకు పాఠశాలను స్థాపించారు. అనాధ శరణాలయాన్ని, వృద్ధాశ్రమాన్ని, మానవులకు, పశువుల కొరకు ఆసుపత్రులను ఏర్పాటు గావించినారు.

శాంతి దూతగా అమెరికా, ఇతర పశ్చిమ దేశాలను సందర్శించి స్వామి వివేకానందుల వారి వలె సమస్త మానవాళి శాంతి పొందుటకు మార్గాన్ని బోధించారు. శ్రీ శాంతి ఆశ్రమం సర్వమత నిలయం.

స్వామీజీ సర్వమత చిహ్నాన్ని ఏర్పాటు చేయించారు. అన్ని మతాలకు చెందిన మహాత్ముల విగ్రహాలను ప్రతిష్ఠింపజేసారు. కొండ చివర శ్రీ విశ్వనాథ మందిరం, సాధకులకు ధ్యాన గుహలు, వేదికలు, తనకు నిర్వాణ మందిరాన్ని నిర్మింపజేసి దానిపైన **'ఓం మణి పద్మేహం'** అని అక్షరాలను చెక్కించారు. ముందు భాగాన శ్రీకృష్ణుడు, బుద్ధుడు, ఏసుక్రీస్తు మరియు మహాత్మాగాంధీల నిలువెత్తు విగ్రహాలను ఏర్పాటు గావించారు.

విశ్వశాంతి ప్రార్థనను లిఖించి అందరికి పంచారు. అది 14 భాషల్లోకి 'అనువదింపబడినది'. శాంతిని ఉశ్వాస నిశ్వాసలతో నింపుకోమన్నారు. స్వామీజీ "నేను వెలుతురులో ఉన్నాను, వెలుతురు నాలోన ఉన్నది నేనే వెలుతురును" అని అన్నారు. నేడే మనది రేపు మనది కాదు. ఇప్పుడు ఇచ్చటనే భగవంతుని కనుడు. ఏ రోజైనా మృత్యువు రాక తప్పదు అందుకు మనమందరం స్వాగతం చెప్పాలి. అందుకే స్వామిజీ **"మృత్యువుకు నా ఆహ్వానం" (Welcome to the Death),** వ్యక్తి శాంతియే లోకశాంతికి దారి తీస్తుందని నిరంతరం లోకశాంతి ప్రార్థనను జపించాలన్నారు. ప్రస్తుత ఆధ్యాత్మిక అధిపతి పూజ్య జ్ఞానేశ్వరి మాతాజీవారు తన ఆరవ ఏట స్వామి దగ్గర చేరి అతని సేవలో తరించారు. విదేశాలకు వెళ్ళి విశ్వశాంతిని బోధించారు.

ఓంకార స్వాములవారు ఒక పాపకు కాలి ఎముక అవసరం కాగా తన త్రుంటి ఎముకను దానం చేసారు. అందుకే వారిని అందరు "అపరదధీచి" అని అంటారు. విశాఖపట్నం కైలాసగిరిపైన ఆరు సంవత్సరాలు మౌనదీక్షలో వున్నారు. అప్పుడే "మౌనపు ఘడియలు" అనే పుస్తకాన్ని రచించారు. స్వామీజీ మొత్తం 30 పైగా తెలుగు, ఆంగ్ల భాషల్లో రచనలు చేసి గ్రంధాలుగా ముద్రింపజేసారు. శాంతి మరియు PEACE అనే ఆంగ్ల పత్రికలను ముద్రింపజేసారు. అవి నేటివరకు అలాగే నెలనెలా ప్రచురింపబడుతూనే ఉన్నాయి.

ఓంకార స్వాములవారు జీవించి ఉండగానే భారతదేశంలోని అనేకమంది పీఠాధిపతులు, మహాత్ములు, గురువులు, శిష్యులు ప్రధాన ఆశ్రమానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆశీస్సులను కూడా పొందారు. అధికారులు, విద్యావంతులు, పండితులు, పామరులు లెక్క కట్టలేనంతమంది స్వామీజీ శుభాశీస్సులను పొందారు.

ఓంకారస్వామి నిర్వాణం చెందెను కాని 'ఓంకారము' మాత్రము అందరిలో మిగిలే వున్నది. ఆశ్రమంలోని ప్రత్యణువులో ఓంకారము నిండియున్నది. ఆశ్రమంలో ఎక్కడ వుండి గమనించినా ఓంకారనాధం హోరుమని ప్రతి చెట్టు-చేమ పుట్ట-పక్షి-జంతువు ఓంకారాన్ని జపిస్తున్నాయి. స్వాములవారు సందర్శకుల కొరకు చక్కటి సూక్తులను ఆశ్రమం నిండా చక్కటి ఫలకాలపైన లిఖింపజేసారు. వాటన్నింటిని మనం ఆచరించాలి. పరమపూజ్య ఓంకారస్వాములకు మరియు వచ్చిన మహాత్ములందరికి సేవలనందించినది. స్వామీజీ కన్నా మాతాజీ వారినే ఎక్కువమంది మహాత్ములు దర్శించుకున్నారు.

శ్రీ శాంతి ఆశ్రమం భారతదేశంలోని ఏ ఆశ్రమం కూడా పొందని అరుదైన గౌరవాన్ని పొంది యున్నది. వేలాదిమంది మహాత్ములు, పుణ్యపురుషులు, మాతాజీల పాదస్పర్శ చేతను వారి అపురూపమైన ఆధ్యాత్మిక ప్రవచనాలచే పునీతమైన పరమపావన క్షేత్రం ఇది.

పూజ్య ఓంకారస్వాములవారి బాటలో విశ్వశాంతి కొరకు వ్యక్తిలో, సమాజంలో, దేశంలోను ప్రపంచమంతా శాంతి కిరణాలను ప్రసరింపజేస్తు పూజ్య జ్ఞానేశ్వరి మాతాజీవారు, ఆశ్రమ ఉత్తరాధికారిణి

అయిన పూజ్య వినమ్ర మాత గారు సేవ చేస్తున్నారు. సాధకులకు సాధనాశిబిరాలు, అనాధలకు – వృద్ధులకు వసతి గృహాలు, బాలబాలికలకు పాఠశాలలు, వసతి గృహాలు పౌష్ఠికాహారం, సందర్శకులకు ఆశీర్వచనాలు ప్రసాదాలు, అన్నధానాలు అందిస్తూ అహర్నిషలు ఆశ్రమాభివృద్ధికి కృషి చేస్తూ ఆధ్యాత్మిక – సామాజిక సేవలనందిస్తున్నారు.

దివ్యత్వం ఉట్టిపడే పూజ్య జ్ఞానేశ్వరి మాతవంటి మాతృమూర్తి ఈ లోకంలో మరెవ్వరూ లేరు. పరమపూజ్య ఓంకార స్వాముల ప్రతిరూపమే మాతాజీ. వారి దర్శనము, ఆశీస్సులే సకల పాపహరణం వారి నోట పల్కెడి శాంతి ప్రార్థనయే ముక్తికి మార్గం.

పరమపూజ్య ఓంకార స్వాములవారు "నా జన్మ దినమే మీ జన్మదినమని" పేర్కొన్నారు. అందుకే చుట్టూ వున్న 30 గ్రామాల ప్రజలకు 21 జనవరి ప్రతి సంవత్సరం ఘనమైన జన్మదినం. ఆనాడు శాంతి ఆశ్రమంతా పండుగే. స్వామీజీ స్థాపించిన ఈ పుణ్యక్షేత్రం నూరు వసంతాలు 2017 జనవరిన పూర్తి చేసుకొనుచున్నది. పూజ్య మాతాజీల ఆధ్వర్యంలో విశ్వశాంతి స్థాపన కొరకు అనేక కార్యక్రమాలు చేపట్టినారు.

సర్వముముక్షువులకు శ్రీ శాంతి ఆశ్రమం ఒక స్వర్గధామం. మతంతో సంబంధం లేకుండా విశ్వమానవాళికంతటికి శ్రీ శాంతి ఆశ్రమం మాతాజీలు ఆహ్వానం పలుకుచున్నారు. ఆశ్రమాన్ని సందర్శించి జన్మను సార్థకం చేసుకోవడమే అందరి విధి.

ఓం సద్గురువు శ్రీ ఓంకార పరబ్రహ్మణే నమః

---

జగద్విదితమైన శ్రీశ్రీశ్రీ పూజ్యులు ఓంకారస్వామి వారి కృషి, దైవశక్తి కలిగిన మహా పురుషులు. వారు తోటపల్లిలో స్థాపించిన శాంతి ఆశ్రమం, శత వసంతాల పండుగ ది. 21-1-2016న ప్రారంభమై ది. 21-1-2017 వ సంవత్సరంనాడు ఎన్నో కార్యక్రమాలు జరుపతలంపు, పూజ్య శ్రీ జ్ఞానేశ్వరి మాతాజీకి కలగడం ఎంతో అభినందనీయం.

నాకు గుండె జబ్బు వచ్చి, ది. 24-4-2012న హైదరాబాదులో ఆపరేషన్ చేయించుకొన్నాను. ఆపరేషనుకు ముందు రోజు పూజ్య మాతాజీ నా కలలో కన్పించి "నేనున్నాను, నీకేమీ కాదు" అని నాకు ధైర్యం చెప్పినారు. దాని పర్యవసానంగా అంత పెద్ద ఆపరేషను అయినప్పటికీ ముల్లు గ్రుచ్చుకొన్నట్టు కూడా అనిపించలేదు. నేను అంత తొందరగా కోలుకొనుటకు కారణం పూజ్య మాతాజీ ఆశీస్సులు, వారి అభయ హస్తం ఏలననగా నా ఆరోగ్యం గురించి ఆశ్రమంలో పూజలు, భజనలు చేయించినట్లు తెలిసి చాలా ఆనందపడ్డాను. అందువల్ల పూజ్య మాతాజీ తలపెట్టిన ఈ శతజయంతి ఉత్సవం దిగ్విజయంగా జరుగుతుందని నా ప్రగాఢ విశ్వాసం.

**– చేకూరి రామకృష్ణం రాజు**

విశాఖపట్నం.

# PEACE PRAYER

## (FOR WORLD PEACE)

***- H.H. SWAMI OMKAR***

Adorable Presence !
Thou who art within and without,
Above and below and all around;
Thou who art interpenetrating the very cells of our being.

Thou who art the Eye of our eyes, the Ear of our ears,
the Heart of our hearts, the Mind of our minds,
the Breath of our breaths, the Life of our lives, and
the Soul of our souls.
Bless us dear God, to be aware of Thy Presence Now and Here.
This is all that we ask of Thee.

May all be aware of Thy Presence in the East and the West,
and the North and South.
May Peace and Goodwill abide among individuals as well as
communities and nations.
This is our earnest Prayer.
May Peace be unto All.

Om Shanti ! Shanti ! Shantih !

## हिंदी प्रार्थना

हे पूजनीय दिव्यस्वरूप । हे सर्वातर्यामी प्रभू ।
आप हमारे भीतर और बाहर । उापर और नीचे सर्वत्र व्याप्त हो ।
आप हमारे अंतर के अणु अणु में निहित हो ।
आप हमारे नयनों के नयन, कानों के कान, ह्लदयों का ह्लदय,
मानस के मानस, श्वासों के श्वास, प्रोणों के प्राण और
आत्मा के आत्मा बनकर प्रकाशित हो ।
हे प्रेम के सागार, आपको जानने पहचानने का सौभाग्य
अभी, यही प्रदान करो ।
हे तेजोमयप्रभु । पूरब पश्चिम, उत्तर दश्रिण और समस्त विश्व के बीच,
आप के दिव्य प्रकाश से परिचित हो।
हे सच्चिदानंद स्वरूप । मनुष्य मनुष्य के बीच, जाति जाति के बीच,
राष्ट्र राष्ट्र के बीच, शांति और समरसता की स्थापना करो ।
हे प्रभु हमारी यही हार्दिक प्रार्थना है ।
लोका : समस्ता : सुखिनो भवन्तु ।
ओम शांति : ! शांति : ! शांति : !

# లోకశాంతి ప్రార్థన
## (సంస్కృతం)

పరమపూజ్య ప్రసన్న ప్రకాశ స్వరూప!
భవాన్ సర్వేషాం ఉపరి, సర్వేషాం అధః సర్వేషాం అంతః
సర్వేషాం బహిః సర్వేషాం పరితః, సర్వం వ్యాప్య తిష్ఠసి సదా।
భవాన్ చక్చుషః చక్షుః, శ్రోత్రస్య శ్రోత్రం, హృదయస్య
హృదయం, మనసో మనః, శ్వాసస్య శ్వాసః, ప్రాణస్య ప్రాణః, ఆత్మనః ఆత్మా,
శ్రేష్ఠభగవాన్! భవంతం అత్రైవ, అధునైవ, జ్ఞాతుం,
భవదనుగ్రహేణ శక్తిందేహి. ఏతదేకమేవ ప్రార్థ్యతే అస్మాభిః
ప్రాచ్యాం, ప్రతీచ్యాం, ఉదీచ్యాం, దక్షిణాయాం
దిక్షు జానంతు సర్వే తవసాన్నిధ్యమ్ ।
ప్రతిజనం, ప్రతి సమూహం, ప్రతిరాష్ట్రం,
శాంతిః సౌహృదం చ విలసితాం,
ఏషా అస్మా కం హృద్యప్రార్థన, సర్వేషాం శాంతిర్భవతు.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు ! ఓం శ్శాంతి శ్శాంతి శ్శాంతి ః

ஓம் ॐ ஓம்

## UNIVERSAL PEACE PRAYER

### போற்றி போற்றி பூரண நிறைவே

உள்ளும் புறமும் மொழிவற நிறைந்தாய்
மேலுங் கீழும் சுற்றிலு முள்ளாய் !
தசைச்சிறு பகுதியுள் தங்குவோய் நீயே !
கண்ணினுட் கண்ணே ! காதினுட் செவியே !
இதயத்தி னுள்ளே இருக்கும் இதயமே !
மனத்தினுள்ளே மன்னிடு மனமே !
உயிர்ப்பினு ளுயிர்ப்பே உயிரினுக் குயிரே !
ஆன்மா வில்லுறை ஆன்ம நாயகனே !
இன்ப அன்பாம் இறைவனே யாங்கள்
ஈங்கு இப்போதே உன் நீங்கா நிறைவை
ஓங்கி உணரச் செய்குவ தொன்றே
பாங்காய் உன்னைப் பணிந்து வேண்டுவமே
மேற்கும் வடக்கும் தெற்கும் கிழக்கினும்.
எத் திசையினும் நிறைந்தாய் !
உனது நிறைவை யுணரவே செய்குவாய்
தனித்தனி மனிதன் சமூகம் தேயம்
அனைத்தினுள்ளும் இன்பமும் அன்பும்
நினைப்பினுள் நிலவ நீயருள் வாயே
இதுவே எங்கள் இதய விண்ணப்பம.
ஓம் சாந்தி : சாந்தி : சாந்தி .



# అర్పణము

ప్రాక్పశ్చిమ దేశవాసులకు, సాధకులకు నా యొక్క విరాళము ఈ శాంతి ఆశ్రమము నాకు ఎంతవరకు చెందునో మీకు అంతగానే చెందును. అందుచే మిమ్ములను ఇక్కడకు వచ్చి తాత్కాలికముగానో, శాశ్వతముగానో ఉండి ఆశ్రమ అభివృద్ధికి తోడ్పడ కోరుచున్నాము.

సాధకులారా! ఇది నా మనోవాంఛితము ఇప్పుడు ఎప్పుడు ఈ శరీరము యున్నను లేక పోయినను ఇదియే నా వాంఛ.

**- స్వామి ఓంకార్**